

'అన్నం పెట్టే రైతన్నను రుణ విముక్తుణ్ని చేయడమే నా ముందున్న లక్ష్యం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15
సంచిక: 294

శనివారం 8-7-2023

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



మనం మాట్లాడుకోవాల్సిందే!
అమ్మాయిలు ట్రాఫికింగ్ బారిన పడకుండా తీసుకోవాల్సిన చర్యలపై కథనం - 11లో



రికార్డు స్థాయి వద్ద లాభాలు
నిఫ్టీ 8 రోజుల పరుగుకు విరామం
సెన్సెక్స్ నష్టం 505 పాయింట్లు - 13లో



రాహుల్ గాంధీకి ఎదురుదెబ్బ
పరువు నష్టం కేసులో రాహుల్‌కు గుజరాత్‌లో కింద కోర్టు విధించిన రెండేళ్ల జైలు శిక్షను నిలిపివేయడానికి హైకోర్టు నిరాకరించింది.
వివరాలు 6లో ▸



అవినీతే కాంగ్రెస్ ఊపిరి
కాంగ్రెస్ పార్టీ ఊపిరి, దాని ముఖ్య సిద్ధాంతం అవినీతేనని అది లేకుండా ఆ పార్టీ బ్రతకలేదని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు.
వివరాలు 6లో ▸



ఆ 5 పథకాలకు రూ.52 వేల కోట్లు
కాంగ్రెస్ ఇచ్చిన 5 ప్రధాన హామీల అమలుకు ఏడాదికి రూ.52 వేల కోట్లు అవసరమవుతాయని కర్ణాటక సీఎం సిద్ధరామయ్య చెప్పారు.
వివరాలు 6లో ▸



త్రిపుర అసెంబ్లీలో గందరగోళం
అసెంబ్లీలో అశ్లీల చిత్రాలను చూశారనే ఆరోపణలు రావడంతో అయిదుగురు బీజేపీ సభ్యులను స్పీకర్ సస్పెండ్ చేశారు.
వివరాలు 6లో ▸

ఫ్యాక్ట్ చెక్


ముఖ్యమంత్రి గారూ.. జీడి రైతు గుర్తున్నాడా?

జీడిపై చీడ రాతలు!

- యూనిట్లు మూతబడ్డాయంటూ 'ఈనాడు' పచ్చి అబద్ధాలు
- రైతుకు వెన్నుదన్నుగా రాష్ట్ర ప్రభుత్వం
- నాలుగేళ్లలో 17,125 ఎకరాల్లో పాత తోటల పునరుద్ధరణ
- 35 వేల ఎకరాల్లో కొత్త తోటల విస్తరణ.. ప్రాసెసింగ్ యూనిట్ల ఆధునికీకరణ.. కొత్తవాటికి ఆర్థిక చేయూత
- తిత్లీతో నష్టపోయిన 1.38 లక్షల మందికి పరిహారం ఎగ్గొట్టిన చంద్రబాబు
- రూ.87.29 కోట్లు అందించి ఆ రైతులను ఆదుకుంది సీఎం జగన్ ప్రభుత్వమే

- వివరాలు 5లో

రైతులకు 'పవర్'

సాగుకు ఉచిత విద్యుత్ ఇచ్చి జీవితాలు మార్చిన మహానేత వైఎస్సార్

అధికారం చేపట్టిన మరుక్షణమే ఆ ఫైల్‌పై తొలి సంతకం

- 2004కు ముందు బిల్లుల వాత.. జరిమానాల మోత
- వ్యవసాయమే దండగన్న చంద్రబాబునాయుడు
- తీగలపై బట్టలు ఆరేసుకోవాలని హేళన చేసిన టీడీపీ నేతలు
- వైఎస్సార్ ఒక్క సంతకంతో బకాయిలు, బిల్లులు రద్దు... కేసులు మాఫీ
- మహానేత తదనంతరం ఈ పథకాన్ని నిర్వీర్యం చేసిన బాబు
- నాడు రాత్రిళ్లు అరకొర కరెంటుకు ఎంతో మంది రైతులు బలి
- 2019లో వైఎస్ జగన్ రాగానే మరింత మెరుగ్గా అమలు
- విద్యుత్ సరఫరా 7 గంటల నుంచి 9 గంటలకు పెంపు.. అదీ పగలే
- 19.11 లక్షల కనెక్షన్లకు ఉచిత విద్యుత్
- వీటి నిర్వహణకు ఏటా రూ.8 వేల కోట్లకు పైగా ఖర్చు
- 30 ఏళ్ల పాటు మరింత నాణ్యతగా అందించేందుకు కసరత్తు
- ఆర్బీకేలతో విత్తు నుంచి విక్రయం వరకు ప్రతి అడుగులోనూ భరోసా
- ఇదివరకెన్నడూ లేని విధంగా పంట నష్టపరిహారం

2లో



మరపురాని మహానేత

14లో

■ సంక్షేమాభివృద్ధి పథకాలతో తెలుగు ప్రజల హృదయాల్లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చెరగని జ్ఞాపకంగా నిలిచారు. పరిపాలనలో మానవత్వాన్ని జోడించి నవయుగానికి నాంది పలికారు. ఆరోగ్యశ్రీ, ఫీజురీయింబర్స్‌మెంట్, జల యజ్ఞం.. ఇలా పథకాల పేర్లు చెప్పగానే వెంటనే ఆ మహానేత పేరు గుర్తుకొస్తుంది. మూడు దశాబ్దాల రాజకీయ జీవితంలో ఓటమే ఎరుగని అజేయుడు. నేడు ఆయన 74వ జయంతి.



చేపల వేటకు అత్యాధునిక టెక్నాలజీ

ఏపీ నుంచే శ్రీకారం చుట్టనున్నట్లు కేంద్ర మంత్రి రిజిజు వెల్లడి

5లో

కేంద్రమంత్రి కిరణ్ రిజిజుకు జ్ఞాపికను అందజేస్తున్న సీఎం జగన్. చిత్రంలో ఎంపీ బాలశౌరి

రైతుబజార్లలో కిలో రూ.50కే టమాటా

- చుక్కలనంటుతున్న వేళ.. వినియోగదారులకు సర్కారు బాసట
- దేశంలో మరెక్కడా లేని రీతిలో సబ్సిడీపై విక్రయాలు
- ఇప్పటివరకు 422.06 టన్నుల సేకరణ
- రాష్ట్రంలోని వివిధ మార్కెట్లతోపాటు వివిధ రాష్ట్రాల నుంచి కొనుగోళ్లు.. సగటున కిలో రూ.94.44 చొప్పున కొనుగోలు
- వినియోగదారులకు మాత్రం రైతుబజార్లలో కిలో రూ.50కే విక్రయం.. ధరలు తగ్గే వరకు సబ్సిడీపైనే విక్రయాలు
- ఉత్తరాది రాష్ట్రాల్లో రూ.250 దాటిన కిలో టమాటా ధర

5లో





అగ్ని కీలల్లో ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్

- ఐదు బోగీలు పూర్తిగా, రెండు బోగీలు పాక్షికంగా దగ్ధం
- శుక్రవారం ఉదయం భువనగిరి సమీపంలోని బొమ్మాయిపల్లి వద్ద ఘటన.. తొలుత ఎస్4 బోగీలో పొగలు.. కాసేపటికే మంటలు
- అది గుర్తించి చైన్ లాగిన ఓ ప్రయాణికుడు
- భయంతో లగేజీ వదిలేసి రైల్లోంచి దిగేసిన ప్రయాణికులు
- ఎస్ 2, 3.. ఇటు 5, 6 బోగీలకూ వ్యాపించిన మంటలు

2లో

గుండెకు నిబ్బరం!

ఆరోగ్యశ్రీతో 1.71 లక్షల మందికి పునర్జన్మ

- హృద్రోగ బాధితులకు ఊరట
- గుండె మార్పిడి సైతం ఉచితంగానే
- గుండె జబ్బు చికిత్సలకు నాలుగేళ్లలో రూ.695 కోట్లు
- ఆరోగ్యశ్రీతో ఇప్పటివరకు 40 లక్షల మందికి లబ్ధి.. రూ.9,025 కోట్లు వ్యయం చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- గత సర్కారు బకాయిలు రూ.630 కోట్లకుపైగా చెల్లింపు



సాక్షి, అమరావతి: గుండె జబ్బుల బారిన పడ్డ పేద, మధ్యతరగతి కుటుంబాలకు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కొండంత అండగా నిలుస్తోంది. చేతి నుంచి ఒక్క రూపాయి ఖర్చు చేయాల్సిన అవసరం లేకుండా బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి. మన రాష్ట్రంతోపాటు చెన్నై, బెంగళూరు, హైదరాబాద్‌లోని కార్పొరేట్ ఆస్పత్రుల్లో సైతం హృద్రోగ బాధితులకు ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచిత వైద్యసేవలు అందుతున్నాయి.

1.71 లక్షల మందికి వైద్యం

2019 నుంచి 1,71,829 మంది గుండె సంబంధిత జబ్బుల బాధితులు ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా వైద్య సేవలు పొందారు. బైపాస్ సర్జరీలు, స్టెంట్లు..

మిగతా 14వ పేజీలో ▶

ఇదండీ సంగతి



విపక్షాలు ఈ వంకతో మిమ్మల్ని ప్రధాని కాకుండా చేస్తున్నాయని నా అనుమానం సార్!

అనంత, వైఎస్సార్ జిల్లాల్లో

సీఎం జగన్ పర్యటన



- దివంగత సీఎం వైఎస్సార్ జయంతి సందర్భంగా నేడు కళ్యాణదుర్గంలో రైతు దినోత్సవం
- 2022 ఖరీఫ్ బీమా పరిహారం రూ.1,117 కోట్లు పంపిణీకి శ్రీకారం
- రాష్ట్ర వ్యాప్తంగా 10.2 లక్షల మందికి లబ్ధి
- అనంతరం ఇడుపులపాయకు చేరుకుని మహానేతకు ఘన నివాళి
- రేపు పులివెందులలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ సహా పలు ప్రారంభోత్సవాలు
- 10న కొప్పర్తి పారిశ్రామికవాడలో అల్‌డిక్సన్ యూనిట్‌కు ప్రారంభోత్సవం
- పారిశ్రామిక యూనిట్లకు శంకుస్థాపన

2లో

ఎన్డీయే భేటీకి.. టీడీపీని పిలవలేదు



- బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాధవ్
- సోషల్ మీడియాలో వచ్చిన వార్తలు నమ్మొద్దు
- కామన్ సివిల్ కోడ్‌పై రాష్ట్రంలోని పార్టీలు తమ వైఖరి చెప్పాలి

3లో

ఆ ఆలయాల నిర్వహణ ఇక ధర్మకర్తలు, అర్చకులదే

- రూ. 5 లక్షల లోపు ఆదాయం ఉండే ఆలయాలపై గెజిట్ నోటిఫికేషన్ జారీ
- ఆలయాలకు ట్రస్టు బోర్డు ఏర్పాటు చేయరు, ఈవోను నియమించరు
- ఆలయ ఆస్తుల విషయంలో మాత్రం కఠిన ఆంక్షలు
- అనుమతి లేకుండా కొత్త ఉద్యోగ నియామకాలు చేపట్టకూడదు

2లో

క్లుప్తంగా...

9న ఒబెరాయ్ హోటల్స్‌కు సీఎం జగన్ శంకుస్థాపన

- వర్చువల్ విధానంలో కార్యక్రమం నిర్వహణ
- కార్యరూపం దాల్చనున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ ఎంవోయూ



సాక్షి, విశాఖపట్నం: నగరంలో ఒబెరాయ్ గ్రూప్ ఆఫ్ హోటల్స్ నిర్మాణానికి వర్చువల్ విధానంలో ఈ నెల 9న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. అన్నవరం సముద్ర తీర ప్రాంతంలో పర్యాటక శాఖకు చెందిన 40 ఎకరాల విస్తీర్ణంలో ఒబెరాయ్ గ్రూప్ ఆఫ్ హోటల్స్ నిర్మాణం జరగనుంది. దీనికి సంబంధించి ఈ ఏడాది మార్చిలో విశాఖపట్నంలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్(జీఐఎస్-2023)లో రాష్ట్ర ప్రభుత్వంతో ఒబెరాయ్ గ్రూప్ చేసుకున్న ఎంవోయూ త్వరలోనే కార్యరూపం దాల్చనుంది. వర్చువల్ విధానంలో సీఎం వైఎస్ జగన్ హోటల్ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో అన్నవరంలో ఏర్పాట్లుపై కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున సమీక్షించారు. టూరిజం రీజనల్ డైరెక్టర్ శ్రీనివాస్ పాణి అన్నవరంలో ఒబెరాయ్‌కు కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. అన్నవరం వద్ద రూ.350 కోట్లుతో 7స్టార్ లగ్జరీ రిసార్టులను నిర్మించనున్నారు.

అమరావతి రైతుల కౌలు కోసం రూ.200 కోట్లు విడుదల

హైకోర్టుకు నివేదించిన సీఆర్‌డీఏ కమిషనర్

సాక్షి, అమరావతి: భూ సమీకరణ కింద రాజధాని అమరావతికి భూములిచ్చిన రైతులకు చెల్లించాల్సిన వార్షిక కౌలు నిమిత్తం రూ.200 కోట్లు విడుదల చేస్తూ జీవో జారీ చేసినట్లు సీఆర్‌డీఏ కమిషనర్ హైకోర్టుకు నివేదించారు. ఈ డబ్బు త్వరలోనే రైతుల ఖాతాల్లో జమ అవుతుందని కమిషనర్ తరఫు న్యాయవాది వివరించారు. ఈ వివరాలను రాతపూర్వకంగా తమ ముందుంచాలని సీఆర్‌డీఏను హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వార్షిక కౌలు చెల్లింపులో జాప్యాన్ని సవాలు చేస్తూ మంగళగిరికి చెందిన రైతు పోతినేని శ్రీనివాసరావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే.

లబ్ధిదారుల ఎంపికలో ఆధార్ వినియోగానికి చట్టబద్ధత

సాక్షి, అమరావతి: పలు సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపిక అత్యంత పారదర్శకంగా ఉండటం కోసం ఆధార్ నంబర్ వినియోగించడానికి చట్టబద్ధత కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేసింది. ఈ మేరకు ఏపీ ఆధార్ ఆర్డినెన్స్ 2023కు సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్ శుక్రవారం జారీ చేసింది. రాష్ట్రంలో పలు సామాజికవర్గాల సాంఘికాభివృద్ధికి వివిధ పథకాలను అమలు చేయడంలో రాష్ట్రం ముందంజలో ఉందని వీటిని అత్యంత సమర్థవంతంగా, పారదర్శకంగా, జవాబుదారీతనంతో అమలు చేయడం కోసం ఈ ఆర్డినెన్స్‌ను అమల్లోకి తీసుకువచ్చినట్లు పేర్కొంది.

ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా మాజీ ఎంపీ శంకరరావు



సాక్షి, అమరావతి/సాక్షి ప్రతినిధి, విజయనగరం: ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ ట్రైబ్స్ (ఎస్టీ) కమిషన్ చైర్మన్‌గా జీవీజీ శంకరరావును నియమిస్తూ ప్రభుత్వ కార్యదర్శి కాంతిలాల్ దండే శుక్రవారం ఉత్తర్వులిచ్చారు. ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా పనిచేసిన మాజీ ఎమ్మెల్యే కుంభ రవిబాబు పదవీ కాలం ఈ ఏడాది మే 11తో ముగియడంతో ఈ నియామకం చేపట్టింది. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు నియోజకవర్గం పాలికవలస గ్రామానికి శంకరరావు 1998లో ఆంధ్రా మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్, ఎండీ పూర్తి చేశారు. ప్రస్తుతం ఆయన నెల్లిమర్ల మిమ్స్ వైద్య కళాశాలలో అనస్థీషియాలజీ విభాగంలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. 1999-2004 వరకు పార్వతీపురం ఎంపీగా పనిచేశారు. గిరిజన ప్రాంతాల్లో సమస్యలపై ఆయనకు పూర్తిగా అవగాహన ఉండడంతో ప్రభుత్వం ఆయనను రాష్ట్ర ఎస్టీ సెల్ కమిషన్ చైర్మన్‌గా నియమించింది. తనపై ఉన్న నమ్మకంతో ప్రభుత్వం బాధ్యతలను అప్పగించినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి శంకరరావు ధన్యవాదాలు తెలిపారు. ఆయన రెండేళ్లపాటు ఈ పదవిలో కొనసాగనున్నారు.



నిమ్మ తోటను పొయ్యి కింద కట్టెల్లా అమ్మి..



ఈ రైతు పేరు గొడ్డేటి నారాయణరెడ్డి. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా పొదలకూరు మండలం పులికల్లు గ్రామం. దశాబ్దాలుగా నిమ్మతోట సాగు చేస్తూ జీవిస్తున్నాడు. 2004కు ముందు విద్యుత్ సరఫరా సక్రమంగా లేక, బిల్లులు చెల్లించలేక ఒక పర్యాయం ఎండిపోయిన తోటను వంట చెరకుగా అమ్ముకున్నాడు. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక **ఉచిత** విద్యుత్ అందించడంతో తిరిగి నిమ్మ మొక్కలు నాటుకుని, తోట నుంచి రాబడి పొందుతున్నాడు. ఈ పథకం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా బిల్లు చెల్లించలేదు. చంద్రబాబు హయాంలో రాత్రి పూట అరకొర విద్యుత్‌తో ఇబ్బందులు పడ్డాడు. నాలుగేళ్లుగా పగటి పూటే కరెంట్ ఇస్తుండటంతో ఆనందంగా సాగులో నిమగ్నమయ్యాడు.

శోకం.. ఆనందం.. పరిమళం



కర్నూలు జిల్లా కల్లూరు మండలం పెద్దటేకూరు గ్రామానికి చెందిన ఈ రైతు పేరు ఎస్.మునిస్వామి. తనకున్న పొలంలోని బోరులో రెండు ఇంచుల నీరు ఉండడంతో పత్తి, ఇతర పంటలు పండించుకుంటున్నాడు. 2004 ఏప్రిల్ నాటికి తన విద్యుత్ కనెక్షన్ల బకాయి రూ.24 వేలకు చేరింది. కట్టేందుకు డబ్బు **లేక,** విద్యుత్ సిబ్బంది ఒత్తిళ్లు తట్టుకోలేక తన రెండెకరాల పొలం అమ్ముకుందాం అనుకున్నాడు. నాడు అతని పొలం ఎకరం ధర రూ.10 వేల వరకు మాత్రమే ఉండేది. రెండెకరాలు అమ్మినా బకాయి **తీరదని** ఆందోళన చెందుతున్న సమయంలో మహానేత ఇచ్చిన 'ఉచిత విద్యుత్' హామీ అతనిలో ధైర్యం నింపింది. ఆ తర్వాత వైఎస్సార్ సీఎం కాగానే రూ.24 వేల బకాయి మాఫీ అయ్యింది. మహానేత తదనంతరం ఎప్పుడు కరెంట్ వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియక ఇక్కట్లు పడ్డాడు. వైఎస్ జగన్ సీఎం అయ్యాక పగలే 9 గంటలు సరఫరా చేస్తుండడంతో మల్లెపూలు, కూరగాయలు పండించుకుంటున్నాడు. మల్లె పంట మంచి లాభాలు తెచ్చిపెడుతోందని సంబరపడుతున్నాడు. రాత్రి కరెంటు కష్టాలు తీరాయని, మెరుగైన విద్యుత్ అందించేందుకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తే తప్పేమీలేదని, పైగా జవాబుదారీతనం పెరుగుతుందని చెబుతున్నాడు.

రైతులకు 'పవర్'

- సాగుకు ఉచిత విద్యుత్ ఇచ్చి జీవితాలు మార్చిన మహానేత వైఎస్సార్
- 2004కు ముందు బిల్లుల వాత.. జరిమానాల మోత
- వ్యవసాయమే దండగన్న చంద్రబాబునాయుడు
- తీగలపై బట్టలు ఆరేసుకోవాలని హేళన చేసిన టీడీపీ నేతలు
- అధికారం చేపట్టిన మరుక్షణమే ఆ ఫైల్‌పై వైఎస్సార్ తొలి సంతకం
- అప్పటి వరకు ఉన్న బకాయిలు, బిల్లులు రద్దు... కేసులు మాఫీ



2019 మార్చి 24న బాబు హయాంలో చీకట్లో చిన్న బ్యాటరీ సహాయంతో పొలానికి నీళ్లు పెడుతున్న కర్నూలు జిల్లా మాచాపురం రైతు సుంకన్న



శుక్రవారం పగటి పూటే నీరు పెడుతున్న నంద్యాల మండలం బిల్లాలాపురం గ్రామానికి చెందిన రైతులు సక్కా జయన్న, అబ్దుల్లా

(ఎస్.పి.యూసుఫ్ - కర్నూలు రాజ్‌విహార్/ సాక్షి, అమరావతి) : రాష్ట్రంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా చేసిన తొలి సంతకం లక్షలాది మంది అన్నదాతల తలరాతలు మార్చింది. 2004కు ముందు చంద్రబాబు పాలనలో రైతులు విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకొని, అందుకు సంబంధించిన డబ్బు చెల్లించి ఏళ్లు గడిచినా కనెక్షన్ మంజూరు అయ్యేది కాదు. అప్పుడు.. ఇప్పుడు అంటూ జాప్యం చేసేవారు. వర్షం పడి, నాటుకున్న పంట ఎండిపోయే దశలో 'డబ్బు కట్టాను.. పంటను కాపాడుకునేందుకు సమీపంలో ఉన్న స్తంభం నుంచి తీగలు పెట్టుకొని మోటర్ ఆన్ చేసుకొని నీళ్లు పెట్టుకుందామంటే కేసుల పేరుతో బెదిరించే వాళ్లు. పంటలు రాక, మద్దతు ధరలు లేక బిల్లులు చెల్లించని పక్షంలో బిల్లుల బకాయిలపై జరిమానాలు విధించేవారు. రాత్రి కరెంటుతో ఎన్నో కష్టాలు పడ్డారు. బావి, బోర్లలో నీళ్లు ఉన్నా.. విద్యుత్ సమస్యలు తప్పేవి కావు. భార్య బిడ్డలకు దూరంగా పొలంలో రాత్రంతా జాగరణ చేసినా పొలాన్ని తడుపుకోలేక సతమతమయ్యేవారు. మెయిన్ సప్లై ఆఫ్, బ్రేక్ డౌన్లు, ట్రిప్పింగ్‌ల కారణంగా అంతరాయం ఏర్పడితే ఎప్పుడు వస్తుందో తెలిసేది కాదు. దీంతో రైతులు రాత్రంతా పొలాల్లో నిద్ర మేలుకుని పడిగాపులుపడేవారు. 'అసలు వ్యవసాయమే దండగ' అని నాటి పాలకుడు చంద్రబాబు రైతులను చులకనగా చూశారు.

తొలి సంతకం.. చరిత్రాత్మకం

రైతు కష్టాలను నాడు పాదయాత్రలో కళ్లారా చూసిన వైఎస్ రాజశేఖరరెడ్డి వ్యవసాయానికి 7 గంటల పాటు ఉచితంగా విద్యుత్ అందిస్తామని ప్రతిపక్ష నేతగా హామీ ఇచ్చారు. ఈ హామీపై అప్పట్లో సీఎంగా ఉన్న చంద్రబాబు 'ఉచిత విద్యుత్ కాదు.. తీగలపై బట్టలు ఆరేసుకోవాలి' అంటూ హేళన చేశారు. 2004 మే 14న సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన వేదిక పైనే వైఎస్సార్ తొలి సంతకం పెట్టి సాహసోపేతంగా ఆ హామీని ఆచరణలో పెట్టారు. అప్పటి వరకు ఉన్న విద్యుత్ కనెక్షన్ల రూ.కోట్ల బకాయిలు రద్దు చేయడంతో పాటు ప్రతి ఏటా దరఖాస్తు చేసుకున్న రైతులకు ఉచిత కనెక్షన్లు ఇస్తూ వచ్చారు. ఏటా కోటాను పెంచారు.

2014లో 9 గంటల హామీ ఇచ్చి.. నీరుగార్చిన బాబు

2014 ఎన్నికలకు ముందు వ్యవసాయానికి 9 గంటల హామీ ఇచ్చిన చంద్రబాబు.. అధికారంలోకి వచ్చాక అమలు చేయకుండా అటకెక్కించారు. రైతులు భార్య పిల్లలను పట్టించుకోకుండా అస్తమానం పొలాల్లో జాగరణ చేసేవారు. కటిక చీకట్లో విష పురుగుల మధ్య గడపాల్సి వచ్చేది. ఎందరో పాము కాట్లకు బలయ్యారు. రాత్రి కరెంటుతో ప్రమాదాల బారిన పడి మృత్యువాత పడ్డారు. ఒక్కో రోజు కనీసం మూడు నాలుగు గంటలు కూడా కరెంట్ సరఫరా అయ్యేది కాదు. పైగా ఫీడర్లు బాగా దెబ్బతిన్నా పట్టించుకోలేదు.

నేడు పగలే 9 గంటల విద్యుత్ సరఫరా

చంద్రబాబు హయాంలో రాత్రి కరెంటు వల్ల ఇబ్బందులు పడిన రైతుల వేదన విన్న వైఎస్ జగన్ పగలే 9 గంటలు ఉచిత విద్యుత్ అందిస్తామని పాదయాత్రలో ప్రతిపక్ష నేతగా హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే 7 గంటల నుంచి 9 గంటలకు సరఫరా పెంచి అమల్లోకి తెచ్చారు. అందుకు దాదాపు రూ.1800 కోట్లు ఖర్చు చేసి సబ్ స్టేషన్ల సామర్థ్యం పెంపు, ఫీడర్ల సంఖ్యను పెంచడంతో పాటు పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు అదనంగా ఏర్పాటు చేశారు. దీంతో నాలుగేళ్లుగా వ్యవసాయానికి పగటి పూటే 9 గంటల ఉచిత విద్యుత్ అందుతుండడంతో రైతులు నిశ్చింతగా ఉన్నారు.

మరింత మెరుగ్గా సరఫరా కోసం స్మార్ట్ మీటరింగ్

వ్యవసాయానికి 30 ఏళ్ల పాటు మరింత నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు చర్యలు చేపట్టిన ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తోంది. వ్యవసాయ సరఫరా, మోటారు వాడకాన్ని బట్టి కొంత విద్యుత్ (లైన్‌లాస్) వృధా అవుతుంది. దీనిని నివారిస్తే విద్యుత్ ఆదా కావడంతో పాటు మెరుగైన విద్యుత్ అందుతుంది. కనెక్షన్ వద్ద మీటరు ఏర్పాటు చేస్తే ఆ రైతు నెలకు ఎన్ని యూనిట్లు వాడుతున్నాడో తెలియడంతో పాటు నెల నెలా ఆ యూనిట్లకు అయ్యే సొమ్మును ప్రభుత్వం రైతు ఖాతాలో జమ చేస్తుంది. ఆ డబ్బును తిరిగి విద్యుత్ పంపిణీ సంస్థకు రైతు చెల్లిస్తాడు. దీని వల్ల రైతుకు ఎలాంటి ఇబ్బందీ ఉండకపోగా.. విద్యుత్ సంస్థకు జవాబుదారీతనం, బాధ్యత పెరగనుంది.

రైతన్నకు అన్ని విధాలా భరోసా

- దేశంలో ఎక్కడా లేని విధంగా సొంత భూమి సాగు చేసుకుంటున్న రైతులతో పాటు అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కౌలు రైతులు, ఆర్‌ఓఎఫ్‌ఆర్ (అటవీ), దేవదాయ భూముల సాగుదారులకు 'వైఎస్సార్ రైతు భరోసా' కింద ఏటా 3 విడతల్లో రూ.13,500 చొప్పున పెట్టుబడి సాయం అందిస్తోంది.
- విత్తనం నుంచి పంట విక్రయం వరకు రైతన్నకు అన్ని సేవలు గ్రామంలోనే అందించే వన్ స్టాప్ సెంటర్లుగా రాష్ట్ర వ్యాప్తంగా 10,778 రైతు భరోసా కేంద్రాల (ఆర్బీకే)లను తీర్చిదిద్దారు. వీటి ద్వారా ధృవీకరించిన, కల్తీలేని నాణ్యమైన విత్తనాలు, నాణ్యమైన ఎరువులు, పురుగు మందుల పంపిణీతో పాటు ఈ - క్రాప్ నమోదు చేస్తున్నారు.
- అర్హులైన రైతులకు వైఎస్సార్ ఉచిత పంటల బీమా, వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాలు, పంట నష్ట పరిహారం వంటి సంక్షేమ ఫలాలు అందించడమే కాకుండా ఈ-క్రాప్ ప్రామాణికంగా ధాన్యం సహా ఇతర పంట ఉత్పత్తులు కొనుగోలు చేస్తున్నారు.
- ఆర్బీకేల ద్వారా కల్లాల వద్దే మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయడమే కాకుండా జీఎల్‌టీ (గోనె సంచులు, ధాన్యం లోడింగ్‌కు హమాలీ ఖర్చులు, ధాన్యాన్ని కల్లం నుంచి కేటాయించిన మిల్లుకు చేర్చే వరకు రవాణా చార్జీలు) రూపేణా క్వింటాల్‌కు మద్దతు ధరకు అదనంగా రూ.300 అందిస్తోంది.

యంత్ర సేవా కేంద్రాలు, టెస్టింగ్ ల్యాబ్స్

- రూ.2,016 కోట్ల వ్యయంతో ఆర్బీకే స్థాయిలో ఒక్కొక్కటి రూ.15 లక్షల విలువ గల 10,750 వైఎస్సార్ యంత్ర సేవా కేంద్రాలు, వరి ఎక్కువగా పండించే 20 జిల్లాల్లో ఒక్కొక్కటి రూ.25 లక్షల విలువ గల కంబైన్డ్ హార్వెస్టర్లతో కూడిన 1,615 క్లస్టర్ స్థాయి యంత్ర సేవా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు.
- దళారులు, కమీషన్ ఏజెంట్లకు స్వస్తి పలుకుతూ మహిళా డెయిరీ సహకార సంఘాల ద్వారా పాలు సేకరిస్తున్నారు. 'జగనన్న పాల వెల్లువ' ద్వారా పాడి రైతులకు లీటర్ గేదె పాలకు రూ.22 వరకు, ఆవు పాలకు రూ.11 వరకు అదనపు లబ్ధి చేకూర్చారు.
- విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు తదితర వ్యవసాయ ఉత్పాదకాల నాణ్యత నిర్ధారణ కోసం రూ.213.27 కోట్ల వ్యయంతో నియోజకవర్గ స్థాయిలో 147, జిల్లా స్థాయిలో 10 పరీక్ష ల్యాబొరేటరీలు, 4 రీజనల్ కోడింగ్ సెంటర్లు నిర్మిస్తోంది. తొలి దశలో 75 ల్యాబ్‌ల సేవలు అందుబాటులోకి రాగా, నేడు మరో 52 ల్యాబ్‌లను ప్రారంభిస్తున్నారు. వీటితో కలిపి ఇప్పటి వరకు 127 ల్యాబ్‌ల సేవలు రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. మొత్తంగా నాలుగేళ్లలో ఈ ప్రభుత్వం రూ.1,70,769.23 కోట్ల మేర రైతులకు లబ్ధి కలిగించింది.

ఇదివరకెన్నడూ లేనంతగా పరిహారం

- దేశంలో ఎక్కడా లేని విధంగా రైతన్నలపై పైసా భారం పడకుండా నోటిఫై చేసిన పంటలకు సాగు చేసిన ప్రతి ఎకరాకు ఈ-క్రాప్ ప్రామాణికంగా రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేస్తోంది.
- వరుసగా నాలుగో ఏడాది 10.20 లక్షల మందికి రూ.1,117.21 కోట్ల బీమా పరిహారాన్ని నేడు జమ చేయనుంది. ఈ మొత్తంతో కలిపి ఇప్పటి వరకు 54.48 లక్షల మందికి రూ.7,802.05 కోట్ల బీమా పరిహారం అందించింది.
- రైతుల తరఫున ప్రభుత్వమే బీమా కంపెనీకి ప్రీమియం చెల్లిస్తోంది. అలాంటప్పుడు వీలైనంత ఎక్కువగా పరిహారం రావాలని కోరుకుంటుంది. ఈ కనీస పరిజ్ఞానం లేకుండా కొంత మంది టీడీపీ నేతలు పరిహారానికి ప్రభుత్వం కొర్రీ వేసిందని ఆరోపించడం.. వాటిని పచ్చ పత్రికలు పతాక శీర్షికన వండి వార్చడం దుర్మార్గం.

దటీజ్ వైఎస్ జగన్

- కర్నూలు జిల్లా సి.బెళగల్ మండలం గుండ్రేవుల గ్రామానికి చెందిన హరిజన బడేసావు 2018 జూలై 9వ తేదీన ఉచిత విద్యుత్ కోసం దరఖాస్తు చేసుకొని, అందుకు సంబంధించిన డబ్బు చెల్లించాడు. సీనియారిటీ పేరుతో విద్యుత్ కనెక్షన్ మంజూరు చేయలేదు. వైఎస్ జగన్ వచ్చాక కనెక్షన్ మంజూరైంది. ఇలా ఒక్క సి.బెళగల్ మండలంలోనే 37 మంది రైతులకు కనెక్షన్లు ఇచ్చారు.
- ఇలా రాష్ట్ర వ్యాప్తంగా వేల దరఖాస్తులు క్లియర్ చేశారు. ప్రస్తుతం రైతు దరఖాస్తు చేసుకుంటే మూడు రోజుల్లో అంచనా (ఎస్టిమేట్లు) వేస్తున్నారు. ఒక్కో రైతుకు సుమారు రూ.65 వేల నుంచి రూ.1.50 లక్షల వరకు ఖర్చు వెచ్చించి నెల రోజుల్లో విద్యుత్ కనెక్షన్ ఇస్తున్నారు.
- ఈ పథకం కింద 2023 మే 30 నాటికి రాష్ట్రంలో 19,11,032 కనెక్షన్లకు ఉచిత విద్యుత్ అందుతోంది. ఈ నాలుగేళ్లలో ప్రభుత్వం విద్యుత్ కనెక్షన్ల కోసం మాత్రమే రూ.2,205.79 కోట్లు ఖర్చు చేసింది. 1.69 లక్షలకు పైగా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసింది. రోజుకు 6.30 కోట్ల యూనిట్ల విద్యుత్‌ను సరఫరా చేస్తోంది. ప్రతి ఏటా ఉచిత విద్యుత్ కోసం ఏకంగా రూ.8 వేల కోట్లకు పైగా వెచ్చిస్తోంది.
- వ్యవసాయానికి పగటి పూట 9 గంటల పాటు నాణ్యమైన ఉచిత విద్యుత్ సరఫరాలో నాణ్యత పెంచేందుకు రూ.1,700 కోట్లతో ఫీడర్లు, సబ్ స్టేషన్లను ఆధునీకరించారు. రానున్న 30 ఏళ్ల పాటు రైతన్నలకు ఉచిత వ్యవసాయ విద్యుత్తుకు ఢోకా లేకుండా ఎస్‌ఈసీఐతో ఒప్పందం చేసుకుని 10 వేల మెగావాట్ల సామర్థ్యం గల సోలార్ పవర్ ప్రాజెక్టు నిర్మిస్తున్నారు. ఆక్వాజోన్ పరిధిలో 10 ఎకరాల్లోపు రైతులకు యూనిట్ రూ.1.50కే విద్యుత్ సరఫరా చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాల వారీగా ఉచిత విద్యుత్ కనెక్షన్ల వివరాలు (ఒక కనెక్షన్‌కు సగటున రూ.65 వేలు)

ప్రాంతం	మొత్తం కనెక్షన్లు	మొత్తం ట్రాన్స్‌ఫార్మర్లు	ఈ ప్రభుత్వం మంజూరు చేసిన కనెక్షన్లు	ట్రాన్స్‌ఫార్మర్లు	ఈ ప్రభుత్వం చేసిన ఖర్చు (రూ.కోట్లలో)
ఎస్‌పీడీసీఎల్ (చిత్తూరు, కడప, కర్నూలు, అనంతపురం, నెల్లూరు జిల్లాలు)	11,66,589	4,94,983	2,22,233	1,11,117	1,444.51
సీపీడీసీఎల్ (ప్రకాశం, గుంటూరు, కృష్ణా జిల్లాలు)	4,47,532	1,72,087	79,303	39,652	515.46
ఈపీడీసీఎల్ (ఉభయ గోదావరి, విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలు)	2,96,911	1,03,046	37,817	18,909	245.81
రాష్ట్రం మొత్తం	19,11,032	7,70,116	3,39,353	1,69,678	2,205.78

టీడీపీ హయాంలో చెల్లించిన బీమా వివరాలు

సీజన్	రైతులు (లక్షల్లో)	లబ్ధి పొందిన మొత్తం (రూ.కోట్లలో)
2014-15	1.03	132.24
2015-16	4.35	339.7
2016-17	8.70	954.75
2017-18	6.77	720.6
2018-19 (ఖరీఫ్-2018)	10	1,263.91
మొత్తం	30.85	3,411.20

గడిచిన మూడేళ్లలో చెల్లించిన బీమా వివరాలు

సీజన్	రైతులు	బీమా మొత్తం (రూ.కోట్లల్లో)
గత ప్రభుత్వ బకాయిలు	6,19,641	715.84
ఖరీఫ్ 2019	9,48,000	1252.18
ఖరీఫ్ 2020	13,00,000	1739
ఖరీఫ్-2021	15,60,703	2977.82
ఖరీఫ్-2022	10,20,000	1117.21 (నేడు జమ కానుంది)
మొత్తం	54,48,344	7,802.05

నెల రోజుల్లో కనెక్షన్

వ్యవసాయ విద్యుత్‌కు గతంలో దరఖాస్తు చేసుకొని, డబ్బు చెల్లించిన డీడీల తేదీ ఆధారంగా సీనియారిటీ మేరకు విద్యుత్ కనెక్షన్లు ఇచ్చే వారు. ఈ పద్ధతి మార్చాలని సీఎం జగన్ ఆదేశించారు. ఎంత ఖర్చయినా ఆపొద్దన్నారు. గతంలో ఉన్న కోటా విధానాన్ని ఎత్తేసి, దరఖాస్తు చేసుకొని అర్హత ఉంటే మంజూరు చేయమన్నారు. దీంతో నెలలో కనెక్షన్ ఇస్తున్నాం.
– కె.సంతోషరావు, సీఎండీ, ఎస్‌పీడీసీఎల్

ఆ ఆలయాల నిర్వహణ ఇక ధర్మకర్తలు, అర్చకులదే

- రూ. 5 లక్షల లోపు ఆదాయం ఉండే ఆలయాలపై గెజిట్ నోటిఫికేషన్ జారీ
- ఆలయాలకు ట్రస్టు బోర్డు ఏర్పాటు చేయరు, ఈవోను నియమించరు
- ఆలయ ఆస్తులు విషయంలో మాత్రం కఠిన ఆంక్షలు
- అనుమతి లేకుండా కొత్త ఉద్యోగ నియామకాలు చేపట్టకూడదు

సాక్షి, అమరావతి: దేవదాయ శాఖ పరిధిలో ఏడాదికి ఐదు లక్షల రూపాయల లోపు ఆదాయం ఉండే ఆలయాల నిర్వహణపై ప్రభుత్వం కీలక ఉత్తర్వులు ఇచ్చింది. ఆ ఆలయాల రోజు వారీ నిర్వహణను పూర్తిగా ఆయా ఆలయాల వంశపారంపర్య ధర్మకర్తలు లేదా వంశపారంపర్య అర్చకులు లేదా ఏదైనా ఆలయ నిర్వహణ కమిటీలకే ప్రభుత్వం అప్పగించింది. ఈ మేరకు శుక్రవారం దేవదాయశాఖ కార్యదర్శి సత్యనారాయణ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేశారు. వచ్చే ఐదేళ్ల కాలానికి ఆ ఆలయాలకు దేవదాయ శాఖ ట్రస్టు బోర్డు ఏర్పాటుతో పాటు కార్యనిర్వాహక అధికారి (ఈవో)ను నియమించబోమని గెజిట్ నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి గతంలోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గం ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే.

గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం..

- ఆయా ఆలయాలు దేవదాయ శాఖ చట్టం సెక్షన్ 57, 65 నిబంధనల ప్రకారం దేవదాయ శాఖకు చెల్లించాల్సిన సీజీఎఫ్ నిధులు వంటివి చెల్లించాల్సిన అవసరం ఉండదు.
- కొత్తగా ఆలయ నిర్వహణ బాధ్యత పొందేవారు ఆలయ సంప్రదాయాల మేరకు పూజా కార్యక్రమాలు చేయాలి. అన్ని రకాల సంప్రదాయాలను కచ్చితంగా పాటించాలి.
- దేవదాయ శాఖ కమిషనర్ అనుమతి లేకుండా ఆ ఆలయంలో కొత్త ఉద్యోగ నియామకాలు చేపట్టరాదు.
- ఆలయ భూములు, స్వామి వారి నగలు వంటి స్థిర చర ఆస్తులను అమ్మడం లేదా మార్పిడి చేయడం, తాకట్టు పెట్టడం వంటివి చేపట్టకూడదు.
- మూడేళ్ల కాలపరిమితికి మించి ఆలయ భూములను లేదా షాపులను లీజుకు ఇవ్వకూడదు.
- ఆలయం పేరిట ఇప్పటికే ఉన్న బ్యాంకు డిపాజిట్లను కమిషనర్ అనుమతి లేకుండా నగదుగా మార్చకూడదు.
- ఈ వ్యవహారాలలో ఏమైనా తప్పిదాలు గుర్తిస్తే సంబంధిత నిర్వాహకులపై దేవదాయ శాఖ చట్ట ప్రకారం తగిన చర్యలు చేపడతారు.

సీఎంకు ధన్యవాదాలు

ఐదు లక్షల లోపు ఆదాయం ఉండే ఆలయాల నిర్వహణ విషయంలో ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంపై ఆంధ్రప్రదేశ్ అర్చక సమాఖ్య అధ్యక్షుడు అగ్నిహోత్రం ఆత్రేయబాబు, కార్యనిర్వాహక కార్యదర్శి పెద్దింటి రాంబాబు ఓ సంయుక్త ప్రకటనలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి కొట్టు సత్యనారాయణ, కమిషనర్ తదితరులకు ధన్యవాదాలు తెలిపారు.

అనంత, వైఎస్సార్ జిల్లాల్లో సీఎం జగన్ పర్యటన

- దివంగత సీఎం వైఎస్సార్ జయంతి సందర్భంగా నేడు కళ్యాణదుర్గంలో రైతు దినోత్సవం
- అనంతరం ఇడుపులపాయకు చేరుకుని మహానేతకు ఘన నివాళి

సాక్షి, అమరావతి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం ఉదయం అనంతపురం జిల్లాలో పర్యటించనున్నారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా కళ్యాణదుర్గంలో నిర్వహించే వైఎస్సార్ రైతు దినోత్సవంలో పాల్గొననున్నారు. ఏపీ మోడల్ స్కూల్ సమీపంలో ఏర్పాటు చేసిన సభా వేదిక వద్దకు చేరుకుని డాక్టర్ వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్‌ను ప్రారంభిస్తారు. ఈ సందర్భంగా 2022- ఖరీఫ్‌లో పంటలు నష్టపోయిన 10.2 లక్షల మందికి రైతులకు లబ్ధి కలిగిస్తూ రూ.1,117 కోట్ల బీమా పరిహారం విడుదల చేస్తారు. తద్వారా ఒక్క అనంతపురం జిల్లాలోనే 1,36,950 మంది రైతులకు రూ.212.94 కోట్ల మేర లబ్ధి చేకూరుతుంది. అనంతరం సీఎం జగన్ ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. ఈ కార్యక్రమం తర్వాత వైఎస్సార్ జిల్లా పర్యటనకు బయలుదేరనున్నారు. నేటి నుంచి 10వ తేదీ వరకు ఆ జిల్లాలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. 8వ తేదీ మధ్యాహ్నం ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్‌కు చేరుకుని మహానేతకు నివాళులర్పిస్తారు.

9న గండికోటకు సీఎం జగన్

ఈనెల 9వ తేదీ ఉదయం 9.20 గంటలకు గండికోట వద్ద ఒబెరాయ్ హోటల్ నిర్మాణ పనులకు సీఎం జగన్ శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం అక్కడ వ్యూ పాయింట్‌ను పరిశీలిస్తారు. ఆ తర్వాత పులివెందుల చేరుకుని నూతనంగా నిర్మించిన మున్సిపల్ ఆఫీసు భవనాన్ని, రాణితోపులో నగరవనాన్ని, గరండాల రివర్ ఫ్రంట్ వద్ద కెనాల్ డెవలప్‌మెంట్ ఫేజ్-1 పనులను, పులివెందులలో నూతనంగా నిర్మించిన (వైఎస్సార్ ఐఎస్‌టీఏ) స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, ఏపీ కార్ల్‌లో న్యూటెక్ బయో సైన్సెస్‌ను ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 2.30 గంటలకు పులివెందులలో వైఎస్సార్ స్పోర్ట్స్ అకాడమికి ప్రారంభోత్సవం చేస్తారు. అనంతరం ఇడుపులపాయకు చేరుకుంటారు. 10వ తేదీ ఉదయం 9 గంటలకు కడపలోని రాజీవ్ మార్గ్, రాజీవ్ పార్కుతో పాటు పలు అభివృద్ధి పనులను ప్రారంభిస్తారు. అనంతరం కొప్పర్తి పారిశ్రామికవాడలో అల్ డిక్సన్ యూనిట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు. కొప్పర్తిలో పలు పారిశ్రామిక యూనిట్లకు శంకుస్థాపన చేస్తారు. మధ్యాహ్నం తిరిగి తాడేపల్లికి బయలుదేరుతారు.

10న విశాఖకు పార్లమెంట్ సబ్ కమిటీ రాక

3 రోజుల పాటు నగరంలో పర్యటన

సాక్షి, విశాఖపట్నం: పార్లమెంట్ కమిటీకి సంబంధించిన అధికార భాషా మొదటి సబ్ కమిటీ విశాఖలో ఈ నెల 10 నుంచి 13 వరకు పర్యటించనుంది. కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలను పరిశీలించనుంది. 10న రాత్రి విశాఖకు చేరుకోనున్న బృందం..11న ఉదయం సింహాచలం అప్పన్న దర్శనం అనంతరం విజయవాడ ఎన్‌హెచ్‌ఏఐ రీజనల్ కార్యాలయం, కోరాపుట్‌లోని హిందూస్థాన్ ఏరోనాటికల్ లిమిటెడ్, మచిలీపట్నంలోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, విశాఖలోని భారత్ డైనమిక్స్, బీఈఎంఎల్ రీజనల్ కార్యాలయం, హిందూస్థాన్ షిప్‌యార్డు, తాడేపల్లిగూడెంలోని ఎన్ఐటీతో పాటు పలు విద్యా సంస్థల ప్రతినిధులతో విశాఖలోని ఓ హోటల్‌లో సమీక్ష నిర్వహించనుంది. అనంతరం నౌకాదళ కేంద్రాన్ని, డ్రైడాక్, షిప్, సబ్‌మెరైన్‌ల ప్రాంతాలను సందర్శిస్తుంది. 12న పలు జిల్లాల్లోని కేంద్రీయ విద్యాలయాల ప్రతినిధులతో అధికార భాష అమలుపై సమీక్షించి అరకు, పాడేరు ప్రాంతాలతో పాటు విశాఖలోని కైలాసగిరి, ఇతర స్థలాలను సందర్శించనుంది. 13న ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, ఓఎన్‌జీసీ, గెయిల్, ఈస్టర్న్ నేవల్ కమాండ్ ప్రతినిధులతో సమీక్ష నిర్వహించిన అనంతరం బృందం ముంబై వెళ్లనుంది.

క్లుప్తంగా...

పులివెందులలో ప్రభుత్వ వ్యవసాయ కళాశాల

గుంటూరు రూరల్: వైఎస్సార్ జిల్లా పులివెందులలో ప్రభుత్వ వ్యవసాయ కళాశాల ఏర్పాటుకు ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ వర్సిటీ అనుమతి మంజూరు చేసినట్లు వీసీ డాక్టర్ ఎ. విష్ణువర్ధన్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ కళాశాల 2023–24 విద్యా సంవత్సరంలో బీఎస్సీ (హానర్స్) అగ్రికల్చర్ బీఎస్సీలో 60 మంది విద్యార్థులతో ప్రారంభించనున్నట్లు చెప్పారు. అందుకుగానూ 104 మంది బోధన, బోధనేతర సిబ్బంది పోస్టులను, సహకార మంత్రిత్వ శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మంజూరు చేసినట్లు వెల్లడించారు.

14న ఏపీపీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలన

సాక్షి, అమరావతి: ఆయుష్ శాఖలో లెక్చరర్/అసిస్టెంట్ ప్రొఫెసర్ (హోమియోపతి, యునాని, ఆయుర్వేదం) పోస్టులతోపాటు దేవదాయ శాఖలో అసిస్టెంట్ కమిషనర్ పోస్టులకు తాత్కాలికంగా ఎంపికైన అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను ఈ నెల 14న పరిశీలించనున్నట్లు ఏపీపీఎస్సీ శుక్రవారం తెలిపింది. అభ్యర్థులు మెమో, చెక్‌లిస్టు, ధ్రువీకరణ పత్రాలను కమిషన్ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించింది. వీటితో పాటు మే నెలలో డిపార్ట్‌మెంటల్ టెస్టుకు నోటిఫికేషన్ జారీ చేయగా సంబంధిత పరీక్షను వచ్చే నెల 2 నుంచి 7వ తేదీ వరకు నిర్వహించనుంది. ఈ టైమ్ టేబుల్‌ను https://psc.ap.gov.inలో ఉంచినట్లు ఏపీపీఎస్సీ తెలిపింది.

22న రెండో సెమిస్టర్ పుస్తకాల పంపిణీ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఈ నెల 22న రెండో సెమిస్టర్ పుస్తకాలను పంపిణీ చేయనున్నట్లు పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజును 'రెండో సెమిస్టర్ పుస్తకాల పంపిణీ' దినోత్సవంగా ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. 1 నుంచి 9వ తరగతి వరకు 36 లక్షల మంది విద్యార్థులకు కోటి పుస్తకాలను ఒకేరోజున పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. మారుమూల ప్రాంతాల్లోని వెయ్యి పాఠశాలలకు అమెజాన్ ద్వారా డెలివరీ చేసేందుకు ప్రభుత్వం ఒప్పందం చేసుకుందని తెలిపారు. మిగిలిన పాఠశాలలకు రేషన్ పంపిణీ వాహనాల ద్వారా తరలించనున్నట్టు తెలిపారు. ఒక్కరోజే నూరుశాతం పుస్తకాలు పంపిణీ చేసేందుకు అమెజాన్ ట్రక్కులు, డెలివరీ బాయ్స్, రేషన్ వాహనాలను వినియోగిస్తున్నట్లు వివరించారు. రెండో సెమిస్టర్ పుస్తకాలను నవంబర్‌లో పంపిణీ చేయాల్సి ఉండగా ప్రభుత్వం ముందుగానే ముద్రణ పూర్తిచేసి అందిస్తోందని తెలిపారు.

13న స్థానిక సంస్థల ఉప ఎన్నికలు



- మచిలీపట్నంలో రెండు డిప్యూటీ మేయర్..
- పెడన మున్సిపాలిటీలో చైర్‌పర్సన్..
- మాచర్ల, ధర్మవరం మున్సిపాలిటీల్లో మరో మూడు వైస్ చైర్మన్..
- 13 మండలాల్లో నాలుగు ఎంపీపీ, ఏడు ఉపాధ్యక్ష, మూడు కో– ఆప్షన్ సభ్యుల పదవులకు వేర్వేరుగా ఎన్నికల నోటిఫికేషన్లు జారీ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మరో విడత స్థానిక సంస్థలకు ఉప ఎన్నికలు నిర్వహించనున్నారు. ఆయా స్థానిక సంస్థల్లో రాజీనామా లేదా మరణించడం వంటి కారణాలతో ఖాళీ అయిన పదవులకు పరోక్ష పద్ధతిలో ఈ నెల 13న ఎన్నికలు నిర్వహిస్తారు. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని శుక్రవారం వేర్వేరుగా నోటిఫికేషన్లు జారీ చేశారు. మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్‌లో రెండు డిప్యూటీ మేయర్ పదవులతో పాటు పెడన మున్సిపాలిటీలో చైర్‌పర్సన్ పదవిని భర్తీ చేస్తారు. అలాగే మాచర్ల మున్సిపాలిటీలో ఒకటి, ధర్మవరం మున్సిపాలిటీల్లో రెండు వైస్ చైర్మన్ పదవులకు ఎన్నికలు జరగనున్నాయి. అదేవిధంగా మొత్తం 13 మండలాల్లో నాలుగు ఎంపీపీ, ఏడు ఉపాధ్యక్ష, మూడు కో– ఆప్షన్ సభ్యుల పదవులకూ ఎన్నికలు నిర్వహిస్తారు. వివిధ మండలాల్లో 12 గ్రామ పంచాయతీల్లో ఉప సర్పంచ్ పదవులకు కూడా ఎన్నికలు ఉంటాయని నోటిఫికేషన్లలో పేర్కొన్నారు. ఈ నెల 13న ప్రత్యేక సమావేశాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్లకు సూచించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన నోటీసులను ఆయా స్థానిక సంస్థల సభ్యులకు ఈ నెల 9 కల్లా అందజేయాలని ఆదేశించారు.

ఎంపీపీ ఎన్నికలు జరిగే మండలాలు (4)	కో- ఆప్షన్ సభ్యుల ఎన్నికలు జరిగే మండలాలు (3) / ఉపాధ్యక్ష పదవికి ఎన్నికలు జరిగే మండలాలు (7)	ఉప సర్పంచ్ ఎన్నికలు జరిగే గ్రామ పంచాయతీలు (12)
రామకుప్పం (చిత్తూరు), తొండంగి (కాకినాడ), వత్సవాయి (ఎన్టీఆర్), చేజెర్ల (నెల్లూరు)	కో- ఆప్షన్: చిత్తూరు, బి.మఠం (వైఎస్సార్), రాజంపేట (అన్నమయ్య) ఉపాధ్యక్ష: రామకుప్పం, విజయాపురం (చిత్తూరు), రాపూరు (శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు), గాలివీడు (అన్నమయ్య), పార్వతీపురం (మన్యం), పెదకడబూరు (కర్నూలు), రాయదుర్గం (అనంతపురం).	అనకాపల్లి, బాపట్ల, అన్నమయ్య జిల్లాల్లో రెండేసి.. శ్రీకాకుళం, విజయనగరం, కృష్ణా, పల్నాడు, తిరుపతి, అనంతపురం జిల్లాల్లో ఒక్కొక్కటి చొప్పున.

నెరవేరిన సర్వేయర్ల కల

- 135 మంది డిప్యూటీ సర్వేయర్లకు తొలిసారి పదోన్నతి
- 30 ఏళ్లుగా ఒకే క్యాడర్‌లో పనిచేసిన వివిధ స్థాయిల్లోని సర్వే అధికారులు

సాక్షి, అమరావతి: ఏళ్ల తరబడి ఒకే క్యాడర్‌లో పని చేస్తున్న 135 మంది డిప్యూటీ సర్వేయర్లకు తొలిసారి పదోన్నతి లభించింది. సర్వే సెటిల్మెంట్ శాఖ పునర్వ్యవస్థీకరణతో పదోన్నతుల చానల్ ఏర్పడటం వల్ల ఇది సాధ్యమైంది. సర్వే సెటిల్మెంట్ కమిషనర్ ఇటీవల వీరందరికీ డిప్యూటీ సర్వేయర్ల నుంచి సర్వేయర్లుగా పదోన్నతులు ఇవ్వడంతో వారి సుదీర్ఘకల నెరవేరింది. దీంతో వీరంతా మండల ల్యాండ్ సర్వే అధికారులుగా పనిచేయనున్నారు. వీరికి మూడు దశల్లో ఏపీ సర్వే అకాడమీ శిక్షణ ఇవ్వనుంది. జీఎన్ఎస్ఎస్ రోవర్లు, రీ సర్వే, ఆన్‌లైన్ పట్టా సబ్ డివిజన్, ఎఫ్ లైన్ పిటిషన్లపై శిక్షణ ఇస్తారు.

వైఎస్ జగన్ ప్రభుత్వం వచ్చిన వెంటనే..

సర్వే సెటిల్మెంట్, భూ రికార్డుల శాఖను గతంలో ఏ ప్రభుత్వం పట్టించుకోలేదు. భూముల రీ సర్వేతో ఈ శాఖకు నూతన వైభవం వచ్చింది. వైఎస్ జగన్ ప్రభుత్వం సర్వే శాఖను దశాబ్దాల తర్వాత గతేడాది ఆగస్టులో పునర్వ్యవస్థీకరించింది. ఆ సమయంలో 101 మంది మండల సర్వేయర్లకు డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేగా పదోన్నతులు దక్కాయి. తాజాగా 135 మంది డిప్యూటీ సర్వేయర్లకు మండల సర్వేయర్లుగా పదోన్నతులు లభించాయి. గతేడాది వరకు సర్వే శాఖలో సర్వేయర్‌గా చేరితే... మళ్లీ సర్వేయర్‌గానే పదవీ విరమణ చేసే పరిస్థితి ఉండేది. ఆ శాఖ ఏర్పడిన నాటి నుంచి పదోన్నతుల చానల్ లేకపోవడమే ఇందుకు కారణం. ఆ శాఖ ఏర్పడినప్పటి నుంచి భూయజమానుల అవసరాలు, ప్రభుత్వ భూ పంపిణీ, ప్రాజెక్టులకు భూసేకరణ, ఇళ్ల పట్టాల సర్వే, పారిశ్రామికీకరణకు భూముల సర్వే, రోడ్ల అభివృద్ధి వంటి అన్ని కార్యక్రమాలు ఎన్నో రెట్లు పెరిగాయి. సర్వేయర్ల సంఖ్య మాత్రం పెరగలేదు. కనీసం రెండు వేల మంది సర్వేయర్లను అదనంగా నియమించాలని గత ప్రభుత్వాలను ఆ శాఖ ఉద్యోగులు కోరినా ఎవరూ పట్టించుకోలేదు. వైఎస్ జగన్ ప్రభుత్వం వచ్చిన వెంటనే అడక్కుండానే 11,118 గ్రామ సర్వేయర్ పోస్టులు సృష్టించింది. దీంతో ప్రస్తుతం ప్రతి గ్రామానికి ఒక సర్వేయర్ అందుబాటులో ఉన్నారు. సర్వే శాఖ పునర్వ్యవస్థీకరణలో భాగంగా 410 నూతన ఉద్యోగాలు కూడా మంజూరు చేశారు. దీనివల్ల 410 ఉద్యోగాలు రావడమే కాకుండా వివిధ స్థాయిల్లో 600 మందికి పైగా పదోన్నతులు కల్పించాల్సిన అవసరం ఏర్పడింది. అందులో భాగంగానే ఇప్పుడు 135 మందికి పదోన్నతి లభించింది.

టీడీపీలో ఉన్నా.. లేకున్నా ఒక్కటే

- జగనన్న సంక్షేమ పథకాల ద్వారా రూ.11 లక్షలు లబ్ధి పొందాం
- ఎమ్మెల్యే భూమన ఎదుట సంతోషం వ్యక్తం చేసిన టీడీపీ కార్పొరేటర్ అభ్యర్థి



టీడీపీ తరఫున కార్పొరేటర్‌గా పోటీ చేసిన గుర్రమ్మ లబ్ధి పొందిన వివరాల బుక్‌లెట్ అందించిన ఎమ్మెల్యే భూమన

తిరుపతి మంగళం: 'భుజాలు అరిగిపోయేలా టీడీపీ జెండాలు మోశాం. పార్టీ కోసం ఎనలేని సేవలందించాం. జగనన్న ప్రభుత్వంలో లబ్ధి పొందినట్టుగా టీడీపీ ప్రభుత్వంలో ఏనాడు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందలేదు. ప్రజలకు మేలు చేయని టీడీపీలో ఉన్నా ఒక్కటే.. లేకున్నా ఒక్కటే. జగనన్న లాంటి నాయకుడు మళ్లీ సీఎం కావాలి' అంటూ తిరుపతి కార్పొరేషన్ ఎన్నికల్లో టీడీపీ తరఫున 30వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థిగా పోటీచేసిన గుర్రమ్మ చెప్పారు. తిరుపతి నెహ్రూనగర్‌లో గురువారం కార్పొరేటర్ కల్పనయాదవ్, డివిజన్ అధ్యక్షుడు ఎస్‌కే ఇమ్రాన్‌బాషా ఆధ్వర్యంలో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, డిప్యూటీ మేయర్ నారాయణ 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ డివిజన్ నుంచి పోటీచేసిన గుర్రమ్మ వైఎస్ జగన్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై ప్రశంసల వర్షం కురిపించారు. తాను కూడా జగనన్న సంక్షేమ పథకాల ద్వారా రూ. 11 లక్షలు లబ్ధి పొందినట్లు ఎమ్మెల్యే భూమనకు ఆమె సంతోషంగా చెప్పారు. ఈ సందర్భంగా భూమన కరుణాకరరెడ్డి మాట్లాడుతూ 'సీఎం వైఎస్ జగన్ కులాలు, మతాలు, పార్టీలు చూడకుండా అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్న గొప్ప నాయకుడు. చంద్రబాబు ధనవంతులకు కొమ్ముకాస్తే, జగనన్న పేదల సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తున్నారు. అలాంటి గొప్ప నాయకుడికి అండగా ఉండాలి' అని చెప్పారు.

ఈ పేద జీవితంలో ఆశలు చిగురించాయి

- వైఎస్ జగన్ ప్రభుత్వంపై ఓ వ్యక్తికి ఎనలేని అభిమానం
- తాను పొందిన సంక్షేమ పథకాల వివరాలతో ఇంటికి ఫ్లెక్సీ



సుభానీ తన ఇంటికి ఏర్పాటు చేసుకున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ఉన్న బ్యానర్

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): 'నేను నిరుపేదను. ఎలాంటి స్థిరాస్తులు లేవు. రోజువారీ కూలీ అయిన నేను కుటుంబ అవసరాలు తీర్చలేకపోవడంతో పాటు పిల్లల చదువుల కోసం ఎంతో ఇబ్బందులు పడుతుండేవాడిని. ఇలాంటి నా జీవితంలో సంక్షేమ పథకాలతో వెలుగులు నింపారు. సగర్వంగా తలెత్తుకుని జీవించేలా చేశారు. ఆర్థికంగా చితికిపోకుండా జీవితంపై ఆశలు చిగురింప చేసిన జగనన్నా ఏమిచ్చి మీ రుణం తీర్చుకోవాలి. మా కుటుంబం మొత్తం మీ వెనుక నడుస్తాం' అంటూ ఓ నిరుపేద తన అభిమానాన్ని ఫ్లెక్సీ రూపంలో తెలిపాడు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కొండపల్లికి చెందిన ఎస్ఎస్ మీరా (సుభానీ) కుటుంబం కూలి పనులు చేసుకుని జీవిస్తుంటుంది. అన్నింటికీ ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న సమయంలో జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అతనికి పలు పథకాల ద్వారా లబ్ధి అందింది. దీంతో అతను దీన స్థితి నుంచి బయటపడి సగౌరవంగా జీవిస్తున్నాడు. తన కుటుంబానికి ప్రభుత్వం ఏమి లబ్ధి చేకూర్చిందో ఫ్లెక్సీ వేసి తన ఇంటి గోడకి అతికించాడు. 'మీ ఉప్పు తింటున్నాం.. మీకు విశ్వాసంగా ఉంటాం' అంటూ ఫ్లెక్సీ వేయించి సీఎం జగన్‌కు, స్థానిక ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఫ్లెక్సీలో ఇలా రాశాడు..

- వైఎస్సార్ చేయూత పథకంలో వచ్చిన రూ. 56,250తో నా భార్య జక్రియా బేగం కిరాణా షాపు ఏర్పాటు చేసుకుంది.
- డ్వాక్రా రుణమాఫీతో రూ.36 వేలు లబ్ధి.
- కుమార్తె ఫాతిమా జేఎన్టీయూలో ఎంటెక్ చదువుకు వసతి దీవెన కింద రూ.40 వేలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద రూ.30వేలు, కుమారుడు బీకాం కంప్యూటర్స్ చదువుకు రూ.45 వేలు ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన కింద రూ.30 వేలు, మరో కుమార్తె నబీనా ఎమ్మెస్సీ బీఈడీ చదువుకు ఫీజు రూ. 30 వేల లబ్ధి చేకూరింది.

ఎన్డీయే భేటీకి టీడీపీని పిలవలేదు

బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాధవ్

సాక్షి, అమరావతి: ఈనెల 18న జరిగే ఎన్డీయే పక్షాల సమావేశానికి బీజేపీ నుంచి తెలుగుదేశం పార్టీకి ఎలాంటి ఆహ్వానంలేదని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ వెల్లడించారు. పార్టీ సహచరులతో కలిసి శుక్రవారం విజయవాడలోని బీజేపీ రాష్ట్ర పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. '2017 ఆగస్టు నుంచి ఎన్డీయేలో తెలుగుదేశం లేదు. ఇప్పటికీ లేదు. ఏ పక్షాలైతే ఎన్డీయేలో ఉన్నాయో, ఆ పార్టీలకే ఎన్డీయే సమావేశానికి ఆహ్వానం ఉంటుంది. 18న జరిగే భేటీకి టీడీపీకి ఆహ్వానం లేదు' అని మాధవ్ కుండబద్దలు కొట్టారు. ఈ రోజుల్లో సోషల్ మీడియాలో వీరబ్రహ్మేంద్రస్వామి వంటి కాలజ్ఞానులు కొంతమంది వ్యక్తులున్నారని.. వారే ఊహించి అలాంటివన్నీ సోషల్ మీడియాలో రాస్తున్నారన్నారు. వాటిని నమ్మాల్సిన అవసరంలేదని ఒక ప్రశ్నకు మాధవ్ బదులిచ్చారు. ఇలాంటి రాజకీయ వ్యవహారాలు ఏమైనా ఉంటే తమ పార్టీ బహిరంగ ప్రకటన చేస్తుందన్నారు. ఇక వచ్చే ఎన్నికల్లో ప్రధాని మోదీని ఢీకొనేందుకు పనికిరాని ప్రతిపక్షాలు నిత్యం తప్పుడు ప్రచారం చేస్తూ, ఇప్పుడు కూటమి ఏర్పాటుచేసుకుంటున్నాయని.. వారి తప్పుడు ప్రచారాన్ని మరింత సమర్థంగా తిప్పికొట్టే అంశంపై ప్రణాళిక రూపకల్పనకే 18న ఎన్డీయే పక్షాల సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం జనసేన తమతో కలిసి ఉందని, ఎన్డీయే పక్షాల సమావేశానికి జనసేనకు పిలుపువస్తుందని భావిస్తున్నామని చెప్పారు.

కులాల ఆధారంగా అధ్యక్ష ఎంపిక ఉండదు..

బీజేపీ కులాల ఆధారంగా పార్టీ రాష్ట్ర అధ్యక్షులను ఎంపిక చేయదని, దగ్గుబాటి పురందేశ్వరి నియామకం కూడా అంతేనని మాధవ్ అన్నారు. సోము వీర్రాజు నేతృత్వంలో పార్టీ సంస్థాగతంగా బలపడిందని, పురందేశ్వరి నాయకత్వంలో మరింత బలపడతామన్నారు. వైఎస్సార్‌సీపీపై బీజేపీ మాత్రమే పోరాటం చేస్తోందని చెప్పారు. కామన్ సివిల్ కోడ్ తమ పార్టీ మూల సిద్ధాంతమని, ఈ అంశంలో రాష్ట్రంలోని పార్టీలు వారి వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కూరగాయల ధరలు ఆకాశాన్ని అంటుతున్నా మంత్రి ఒక్క సమీక్ష కూడా ఎందుకు నిర్వహించలేదని ప్రశ్నించారు.

'భాష్యం' ప్రవీణ్‌కు టీడీపీ షోకాజ్ నోటీసు

చిలకలూరిపేటలో రచ్చకెక్కిన ఆధిపత్య పోరు

సాక్షి, అమరావతి: పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో పార్టీ ఆదేశాలకు విరుద్ధంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారంటూ టీడీపీ అధిష్టానం ‘భాష్యం’ ప్రవీణ్‌కు షోకాజ్ నోటీసు ఇచ్చింది. పార్టీ క్రమశిక్షణా కమిటీ తరఫున గుంటుపల్లి నాగేశ్వరరావు శుక్రవారం ఈ నోటీసు జారీచేశారు. పార్టీ ఆదేశాలకు విరుద్ధంగా నిర్వహించిన కార్యక్రమాలపై ఈనెల 10న మంగళగిరి పార్టీ కేంద్ర కార్యాలయానికి వచ్చి వివరణ ఇవ్వాలని అందులో పేర్కొన్నారు. నోటీసులో ‘భాష్యం’ ప్రవీణ్‌ను తాడికొండ నియోజకవర్గ నేతగా పేర్కొనడం విశేషం. చిలకలూరిపేటలో మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, భాష్యం ప్రవీణ్ వర్గాల మధ్య కొద్దిరోజులుగా ఆధిపత్యపోరు నడుస్తోంది. ప్రవీణ్ తనకే ఎమ్మెల్యే సీటు ఇస్తున్నారని చెబుతూ నియోజకవర్గంలో కార్యక్రమాలు నిర్వహిస్తుండగా పుల్లారావు దీనిని వ్యతిరేకిస్తున్నారు. ఈ నేపథ్యంలో.. ప్రవీణ్ శుక్రవారం చిలకలూరిపేటలో భారీ ర్యాలీకి సిద్ధమయ్యారు. దీన్ని వ్యతిరేకిస్తూ పుల్లారావు వర్గీయులు సమావేశమై పార్టీకి రాజీనామా చేస్తామని హెచ్చరించడంతో టీడీపీ అధిష్టానం జోక్యం చేసుకుని ప్రవీణ్‌ను ర్యాలీ చేయవద్దని ఆదేశించింది. అయినా.. ప్రవీణ్ ర్యాలీ నిర్వహించడంతో పార్టీ ఆదేశాలను ధిక్కరించారని షోకాజ్ నోటీసులు ఇచ్చారు.

'మిట్స్'ను సందర్శించిన తైవాన్ వర్సిటీ డీన్లు



కురబలకోట: అన్నమయ్య జిల్లా కురబలకోట మండలం అంగళ్లులోని మదనపల్లె ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజి అండ్ సైన్స్(మిట్స్)ను శుక్రవారం తైవాన్ యూనివర్సిటీకి చెందిన ఐదుగురు డీన్లు ఇంగ్ హూయ్ చెన్, జియున్ జోంగ్, చింగ్ హీన్, చున్ వీలిన్, చార్లెస్ సందర్శించారు. కళాశాల ఎక్స్‌లెన్స్ పెంచడానికి, ఇంటర్న్‌షిప్‌లు, సహకార కార్యకలాపాలు, ఎంఎస్ ప్రోగ్రామ్‌లు ఇతర వర్చువల్ సమగ్ర కార్యకలాపాల గురించి చర్చించారు. అనంతరం ప్రిన్సిపాల్ యువరాజ్ మాట్లాడుతూ తైవాన్ వర్సిటీ వారితో ఎంవోయు కుదుర్చుకున్నట్లు తెలిపారు.

గ్రామీణ రోడ్లకు పునరుజ్జీవం

- రూ.49.83 కోట్లతో పీఆర్ రోడ్ల అభివృద్ధి
- జంగారెడ్డిగూడెం డివిజన్‌లో 37 రోడ్ల నిర్మాణం
- చకచకా పనులు



జంగారెడ్డిగూడెం: ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం పంచాయతీరాజ్ డివిజన్ పరిధిలో రూ.49.83 కోట్లతో పీఆర్ రోడ్లను అభివృద్ధి చేయనున్నారు. దీనిలో ఎస్సీ కాంపోనెంట్ నిధులు (ఎస్‌టీసీ) రూ.4.25 కోట్లు కాగా ఆంధ్రప్రదేశ్ రూరల్ రోడ్స్ ప్రోగ్రామ్ (ఏపీఆర్ఆర్) కింద ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ (ఏఐఐబీ) నిధులు రూ.45.58 కోట్లు వెచ్చించనున్నారు. వీటిలో కొన్ని పనులు ప్రారంభించి తుది దశకు చేరుకోగా, మరికొన్ని పనులు వివిధ దశల్లో ఉన్నాయి. ఇంకొన్ని పనులు టెండరు దశలో ఉన్నాయి.

ఎస్‌టీసీ నిధులు రూ.4.25 కోట్లు

పోలవరం నియోజకవర్గంలో మూడు బీటీ రోడ్ల నిర్మాణానికి ఎస్‌టీసీ నిధులు వెచ్చిస్తున్నారు. వీటిలో బుట్టాయగూడెం నుంచి కోయరాజమండ్రి వరకు 4 కిలోమీటర్ల రోడ్డును రూ.కోటి, బుట్టాయగూడెం మండలం రవ్వారిగూడెం నుంచి రెడ్డి కోపల్లె మధ్య 7 కిలోమీటర్లకు రూ.1.75 కోట్లు, గురుగుమిల్లి నుంచి కామవరం వరకు 6 కిలోమీటర్లకు రూ.1.50 కోట్లు వెచ్చిస్తున్నారు.

ఏపీఆర్ఆర్ పథకంలో..

ఏపీఆర్ఆర్ కార్యక్రమంలో ఏఐఐబీ నిధులు రూ.45.58 కోట్లతో 33 రోడ్లను అభివృద్ధి చేయనున్నారు. ప్యాకేజీ-1, ప్యాకేజీ-2 కింద నిర్మాణ పనులు చేపట్టారు.

ఏపీఆర్ఆర్‌పీ-1ఏ ప్యాకేజీ కింద (మండలాల వారీగా)..

జంగారెడ్డిగూడెం: పేరంపేట నుంచి వెంకటరామానుజపురం 1.94 కి.మీ రోడ్డుకు రూ.110.20 లక్షలు, జేపీ రోడ్డు నుంచి నాగులగూడెం వరకు 1.65 కి.మీ రోడ్డుకు రూ.90.70 లక్షలు.
ద్వారకాతిరుమల: జెడ్పీ రోడ్డు నుంచి బీసీపన్నవారిగూడెం వరకు 2.19 కి.మీ రోడ్డుకు రూ.126 లక్షలు, ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి మాతేవారిగూడెం వయా కనుమలగూడెం 2.05 కి.మీ రోడ్డుకు రూ.119.50 లక్షలు, లక్ష్మీపురం నుంచి జి.కొత్తపల్లి వయా గొడుగుపేట రోడ్డుకు రూ.163 లక్షలు, తిమ్మాపురం నుంచి వీరిశెట్టిగూడెం జెడ్పీ రోడ్డు నుంచి పంగిడిగూడెం, వేంపాడు జెడ్పీ రోడ్డు వయా హెచ్ లింగపాలెం వరకు రూ.195 లక్షలు.
బుట్టాయగూడెం: ఉప్పరిల్ల అప్రోచ్ రోడ్డుకు రూ.125 లక్షలు, కొవ్వాడ నుంచి ముద్దప్పగూడెం రోడ్డుకు రూ.84 లక్షలు, పీకే రోడ్డు నుంచి యర్రాయిగూడెం రోడ్డుకు రూ.104 లక్షలు, బీకే రోడ్డు నుంచి దండిపూడి వరకు రోడ్డుకు రూ.230 లక్షలు, గుళ్లపూడి నుంచి లంకాలపల్లి వరకు రోడ్డుకు రూ.103 లక్షలు.
జీలుగుమిల్లి: జేపీ రోడ్డు నుంచి బర్రింకలపాడు వరకు రూ.94 లక్షలు.
పోలవరం: వింజరం నుంచి వెంకటరెడ్డిగూడెం వరకు రూ.114 లక్షలు, చింతపల్లి నుంచి గడ్డపల్లి వరకు రూ.411 లక్షలు.
టి.నరసాపురం: ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి ఆర్అండ్‌బీ రోడ్డు వరకు వయా సింగరాయపాలెం రోడ్డుకు రూ.30 లక్షలు వెచ్చించనున్నారు.

ప్యాకేజీ-2 కింద.. (మండలాల వారీగా..)

జంగారెడ్డిగూడెం: అమ్మపాలెం నుంచి కట్టవపాదలగూడెం వరకు రూ.3 కి.మీ రోడ్డుకు రూ.90 లక్షలు, జంగారెడ్డిగూడెం నుంచి శ్రీనివాసపురం మీదుగా ములగలంపల్లి రోడ్డుకు 12.60 కి.మీకు రూ.378.88, శ్రీనివాసపురం నుంచి అక్కంపేట 2.65 కి.మీ రోడ్డుకు రూ.79.50 లక్షలు.
కామవరపుకోట: ఈజే రోడ్డు నుంచి ఉప్పలపాడు వరకు 1.40 కి.మీ రోడ్డుకు రూ.42 లక్షలు, కామవరపుకోట నుంచి బొర్రంపాలెం 7.35 కి.మీ రోడ్డుకు రూ.220.50 లక్షలు.
బుట్టాయగూడెం: బీబీ రోడ్డు నుంచి కొల్లాయగూడెం 2 కి.మీ రోడ్డుకు రూ.60 లక్షలు, బీకే రోడ్డు నుంచి గుళ్లపూడి 5.60 కి.మీకు రూ.165 లక్షలు, బీడీ రోడ్డు నుంచి సీతప్పగూడెం వరకు 1.25 కి.మీకు రూ.37.50 లక్షలు, దుద్దుకూరు నుంచి కొమరవరం 2.30 కి.మీ రోడ్డుకు రూ.69 లక్షలు, దొరమామిడి నుంచి కోర్సావారిగూడెం వయా గురుగుమిల్లి 6 కి.మీ రోడ్డుకు రూ.173.23 లక్షలు, పీఆర్‌గూడెం నుంచి ముంజులూరు వరకు 7.05 కి.మీకు రూ.190.35 లక్షలు, ముంజులూరు నుంచి గురుగుమిల్లి వరకు 6 కి.మీకు రూ.162 లక్షలు.
జీలుగుమిల్లి: లక్ష్మీపురం నుంచి జంగారెడ్డిగూడెం మండలం ఎ.పోలవరానికి కిలోమీటరు రోడ్డుకు రూ.30 లక్షలు జీలుగుమిల్లి నుంచి మక్కినవారిగూడెం వయా సీతంపేట వరకు 7.80 కి.మీకు రూ.234 లక్షలు.
కొయ్యలగూడెం: గవరవరం నుంచి తిమ్మనకుంట వరకు 9 కి.మీ రోడ్డుకు రూ.260 లక్షలు, ఎంఎన్‌డీపాలెం నుంచి గంగవరం కిలోమీటరుకు రూ.30 లక్షలు, అచ్యుతాపురం నుంచి శ్రీరంగపట్నం వయా త్రినాథపురం 3.40 కి.మీ రోడ్డుకు రూ.102 లక్షలు.
టి.నరసాపురం: ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి 100 రామన్నపాలెం వరకు 1.64 కి.మీ రోడ్డుకు రూ.49.20 లక్షలు వెచ్చించనున్నారు.

చురుగ్గా పనులు



జంగారెడ్డిగూడెం డివిజన్‌లో పలు రోడ్ల పనులు ఇప్పటికే ప్రారంభించారు. ప్రారంభించిన పనులన్నీ చురుగ్గా సాగుతున్నాయి. కొన్ని పనులు వివిధ దశల్లో ఉన్నాయి. మరికొన్ని పనులకు టెండర్లు పిలవాల్సి ఉంది. పనులు సకాలంలో పూర్తిచేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయి. ఆ దిశగా ముందుకు సాగుతున్నాం.
–వి.సత్యనారాయణ, డీఈఈ (పీఐయూ), జంగారెడ్డిగూడెం

నిజాయితీతో దైవసాక్షిగా ప్రమాణం చేశా

- తోకముడిచి పారిపోయావెందుకు పులకేశి..
- వెయ్యికోట్ల ఆస్తి ఎక్కడో చూపించు
- జిల్లాలో తప్ప ఎక్కడా నాకు సెంటుభూమి లేదు
- లోకేశ్‌పై విరుచుకుపడ్డ ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్



నెల్లూరులో వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రమాణం చేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్

నెల్లూరు (వీఆర్సీసెంటర్): టీడీపీ నాయకుడు లోకేశ్ తనపై చేసిన ఆరోపణలు నిజం కాదంటూ నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్ శుక్రవారం దైవసన్నిధిలో ప్రమాణం చేశారు. నెల్లూరు నగరంలోని వెంటేశ్వరపురంలోగల శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించి, లోకేశ్ తనపై వేసిన నిందలు (రూ.వెయ్యికోట్ల విలువైన ఆస్తులు సంపాదించానని) అబద్ధమని దైవసాక్షిగా ప్రమాణం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తనపై ఆరోపణలు చేసి, దేవుడి సన్నిధిలో ప్రమాణం చేయాలని చెప్పిన పులకేశి తోకముడిచి పలాయనం చిత్తగించాడని ఎద్దేవా చేశారు. టీడీపీ నేత లోకేశ్ ఆరోపించినట్లు గూడూరులోని చెన్నూరు వద్ద, సాదావారిపాలెం, అల్లీపురంలలో ఒక్క సెంటుభూమి కూడా తనకు లేదన్నారు. తన తండ్రి నుంచి వచ్చిన 18 ఎకరాల్లో 14 ఎకరాలను రాజకీయాల్లోకి వచ్చిన తరువాత అమ్మేశానని చెప్పారు. తన వివాహ సమయంలో అత్తమామలు తన భార్యకు హైదరాబాద్‌లో ఇచ్చిన 10 సెంట్లభూమి తప్ప, కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ఎక్కడా అంకణం భూమి లేదని తెలిపారు. తనకు వెయ్యికోట్ల ఆస్తి ఎక్కడ ఉందో లోకేశ్ చూపించాలని సవాలు చేశారు. తాను సమాధానం చెప్పేది దేవుడికి, నగర ప్రజలకు మాత్రమేనన్నారు. ప్రజలకు ఒక్కటే చెప్పదలచుకున్నానని, ఆస్తులన్నీ అమ్ముకుని రాజకీయాల్లో ఉన్నానని తెలిపారు. నగరంలోని టీడీపీ నాయకులు నటనలో కమల్‌హాసన్‌ను మించిపోయారని చెప్పారు. చంద్రబాబుకు తండ్రి ఖర్జూరనాయుడు రెండెకరాలు ఇస్తే.. జూబ్లీహిల్స్‌లో రూ.100 కోట్లతో ఇల్లు ఎలా నిర్మించాడని ప్రశ్నించారు. తనకు, తన తండ్రికి 70 ఎకరాల భూములున్నాయని, దేవుడి సన్నిధిలో తన ఆస్తుల వివరాలను ప్రజలకు చెప్పే అవకాశం వచ్చిందని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో నగర డిప్యూటీ మేయర్ ఖలీల్, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

మేకల మందపై చిరుత దాడి

- రెండు మేకలు మృతి
- ప్రకాశం జిల్లా దిగువమెట్ట తండాలో ఘటన

గిద్దలూరు రూరల్: మేకల మందపై చిరుత పులి దాడి చేసిన ఘటన ప్రకాశం జిల్లా గిద్దలూరు మండలంలోని దిగువమెట్ట తండాలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... దిగువమెట్ట సమీపంలోని తండాలో గురువారం రాత్రి 12 గంటల సమయంలో గ్రామానికి చెందిన వాల్మీకి నాయక్, శ్రీరామ్ నాయక్ మేకల దొడ్డిలో గుంపు, గుంపులుగా ఉన్న మేకలపై చిరుతపులి దాడి చేసింది. ఒక మేకను చంపి రక్తం తాగి వదిలేసింది. మరొక మేకపై దాడి చేసి పక్కకు లాక్కెళ్లి మాంసాన్ని తిని వెళ్లిపోయింది. శుక్రవారం ఉదయం గమనించిన మేకల పోషకులు గిద్దలూరు ఫారెస్టు అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనా స్థలాన్ని పరిశీలించి చిరుత పాదముద్రలను సేకరించారు.

ఇద్దరు అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లర్ల అరెస్టు

16 కేజీల గంజాయి స్వాధీనం

గూడూరు (తిరుపతి జిల్లా): కేరళ, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన ఇద్దరు అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లర్లను గూడూరు ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఎస్ఈబీ అధికారులు అరెస్ట్ చేసి 16 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. పట్టణంలోని ఎస్ఈబీ కార్యాలయంలో ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ విలేకరులకు వివరాలు వెల్లడించారు. జిల్లా ఎస్పీ పరమేశ్వరరెడ్డి, ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ ఏ రాజేంద్ర ఆదేశాల మేరకు గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు. ఈ క్రమంలో పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలో శుక్రవారం ఉదయం 6 గంటల ప్రాంతంలో తనిఖీలు చేశామని తెలిపారు. ఒడిస్సాలోని రాయగఢ్‌కు వెళ్లి ఓ వ్యక్తి వద్ద నుంచి 16 కిలోల గంజాయిని తీసుకొస్తున్న సర్ఫరాజ్ ఖాన్, సిద్దప్ప అనే ఇద్దరిని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. ఈ కేసులో పట్టుబడ్డ ఇద్దరు యువకులతో పాటు, కేరళకు చెందిన ఇద్దరు, రాయ్‌గఢ్‌కు చెందిన మరో వ్యక్తిపై కూడా కేసు నమోదు చేశామని తెలిపారు. వారిని కూడా త్వరలోనే అరెస్ట్ చేస్తామని చెప్పారు. కాగా, గడచిన రెండేళ్లలో 40 కేసులు నమోదు చేసి, 85 మందిని అరెస్ట్ చేయడంతోపాటు, వారి వద్ద నుంచి 495 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

సాక్షి

శనివారం, 8 జూలై 2023

ఘోరం... దారుణం!

కొన్ని ఉదంతాలు మనల్ని విషాదంలో ముంచెత్తుతాయి. మనం మనుషులుగానే మనుగడ సాగిస్తున్నామా, సమాజం ఇంత అమానుషంగా మారిందా అనే అనుమానం కలిగిస్తాయి. మధ్యప్రదేశ్‌లో ప్రవేశ్ శుక్లా అనే దుండగుడు ఆదివాసీపై మూత్ర విసర్జన చేసిన ఉదంతం అటువంటిదే. అసలు ఊహకు కూడా అందని రీతిలో శుక్లా ఇలా రెచ్చిపోవడానికి కారణమేమిటి? మధ్యప్రదేశ్ ప్రభుత్వం ఈ ఉదంతం విషయంలో చకచకా కదిలింది. వెనువెంటనే ఆ దుండగుడిని కఠినమైన జాతీయ భద్రతా చట్టం(ఎన్ఎస్ఏ) కింద నిర్బంధించింది. అతను నివాసం ఉంటున్న ఇంటిని కూల్చేసింది. ఆదివాసీకి రూ. 6.5 లక్షలు పరిహారంగా ఇస్తున్నట్టు ప్రకటించింది. అంతేకాదు...ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ బాధితుణ్ణి తన నివాసానికి పిలిపించుకొని అతని కాళ్లు కడిగి తలపై జల్లుకున్నారు. దుండగుడు స్థానిక బీజేపీ ఎమ్మెల్యే అనుచరుడు కావడంవల్ల తమపై ఆ మచ్చ పడుతుందన్న భయంతో ప్రభుత్వం వేగంగా కదిలివుండొచ్చు. సామాజిక మాధ్యమాల్లో ఈ ఉదంతంపై ఇంకా నిరసలు వెల్లువలా వస్తూనే ఉన్నాయి. ఏదైనా ఉదంతం చోటుచేసుకున్నప్పుడు ప్రభుత్వాలు తక్షణం స్పందించటం, కారకులపై కఠినమైన చర్యలు తీసుకోవటం, బాధితులకు రక్షణ కల్పించటం సాధారణ ప్రజలకు భరోసానిస్తుంది. అయితే స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లవుతున్నా ప్రవేశ్ శుక్లా వంటి దుండగులు ఈ సమాజంలో నాగరిక వేషంలో ఎలా మనుగడ సాగించగలుగుతున్నారు? రాజకీయ పార్టీల్లోకి ఎలా చొరబడగలుగుతున్నారు? ఈ ప్రశ్నలకు సమాధానం అన్వేషించకపోతే ఇవి పదే పదే పునరావృతమవుతూనే ఉంటాయి. దళితులనూ, ఆదివాసీలనూ, అట్టడుగు కులాల వారినీ అకారణంగా అవమానించటం, వారిని అత్యంత హీనంగా చూడటం మన దేశంలో కొత్తగాదు. తాజా ఉదంతం వీడియో సాక్షిగా బయటికొచ్చింది కనుక ఇంతగా స్పందన వచ్చింది. ప్రభుత్వం కూడా చురుగ్గా కదిలింది. కానీ చట్టానికి దొరక్కుండా, సాక్ష్యాలకు చిక్కకుండా నిత్యం సాగుతున్న దుండగాల మాటేమిటి?

ఈ ఉదంతంపై నిరసనల హోరు ప్రారంభమైన రోజే సర్వోన్నత న్యాయస్థానం విశ్వవిద్యాలయాల పర్యవేక్షణను చూస్తున్న యూజీసీకి కీలకమైన ఆదేశాలిచ్చింది. ఉన్నత విద్యాలయాల్లో వివక్షకు తావులేకుండా చేయటానికి ఇంతవరకూ తీసుకున్న, తీసుకోబోతున్న చర్యలేమిటో చెప్పాలని కోరింది. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ చేస్తూ వివక్షకు బలై ప్రాణం తీసుకున్న రోహిత్ వేముల తల్లి, ముంబైలో వైద్య విద్యలో పీజీ చేస్తూ తోటి విద్యార్థినుల వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకున్న ఆదివాసీ యువతి పాయల్ తాడ్వి తల్లి దాఖలు చేసిన పిటిషన్‌లో సుప్రీంకోర్టు ఈ ఆదేశాలిచ్చింది. వారి తరఫున వాదించిన సీనియర్ న్యాయవాది ఇందిరా జైసింగ్ గత ఏడాది కాలంలో మూడు ఉన్నత శ్రేణి సంస్థల్లో ముగ్గురు విద్యార్థులు కులోన్మాదుల హింస భరించలేక ఆత్మహత్యలు చేసుకున్న వైనాలను ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. రోహిత్ వేముల, పాయల్ తాడ్వి ఉదంతాలప్పుడు విద్యాసంస్థల నిర్వాహకులు తమ సంస్థల్లో వివక్ష లేనేలేదని బుకాయించారు. వారికి వత్తాసు పలికిన విద్యార్థి సంఘాలు, రాజకీయ పార్టీలు కూడా ఉన్నాయి. సరిగ్గా గ్రామ స్థాయి నుంచి ఉన్నత శ్రేణి విద్యాసంస్థల వరకూ నిత్యం వినబడే ఇలాంటి బుకాయింపులే మన సమాజంలో ఆధిపత్య కులాల హింసకు లైసెన్సునిస్తున్నాయి. గ్రామాల్లో ఇప్పటికీ యధేచ్ఛగా కొనసాగుతూనే ఉన్న రెండు గ్లాసుల వ్యవస్థ, మహానగరాలనుకునేచోట అపార్ట్‌మెంట్లలో పనివాళ్ల పట్ల చూపే వివక్ష... అట్టడుగు కులాలవారికీ, మైనారిటీలకూ ఇళ్లు అద్దెకు దొరక్కపోవటం వంటివి ఈ హింసను అడుగడుగునా చాటుతూనే ఉన్నాయి. వాటిని సరిచేయటానికి పూనుకోవాల్సిన వ్యవస్థలు చాలా సందర్భాల్లో రాజీపడుతున్నాయి. పైకి ఎంతో గౌరవప్రదంగా కనబడే వ్యక్తులే ఈ వివక్షకు బాధ్యులవుతుండటం చేదు నిజం. ఎంతో గొడవ జరిగి, పెను వివాదమైతే తప్ప చర్యలకు సిద్ధపడటం లేదు. అసలు పట్టించుకోకపోవటం వేరు...అతిగా పట్టించుకోవటం వేరు. పర్వేశ్ శుక్లాను కఠినమైన చట్టంకింద అరెస్టు చేశారు. మంచిదే. ఆదివాసీ కాళ్లు కడిగి ఆ నీళ్లు నెత్తిపై జల్లుకున్నారు. పాలకుడిగా మానసిక వేదనకు లోనయి ఈ పని చేశారని సరిపెట్టుకోవచ్చు. కానీ దుండగుడి నివాసం కూల్చేయటం ఎలాంటి చర్య? తప్పు చేసిన ఏ వ్యక్తయినా చట్టం ముందు సమానమేనని, వారిపై కఠిన చర్య తీసుకుంటామని సందేశం పంపడానికి బదులు, తాము ఏం చేస్తే అదే చట్టమనే ధోరణి ప్రదర్శించటం ఎలాంటి సంకేతాలిస్తుంది? శివరాజ్ సింగ్ చౌహాన్ ఆలోచించాలి.

అట్టడుగు కులాలవారిపై ఆధిపత్య కులాల హింసను అంతమొందించటంలో, మహిళలపై నిత్యం సాగే అమానుషత్వాన్ని అరికట్టడంలో మన సమాజం పదే పదే విఫలమవుతున్న తీరు ఆందోళన కలిగించే అంశం. 2002లో గుజరాత్ అగ్నిగుండమైనప్పుడు బిల్కిస్ బానో అనే మహిళపై అత్యాచారానికి పాల్పడిన ఘటనలో యావజ్జీవ శిక్ష పడిన 11మంది నేరస్తులను నిరుడు విడుదల చేయటం, దీనికి వ్యతిరేకంగా ఆమె పోరాడుతున్నా ఇంకా అతీ గతీ లేకపోవటం అందరూ గమనిస్తూనే ఉన్నారు. అటువంటప్పుడు మధ్యప్రదేశ్‌లో ఈ ఏడాది ఆఖరులో ఎన్నికలు వస్తున్నందువల్లే శివరాజ్ సింగ్ సర్కారు వేగంగా స్పందించిందన్న విపక్షాల విమర్శలను కొట్టిపారేయగలమా? ఏదేమైనా చట్ట ప్రకారం వ్యవహరించటంలోనే, సంయమనం పాటించటంలోనే ప్రభుత్వాల సమర్థత వెల్లడవుతుంది. అది ప్రజాస్వామిక సంస్కృతిని మరింత బలోపేతం చేస్తుంది.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, ఆషాఢ మాసం, తిథి: బ.పంచమి ఉ.5.44 వరకు, తదుపరి షష్ఠి రా.3.28 వరకు, నక్షత్రం: పూర్వాభాద్ర రా.2.33 వరకు తదుపరి ఉత్తరాభాద్ర, వర్జ్యం: ఉ.10.03 నుండి 11.33 వరకు, దుర్ముహూర్తం: ఉ.5.35 నుండి 7.19 వరకు, అమృతఘడియలు: రా.7.01 నుండి 9.03 వరకు.

సూర్యోదయం : 5.35
సూర్యాస్తమయం: 6.35
రాహుకాలం : ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుండి 3.00 వరకు

రాజన్న బాటలో సంక్షేమ రాజ్యం!

తెలుగు నేలపై డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి పథకాల వల్ల ప్రయోజనం పొందని కుటుంబం ఒక్కటి కూడా లేదంటే అతిశయోక్తి కాదు. ఆయన 'ఫీజు రీయంబర్స్‌మెంట్'తో చదువుకున్న బడుగు, బలహీన వర్గాల పిల్లలు ఇవ్వాళ ఉన్నత స్థానాల్లో ఉన్నారు. ఆయన ప్రవేశపెట్టిన ఆరోగ్య పథకాలూ, సేవలూ ఎంత విలువైనవో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఇక వైఎస్ చేసిన 'జలయజ్ఞం' మెట్టలను మాగాణులుగా మార్చి రైతును రాజును చేసింది. రైతు బాగుంటే దేశం బాగుంటుందని బలంగా నమ్మి నిజంగా రైతు రాజ్యాన్ని నెలకొల్పారు వైఎస్సార్. ప్రజాకాంక్షలను తీర్చడంలో ఎన్ని అడ్డంకులు ఎదురైనా చెరగని నవ్వుతో భావి తరాలకు బాటలు వేశారు.

సకల జన బాంధవుడు

సందర్భం



ఎం.వి.ఎస్. నాగిరెడ్డి

2004 మే నెల రెండవ వారంలో రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసే నాటికి రాష్ట్రంలో పరిస్థితులు అధ్వాన్నంగా ఉన్నాయి. ముఖ్యంగా రైతులు దీన స్థితిలో ఉన్నారు. సకాలంలో వర్షాలు పడక, సకాలంలో ప్రాజెక్టుల నుండి నీరు విడుదల గాక, ఆహారధాన్యాల ఉత్పత్తులు గణనీయంగా తగ్గిపోయాయి. ఆ పండిన పంటలకు కనీస మద్దతు ధర లభించక రైతులు అప్పులపాలయ్యారు. భూమి అమ్మి అప్పు తీరుద్దామంటే భూముల ధరలు కుప్పకూలి రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. ఆ ఆత్మహత్యలపై ఎగతాళిగా అప్పటి ముఖ్యమంత్రి మాట్లాడారు.

వైఎస్ఆర్ సీఎం పదవిని చేపట్టి నెల తిరక్కుండానే 'ఆత్మహత్యలు సమస్యకు పరిష్కారం కాదు. అయినా ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలు అనాథలు కాకూడదు. మేమున్నాం' అంటూ ప్రభుత్వం నుండి భరోసా ఇస్తూ 421 నంబర్ జీవో విడుదల చేశారు. ఫలితంగా 2 లక్షల రూపాయల పరిహారం ఆత్మహత్యలు చేసుకున్న రైతు కుటుంబాలకు అందింది. అలాగే అర్హులైన రైతులందరికీ సహకార సంఘాల ద్వారా పావలా వడ్డీకే పంట రుణాలు అందించారు.

రాజశేఖర రెడ్డి రాజకీయ జీవితంలో మొట్టమొదటిగా లేపాక్షి నుండి పోతిరెడ్డిపాడు వరకు పాదయాత్ర చేశారు. అప్పుడే పోతిరెడ్డిపాడు రెగ్యులేటర్‌ను వెడల్పు చేయాలనే ఆలోచన వచ్చింది. అత్యధిక జనం ఆధారపడ్డ వ్యవసాయ రంగం మెరుగుపడితే అందరి జీవితాలూ బాగవుతాయని ఆయన భావించారు. అందుకే వ్యవసాయానికి ముఖ్యమైన నీటిని అందించడానికి 'జలయజ్ఞం' ప్రారంభించారు. రాయలసీమ, తెలంగాణ, కోస్తా ప్రాంతాల్లో అనేక నీటిపారుదల ప్రాజెక్టులు చేపట్టారు. జలయజ్ఞంలో మొట్టమొదట మొదలు పెట్టిన ప్రాజెక్టు కృష్ణా డెల్టా చిరకాల స్వప్నం పులిచింతల ప్రాజెక్టు అయితే మొదట పూర్తి చేసిన ప్రాజెక్టు నిజామాబాద్ జిల్లాలోని అలీసాగర్ ప్రాజెక్ట్.

సాగునీటికి నదులపై నిర్మించిన ప్రాజెక్టులు ఎంత ముఖ్యమో, భూగర్భ జలాలూ సాగుకు అంతే ముఖ్యం. అందుకే రైతు భూగర్భ జలాలు వెలికి తీయడానికి అవసరమైన విద్యుత్‌ను ఉచితంగా ఇవ్వాలని సంకల్పించారు. కానీ కొంతమంది ఎగతాళి చేశారు. ఢిల్లీ పెద్దలు సహకరించలేదు. అయినా ముందుకే వెళ్లారు. ఆయన ప్రారంభించిన 'వ్యవసాయానికి ఉచిత విద్యుత్' పథకం నేడు ఆదర్శమై ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, పంజాబ్ రాష్ట్రాలలో అమలవుతోంది. వ్యవసాయం రాష్ట్ర ప్రభుత్వం ఆధీనంలో ఉన్నప్పటికీ, వ్యవసాయ విధానాలన్నీ కేంద్ర ప్రభుత్వం చేతిలోనే ఉన్నాయి. అందువలన కేంద్ర–రాష్ట్రాల సమన్వయం కోసం ప్రత్యేక వ్యవస్థ ఉండాలని గుర్తించి తాను ఛైర్మన్‌గా, పెద్దలు సోమయాజులు వైస్ ఛైర్మన్‌గా 'అగ్రికల్చర్ టెక్నాలజీ మిషన్' ఏర్పాటు చేశారు.

వ్యవసాయ పంటలకు ఇస్తున్న మద్దతు ధరలు పెరుగుతున్న పెట్టుబడులకు అనుగుణంగా లేవని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్ళడం ద్వారా 2004 నుండి 2009 వరకు అత్యధిక మద్దతు ధర చెల్లించేలా ఒత్తిడి తెచ్చారు. రూ. 450 గా ఉన్న వరి ధాన్యం ధరను రూ. 1000కి పెంచేలా చేసిన ఘనత వైఎస్సార్‌దే. ఈ సమయంలోనే వైఎస్ ప్రోద్బలంతో కేంద్ర ప్రభుత్వం రుణమాఫీ ప్రకటించింది. ఇందువల్ల అత్యధిక ప్రయోజనం ఆంధ్రప్రదేశ్‌కే దక్కింది. కేంద్రం ప్రకటించిన రుణమాఫీ లబ్ధి సకాలంలో బకాయిలు చెల్లించిన రైతులకు అందలేదని గ్రహించి, రైతు సంఘాలు కూడా లేవనెత్తక ముందే, 36 లక్షల మంది రైతులకు ఐదు వేల రూపాయల చొప్పున రూ. 1800 కోట్లు రైతుల ఖాతాలో జమ చేశారు. దేశంలోనే ఇలా చేసిన ఏకైక ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి మాత్రమే.

సన్న, చిన్నకారు రైతులు, కౌలు రైతులు ఆర్థిక సంక్షోభంలోకి నెట్టివేయబడటానికి పిల్లల విద్య, కుటుంబ సభ్యుల వైద్యం ఖర్చు వంటివి కారణాలు. ఇది గ్రహించిన వైఎస్ 'ఆరోగ్యశ్రీ', 'ఫీజు రీయింబర్స్ మెంట్' పథకాలు; '108', '104' వంటి సేవలనూ ప్రవేశపెట్టారు. రాష్ట్రంలో అధికులు చిన్న రైతులే కాబట్టి 90 శాతం మంది రైతులకు తెల్ల రేషన్ కార్డులు, వృద్ధాప్య పెన్షన్లు ఇచ్చారు. బలహీన వర్గాలకు గృహాలు కేటాయించారు. ఆర్టీసీ బస్ చార్జీలు, విద్యుత్ చార్జీలు వంటివేవీ పెంచలేదు. ఒక్క రూపాయి కొత్త పన్ను వెయ్యలేదు. సంక్షేమ పథకాలన్నీ అర్హులందరికీ అందాయి. రైతులకు ఆదాయం పెరగడంతో వ్యవసాయ కార్మికులు, చిన్న వ్యాపారులు, చిరువ్యాపారుల ఆదాయం పెరిగి గ్రామాలలో సంపద పెరిగి వ్యవసాయ భూముల ధరలు పెరిగాయి.

అభివృద్ధి – సంక్షేమం తన రెండు కళ్ళుగా పాలన గావించి రైతుల గుండెలలో చిరంజీవిగా మిగిలిన– ఆ మహానాయకునికి మనం ఇచ్చే గౌరవం ఆయన పుట్టిన రోజును 'రైతు దినోత్సవం'గా జరుపుకోవడం. దివంగత సీఎం రాజశేఖరరెడ్డి అమలు చేసిన ఉచిత విద్యుత్‌తో సహా ఆరోగ్య, వైద్య పథకాలను ఆయన తనయుడు, ప్రస్తుత సీఎం కొనసాగిస్తున్నారు. అంతేకాక ఆయన పేరుతో మరిన్ని సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారు. పోలవరం వంటి ప్రాజెక్టుల పనులు శరవేగంతో కదులుతున్నాయి. ఆయన వదలి వెళ్లిన ఆదర్శాలూ, లక్ష్యాలను అందిపుచ్చుకొని ప్రస్తుత ప్రభుత్వం ఘన నీరాజనాలు అర్పిస్తోంది.


వ్యాసకర్త ఏపీ 'అగ్రికల్చర్ మిషన్' వైస్ ఛైర్మన్



నేడు డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి జయంతి
రైతు దినోత్సవం

అపర భగీరథుడు

సందర్భం



మాకిరెడ్డి పురుషోత్తమ రెడ్డి

వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా పలు రకాలుగా వారి సేవలను తెలుగు ప్రజలు స్మరించుకుంటున్నారు. ఒక వ్యక్తి గొప్పదనం వారి తదనంతరం వారిని గుర్తు చేసుకునే దాన్ని బట్టి ఉంటుంది. అదే ప్రజానేత అయితే వారు తీసుకునే నిర్ణయాల సార్వజనీనతను బట్టి ఉంటుంది. ఆ కోణంలో చూసినప్పుడు దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి విపక్ష నేతగా, ముఖ్యమంత్రిగా చేసిన పోరాటాలూ, తీసుకున్న నిర్ణయాలూ ఆంధ్రప్రదేశ్ రాజకీయాలలో మరీ ముఖ్యంగా రాయలసీమ ప్రస్థానంలో వారిని చిరస్థాయిగా నిలిచిపోయేట్లు చేశాయి.

ఎందరో మహానుభావులు రాయలసీమ ఉద్యమాన్ని నడిపారు. దాన్ని ప్రజా ఉద్యమంగా మలచడంలో వైఎస్ విజయం సాధించారు. జాతీయ పార్టీ ముఖ్యమంత్రి రేసులో ఉన్న వైఎస్ ఒక ప్రాంత సమస్యపై పోరాటంలో పాల్గొనడం సాహసం. రాయలసీమ ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా మార్చిన కారణంగా... కేవలం చెన్నై నగరానికి త్రాగు నీరు కోసం రూపొందించిన 'తెలుగు గంగ' తిరుపతి వరకూ రాగలిగింది. కీలకమైన పోతిరెడ్డిపాడు సమస్య సమాజం ముందుకొచ్చింది. సీమ ఉద్యమంలో వైఎస్ ప్రస్థాన ఫలితమే 'జల యజ్ఞ' రూపకల్పన. వెనుకబడిన ప్రాంత అస్తిత్వ ఉద్యమంలో కీలక అంశంగా నీటి సమస్య ఉంటుంది. వైఎస్ అధికారంలోకి వచ్చిన వెంటనే అత్యంత ప్రాధాన్యత అంశంగా తీసుకున్నది జల యజ్ఞం. ఏపీలోని అన్ని ప్రాంతాలకు శాశ్వత పరిష్కారంగా జల యజ్ఞం రూపొందించారు. పోలవరం, దుమ్ముగూడెం టేల్ పాండ్, పులిచింతల, గాలేరు– నగరి, హంద్రీనీవా, పోతిరెడ్డిపాడు, సిద్దేశ్వరం లాంటి ప్రాజెక్టులు నేడు ప్రజల ముందు ఉన్నాయి అంటే అది వైఎస్ దూర దృష్టి ఫలితమే.

జలయజ్ఞం పేరుతో అన్ని ప్రాజెక్టుల నిర్మాణం ఒకేసారి చేపట్టడం సరికాదని చాలా మంది వాదించారు. అలాంటి వాదనలకు వైఎస్ చెప్పిన సమాధానం 'రాష్ట్ర నీటి సమస్య పరిష్కారానికి నేడు రూపొందించిన ప్రాజెక్టులు మన హయాంలో పూర్తి కాకపోయినా ప్రజలు పోరాడి సాధించుకుంటారు.' అది వైఎస్ ఆలోచన. అలా ఆయన ఆలోచన చేయకుండా ఉంటే పోలవరం జాతీయ ప్రాజెక్ట్‌గా మారి ఉంటుందా? నీటి హక్కులు లేని గాలేరు నగరి, హంద్రీనీవా, వెలుగొండ ప్రాజెక్టులకు విభజన చట్టంలో స్థానం దక్కేదా? వారు ఊహించిన విధంగా నేడు ప్రజలు ప్రాజెక్టులు పూర్తి చేయాలని పోరాడుతున్నారు.

రాయలసీమ ఉద్యమంలో పాల్గొన్న వైఎస్. తాను అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ ఉద్యమ డిమాండ్లకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చారు. కొన్ని సాహసోపేత నిర్ణయాలు తీసుకున్నారు. అందులో పోతిరెడ్డిపాడు రెగ్యులేటర్ వెడల్పునూ, శ్రీశైలం ప్రాజెక్ట్ నీటి మట్టాన్ని పెంచాలని నిర్ణయించడం వంటివి కొన్ని మాత్రమే.

రాయలసీమ నీటి సమస్య పరిష్కారానికి పోతిరెడ్డిపాడు రెగ్యులేటర్ వెడల్పు పెంచడం అవసరం. వరద సమయంలో నీటి హక్కు లేని ప్రాజెక్టులకు నీరు విడుదల చేయడానికి వీలుగా పోతిరెడ్డిపాడు రెగ్యులేటర్ వెడల్పును 12 వేల క్యూసెక్కుల సామర్థ్యం నుంచి 44 వేల క్యూసెక్కుల సామర్థ్యానికి పెంచారు. శ్రీశైలం కనీస నీటి మట్టం 854 అడుగులు ఉండేలా జీఓ ఇచ్చినా రాజకీయ కుట్రల కారణంగా దాని అమలు సాధ్యం కాలేదు. దాని ఫలితం నేడు రెండు రాష్ట్రాల సమస్యగా మారింది. గండికోట ప్రాజెక్ట్ నిర్మాణం, కుందూ నదిపై జోలదరాసికీ, రాజోలుకూ శంకుస్థాపన చేశారు. అలాగే సిద్దేశ్వరం అలుగు ఆలోచన చేశారు.

గోదావరిపై పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం చిరకాల వాంఛ. ఎందరో ఎన్నో ప్రయత్నాలు చేసినా ఓ కొలిక్కి రాలేదు. కానీ నీటి సమస్య గురించి అవగాహన కలిగిన వైఎస్ అత్యంత వ్యయంతో కూడిన పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి పూనుకున్నారు. కేంద్రాన్ని ఒప్పించి అన్ని అనుమతులూ మంజూరు చేయించుకొని కుడి ఎడమ కాల్వల నిర్మాణం చేపట్టారు. 'ప్రాజెక్టు పూర్తి కాకుండానే కాల్వల నిర్మాణం' అంటూ విపక్షాలు చేసే విమర్శలకు వెరవలేదు. విభజన సమయంలో పోలవరానికి జాతీయ హోదా లభించింది అంటే అది వైఎస్ కృషి ఫలితమే. నాడు కాల్వలు సింహభాగం పూర్తి చేశారు కనుక నేడు పట్టిసీమ! అదీ నీటి ప్రాజెక్టులపై వైఎస్‌కున్న నిబద్ధత, దూరదృష్టి. అదే సమయంలో అపార నీటి వనరులు ఉన్న గోదావరి నీటిని పూర్తి స్థాయిలో వినియోగించే ప్రయత్నంలో భాగంగా దుమ్ముగూడెం పథకాన్ని రూపొందించి 500 కోట్లతో ప్రాథమిక పనులు పూర్తి చేశారు. వైఎస్ మరణం, విభజన సమయంలో దూరదృష్టి లేని నేతల కారణంగా ఏపీ తీవ్రంగా నష్టపోయింది. శంకుస్థాపనకే పరిమితం అయిన గాలేరు–నగరి, హంద్రీనీవా, వెలుగొండ ప్రాజెక్టులను పరుగులు పెట్టించారు. ఫలితంగా నీటి హక్కులు లేకపోయినా మూడు ప్రాజెక్టులను ఉమ్మడి రాష్ట్రంలో రూపొందించిన విధంగా నిర్మాణం చేసుకోవచ్చని విభజన చట్టంలో అనుమతించారు.

వైఎస్ ఆశించిన శ్రీశైలం ప్రాజెక్ట్ నీటిమట్టం పెంపు, సిద్దేశ్వరం, గుండ్రేవుల, కుందూపై నిర్మాణాలు... ముఖ్యంగా దుమ్ముగూడెం పథకం పూర్తి అయితే రాయలసీమ నీటి సమస్యకు పరిష్కారం లభిస్తుంది. విపక్ష నేతగా సీమ హక్కుల కోసం పోరాటం, అధికారంలోకి వచ్చిన తర్వాత సాకారం కోసం ప్రయత్నాలు చేసిన వైఎస్ రాజశేఖర రెడ్డి రాయలసీమ ప్రస్థానంలో ఎప్పటికీ చిరస్మరణీయులు.

వ్యాసకర్త రాయలసీమ మేధావుల ఫోరం సమన్వయ కర్త | 94904 93436

పరువు దక్కించుకునే ప్రయాణమా?

విశ్లేషణ



దినేశ్ సి. శర్మ

ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవలి అమెరికా పర్యటన సందర్భంగా ఇరుదేశాల మధ్య సాంకేతిక పరిజ్ఞాన ఒప్పందాలు చాలానే జరిగాయి. వాటిల్లో అంతరిక్ష రంగానికి సంబంధించినవి కూడా రెండు ఉన్నాయి. ఒకటేమో శాంతియుత ప్రయోజనాల కోసం అంతరిక్ష అన్వేషణకు ఉద్దేశించిన 'ఆర్టిమిస్ అకార్డ్స్'. (ఆర్టిమిస్ అనేది ఒక గ్రీకు దేవత పేరు.) అమెరికాలో భారతీయ రాయబారి తరణ్‌జీత్ సింగ్ సంధూ ఈ ఒప్పందంపై సంతకం చేశారు. వాషింగ్టన్‌లోని ఓ హోటల్‌లో నాసా అడ్మినిస్ట్రేటర్ బిల్ నీల్సన్ సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. రెండో ఒప్పందం... 2024లో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి(ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్) పంపే భారతీయ వ్యోమగామికి అమెరికా అంతరిక్ష సంస్థ (నాసా) ప్రాయోజకత్వం వహించడం! భారత్, అమెరికాల మధ్య కుదిరిన ఒప్పందాలు దౌత్యపరంగా, సైన్స్ పరంగా చారిత్రాత్మకమైన వని వర్ణిస్తున్నారు. వాస్తవం దీనికి భిన్నం.

భారత్ సొంతంగానే ఓ వ్యోమగామిని అంతరిక్షంలోకి పంపేందుకు ప్రయత్నిస్తున్నది. ఈ కార్యక్రమం ఒకవైపు నడుస్తూండగానే అమెరికా ప్రాయోజకత్వంతో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వ్యోమగామిని పంపించాల్సిన అవసరం ఏమొచ్చిందన్నది ప్రశ్న. "మనం నర్సరీ రైమ్స్ పాడుకుంటున్న సమయంలోనే జాబిల్లి ఉపరితలంపై మనిషి కాలిడేలా చేసిన అమెరికా లాంటి దేశం జాబిల్లిపై ప్రయోగాల విషయంలో మన నుంచి సమాచారాన్ని, నైపుణ్యాన్ని ఆశిస్తోందంటే అంతకంటే గర్వకారణమైన విషయం ఇంకోటి ఉంటుందా?" ప్రధానమంత్రి కార్యాలయ సహాయ మంత్రి, అంతరిక్ష, అణుశక్తి రంగాల పర్యవేక్షకులైన జితేంద్ర సింగ్ చేసిన వ్యాఖ్య ఇది. ఆర్టిమిస్ ఒప్పందం అంతరిక్ష రంగానికి సంబంధించిన కీలక టెక్నాలజీల దిగుమతిపై ఉన్న నియంత్రణలు తొలగేందుకు మార్గంగా మారతుందని కూడా ఆయన అన్నారు.

ఆర్టిమిస్ ఒప్పందం ద్వైపాక్షిక ఒప్పందం లేదా ట్రీటీ, ప్యాక్ట్ కాదు. ఆర్టిమిస్ కోసం భారతీయ నైపుణ్యాన్ని, సమాచారాన్ని కూడా కోరడం లేదు. జాబిల్లిపై ఒక స్థావరాన్ని ఏర్పాటు చేయడం ఆర్టిమిస్ లక్ష్యం. కీలక టెక్నాలజీల దిగుమతిపై నియంత్రణలు తొలగించే ప్రస్తావన కూడా ఆర్టిమిస్ ఒప్పందంలో లేదు. నాసా వెబ్‌సైట్‌లో, జూన్ 23 నాటి నాసా పత్రికా ప్రకటనలో ఉన్న సమాచారం ప్రకారం... అంతరిక్షాన్ని శాంతియుత ప్రయోజనాల కోసం అన్వేషించడం, ఈ అన్వేషణకు సంబంధించి కొన్ని సాధారణ నియమ నిబంధనలు మాత్రమే ఉన్నాయి. మంత్రి చెప్పిన ప్రకారం, ఒకవేళ నాసా భారత్ సహ కారాన్ని కోరుతున్నా... లేక దిగుమతులపై నిబంధనలను సడలించిందన్నా... నైజీరియా, రువాండా, బ్రెజిల్, కొలంబియా, ఈక్వెడార్ వంటి దేశాలతో కూడా నాసా ఇదే తరహా ఒప్పందాలు చేసుకుంది.

భారతదేశం ఆర్టిమిస్ అకార్డ్‌లో భాగమైన 27వ దేశమన్నది గుర్తుంచుకోవాలి. పైగా ఈ ఒప్పందాలన్నీ స్వచ్ఛందమైనవే. ఆర్టిమిస్ అకార్డ్ ఉద్దేశం బయటకు కనిపిస్తున్న దానికంటే చాలా భిన్నమైంది. అమెరికా విదేశీ వ్యవహారాల శాఖ మరోసారి అమెరికా ఆధిపత్యాన్ని నిలుపుకునేందుకు దీన్ని సృష్టించిందనాలి. చైనాతోపాటు ప్రైవేట్ అంతరిక్ష కంపెనీలు అనేకం మనుగడలోకి వస్తున్న నేపథ్యంలో ఇలాంటి ఒప్పందం ఒకటి అవసరమైంది. ఈ ఒప్పందాల ద్వారా అంతరిక్ష రంగానికి సంబంధించిన కొత్త నియమ నిబంధనలను రూపొందించేందుకు సిద్ధమవుతోంది. అంతరిక్ష రంగానికి సంబంధించి ఇప్పటికే ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో రూపొందిన చట్టాలు కొన్ని అందుబాటులో ఉన్నాయి. వీటిని ఇప్పుడు ఈ కాలానికి తగ్గట్టుగా మార్చాల్సిన అవసరముంది. ఈ ఉద్దేశాలను ముందుగానే పసి గట్టిన చైనా, రష్యా, జర్మనీ, యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ వంటివి ఆర్టిమిస్‌కు దూరంగానే ఉన్న విషయం ఇక్కడ చెప్పుకోవాల్సిన అంశం.

ఆర్టిమిస్ ఒప్పందంలో పదాలను చాలా తెలివిగా ఉపయోగించారు. ఔటర్ స్పేస్ ట్రీటీకి (ఐక్యరాజ్య సమితి సిద్ధం చేసింది. 1967 జనవరి 27వ తేదీ నుంచి దేశాల ఆమోద ముద్రను ఆహ్వానిస్తున్నది) కట్టుబడి ఉండటం ఎంత ముఖ్యమో చెబుతూనే కొన్ని కొత్త విషయాలను ఇందులోకి చేర్చారు. ఈ ఒప్పందంలో వ్యోమగాముల రక్షణ వంటి విషయాల్లో ఐక్యరాజ్య సమితి ఒప్పందంతోపాటు ఖగోళ వస్తువుల వల్ల కలిగే నష్టానికి బాధ్యులపై 1972లో కుదిరిన అంతర్జాతీయ ఒప్పందానికీ కట్టుబడి ఉంటామని పేర్కొన్నారు.



కానీ... ఆర్టిమిస్‌లో అంతరిక్ష వారసత్వాన్ని కాపాడటం, సహజ వనరుల వినియోగానికి సురక్షిత ప్రాంతాల ఏర్పాటు (ఐక్యరాజ్య సమితి ఒప్పందాలకు భిన్నంగా) వంటి ఆలోచనలను జొప్పించారు. ఆర్టిమిస్ అకార్డ్ భవిష్యత్తులో ఐక్యరాజ్య సమితి అభివృద్ధి చేసే అంతరిక్ష ఒడంబడికలోని ప్రధాన అంశాలపై ఏకాభిప్రాయాన్ని సాధించేందుకు ఉద్దేశించినట్టుగా కనిపిస్తోంది. ఈ క్రమంలోనే బహుముఖీన సిద్ధాంతాలను తోసిరాజన్నారు. భారత్ ఇవేవీ ఆలోచించకుండా దౌత్యపరమైన వలలో చిక్కుకుంది. దేశీయంగా ఎలాంటి చర్చ జరపకుండా, అంతరిక్ష చట్టం ఏదీ చేయకుండా 'ఊ' కొట్టేసింది.

అమెరికాతో కుదిరిన అంతరిక్ష ఒప్పందాల్లో ఇంకోటి వచ్చే ఏడాది నాసా భారతీయ వ్యోమగామిని అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి పంపడం. ఇది కూడా చాలా చిత్రమైందనే చెప్పాలి. ఎందుకంటే మానవ సహిత అంతరిక్ష ప్రయోగాల కోసం భారత్ ఇప్పటికే ముమ్మర ప్రయత్నాలు చేస్తోంది. నలుగురు వ్యోమగాములు రష్యాలో శిక్షణ కూడా పొందుతున్నారు. అమెరికా, రష్యా సంయుక్తంగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి మన వ్యోమగాములను పంపాలని అనుకుని ఉంటే ఆ పని 'ఇస్రో' ఎప్పుడో చేసి ఉండేది. ఎందుకు చేయలేదంటే, మానవుడిని అంతరిక్షంలోకి పంపటం ఇస్రో ప్రాధమ్యం కాదు కాబట్టి! అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం సుమారు 20 ఏళ్లుగా పనిచేస్తోంది. ఇప్పటివరకూ 21 దేశాలకు చెందిన 269 మంది వ్యోమగాములు అక్కడికి వెళ్లారు. అమెరికా, యూరోపియన్ దేశాలను మినహాయించినా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, సౌదీ అరేబియా, మలేసియా వ్యోమగాములు కూడా ఇక్కడకు వెళ్లారన్న విషయం గుర్తుపెట్టుకోవాలి. మానవ సహిత అంతరిక్ష ప్రయోగాలకు భారత్ సొంతంగా సిద్ధమవుతున్న తరుణంలో ఇక్కడికి వ్యోమగామిని పంపేందుకు తొందర పడటం ఎందుకు? భారత్ స్వాతంత్ర్యం సాధించి 75 ఏళ్లు అయ్యే సమయానికి భారతీయ వ్యోమగామి అంతరిక్షంలోకి ప్రవేశిస్తారని ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా 2018లో ప్రకటించారు. ఈ అతిశయోక్తి హామీ నెరవేరలేదు. అందుకే దానికొక అల్ప ప్రత్యామ్నాయంగా, పరువు దక్కించుకోవడానికి బహుశా ఇలా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వ్యోమ గామిని పంపనున్నారు.

వ్యాసకర్త సైన్స్ అంశాల వ్యాఖ్యాత
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

నీ ప్రాణం మాతోనే!

రాజన్నా...
పేదోళ్లకు నువ్వు ఇళ్లు కడితే
అతను ఊళ్లే కడుతున్నాడు

నువు పెంచిన పింఛను పదింతలు చేసి
నేరుగా గడప గడపకూ అందిస్తున్నాడు

నీ యజ్ఞం పరవళ్లు తొక్కుతోంది
నీ సంకల్పం బలం పుంజుకుంటోంది

మన బడులు కళకళలాడుతున్నాయి
పేదలు పెద్దగా చదువుతున్నారు

మన పల్లెలు పట్టుగొమ్మలుగా మారి
దేశానికి ఆదర్శమవుతున్నాయి

మన రైతు రాజులా బతుకుతూ
భరోసాగా సాగు చేస్తున్నాడు

సంక్షేమం అందిస్తున్న ఆసరాతో
మహిళలు లక్షాధికారులవుతున్నారు

ఇంటింటికీ డాక్టరు వస్తున్నాడు
రూపాయి తీసుకోకుండా మందులిస్తున్నాడు

నీ ప్రాణాన్ని మాకొదిలి వెళ్లి
నువ్వు లేవంటే ఎలాగయ్యా!
నువ్వున్నావు
నీ నవ్వులాగే ఉన్నావు
ప్రజల నవ్వుల్లో ఉన్నావు
హ్యాపీ బర్త్ డే టు యూ!

– పూడి శ్రీనివాసరావు
సీనియర్ జర్నలిస్ట్

క్లుప్తంగా...

నేడు, రేపు తేలికపాటి వర్షాలు

బలహీనపడిన ఉపరితల ఆవర్తనం

సాక్షి, విశాఖపట్నం: ఉపరితల ఆవర్తనం ప్రభావంతో కొద్దిరోజుల నుంచి రాష్ట్రంలో వానలు కురుస్తున్నాయి. కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు, అక్కడక్కడ భారీ వర్షాలు పడుతున్నాయి. అయితే ఈ ఉపరితల ఆవర్తనం బలహీన పడింది. ప్రస్తుతం రాష్ట్రంపై ప్రభావం చూపే అల్పపీడన ద్రోణి కూడా లేదు. రుతుపవనాలు చురుగ్గా లేవు. ఈ కారణాలతో రాష్ట్రంలో తేలికపాటి వానలకే పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి. దీంతో శనివారం, ఆదివారం కోస్తాంధ్ర, రాయలసీమల్లో ఒకటి, రెండుచోట్ల తేలికపాటి వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ శుక్రవారం నివేదికలో తెలిపింది. అదే సమయంలో ఉరుములు, మెరుపులతోపాటు పిడుగులకు ఆస్కారం ఉందని, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని వెల్లడించింది. ఈ నెల 12 నుంచి రాష్ట్రంలో మళ్లీ వర్షాలు బాగా కురిసే వాతావరణం ఏర్పడుతుందని పేర్కొంది.

మైనింగ్ వ్యాపారి కృష్ణారెడ్డికి నోటీసులు

నెల్లూరు (సెంట్రల్): నెల్లూరు జిల్లా కావలి నియోజకవర్గంలో అక్రమంగా మైనింగ్ నిర్వహిస్తున్న క్రషర్ నిర్వాహకులు డీవీ కృష్ణారెడ్డికి నోటీసులు జారీచేసి క్రషర్‌ను, కంకరను సీజ్ చేసినట్లు జిల్లా మైనింగ్ అధికారి శ్రీనివాస కుమార్ శుక్రవారం తెలిపారు. గట్టుపల్లిలోని సర్వే నంబరు 1,015లో అక్రమంగా నడుపుతున్న గురురాఘవేంద్ర ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు చెందిన క్రషర్‌ను, 1003.6 క్యూబిక్ మీటర్ల కంకరను సీజ్ చేశామన్నారు. యజమాని డీవీ కృష్ణారెడ్డిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వీటితో పాటు గట్టుపల్లిలోని అదే సర్వే నంబరులో స్టోన్‌క్రషర్ రెన్యూవల్ కోసం దరఖాస్తు చేసుకున్నారని, దాన్ని తిరస్కరిస్తూ నోటీసులు జారీ చేశామని చెప్పారు. సమీపంలోని అన్నవరం ప్రాంతంలో సర్వే నంబరు 845, 850లో గురురాఘవేంద్ర ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పేరుతో క్వారీకి దరఖాస్తు చేసుకున్నారని, దీనిని కూడా తిరస్కరించి నోటీసులు జారీ చేశామన్నారు.

ఏపీజెన్‌కో, ఏపీఎండీసీ పనితీరు భేష్

జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యురాలు అంజుబాల



సాక్షి, అమరావతి: రిజర్వేషన్ల అమలు, ఉద్యోగుల సంక్షేమం విషయంలో ఏపీ జెన్‌కో పనితీరు అద్భుతంగా ఉందని, ఏపీ ఖనిజాభివృద్ధి సంస్థ (ఏపీఎండీసీ)లో అనుసరిస్తున్న విధానాలు మిగిలిన సంస్థలకు ఆదర్శప్రాయంగా ఉన్నాయని జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యురాలు డాక్టర్ అంజుబాల ప్రశంసించారు. ఆమె శుక్రవారం విజయవాడలోని ఏపీ జెన్‌కో, ఏపీఎండీసీ కార్యాలయాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏపీజెన్‌కో, ఏపీఎండీసీ యాజమాన్యం పనితీరును అభినందిస్తూ ప్రశంసా పత్రం పంపడంతోపాటు, కమిషన్ తరఫున రాష్ట్రపతికి సిఫార్సు చేయనున్నట్లు చెప్పారు. విద్యుత్ సౌధలో కమిషన్ అధికారులతో కలిసి ఎస్సీ అసోసియేషన్ల ఉద్యోగులతో సమావేశమై రిజర్వేషన్ల అమలు తీరు, ఉద్యోగుల సంక్షేమంపై సమీక్షించారు. తమతో ఏపీజెన్‌కో యాజమాన్యం అన్ని విధాలా సుహృద్భావంతో వ్యవహరిస్తోందంటూ అసోసియేషన్లు సంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిపారు. ప్రతి నెలా ఓసారి ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో 'చాయ్ పే చర్చ' ఏర్పాటు చేసుకుని సమస్యలు ఉంటే పరిష్కరించుకోవాలని సూచించారు. ఏపీఎండీసీలో రూల్ ఆఫ్ రిజర్వేషన్లలో కచ్చితమైన విధానాన్ని అమలు చేయడాన్ని అభినందించారు.

చిన్నారిని శ్రీవారే రక్షించారు

టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి

తిరుపతి తుడా: అలిపిరి నడక మార్గంలో చిరుత దాడిలో గాయపడిన చిన్నారి కౌశిక్‌ను శ్రీవారే రక్షించారని టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. ఆస్పత్రిలో 14 రోజుల చికిత్స అనంతరం పూర్తి ఆరోగ్యంతో ఉన్న చిన్నారిని శుక్రవారం వైద్యులు డిశ్చార్జి చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ సుబ్బారెడ్డి మీడియాతో మాట్లాడారు. గత జూన్ 22న రాత్రి చిరుత దాడిలో గాయపడిన చిన్నారికి శ్రీపద్మావతి చిన్నపిల్లల ఆస్పత్రిలో ప్రత్యేక వైద్య బృందం పర్యవేక్షణలో చికిత్స అందించినట్లు చెప్పారు.

లోకేశ్.. అసత్య ఆరోపణలు మానుకో..

ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం: టీడీపీ నేత లోకేశ్ తనపై తప్పుడు ఆరోపణలు చేశాడని నెల్లూరు జిల్లా కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి చెప్పారు. ఈ ఆరోపణలపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని సీఎం వైఎస్ జగన్‌ను కోరనున్నట్లు తెలిపారు. నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాళెంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యువగళం పాదయాత్ర పేరుతో గురువారం బుచ్చిరెడ్డిపాళెంలో పర్యటించిన లోకేశ్.. తాను రూ.1,500 కోట్లు సంపాదించానని ఆరోపించడంపై సీబీఐ లేదా హైకోర్టు సిట్టింగ్ జడ్జితో లేదా ఏదైనా సంస్థతో విచారణ చేయాలని కోరారు. ఆరోపణలు నిజమని తేలితే బుచ్చిరెడ్డిపాళెం సెంటర్‌లో తనను ఉరితీయాలని ముఖ్యమంత్రి జగన్‌ను కోరతానని చెప్పారు. తనవద్ద నిజంగా రూ.1,500 కోట్లు ఉంటే నెల్లూరు జిల్లాలో టీడీపీ వారికే పంచిపెట్టి నెల్లూరులో టీడీపీ కనిపించకుండా చేసేవాడినన్నారు.

జీడిపై చీడ రాతలు!

యూనిట్లు మూతబడ్డాయంటూ 'ఈనాడు' పచ్చి అబద్ధాలు



ఫ్యాక్ట్ చెక్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో జీడి తోటల విస్తీర్ణాన్ని చూసినా.. దిగుబడులైనా.. ఎగుమతులైనా గత సర్కారు హయాంతో పోలిస్తే ఇప్పుడు రెట్టింపయ్యాయి. సాగు విస్తీర్ణాన్ని పెంచడంతోపాటు ఏకంగా 17 వేల ఎకరాలకుపైగా జీడి తోటలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పునరుద్ధరించింది. ఇక తిత్లీ తుపాను కారణంగా తీవ్రంగా నష్టపోయిన ఉత్తరాంధ్ర రైతుల నోట్లో మట్టిగొట్టిన చంద్రబాబు నిర్వాకాల గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే! ఆ అన్నదాతలను ఆదుకుంటూ గత సర్కారు ఎగ్గొట్టిన రూ.87.29 కోట్ల పరిహారాన్ని చెల్లించిందీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమే. ప్రపంచాన్ని ముంచెత్తుతున్న వియత్నాం జీడి గింజల దిగుమతులను అరికట్టడం సాధ్యం కాకున్నా ప్రాసెసింగ్‌లో 50 శాతం మాత్రమే వినియోగించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. గతంలో 80 శాతం దిగుమతి చేసుకున్న గింజలను వినియోగిస్తే కిమ్మనని ఈనాడు రామోజీ ఇప్పుడు మాత్రం అన్యాయం జరిగిపోతోంది..! బాబోయ్ దిగుమతులు పెరిగాయ్..! ప్రాసెసింగ్ యూనిట్లు మూతబడ్డాయని గుండెలు బాదుకుంటూ తప్పుడు కథనాలకు తెగబడ్డారు!!

'ఈనాడు' ఆరోపణ:

దిగుబడులు లేక నష్టాల బారిన రైతులు..

■ **వాస్తవం:** 2018 –19లో శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, తూర్పు గోదావరి, ఏలూరు జిల్లాల్లో 3 లక్షల ఎకరాల్లో జీడితోటలు ఉండగా ఈ విస్తీర్ణం ప్రస్తుతం 3.35 లక్షల ఎకరాలకు పెరిగింది. నాలుగేళ్లలో 35 వేల ఎకరాలు కొత్తగా సాగులోకి వచ్చాయి. టీడీపీ హయాంలో రూ.6.92 కోట్లతో 8,648 ఎకరాల్లో తోటలను పునరుద్ధరిస్తే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.13.64 కోట్లతో 17,125 ఎకరాల్లో పాత తోటలను పునరుద్ధరించడమే కాకుండా రూ.8.30 కోట్లతో 35 వేల ఎకరాల్లో కొత్త తోటలను విస్తరించింది. ఏటా క్రమం తప్పకుండా నిర్వహిస్తున్న తోటబడుల వల్ల ఉత్పత్తి సగటున 800 కిలోల నుంచి 1,150 కిలోలకు పెరిగింది. ఫలితంగా దిగుబడులు 1.23 లక్షల టన్నుల నుంచి 1.67 లక్షల టన్నులకు పెరిగాయి. చంద్రబాబు జమానాలో రూ.701.69 కోట్ల విలువైన 12,356 టన్నుల జీడిపప్పు ఎగుమతి కాగా ఇప్పుడు నాలుగేళ్లలో రూ.1,718.85 కోట్ల విలువైన 29,399 టన్నులు ఎగుమతి అయ్యాయి. నాలుగేళ్లలో ఎగుమతులు ఏకంగా 17 వేల టన్నులకు పైగా పెరిగాయి. సాధారణంగా జీడి పిక్కల కోత మే నెలకల్లా పూర్తయిపోతుంది. ప్రస్తుతం రైతుల వద్ద పది శాతం కూడా పంట లేదు. అలాంటప్పుడు రైతుకు నష్టం ఏ విధంగా జరుగుతుందో రామోజీకే తెలియాలి.

ఆరోపణ: జీడి రైతుల సంక్షేమాన్ని విస్మరించారు

■ **వాస్తవం:** 2018–19లో తిత్లీ తుపాన్ కారణంగా జీడి తోటలు పెద్ద ఎత్తున దెబ్బతింటే చంద్రబాబు కేవలం 70 వేల మంది రైతులకు రూ.68.18 కోట్ల పరిహారం విదిల్చారు. 1,38,458 మంది రైతులకు చంద్రబాబు ఎగ్గొట్టిన రూ.87.29 కోట్ల పరిహారాన్ని సీఎం జగన్ అధికారంలోకి వచ్చాక అందజేసి రైతులను ఆదుకున్నారు. తుపాన్‌తో నష్టపోయిన ప్రాంతాల్లో 21,250 ఎకరాల్లో తోటల పునరుద్ధరణ, విస్తరణ కార్యక్రమాలు చేపట్టారు.

ఆరోపణ: జీడిపప్పు ధరల పతనంతో నష్టాలు

■ **వాస్తవం:** రాష్ట్రంలో ఉత్పత్తయ్యే జీడిపప్పు మొదటి రకం కిలో రూ.800, రెండో రకం కిలో రూ.600 ఉంటుంది. అయితే మన జీడిపప్పు ధర వెనుక అసలు కారణాలకు 'ఈనాడు' ముసుగేసింది. ప్రపంచంలో అత్యధికంగా జీడిపప్పు ఉత్పత్తి చేసే వియత్నాం నుంచి యూరప్, అమెరికా దేశాలకు ఎగుమతులు జరుగుతాయి. అయితే ఆ దేశాల్లో నిల్వలు ఎక్కువ కావడంతో వియత్నాం నుంచి దిగుమతులను నిలిపివేశాయి. దీంతో ఆసియా దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. దేశవ్యాప్తంగా భారీగా దిగుమతి అవుతున్న వియత్నాం జీడిపప్పు స్థానిక మార్కెట్‌లో మొదటి రకం కిలో రూ.600, రెండో రకం రూ.450లకే లభిస్తోంది. గత పదేళ్లుగా ముడి గింజలు కిలో రూ.80 నుంచి రూ.120 మధ్య ఉండగా ఈనాడు మాత్రం రూ.140 – రూ.150 మధ్య ఉండేవంటూ మరో అబద్ధాన్ని అచ్చేసింది.

ఆరోపణ: జీడి పరిశ్రమకు చేయూత ఏదీ?

■ **వాస్తవం:** జీడిమామిడి రైతుల సంక్షేమం, నాణ్యమైన జీడి ఉత్పత్తి కోసం నాలుగేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ప్రధానంగా నాణ్యమైన మొక్కలతో జీడి విస్తీర్ణ పథకం, జీడి తోటలకు బిందు సేద్యం, పాత జీడితోటల పునరుద్ధరణ కార్యక్రమాలను చేపట్టారు. సాగు మెళకువలను నేర్పించడం ద్వారా జీడి పంట నాణ్యత పెంచేలా తోటబడి కార్యక్రమం ద్వారా 418 ప్రదర్శన క్షేత్రాలు నిర్వహించారు. పలాసను జీడిపప్పు ప్రాసెసింగ్ క్లస్టర్‌గా అభివృద్ధి చేశారు. బొబ్బిలి, అనకాపల్లిలోని ప్రభుత్వ ఉద్యానవన క్షేత్రాలతో పాటు బాపట్లలోని జీడిపప్పు పరిశోధనా కేంద్రంలో 4.5 లక్షలకు పైగా అంటుకట్టిన జీడి మొక్కలను ఉత్పత్తి చేసి రైతులకు అందిస్తున్నారు.

ఆరోపణ: కొత్త యూనిట్లకు ప్రోత్సాహమేది?

■ **వాస్తవం:** ప్రాసెసింగ్ యూనిట్ల సామర్థ్యాన్ని పెంచేలా ఆధునికీకరణకు ఆర్థిక చేయూతనిస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా 50 శాతం సబ్సిడీపై రూ.4 లక్షల అంచనాతో ప్యాక్ హౌస్‌లు, కలెక్షన్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నారు. కొత్త ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు రూ.25 లక్షల వరకు ఆర్థిక చేయూతనిస్తున్నారు. ఇందులో రూ.10 లక్షలు సబ్సిడీగా అందిస్తున్నారు. మౌలిక సదుపాయాల కల్పనకు రూ.6 లక్షల సబ్సిడీతో రూ.15 లక్షల వరకు ఆర్థిక చేయూతనిస్తున్నారు. తొలిసారిగా జీడిపిక్కల నిల్వ కోసం రూ.1.69 కోట్లు వెచ్చించి 15 కలెక్షన్ సెంటర్లను నెలకొల్పారు. రూ.2.79 కోట్లతో రైతులకు బిందు సేద్యం పరికరాలను సమకూర్చారు. జీడిపప్పు కెర్నల్ ఆయిల్ యూనిట్ల ఏర్పాటుకు ఆర్థిక సహాయం అందిస్తున్నారు. మెరుగైన విలువ జోడింపు, అధిక ఆదాయం కోసం శ్రీకాకుళం, విశాఖ జిల్లాల్లోని గిరిజన ప్రాంతాలలో పీపీపీ ప్రాజెక్టుల కింద జీడిపప్పులో సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నారు.

ఆరోపణ: నష్టాలు భరించలేక 500 పరిశ్రమలు మూసివేత

వాస్తవం: ఇంతకంటే పచ్చి అబద్ధం మరొకటి ఉండదు. రాష్ట్రంలో 402 ప్రాసెసింగ్ యూనిట్లున్నాయి. ఇవి సంవత్సరానికి 79,140 టన్నుల సామర్థ్యంతో 1.50 లక్షల ఉపాధి కల్పిస్తున్నాయి. ఏటా ఆషాఢ మాసంలో మెజార్టీ యూనిట్లు ఉత్పత్తిని తాత్కాలికంగా నిలుపుదల చేస్తాయి. కొన్ని యూనిట్లు ఉత్పత్తిని తగ్గిస్తాయి. అంతేకానీ రాష్ట్రంలో శాశ్వతంగా మూతపడిన పరిశ్రమ ఒక్కటంటే ఒక్కటీ కూడా లేదు. పైగా రాష్ట్రంలో ఉన్నవే 402 పరిశ్రమలైతే 500 పరిశ్రమలు ఎలా మూతపడ్డాయో ఈనాడుకే తెలియాలి.

ఆరోపణ: దిగుమతులతో పడిపోతున్న ధరలు

వాస్తవం: స్థానిక డిమాండ్‌కు సరిపడా జీడి గింజల ఉత్పత్తి లేకపోవడంతో 40–50 శాతం ఆసియా, ఆఫ్రికా దేశాల నుంచి ముడి గింజల దిగుమతి జరుగుతోంది. చంద్రబాబు హయాంలో 80 శాతం దిగుమతి చేసుకున్న గింజలను, 20 శాతం స్థానికంగా పండే గింజలను కలిపి ప్రాసెసింగ్ చేసేవారు. అలాంటిది ఇప్పుడు ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్ల 50 : 50 శాతం చొప్పున వినియోగిస్తున్నారు. అంటే దిగుమతులు పెరిగినట్టా.. తగ్గినట్లా? వేరే చెప్పాలా?

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

- 10వ తేదీ నుంచి ఫీవర్ సర్వే
- వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి రజిని

సాక్షి, అమరావతి: సీజనల్ వ్యాధుల నియంత్రణ చర్యల్లో భాగంగా ఈ నెల 10వ తేదీ నుంచి రాష్ట్రంలో ఫీవర్ సర్వే ప్రారంభించాలని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులను ఆ శాఖ మంత్రి విడదల రజిని ఆదేశించారు. డెంగీ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు గతంలో ఎక్కువ కేసులు నమోదైన ప్రాంతాలను హాట్ స్పాట్లుగా గుర్తించి ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై శుక్రవారం మంగళగిరిలోని తన కార్యాలయంలో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వలంటీర్లు, ఏఎన్ఎంలు ప్రతి ఇంటిని సందర్శించి ఫీవర్ సర్వే చేపట్టాలన్నారు. పారిశుధ్యం విషయంలో పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖలతో సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లాలని సూచించారు. డెంగీ, మలేరియా నిర్ధారణ టెస్టులకు సంబంధించి వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ స్థాయిలోనే కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధుల ప్రభావం ఎక్కువగా ఉంటుందని, మన్యం, అల్లూరి సీతారామరాజు తదితర జిల్లాల్లో ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని చెప్పారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఫాగింగ్, దోమతెరల పంపిణీ, గంబూషియా చేపల పంపిణీ లాంటి చర్యలు చేపట్టాలన్నారు. ఎక్కడా మందుల కొరత రావడానికి వీల్లేదని చెప్పారు. బ్లడ్ బ్యాంకులపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. సీజనల్ వ్యాధుల ప్రభావం ఉండే ఈ మూడు నెలలు అధికారులు కచ్చితంగా క్షేత్రస్థాయి పర్యవేక్షణ చేస్తూ ఉండాలన్నారు. పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ఇతర అంశాలపై రాష్ట్ర వ్యాప్తంగా 15 రోజులపాటు ఇంటింటికీ అవగాహన కార్యక్రమాన్ని చేపట్టాలని ఆదేశించారు.

14 నుంచి ఈసెట్ కౌన్సెలింగ్

కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల

17 వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ - 20 వరకు సర్టిఫికెట్ల పరిశీలన

- 19-21 వరకు ఆప్షన్ల ఎంపిక
- 25న సీట్ల కేటాయింపు
- ఆగస్టు 1 నుంచి తరగతులు
- కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఇంజనీరింగ్ రెండో సంవత్సరంలో ప్రవేశాలకు నిర్వహించిన ఏపీఈసెట్–2023 కౌన్సెలింగ్‌ను ఈ నెల 14 నుంచి ప్రారంభిస్తున్నట్టు సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని సాంకేతిక విద్యా శాఖ కార్యాలయంలో శుక్రవారం ఆమె కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈసెట్‌లో అర్హత సాధించినవారు ఈ నెల 14 నుంచి 17 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకుని ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాలని సూచించారు. అనంతరం 20 వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్, 19 నుంచి 21 వరకు ఆప్షన్ల ఎంపిక ఉంటుందన్నారు. 22న అభ్యర్థులు ఆప్షన్లను మార్చుకోవచ్చని తెలిపారు. 25న సీట్లు కేటాయిస్తామన్నారు. సీట్లు పొందినవారు 25 నుంచి 30లోగా ఆయా కళాశాలల్లో వ్యక్తిగతంగా రిపోర్టు చేయాలని సూచించారు. ఆగస్టు 1 నుంచి తరగతులు ప్రారంభమవుతాయన్నారు. సర్టిఫికెట్ల పరిశీలనకు రాష్ట్రవ్యాప్తంగా 14 సహాయ కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. సర్టిఫికెట్ల పరిశీలన సమయంలో అభ్యర్థులు ఈసెట్ ర్యాంకు కార్డు, హాల్‌టికెట్, పదో తరగతి మార్కుల సర్టిఫికెట్, పాలిటెక్నిక్ డిప్లొమా మార్కుల జాబితా, ప్రొవిజినల్ సర్టిఫికెట్, ఏడో తరగతి నుండి డిప్లొమా వరకు స్టడీ సర్టిఫికెట్లు, టీసీ, 2020 జనవరి 1 తర్వాత జారీ చేసిన ఆదాయ ధ్రువీకరణ పత్రం, రిజర్వుడ్ అభ్యర్థులు.. అందుకు తగిన పత్రాలు, నివాస ధ్రువీకరణ పత్రం, ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ సిద్ధం చేసుకోవాలన్నారు. కాగా ఈ ఏడాది 38,181 మంది ఈసెట్‌కు దరఖాస్తు చేసుకోగా 34,503 మంది పరీక్ష రాశారన్నారు. ఇందులో 31,933 (92.55 శాతం) మంది అర్హత సాధించారని తెలిపారు. మరిన్ని వివరాలకు 7995681678, 7995865456, 9177927677 నంబర్లకు ఫోన్ చేయొచ్చన్నారు.

రైతుబజార్లలో కిలో రూ.50కే టమాటా

- చుక్కలనంటుతున్న వేళ.. వినియోగదారులకు సర్కారు బాసట
- దేశంలో మరెక్కడా లేని రీతిలో సబ్సిడీపై టమాటా విక్రయాలు



సాక్షి, అమరావతి : టమాటా ధరలు చుక్కలనంటుతున్న తరుణంలో దేశంలో మరెక్కడా లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం రైతుబజార్ల ద్వారా సబ్సిడీ రేటుకు టమాటాలను విక్రయిస్తూ వినియోగదారులకు బాసటగా నిలుస్తోంది. గతంలో ఎన్నడూలేని విధంగా ఈసారి వీటి ధరలు రోజురోజుకూ దేశవ్యాప్తంగా పెరుగుతున్నాయి. ఉత్తరాది రాష్ట్రాల్లో అయితే కిలో రూ.250లు దాటింది. రాష్ట్రంలో కిలో రూ.150 ఉంది. అయినా సరే ప్రభుత్వం వెనుకాడడంలేదు. దేశంలో మరెక్కడాలేని విధంగా మార్కెట్ ఇంటర్‌వెన్షన్ స్కీమ్ కింద మార్కెట్‌లో జోక్యం చేసుకుని రైతుల నుంచి గిట్టుబాటు ధరకు కొనుగోలు చేస్తూ గత నెల 28 నుంచి కిలో రూ.50 చొప్పున సబ్సిడీపై అందిస్తోంది. ధరలు పూర్తిగా అదుపులోకి వచ్చేవరకు రైతుబజార్ల ద్వారా ఈ అమ్మకాలు కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ఇప్పటివరకు 422 టన్నుల సేకరణ

ఈ నేపథ్యంలో.. ప్రతిరోజూ రాష్ట్రంలోని వివిధ టమాటా మార్కెట్లతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి కూడా రాష్ట్ర ప్రభుత్వం టమాటాలను సేకరిస్తోంది. ఇప్పటివరకు దాదాపు రూ.4 కోట్లు ఖర్చుచేసి 422.06 టన్నులు సేకరించింది. ప్రధాన మార్కెట్లలో వ్యాపారులతో పాటు వేలంపాటల్లో పాల్గొని రైతుల నుంచి, వ్యాపారుల నుంచి సేకరిస్తోంది. ఇలా ఇప్పటివరకు సగటున కిలో రూ.94.44 చొప్పున గరిష్ఠంగా కిలో రూ.110 చొప్పున కొనుగోలు చేసింది. వీటిని రాష్ట్రవ్యాప్తంగా 103 రైతుబజార్లలో మనిషికి కిలో నుంచి రెండు కిలోల వరకు విక్రయిస్తోంది. మరోవైపు.. శుక్రవారం సగటున కిలో రూ.94.34 చొప్పున రూ.61.32 లక్షల విలువైన 65టన్నుల టమాటాలను అధికారులు సేకరించారు. వీటిలో 30 టన్నులు పలమనేరు మార్కెట్ నుంచి, 20 టన్నులు మదనపల్లి మార్కెట్ నుంచి, మరో 15 టన్నులు విజయవాడలోని రైతులు, వ్యాపారుల నుంచి కొనుగోలు చేశారు. విశాఖ, కాకినాడ, తూర్పుగోదావరి, కర్నూలు, నంద్యాల, అన్నమయ్య, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లోని రైతుబజార్లకు తరలించి ప్రత్యేక కౌంటర్ల ద్వారా విక్రయిస్తున్నారు. దీంతో వినియోగదారులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. గతంలో కూడా ఇదే రీతిలో కిలో రూ.100 దాటిన సందర్భంలో రైతుల నుంచి సేకరించి సబ్సిడీపై రైతుబజార్ల ద్వారా విక్రయించారు.

సీఎం జగన్ ఆదేశాల మేరకు..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు దేశంలో మరెక్కడా లేని విధంగా రాష్ట్రంలో రైతుబజార్ల ద్వారా సబ్సిడీపై టమాటాను విక్రయిస్తున్నాం. ప్రభుత్వంపై ఆర్థికంగా భారమైనప్పటికీ సగటున కిలో రూ.94.44 చొప్పున కొనుగోలు చేసి వినియోగదారులకు కిలో రూ.50లకే విక్రయిస్తున్నాం. ధరలు తగ్గేవరకూ రైతుబజార్లలో సబ్సిడీ టమాటా కౌంటర్లు కొనసాగిస్తాం.

– రాహుల్ పాండే, కమిషనర్, ఏపీ మార్కెటింగ్ శాఖ

గ్రామ, వార్డు సచివాలయాల ఆర్డినెన్స్ మనుగడలో ఉందా, లేదా?

- పూర్తివివరాలు మా ముందుంచండి
- ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం
- విచారణ 13కి వాయిదా



సాక్షి, అమరావతి: గ్రామ, వార్డు సచివాలయాలకు చట్టబద్ధత కల్పిస్తూ జారీచేసిన ఆర్డినెన్స్ కాలపరిమితి ముగిసిందా, లేదా? చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలను తమ ముందుంచాలంది. విచారణను ఈ నెల 13కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ ఉప్మాక దుర్గాప్రసాదరావు, జస్టిస్ ప్రతాప వెంకటజ్యోతిర్మయి ధర్మాసనం శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేసే మహిళా సంరక్షణ కార్యదర్శులను మహిళా కానిస్టేబుళ్లుగా పేర్కొంటూ ప్రభుత్వం జారీచేసిన జీవోలను సవాలు చేస్తూ హైకోర్టులో పలు వ్యాజ్యాలు దాఖలయ్యాయి. ఈ వ్యాజ్యాలపై జస్టిస్ దుర్గాప్రసాదరావు ధర్మాసనం శుక్రవారం మరోసారి విచారించింది. ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరామ్ వాదనలు వినిపిస్తూ.. మహిళా సంరక్షణ కార్యదర్శులను మహిళా పోలీసులుగా మాత్రమే పిలుస్తారని తెలిపారు. వారు పోలీసులు నిర్వర్తించే విధులు నిర్వర్తించడం లేదన్నారు. యూనిఫాం వేసుకున్నంత మాత్రాన వారు రెగ్యులర్ పోలీసులు కాదని చెప్పారు. ఆర్డినెన్స్‌పై స్పష్టతనిచ్చేందుకు కొంత గడువు కావాలని కోరారు. అంతకుముందు పిటిషనర్ల న్యాయవాది నర్రా శ్రీనివాసరావు వాదనలు వినిపిస్తూ.. గ్రామ, వార్డు సచివాలయాలకు చట్టబద్ధత కల్పిస్తూ తీసుకొచ్చిన ఆర్డినెన్స్ కాలపరిమితి జూన్ 7తో ముగిసిందన్నారు. అది చట్టరూపం దాల్చలేదన్నారు. తమను మహిళా కానిస్టేబుళ్లుగా పరిగణించడం సబబేనంటూ పలువురు మహిళా సంరక్షణ కార్యదర్శులు దాఖలుచేసిన అనుబంధ వ్యాజ్యాలను ధర్మాసనం అనుమతించింది. ఆర్డినెన్స్ కాలపరిమితిపై స్పష్టత ఇవ్వాలంటూ విచారణ ఈ నెల 13కి వాయిదా వేసింది.

చేపల వేటకు అత్యాధునిక టెక్నాలజీ

- సముద్రంలో చేపల సమాచారం శాటిలైట్ ద్వారా మత్స్యకారులకు
- ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ నుంచి శ్రీకారం
- ఆక్వా రంగంలో ఏపీదే అగ్రస్థానం
- విలేకరుల సమావేశంలో కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు

సాక్షి, అమరావతి: సముద్రంలో చేపలు ఎప్పుడు, ఎక్కడ లభ్యమవుతాయన్న సమాచారం మత్స్యకారులకు అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు, దీని కోసం అత్యాధునిక టెక్నాలజీతో కూడిన శాటిలైట్ వినియోగిస్తున్నట్లు కేంద్ర భూ విజ్ఞాన శాఖ మంత్రి కిరణ్ రిజిజు చెప్పారు. ఈ కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ నుంచి మొదలు పెట్టామని తెలిపారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉందని చెప్పారు. శుక్రవారం విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మత్స్యకారులతో సమావేశం అయ్యేందుకు ఇక్కడకు వచ్చానని, మచిలీపట్నంలో మత్స్యకారులతో సమావేశమయ్యానని చెప్పారు. ప్రకృతి వైపరీత్యాలను సమర్థంగా ఎదుర్కొనేందుకు మత్స్యకారులకు సకాలంలో సమాచారం అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సముద్రంలో మత్స్య సంపద ఎక్కడ ఉందనేది కనుగొనడం కష్టమని, టెక్నాలజీ సహకారంతో ఆ మత్స్య సంపద ఎక్కడ ఎక్కువగా ఉందనేది కచ్చితత్వంతో తెలుసుకోవచ్చన్నారు. ఆ సమాచారాన్ని వేటకు వెళ్లేవారికి ముందుగానే తెలుపుతామన్నారు. ఇప్పుడు తీసుకొస్తున్న ఈ టెక్నాలజీపై మత్స్యకారులకు అవగాహన కోసం సమావేశాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. 'ఆంధ్రప్రదేశ్‌కు సుదీర్ఘ తీర ప్రాంతం ఉంది. ఆక్వా రంగంలో దేశంలోనే ఏపీది మొదటి స్థానం. అందువల్ల మత్స్యకారులకు సాంకేతిక సహకారం అందజేసే కార్యక్రమం ఏపీ నుంచే ప్రారంభించాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా ఈ కార్యక్రమాన్ని చేపట్టాయి' అని వివరించారు. ప్రస్తుతం ప్రపంచం ఐదో ఆర్థిక శక్తిగా ఉన్న భారత్.. మూడో స్థానానికి చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకుందని, ఆ లక్ష్య సాధనకు ఆక్వా రంగ ఎగుమతులు అత్యంత కీలకమని రిజిజు చెప్పారు. రాష్ట్ర పర్యటన సందర్భంగా ఇక్కడి బీజేపీ కుటుంబసభ్యులను కలవడానికి రాష్ట్ర పార్టీ కార్యాలయానికి వచ్చినట్టు వివరించారు. విలేకరుల సమావేశంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు పీవీఎన్ మాధవ్, వేటుకూరి సూర్యనారాయణ రాజు, రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్ పాకా వెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌ను కలిసిన కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి నివాసంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కేంద్ర భూవిజ్ఞాన శాఖ మంత్రి కిరణ్ రిజిజు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం ఎంపీ వి. బాలశౌరి పాల్గొన్నారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం

- మాదిగలపై గత ప్రభుత్వం పెట్టిన కేసులను ఎత్తేసేందుకు సీఎం జగన్ అంగీకారం
- సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతూ కార్యక్రమం



సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎంపీ నందిగం సురేష్, నాయకులు

సాక్షి, అమరావతి : టీడీపీ సర్కార్ హయాంలో దళితుల్లో పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా.. అంటూ నాటి సీఎం చంద్రబాబు ఎస్సీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తే.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక రాజ్యాధికారం, సంక్షేమ పథకాల్లో సింహభాగం వాటా ఇచ్చి ఎస్సీల ఆత్మగౌరవాన్ని సీఎం వైఎస్ జగన్ నిలిపారని ఎంపీ నందిగం సురేష్ కొనియాడారు. ఎంఆర్‌పీఎస్ 2017లో నిర్వహించిన కురుక్షేత్ర మహాసభలో పాల్గొన్న మాదిగలపై నాటి టీడీపీ సర్కార్ పెట్టిన కేసులు ఎత్తేసేందుకు అంగీకరించిన సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి శుక్రవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం వద్ద ఎంపీ నందిగం సురేష్, మాదిగ కార్పొరేషన్ అధ్యక్షుడు కనకారావు నేతృత్వంలో భారీ ఎత్తున క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఎంపీ మీడియాతో మాట్లాడుతూ ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో 2017లో జరిగిన కురుక్షేత్ర మహాసభలో పాల్గొన్న మాదిగ నాయకులు, విద్యార్థులపై అప్పటి సీఎం చంద్రబాబు కేసులు పెట్టి వేధించారని గుర్తు చేశారు. ఆ కేసుల వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని.. వాటిని ఎత్తివేయాలని గురువారం సీఎం జగన్‌ను కోరగా, అందుకు అంగీకరించారని చెప్పారు. మంత్రివర్గం నుంచి నామినేటెడ్ పదవుల వరకూ ఎస్సీలకు సింహభాగం పదవులిచ్చి.. సంక్షేమ పథకాల్లో పెద్ద పీట వేసిన వైఎస్ జగన్‌ను మళ్లీ గెలిపించి, ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని కనకరావు మాదిగ పిలుపునిచ్చారు.

గిరిజనుల అభివృద్ధిని చూసి ఓర్వలేకే టీడీపీ దుష్ప్రచారం

వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మేరాజోత్ హనుమంత్‌నాయక్



సాక్షి, అమరావతి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గిరిజనులకు అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓర్వలేకనే టీడీపీ దుష్ప్రచారం చేస్తోందని వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మేరాజోత్ హనుమంత్‌నాయక్ అన్నారు. తాడేపల్లిలో ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధిని గత తెలుగుదేశం ప్రభుత్వం పూర్తిగా విస్మరించిన విషయాన్ని గుర్తు చేశారు. టీడీపీ ఉనికి కోసం ఇప్పుడు అనేక రకాలుగా పాట్లు పడుతోందన్నారు. గిరిజనులకు సంబంధించిన 16 పథకాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రద్దు చేసిందని టీడీపీ దుష్ప్రచారం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు హయాంలో గిరిజన ప్రాంతంలో బాక్సైట్ ఖనిజాలను దోచుకోవాలని ప్రయత్నించి జీవో నంబర్ 97 జారీ చేసిన సంగతి టీడీపీ గిరిజన నేతలకు తెలియదా అని ప్రశ్నించారు. బాక్సైట్ తవ్వకాల కోసం చంద్రబాబు ఇచ్చిన జీవో రద్దుకై గిరిజనుల తరఫున ప్రతిపక్ష నేత హోదాలో వైఎస్ జగన్ చింతపల్లిలో బహిరంగసభ పెట్టి పోరాటం చేసిన విషయాన్ని గుర్తుపెట్టుకోవాలని సూచించారు. టీడీపీ హయాంలో మంత్రి మండలిలో గిరిజనులకు అవకాశం కల్పించలేదని, ప్రత్యేక ఎస్టీ కమిషన్‌ను ఏర్పాటు చేయకుండా చంద్రబాబు నిర్లక్ష్యం వహించారని చెప్పారు. గిరిజనులకు ఉపముఖ్యమంత్రి పదవి ఇవ్వడంతో పాటు ప్రత్యేక ఎస్టీ కమిషన్‌ను కూడా ఏర్పాటు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కు దక్కుతుందన్నారు. జిల్లాల పునర్విభజనలో పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు పేరుతో రెండు గిరిజన జిల్లాలను సీఎం జగన్ ఏర్పాటు చేయడం గొప్ప విషయమన్నారు. గిరిజనుల కోసం సీఎం జగన్ ఎన్నో కార్యక్రమాలను, సంక్షేమ పథకాలను అమలు చేశారని, టీడీపీ ఎన్ని కుట్రలు పన్నినా 2024లో వైఎస్ జగన్‌ను మళ్లీ సీఎంను చేసేందుకు గిరిజనులు సిద్ధంగా ఉన్నారని హనుమంత్ నాయక్ స్పష్టం చేశారు.

క్లుప్తంగా...

తుపాకీతో కాల్చుకుని డీఐజీ ఆత్మహత్య



సాక్షి, చెన్నై: తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరు రేంజ్ డీఐజీ విజయ కుమార్(45) శుక్రవారం ఉదయం తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఉదయం వాకింగ్‌కు వెళ్లి వచ్చినానంతరం కోయంబత్తూరు రేస్ కోర్సులోని క్యాంప్ కార్యాలయం వద్ద తన భద్రతా ఉద్యోగి రవి నుంచి తుపాకీ తీసుకుని కాల్చుకున్నారు. ఈ సమాచారంతో తమిళనాడు పోలీసు యంత్రాంగం ఉలిక్కి పడింది. సీఎం స్టాలిన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విచారణలో మానసిక ఒత్తిడి కారణంగానే ఆయన ఈ చర్యకు పాల్పడినట్టు తేలింది. గత కొంతకాలంగా ఆయన మానసిక ఒత్తిడికి సంబంధించి కౌన్సెలింగ్ తీసుకుంటున్నట్లు వెలుగుచూసింది. పోస్టుమార్టం అనంతరం విజయకుమార్ భౌతిక కాయానికి స్వగ్రామం తేని జిల్లా బోడినాయకనూరు సమీపంలోని అనైకార పట్టి గ్రామానికి తీసుకెళ్లారు. తమిళనాడు డీజీపీ శంకర్ జివ్వాల్, ఏడీజీపీ అరుణ్‌తోపాటు ఎస్పీ విజయకుమార్ పాడెను మోశారు. విజయకుమార్ తొలుత టీఎన్‌పీఎస్సీ ద్వారా డీఎస్పీగా ఎంపికయ్యారు. ఆ తర్వాత యూపీఎస్సీ పరీక్ష రాసి 2009 బ్యాచ్ ఐపీఎస్ అధికారిగా తమిళనాడులో విధుల్లోకి చేరారు. ఆయనకు భార్య, ఓ కుమార్తె ఉన్నారు.

ఆ 5 పథకాలకు ఏటా రూ.52 వేల కోట్లు



బెంగళూరు: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అయిదు ప్రధాన ఎన్నికల హామీల అమలుకు ఏడాదికి రూ.52 వేల కోట్లు ఖర్చవుతాయని కర్ణాటక సీఎం, ఆర్థికమంత్రి పోర్ట్‌ఫోలియో నిర్వహిస్తున్న సిద్ధరామయ్య చెప్పారు. శుక్రవారం ఆయన 2023–24 సంవత్సరానికి గాను రూ.3,27,747 కోట్లతో రాష్ట్ర బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. అయిదు హామీలతో 1.3 కోట్ల కుటుంబాలు లబ్ధి పొందుతాయని, ఒక్కో కుటుంబానికి సరాసరిన నెలకు రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకు సాయం అందుతుందని సిద్ధరామయ్య చెప్పారు. ఆర్థిక వనరులను సమకూర్చుకునేందుకు ప్రభుత్వ అనవసర వ్యయాన్ని తగ్గించుకుని, పకడ్బందీగా పన్ను వసూళ్లకు చర్యలు చేపడతామని తెలిపారు. బీజేపీని అధికారం నుంచి దింపేందుకు కాంగ్రెస్ ఇచ్చిన..మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, పేదలకు నెలకు 10 కిలోల ఆహారధాన్యాలు, ప్రతి కుటుంబంలో మహిళకు నెలకు రూ.2 వేలు, నిరుద్యోగ భృతి రూ.3 వేలు పంపిణీ హామీలు పనిచేశాయని పరిశీలకులు అంటున్నారు.

పరువు నష్టం కేసులో రాహుల్‌కు ఎదురుదెబ్బ

శిక్ష నిలుపుదలకు గుజరాత్ హైకోర్టు నిరాకరణ ● సుప్రీంకోర్టులో సవాల్ చేస్తామన్న కాంగ్రెస్

అహ్మదాబాద్/న్యూఢిల్లీ: మోదీ ఇంటిపేరుపై వ్యాఖ్యలకు సంబంధించిన పరువు నష్టం కేసులో కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీకి ఎదురుదెబ్బ తగిలింది. గుజరాత్‌లో కింద కోర్టు విధించిన రెండేళ్ల జైలు శిక్షను నిలిపివేయడానికి హైకోర్టు నిరాకరించింది. తనకు విధించిన శిక్షను నిలిపివేయాలంటూ రాహుల్ గాంధీ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ హేమంత్ ప్రచ్ఛక్ శుక్రవారం తోసిపుచ్చారు. ఆ శిక్షను నిలుపుదల చేయడానికి ఎలాంటి కారణాలు కనిపించడం లేదని అన్నారు. ''రాహుల్ గాంధీపై 10కి పైగా క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. పరువు నష్టం కేసులో రాహుల్ గాంధీకి కింద కోర్టు విధించిన రెండేళ్ల జైలు శిక్ష సరైనదే, న్యాయపరమైనదే. ఈ శిక్షను నిలిపివేయడానికి తగిన కారణాలు ఏమీ లేవు''అని జస్టిస్ హేమంత్ వ్యాఖ్యానించారు. 2019 లోక్‌సభ ఎన్నికల ప్రచారం సందర్భంగా కర్ణాటకలోని కోలార్‌లో దొంగలందరికీ మోదీ అనే ఇంటి పేరే ఎందుకు ఉంటుందో అంటూ రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం లేపాయి. ఈ వ్యాఖ్యలపై గుజరాత్ బీజేపీ ఎమ్మెల్యే పూర్ణేశ్ మోదీ సూరత్ కోర్టులో పరువు నష్టం దావా వేశారు. దీనిపై విచారించిన ట్రయల్ కోర్టు రాహుల్ గాంధీకి రెండేళ్ల జైలు శిక్ష విధించడంతో ఆయన లోక్‌సభ సభ్యత్వం రద్దయిన విషయం తెలిసిందే.

రాహుల్ గొంతు నొక్కేయడానికి కొత్త టెక్నిక్కులు : కాంగ్రెస్

గుజరాత్ హైకోర్టు తీర్పుని సుప్రీం కోర్టులో సవాల్ చేస్తామని కాంగ్రెస్ స్పష్టం చేసింది. రాహుల్ అన్నీ నిజాలు మాట్లాడుతూ ఉండడంతో ఆయన గొంతు నొక్కేయడానికి కేంద్ర ప్రభుత్వం కొత్త టెక్నిక్కులు ఉపయోగిస్తోందని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి అభిషేక్ సింఘ్వి ఆరోపించారు. గుజరాత్ హైకోర్టు రాహుల్ పిటిషన్‌ను కొట్టేయడం తీవ్ర అసంతృప్తికి లోను చేసిందని, కానీ తాము ఊహించిన తీర్పే వచ్చిందన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ బీజేపీ రాజకీయ కుట్రలకు ఎవరూ భయపడడం లేదన్నారు. పార్లమెంటులో రాహుల్ గొంతు నొక్కేయడానికి బీజేపీ కుట్రలు పన్నుతోందని ఆరోపించిన ఖర్గే రాహుల్ గాంధీ న్యాయం కోసం , నిజం కోసం తన పోరాటం కొనసాగిస్తారని ట్విటర్ వేదికగా పేర్కొన్నారు. ఇక పార్టీ ప్రధాన కార్యదర్శి కె.సి. వేణుగోపాల్ ఇలాంటి తీర్పు రావడం పట్ల తమకు ఎలాంటి ఆశ్చర్యం లేదన్నారు. ''ప్రస్తుత పరిస్థితుల్లో గుజరాత్ వంటి రాష్ట్రం నుంచి న్యాయం జరుగుతుందని మేము ఎలా భావిస్తాం. ఈ తీర్పులు రాసేవారు, కోర్టుల్లో పిటిషన్‌లు వేసేవారంతా ఒక్కటి గుర్తు ఉంచుకోవాలి. రాహుల్ లాంటి నాయకుడిని ఏ తీర్పులు , అనర్హత వేటులు ఆపలేవు''అని వ్యాఖ్యానించారు. దేశాన్ని ఏకం చేసే మిషన్ నుంచి రాహుల్‌ని అడ్డుకునే శక్తి దేనికీ లేదన్నారు.



పరువు తీయడం కాంగ్రెస్‌కు అలవాటే: బీజేపీ

గుజరాత్ హైకోర్టు తీర్పుని బీజేపీ స్వాగతించింది. ఇతరుల పరువు తీయడం , వారిని దూషించడం కాంగ్రెస్‌కు తరతరాలుగా వస్తున్న ఒక అలవాటేనని ఆరోపించింది. మోదీ ఇంటి పేరు వ్యాఖ్యలపై క్షమాపణ కోరడానికి రాహుల్ నిరాకరించడం ఆయనకున్న అహంకారాన్ని సూచిస్తుందని బీజేపీ నాయకుడు రవిశంకర్ ప్రసాద్ పేర్కొన్నారు. రాహుల్ గాంధీ ప్రవర్తన ఇలాగే ఉంటే చట్టం తన పని తాను చేసుకుపోతుందని అన్నారు. రాహుల్ గాంధీకి విధించిన శిక్ష అత్యంత కఠినమైనదని అంటున్న వారంతా అంత కఠినమైన నేరాన్ని ఆయన ఎందుకు చేశారో సమాధానం ఇవ్వాలని రవిశంకర్ ప్రసాద్ డిమాండ్ చేశారు.

'వాల్‌మార్ట్' కాల్పుల దోషికి 90 జీవిత ఖైదులు

ఎల్ పాసో: అమెరికాలోని ఎల్ పాసో నగరంలోని వాల్‌మార్ట్ స్టోర్‌లో 2019లో కాల్పులు జరిపి 23 మంది మృతికి కారణమైన వ్యక్తికి కోర్టు 90 వరుస జీవిత ఖైదులను విధించింది. దోషి పాట్రిక్ క్రుసియస్(24)పై సుమారు 50 ఫెడరల్ విద్వేష నేరాభియోగాలున్నాయి. దీనిపై జిల్లా కోర్టు విచారణ జరిపి, శిక్షలు ప్రకటించింది. రాష్ట్ర కోర్టులో విచారణకొస్తే మరణ శిక్ష సహా మరిన్ని శిక్షలపై పట్టుబడతామని న్యాయవాదులు అంటున్నారు. ఈ నేరానికి పాల్పడేందుకు పథకం ప్రకారం క్రుసియస్ డల్లాస్‌లోని సొంతింటి నుంచి ఏకే రైఫిల్‌తో తన వాహనంలో 700 మైళ్ల దూరంలోని ఎల్ పాసోకు వచ్చినట్లు పోలీసులు తెలిపారు. హిస్పానిక్ ప్రజలే లక్ష్యంగా అతడు వాల్ మార్ట్ స్టోర్ లోపల, వెలుపల యథేచ్ఛగా కాల్పులకు తెగబడ్డాడు. ఈ కాల్పుల్లో 23 మంది చనిపోగా మరో 25 మంది గాయపడ్డారు. 2006 తర్వాత అమెరికాలో జరిగిన జాత్యహంకార కాల్పుల ఘటనల్లో అత్యంత తీవ్రమైందిగా ఎల్ పాసో ఘటనను పరిగణిస్తున్నారు.

పవార్ × పవార్

మహారాష్ట్రలోని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ)లో పోరు ముదురుతోంది. ఎన్సీపీ ఎవరిది? శరద్ పవార్‌దా? అజిత్ పవార్‌దా? ఎవరికి వారే పార్టీ తమదేనని వాదిస్తున్నారు. చిన్నాన్నపై ఎదురు తిరిగి అధికార బీజేపీ కూటమితో కలిసిపోయిన అజిత్ పవార్ మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశాక పార్టీ అధ్యక్ష పదవి నుంచి శరద్ పవార్‌ను తొలగించామని తమదే అసలైన ఎన్సీపీ అంటూ ఎన్నికల సంఘానికి లేఖ రాశారు. ఎన్సీపీ ఎన్నికల గుర్తు గడియారం తమకే కేటాయించాలని ఆ లేఖలో కోరారు. ఆ మర్నాడే జాతీయ కార్యవర్గ సమావేశాన్ని ఏర్పాటు చేసిన శరద్ పవార్ తానే అధ్యక్షుడినని ప్రకటించుకున్నారు. ఇలా ఇరు వర్గాలు పోటాపోటీగా బలప్రదర్శన కోసం సమావేశాలు ఏర్పాటు చేస్తూ మహారాష్ట్రలో రాజకీయ వేడిని పెంచాయి. పార్టీల్లో చీలికలు, ఏది అసలు సిసలు పార్టీ అన్న ప్రశ్నలు కేంద్ర ఎన్నికల సంఘానికి కొత్తేం కాదు. ఇదే ఏడాది మహారాష్ట్రలో శివసేనలో చీలికలు ఏర్పడినప్పుడు ఏక్‌నాథ్ షిండే చీలిక వర్గానికే విల్లు బాణాలు గుర్తుని కేటాయించి అదే అసలైన శివసేన అంటూ ఈసీ తేల్చి చెప్పింది. ఇప్పుడు ఎన్సీపీ వంతు వచ్చింది.

-సాక్షి, నేషనల్ డెస్క్



ఎవరి బలాలు ఏంటి?

మహారాష్ట్ర అసెంబ్లీలో ఎన్సీపీకున్న 53 మంది ఎమ్మెల్యేలకు గాను ప్రస్తుతానికి 32 మంది ఎమ్మెల్యేలు అజిత్ పవార్ వెంట ఉన్నారు. ఆ సంఖ్య 36కి చేరుకుంటే ఎలాంటి అనర్హత వేటు లేకుండా అధికార పక్షంలో కలిసిపోవచ్చు. ఇక ఎన్నికల గుర్తు రావాలన్నా మెజార్టీయే కీలకం. అజిత్ పవార్ నాలుగు దశాబ్దాలుగా ఎన్సీపీలో కీలకంగా వ్యవహరిస్తూ ఉన్నారు. క్షేత్రస్థాయిలో ఆయనకు పట్టు ఉంది. ఎంతో మంది కార్యకర్తలు, జిల్లా స్థాయి నాయకుల మద్దతు అజిత్ పవార్‌కు ఉంది. ఇప్పుడు ఉప ముఖ్యమంత్రిగా అధికారంలో ఉన్నారు కాబట్టి ఆయన బలం మరింత పెరిగే అవకాశాలున్నాయి. అయితే పవార్‌కు ఇలా పార్టీని వీడడం కొత్త కాదు. గతంలో పలు మార్లు బయటకు వచ్చి తిరిగి శరద్ పవార్‌కే జై కొట్టిన సందర్భాలున్నాయి. అందుకే ఎమ్మెల్యేలు ఆయనను ఎంతవరకు నమ్ముతారన్న ప్రశ్న తలెత్తుతోంది. మరోవైపు వచ్చే ఎన్నికల్లో బీజేపీ, శివసేన (షిండే వర్గం)తో కలిసి పోటీ చేస్తే టికెట్లు ఎంతమందికి వస్తాయన్న అనుమానాలు ఉన్నాయి. ఎన్డీయేతో కలిస్తే ముస్లిం, దళిత ఓట్లు పోగొట్టుకుంటామన్న ఆందోళన కూడా చాలా మంది ఎమ్మెల్యేల్లో ఉంది. అందుకే ఆఖరి నిమిషంలో ఎంతమంది అజిత్ పవార్ వెంట నడుస్తారన్నది మిలియన్ డాలర్ ప్రశ్నగా మారింది. ఇక మహారాష్ట్ర దిగ్గజ నాయకుడిగా శరద్ పవార్‌కున్న పాపులారిటీయే వేరు. గత కొన్ని దశాబ్దాలుగా గౌరవప్రదమైన రాజకీయ నాయకుడిగా హోదా అనుభవిస్తున్నారు. ఆయన కనుసైగ చేస్తే చాలు ఎలాంటి పనినైనా చక్కపెట్టగల అనుచరగణం ఉంది. 82 ఏళ్ల శరద్ పవార్‌కు ఆయన వయసే ప్రతిబంధకంగా మారింది.

మహారాష్ట్ర అసెంబ్లీలో ఎన్సీపీ సభ్యులు	శరద్ పవార్ వెంట ఉన్న ఎమ్మెల్యేలు	అజిత్ పవార్ సమావేశానికి హాజరైనవారు
53	15	32
ప్రస్తుతానికి తటస్థంగా ఉన్న ఎమ్మెల్యేలు	6	

మెజార్టీయే శిరోధార్యం

ఏ పార్టీలోనైనా మెజార్టీ ఎమ్మెల్యేలు, పార్టీలో జిల్లా అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు అత్యధికులు ఎవరివైపు ఉంటే వారిదే అసలైన పార్టీ అని ఈసీ తేలుస్తుంది. దీనికి సంబంధించి పూర్తి స్థాయి కసరత్తు నిర్వహించి పార్టీని స్థాపించిన వారు కాకుండా మెజార్టీ ఎవరి వైపు ఉంటే వారికే పార్టీని, గుర్తుని కేటాయిస్తుంది. 1968లో ఎన్నికల గుర్తుకు సంబంధించిన స్పష్టమైన ఉత్తర్వులున్నాయి. ఈ ఉత్తర్వుల కింద మొట్టమొదటిసారిగా కాంగ్రెస్ పార్టీలో చీలికల కేసుని పరిష్కరించారు. 1969లో కె.కామరాజ్, నీలం సంజీవరెడ్డి, ఎస్. నిజలింగప్ప, అత్యుల ఘోష్ వంటి నాయకులు ఒక్కటై ఇందిరాగాంధీని పార్టీ నుంచి బహిష్కరించారు. దీంతో పార్టీ రెండుగా విడిపోయింది. నిజలింగప్ప ఆధ్వర్యంలో పాత కాంగ్రెస్‌కే అధికారిక గుర్తు కాడెద్దులు గుర్తు దక్కింది. 1968కి ముందు ఎన్నికల నిబంధనలు, 1961 కింద కార్యనిర్వాహక ఉత్తర్వుల జారీతో ఈసీ ఈ వివాదాన్ని పరిష్కరించేది. 1964లో కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (సీపీఐ) చీలిక అతి పెద్దదిగా చెప్పుకోవాలి. సీపీఐ (మార్క్సిస్టు) వర్గం తమని ప్రత్యేక పార్టీగా గుర్తించాలని కోరింది. అప్పట్లో ఆంధ్రప్రదేశ్, కేరళ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల ఎమ్మెల్యేలు, ఎంపీలు మద్దతుగా ఉన్నట్టుగా ఈసీకి లేఖ సమర్పించింది. ఏదేమైనా ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు ఎవరి వెంట ఎక్కువ మంది ఉంటే వారిదే అసలు సిసలు పార్టీగా ఎన్నికల సంఘం గుర్తించడం ఆనవాయితీగా వస్తోంది.

లోక్‌సభ ఎన్నికలపై ఎలాంటి ప్రభావం ?

మహారాష్ట్ర ఎన్సీపీలో సంక్షోభం వచ్చే లోక్‌సభ ఎన్నికలపై పడే ప్రభావంపైనే సర్వత్రా చర్చ జరుగుతోంది. బీజేపీ వెనక ఉండి నడిపించినట్టు ఆరోపణలు వస్తున్న ఆపరేషన్ అజిత్ పవార్‌తో ఇప్పటికిప్పుడు మహారాష్ట్ర అసెంబ్లీకి వచ్చే లాభమేమీ లేదు. ఇప్పటికే ఏక్‌నాథ్ షిండే సర్కార్ పూర్తి స్థాయి మెజార్టీతో బలంగానే ఉంది. వచ్చే ఏడాది జరగనున్న లోక్‌సభ ఎన్నికల్ని దృష్టిలో ఉంచుకొనే బీజేపీ అజిత్ పవార్ తిరుగుబాటును ప్రోత్సహించినట్టుగా తెలుస్తోంది. ఉత్తరప్రదేశ్ తర్వాత అత్యధిక లోక్‌సభ స్థానాలు కలిగిన రాష్ట్రం మహారాష్ట్ర, 48 ఎంపీ స్థానాలతో ఈ రాష్ట్రం పార్లమెంటు ఎన్నికల్లో అత్యంత కీలకంగా ఉంది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ–శివసేన కూటమి 41 లోక్‌సభ స్థానాలను గెలుచుకున్నాయి. కానీ ఇప్పుడు ఎన్డీయేతో శివసేన లేకపోవడంతో ఆ పార్టీలో చీలికలు తెచ్చి ఏక్‌నాథ్ షిండే వర్గాన్ని తమ వైపు లాక్కుంది. అయినప్పటికీ గత ఎన్నికల మాదిరిగా సీట్లు వచ్చే అవకాశం లేకపోవడంతో ఎన్సీపీని కూడా చీల్చడానికి ప్రయత్నించిందన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. విపక్షాలను బలహీనపరచడమే కాకుండ ప్రజాకర్షణ బలంగా ఉన్న మరాఠా నాయకులైన ఏక్‌నాథ్ షిండే, అజిత్ పవార్ వంటి వారి అండ బీజేపీ వైపు ఉంది. ఈ సారి కాంగ్రెస్, శివసేన ఉద్ధవ్ వర్గంతో ఎన్సీపీ శరద్ పవార్ వర్గం చేతులు కలిపినప్పటికీ తమ వైపు ఉన్న నాయకులే బలంగా ఉన్నట్టుగా బీజేపీ నమ్ముతోంది. ఓ రకంగా మహారాష్ట్ర బీజేపీ చెయ్యి జారిపోకుండా కాపాడుకోవడానికే ఇదంతా చేస్తోందన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి.



అమెరికాలోని నెవార్క్ పోర్టులో నిలిచిన ఇటాలియన్ సరుకు నౌక ఇది. సుమారు 1,200 పాత, కొత్త వాహనాలతో పశ్చిమ ఆఫ్రికా వైపు వెళుతుండగా మంటలు చెలరేగాయి. మూడు రోజులుగా ప్రయత్నిస్తున్నా మంటలు అదుపులోకి రాలేదు. ప్రమాదవశాత్తు ఇద్దరు ఫైర్ ఫైటర్లు ప్రాణాలు కోల్పోయారు.

ఉత్తరాఖండ్‌లో టమాటా కేజీ రూ. 250



''ఏవండీ టమాటాలు చాలా చీప్‌గా ఉన్నాయట. కేజీ 15 వందలేనట. ఇంటికి వచ్చేటప్పుడు ఓ రెండు కేజీలు తీసుకురండి'' అని ఆదిత్య 369 సినిమాలో ఒక డైలాగ్ ఉంటుంది. అప్పట్లో అదో పెద్ద జోక్‌లా అందరూ పడి పడి నవ్వారు. కానీ ఇప్పుడు టమాటా ధరల్ని చూస్తూ ఉంటే అదెంత కఠోర వాస్తవమో తెలుస్తుంది. మరీ ఆ సినిమాలో చూపించిన స్థాయిలో కాకపోయినా లీటర్ పెట్రోల్ ధర కంటే టమాటా ధరలు మండిపోతున్నాయి. ఢిల్లీ, ముంబై, బెంగుళూరు వంటి రాష్ట్రాల్లో కేజీ టమాటా రూ.160కి చేరుకుంటే ఉత్తరాఖండ్‌లో అత్యధికంగా టమాటా కేజీ ధర రూ.250గా ఉంది. గంగోత్రి రిటైల్ మార్కెట్లో శుక్రవారం కేజీ టమాటా రూ.250 ధర పలికింది. ఉత్తరకాశీలో టమాటా ధర రూ.180 నుంచి రూ.200 వరకు ఉంది. దీంతో టమాటా కొనడానికి సామాన్యులెవరూ ముందుకు రావడం లేదు. సాధారణంగా ప్రతీ ఏడాది జూన్, జూలై నెలల్లో టమాటా ధరలు పెరిగిపోతాయి. కానీ ఈ సారి అసాధారణంగా రేట్లు భగ్గుమనడంతో సామాన్య జనం గగ్గోలు పెడుతున్నారు. టమాటా పండించే ప్రాంతాలలో అతివృష్టి లేదంటే అనావృష్టి పరిస్థితులు, రుతుపవనాలు ఆలస్యం కావడం, ఉష్ణోగ్రతలు భారీగా పెరిగిపోవడం వంటి కారణాలతో దిగుబడి పడిపోయి ధరలు ఆకాశాన్నంటాయి. టమాటా ధరలు పెరిగిపోవడంపై సోషల్ మీడియాలో మీమ్స్ వెల్లువెత్తుతున్నాయి. కొందరు నెటిజన్లు టమాటా కంటే పెట్రోల్ తక్కువ ధరకి వస్తోందని అంటే మరికొందరు టమాటా అమ్మకందారులు రుణాలిచ్చే అధికారుల్ని కూడా వెంట తీసుకురావాలంటూ సెటైర్లు వేస్తున్నారు.

మెక్‌డొనాల్డ్స్ బర్గర్లలో నో టమాటా

టమాటో ధరలు రోజు రోజుకి పెరిగిపోతూ ఉండడంతో ఫాస్ట్ ఫుడ్ రెస్టారెంట్ మెక్‌డొనాల్డ్ తమ బర్గర్లలో ఇక టమాటాలు వేయమని తేల్చి చెప్పింది. న్యూఢిల్లీలోని మెక్‌డొనాల్డ్స్ ఔట్‌లెట్ బయట బర్గర్లలో టమాటాలు వెయ్యలేమని అందరూ సహకరించాలంటూ ఒక నోటీసు అంటించింది. టమాటా ధరతో పాటు నాణ్యత కూడా లోపించడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టుగా తెలిపింది. కేవలం నెల రోజుల వ్యవధిలో టమాటా ధరలు అయిదు రెట్లు పెరిగిపోవడంతో వాటిని కొనడానికి ముందు వెనుక ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

- సాక్షి, నేషనల్ డెస్క్

అవినీతే కాంగ్రెస్ ఊపిరి

- అది లేకుండా ఆ పార్టీ బతకలేదు
- ప్రధానమంత్రి మోదీ ఘాటు విమర్శలు
- ఛత్తీస్‌గఢ్, యూపీల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

రాయ్‌పూర్/గోరఖ్‌పూర్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరోసారి కాంగ్రెస్‌పై నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ ఊపిరి, ముఖ్య సిద్ధాంతం అవినీతేనని పేర్కొన్నారు. అవినీతి లేకుండా ఆ పార్టీ బతకలేదని విమర్శించారు. శుక్రవారం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం రాయ్‌పూర్‌లో జరిగిన వివిధ కార్యక్రమాల్లో ప్రధాని మోదీ పాల్గొని మాట్లాడారు. ఛత్తీస్‌గఢ్ అభివృద్ధిని అధికారంలో ఉన్న కాంగ్రెస్ అడ్డుకుంటోందని ఆరోపించారు. రాష్ట్రాన్ని ఆ పార్టీ ఏటీఎంలా మార్చేసుకుందని వ్యాఖ్యానించారు. అవినీతికి కాంగ్రెస్ గ్యారెంటీ అయితే, అవినీతి పరులపై చర్యలకు తనదీ గ్యారెంటీ అని అన్నారు. 'కుంభకోణాల్లో మునిగిన కాంగ్రెస్ ప్రభుత్వం దుష్పరిపాలనకు ఆదర్శంగా మారింది. అభివృద్ధికి అడ్డుగోడగా నిలిచింది. ప్రజల హక్కుల్ని లాగేసుకుని, రాష్ట్రాన్ని లూటీ చేసి, నాశనం చేసేందుకు పూనుకుంది. అందుకే వచ్చే ఎన్నికల్లో ఈ ప్రభుత్వాన్ని సాగనంపాలని ప్రజలు నిర్ణయించుకున్నారు'అని ప్రధాని నిప్పులు చెరిగారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రకటించిన మద్య నిషేధం తదితర 36 వాగ్దానాలను ఆ పార్టీ నెరవేర్చలేకపోయింది. మద్య నిషేధానికి బదులుగా కోట్లాది రూపాయల మద్యం కుంభకోణానికి పాల్పడింది. ఈ డబ్బంతా కాంగ్రెస్ ఖాతాలోకే చేరింది. ఒక్క మద్యానికే కాదు. ప్రతి శాఖలోనూ అవినీతే. అవినీతి కాంగ్రెస్‌కు ఊపిరిగా మారింది. అది లేకుండా ఆ పార్టీకి శ్వాస ఆడదు. అవినీతే కాంగ్రెస్ ముఖ్య సిద్ధాంతం'అని అన్నారు. కాంగ్రెస్ అవినీతికి గ్యారెంటీ అని నేను విమర్శిస్తే కొందరు నాపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దానర్థం, అవినీతికి వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తున్నట్లే. కాంగ్రెస్ అవినీతికి గ్యారెంటీ అయితే, అవినీతిపై చర్యలకు మోదీ గ్యారెంటీ'అని ఆయన స్పష్టం చేశారు. అవినీతి పరులు, గతంలో పరస్పరం దూషించుకున్నవారు ఇప్పుడు దగ్గరవుతున్నారంటూ బీజేపీకి వ్యతిరేకంగా ఏకమయ్యేందుకు ప్రతిపక్షాలు చేస్తున్న ప్రయత్నాలపై ఆయన మండిపడ్డారు. ఇటువంటి వాటికి భయపడేది లేదన్నారు. 'తప్పుడు పనుల్లో మునిగి తేలేవారు తప్పించుకోలేరు. నా దగ్గర ఉన్నదంతా మీరు (ప్రజలు), ఈదేశం ఇచ్చినవేనని ధైర్యంగా చెబుతున్నా. నాపై కుట్రలు పన్నుతున్న వారికి, నా సమాధి తవ్వాలని చూస్తున్న వారికి భయపడను. భయపడితే మోదీనే కాను'అని ప్రధాని చెప్పారు. రాష్ట్రం నుంచి నక్సలిజంను లేకుండా చేసేందుకు కేంద్రం తీసుకుంటున్న చర్యలు ఫలితమిస్తున్నాయని తెలిపారు. నక్సల్ ప్రభావిత జిల్లాల సంఖ్య 126 నుంచి 70కి తగ్గిపోయిందన్నారు.



రాయ్‌పూర్‌లో మహిళా లబ్ధిదారుతో ప్రధాని మోదీ

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

రాయ్‌పూర్‌లో రూ.7,600 కోట్ల విలువైన ఎనిమిది ప్రాజెక్టులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కాంకేర్ జిల్లా అంతగఢ్– రాయ్‌పూర్ రైలుకు వర్చువల్‌గా జెండా ఊపారు. ఆయుష్మాన్ భారత్ పథకం కార్డులను పంపిణీ చేశారు. దశాబ్దాలుగా అన్యాయానికి గురవుతున్న వారికి ఆధునిక సౌకర్యాలు కల్పించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. శంకుస్థాపన చేసిన రాయ్‌పూర్– ధన్‌బాద్ ఎకనామిక్ కారిడార్, రాయ్‌పూర్–విశాఖపట్టణం ఆర్థిక కారిడార్ ప్రాజెక్టులతో ఈ ప్రాంత రూపురేఖలే మారనున్నాయన్నారు.

గీతా ప్రెస్ శతాబ్ది ఉత్సవాల్లో ప్రధాని

శుక్రవారం ప్రధాని మోదీ గోరఖ్‌పూర్‌లో పర్యటించారు. గీతా ప్రెస్ శతాబ్ది ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. గీతా ప్రెస్ కేవలం పుస్తకాలను ముద్రించే ముద్రణాలయం కాదు, ప్రజల విశ్వాసం, దేవాలయమని పేర్కొన్నారు. మహాత్మాగాంధీకి గీతా ప్రెస్‌తో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేశారు. గీతా ప్రెస్ ఆధ్వర్యంలో నడిచే కల్యాణ్ మేగజీన్ కోసం ఆయన వ్యాసాలు రాసే వారని చెప్పారు. ప్రధాని రెండు వందేభారత్ రైళ్లను ప్రారంభించారు. అనంతరం సొంత నియోజకవర్గం వారణాసికి చేరుకున్నారు. అక్కడ రూ.12 వేల కోట్ల 29 అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. గత ప్రభుత్వాలహయాంలో ఏసీ గదుల్లో కూర్చుని సంక్షేమ పథకాలను తయారు చేసే, ప్రభావం ఏమిటనే దానిపై అప్పటి నాయకులకు అవగాహన లేదని ప్రధాని అన్నారు.

త్రిపుర అసెంబ్లీలో గందరగోళం

అగర్తలా: త్రిపుర అసెంబ్లీలో శుక్రవారం గందరగోళం చెలరేగింది. సభా కార్యకలాపాలకు అంతరాయం కలిగించినందుకు స్పీకర్ అయిదుగురు సభ్యులను సస్పెండ్ చేశారు. మార్చిలో అసెంబ్లీ సమావేశాలు జరుగుతుండగా బీజేపీకి చెందిన జాదవ్‌లాల్ నాథ్ సభలోనే తన సెల్‌ఫోన్‌లో అశ్లీల చిత్రాలు చూశారనే ఆరోపణలొచ్చాయి. ఆ ఘటనపై చర్చను చేపట్టాలంటూ తిప్రా మోథా పార్టీకి చెందిన అనిమేశ్ దేవ్‌వర్మ వాయిదా తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. స్పీకర్ బిశ్వ బంధు సేన్ ఆ తీర్మానాన్ని తోసిపుచ్చుతూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గాను రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టాలని ఆర్థిక మంత్రిని కోరారు. స్పీకర్ నిర్ణయంపై తిప్రా మోథా సభ్యులు నిరసనకు దిగారు. సీపీఎం, కాంగ్రెస్ సభ్యులు వారికి తోడయ్యారు. దీంతో, స్పీకర్ బిశ్వ బంధు సేన్..తిప్రా మోథాకు చెందిన ముగ్గురు, కాంగ్రెస్, సీపీఎంలకు చెందిన ఒక్కో ఎమ్మెల్యేలను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ నిర్ణయంపై ప్రతిపక్ష సభ్యులు వాకౌట్ చేశారు. సీఎం మాణిక్ సాహా జోక్యంతో స్పీకర్ సస్పెన్షన్ ఎత్తివేస్తున్నట్లు ప్రకటించడంతో ఆ ఎమ్మెల్యేలు తిరిగి సభలోకి వచ్చారు. అయితే, ఎమ్మెల్యే జాదవ్ లాల్ చేసిన తప్పును ఖండిస్తూ తీర్మానం చేయాలన్నారు. స్పీకర్ తిరస్కరించడంతో మళ్లీ వాకౌట్ చేశారు.

సిసోడియా తదితరుల ఆస్తులు అటాచ్

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కుంభకోణంలో మనీ లాండరింగ్ ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆప్ నేత, ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియా, ఆయన భార్య, ఇతరులకు చెందిన రూ.52 కోట్ల విలువైన ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అటాచ్ చేసింది. మనీష్ సిసోడియాను మార్చిలో ఈడీ అరెస్ట్ చేసింది. ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు.

ఎన్సీపీ చీలి పోలేదు: ప్రఫుల్ పటేల్

ముంబై: నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్సీపీ) చీలిపోలేదని ఆ పార్టీ నేత ప్రఫుల్ పటేల్ చెప్పారు. పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, వివిధ విభాగాలు జూన్ 30వ తేదీన సమావేశమై అజిత్ పవార్‌ను అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నాయని వెల్లడించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. అజిత్ పవార్ తమ పార్టీ అధ్యక్షుడని పేర్కొంటూ 40 మందికి పైగా ఎమ్మెల్యేలు ఎన్నికల సంఘం(ఈసీఐ)కి నివేదిక అందజేశారన్నారు. పార్టీ పేరు, గుర్తులను తమకే కేటాయించాలని కోరారని కూడా చెప్పారు. గురువారం శరద్‌పవార్ నేతృత్వంలో ఢిల్లీలోని జరిగిన ఎన్సీపీ సమావేశం అధికారికం కాదన్నారు. అజిత్ పవార్‌ను, ఆయన వర్గానికి చెందిన వారిని బహిష్కరిస్తూ శరద్ పవార్ వర్గం తీసుకున్న నిర్ణయం చెల్లదని చెప్పారు. అసలైన రాజకీయ పార్టీ ఎవరిదనే నిర్ణయించాల్సింది ఎన్నికల సంఘమేనన్నారు.

గ్రీన్‌కార్డు ఆశలు తీరే మార్గం..



- నిరుపయోగంగా ఉన్న 2 లక్షల గ్రీన్‌కార్డుల పునర్వినియోగం
- ప్రతిపాదనకు అమెరికా అధ్యక్షుడి సలహా మండలి ఆమోదం
- ఎక్కువ కార్డులు కుటుంబం, ఉద్యోగం కేటగిరీల్లోనివే..

వాషింగ్టన్: గ్రీన్‌కార్డుల కోసం ఏళ్లుగా ఎదురు చూస్తున్న భారతీయ అమెరికన్లకు శుభవార్త. 1992 నుంచి నిరుపయోగంగా ఉన్న 2.30 లక్షలకు పైగా గ్రీన్‌కార్డులను స్వాధీనం చేసుకుని, పునర్వినియోగించాలన్న సిఫారసుపై అధ్యక్షుడి సలహా మండలి ఆమోద ముద్ర వేసింది. ఫలితంగా, మరింత మంది గ్రీన్‌కార్డులను అందుకునేందుకు వీలు ఏర్పడింది. దీని ప్రకారం..ఏటా ఇచ్చే 1.40 లక్షల గ్రీన్‌కార్డులకు అదనంగా 2.30 లక్షల కార్డుల్లో ఏటా కొన్నిటిని జారీ చేస్తారని ప్రముఖ భారతీయ అమెరికన్ అజయ్ భుటోరియా చెప్పారు. అధ్యక్షుడు బైడెన్‌కు ఆసియన్ అమెరికన్ల సలహా మండలిలో భుటోరియా సభ్యుడు. ఇందుకు సంబంధించిన సిఫారసులను మండలికి గురువారం అందజేసినట్లు ఆయన తెలిపారు. గ్రీన్ కార్డు అంటే అమెరికాలో వలసదారులకు అందజేసే శాశ్వత నివాస పత్రం. ఉపయోగంలో లేని గ్రీన్‌కార్డులను తిరిగి స్వాధీనం చేసుకోవడం, ముమ్ముందు గ్రీన్‌కార్డుల వృథాను అరికట్టేందుకు పలు సిఫారసులను చేశామన్నారు. వీటి అమలుతో గ్రీన్‌కార్డు కోసం ఎదురుచూస్తున్న వారికి ఎంతో ఊరటనిస్తుందని చెప్పారు. తమ కమిషన్ సిఫారసులకు ఆమోదం తెలిపిన బైడెన్ ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కుటుంబ, ఉద్యోగ ప్రాతిపదికన వలసదారులకు ఏటా నిర్ణీత సంఖ్యలో గ్రీన్‌కార్డులను జారీ చేసే అధికారం డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ(డీహెచ్ఎస్)కి కాంగ్రెస్ ఇస్తుంటుంది. అయితే, పరిపాలనాపరమైన జాప్యంతో జారీ అయిన గ్రీన్‌కార్డుల్లో కొన్ని నిరుపయోగంగా ఉండిపోతున్నాయి. అనేక ఏళ్లుగా ఇలా కార్డులు లక్షలుగా పేరుకుపోయాయని భుటోరియా వివరించారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు రెండు చర్యలను తాము సూచించినట్లు వెల్లడించారు. అందులో ఒకటి...1992 నుంచి ఉపయోగంలో గ్రీన్‌కార్డులను తిరిగి స్వాధీనం చేసుకోవాలి. ఏటా ఇచ్చే 1.40 లక్షల గ్రీన్‌కార్డులకు తోడుగా స్వాధీనం చేసుకున్న 2.30 లక్షల కార్డుల్లో ఏటా కొన్నిటినీ జారీ చేయాలి. రెండోది..ఆ ఆర్థిక సంవత్సరంలో సంబంధిత పత్రాలను ఏజెన్సీలు ప్రాసెస్ చేయలేకపోయినప్పటికీ, అన్ని గ్రీన్ కార్డ్‌లు వార్షిక పరిమితి ప్రకారం అర్హులైన వలసదారులకు అందుబాటులో ఉండేలా కొత్త విధానాన్ని తీసుకురావడం. కొత్త విధానం అమల్లోకి రాకముందే ఉపయోగించని గ్రీన్ కార్డ్‌లను తిరిగి పొందేందుకు ఈ విధానాన్ని ముందస్తుగా వర్తింపజేయడం'అని ఆయన వివరించారు. ఈ సిఫారసులు అమల్లోకి వస్తే ఎన్నో కుటుంబాలు, వ్యక్తులతోపాటు అమెరికా ఆర్థిక వ్యవస్థకు కూడా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. నిరుపయోగంగా ఉండే గ్రీన్‌కార్డుల ప్రభావం ముఖ్యంగా భారతీయ అమెరికన్లు, ఫిలిపినో అమెరికన్లు, చైనీస్ అమెరికన్ల కుటుంబాలపైనే ఉంటుందని చెప్పారు. గ్రీన్‌కార్డుల కొరత ప్రభావం తాత్కాలిక ఉద్యోగాలు చేసుకునే హెచ్–1బీ వీసాదారులపై ఉంటుందని, వారి పిల్లల వలస హోదాపైనా పడుతోందన్నారు. 2020 గణాంకాల ప్రకారం 42 లక్షల కుటుంబాలు సగటున ఆరేళ్లుగా గ్రీన్‌కార్డుల కోసం ఎదురుచూస్తున్నారు. భారతీయ ఐటీ నిపుణులు గ్రీన్‌కార్డు కోసం సగటున దశాబ్ద కాలంపాటు ఎదురు చూపులు చూడాల్సిన పరిస్థితులున్నాయి.

చెన్నైలో పెరుగుతున్న జ్వరం కేసులు

సాక్షి, చెన్నై: చెన్నై, శివారు ప్రాంతాల్లో జ్వరం కేసులు పెరుగుతున్నాయి. అత్యధిక శాతం మంది తీవ్ర గొంతునొప్పి, దగ్గు, జ్వరం బాడిన పడుతున్నారు. క్లినిక్‌లు, ప్రైవేటు ఆస్పత్రులు, ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే వారి సంఖ్య శుక్రవారం పెరిగింది. నైరుతి రుతుపవనాల రాకతో రాష్ట్రంలో అక్కడక్కడ చెదురు మదురుగా వర్షాలు పడుతున్న విషయం తెలిసిందే. ఈ పవనాలు వచ్చి రాగానే తొలుత చెన్నై, శివారు జిల్లాలపై అధిక ప్రభావాన్ని చూపించాయి. ప్రస్తుతం వాతావరణం పూర్తిగా మారింది. ఈ క్రమంలో చాలా మంది జ్వరాలతో క్లినిక్‌ల ముందు క్యూకడుతున్నారు. ఈ జ్వరాలు మూడు లేదా నాలుగు రోజులకు పైగా ఉంటే రక్త పరీక్షలు చేసుకోవాలని ఆరోగ్యశాఖ అధికారులు పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

కొత్త టెర్మినల్ నుంచి పూర్తి స్థాయిలో విమాన సేవలు



టెర్మినల్‌లో ప్రారంభమైన సేవలు

కొరుక్కుపేట: చెన్నైలోని మీనంబాక్కం అంతర్జాతీయ విమానాశ్రయంలో నూతనంగా ఏర్పాటు చేసిన టెర్మినల్ నుంచి పూర్తి స్థాయిలో విమాన సేవలు ప్రారంభమయ్యాయి. ఇక్కడ 1,36,295 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన టెర్మినల్‌ను 2023 ఏప్రిల్ 8న ముఖ్యమంత్రి స్టాలిన్ సమక్షంలో ప్రధాని మోదీ ప్రారంభించారు. ఈ కొత్త టెర్మినల్‌లో మొదటి టెస్ట్ రన్ ఏప్రిల్ 25న ప్రారంభమైంది. 3వ తేదీ ట్రయల్ రన్ ప్రారంభించి నెలాఖరులోగా పూర్తి చేశారు. జూన్ మొదటి వారం నుంచి కొత్త ఇంటిగ్రేటెడ్ ఇంటర్నేషనల్ టెర్మినల్‌లో పూర్తి స్థాయిలో అంతర్జాతీయ రాకపోకలు ఉంటాయని చెన్నై విమానాశ్రయ అధికారులు తెలిపారు. కానీ విమానాలను ప్రయోగాత్మకంగా నడుపుతున్నప్పుడు కొన్ని సమస్యలు గుర్తించారు. వాటిని సరిచేసి పూర్తి స్థాయిలో విమాన సేవలను శుక్రవారం నుంచి ప్రారంభించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఉదయం నుంచి అన్ని అంతర్జాతీయ విమానాలు, రాకపోకలు పూర్తిగా పనిచేయడం ప్రారంభించాయి. ఈ కొత్త టెర్మినల్ నుంచి 51 విదేశీ విమానాలు బయలుదేరుతున్నాయి. అదేవిధంగా 51 విదేశీ విమానాలు రానున్నాయి. ఒక్క శుక్రవారం మాత్రమే 102 విమాన సర్వీసులు నడుస్తున్నాయి. పర్యవసానంగా ఇప్పటికే పని చేస్తున్న టెర్మినల్ 3 అని పిలువబడే పాత అంతర్జాతీయ టెర్మినల్ 10వ తేదీ తర్వాత పూర్తిగా మూసివేయనున్నారు. అక్కడ నుంచి ఎలాంటి సేవలు ఉండవు. కొద్ది రోజుల్లో టెర్మినల్ 3ని కూల్చివేయనున్నారు. ఆ తర్వాత ఫేజ్ 2 నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయని చెన్నై విమానాశ్రయ అధికారులు పేర్కొన్నారు.

11 నుంచి సెంథిల్ కేసు విచారణ

- త్రిసభ్య బెంచ్ నిర్ణయం

సాక్షి, చెన్నై: సెంథిల్ బాలాజీ అరెస్టుకు వ్యతిరేకంగా ఆయన సతీమణి మేఘల దాఖలు చేసిన పిటిషన్‌ను ఈనెల 11 నుంచి త్రిసభ్య బెంచ్ విచారించనుంది. శుక్రవారం ఈ నిర్ణయాన్ని త్రిసభ్య బెంచ్ వెల్లడించింది. ఈ పిటిషన్‌పై రెండు రోజుల క్రితం భిన్న తీర్పు వెలువడిన విషయం తెలిసిందే. ద్విసభ్య బెంచ్‌లో వెలువడ్డ ఈ తీర్పుతో త్రిసభ్య బెంచ్ అనివార్యమైంది. గురువారం న్యాయమూర్తులు నిషా భాను, భరత చక్రవర్తిలతో పాటు మూడో న్యాయమూర్తిగా కార్తికేయన్ కేసు విచారణకు సిద్ధమయ్యారు. తొలిరోజు మేఘల తరఫున న్యాయవాది ఇలంగోవన్ కొంత సమాచారాన్ని కోర్టు ముందు ఉంచారు. ఈ పిటిషన్‌ను త్వరితగతిన ముగించాలని సుప్రీంకోర్టు ఆదేశించిన నేపథ్యంలో శనివారం నుంచి కేసు విచారణ వేగం పెంచే విధంగా నిర్ణయం తీసుకున్నారు. శుక్రవారం ఈ విషయంగా నిర్ణయాలు తీసుకున్నా, చివరకు 11వ తేదీ నుంచి విచారణ వేగం పుంజుకోనుంది. అరెస్టు- జుడీషియల్ కస్టడీ, పిటిషన్ విచారణ యోగ్యమా...? కస్టోడియల్ కాలం..? అన్న మూడు అంశాలపై ఈ విచారణ జరగనుంది. ఈ కేసు విచారణ నిమిత్తం ఢిల్లీ నుంచి తమ తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబాల్ రావాల్సి ఉందని, ఈ దృష్ట్యా, ఈనెల 11వ తేదీ నుంచి విచారణ చేపట్టాలని కోర్టుకు ఇలంగోవన్ విజ్ఞప్తి చేశారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఢిల్లీ నుంచి కేంద్ర ప్రభుత్వ అటార్నీ జనరల్ తుషార్ మెహత హాజరై ఆక్షేపణ వ్యక్తం చేశారు. శనివారం నుంచి విచారణ కొనసాగాలని, ఈనెల 11న తనకు సుప్రీంకోర్టులో మరికొన్ని కేసులు ఉన్నట్లు వివరించారు. వాదనల అనంతరం ఈనెల 11న ఉదయం పిటిషనర్ తరఫున వాదన, మధ్యాహ్నం తర్వాత ఈడీ తరఫున ఢిల్లీ నుంచే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఇవ్వవచ్చునని తుషార్ మెహతాకు త్రిసభ్య బెంచ్ సూచించింది. ఇదిలా ఉండగా సెంథిల్ బాలాజీ ఇలాకాల లేని మంత్రిగా కొనసాగడాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్ మరో బెంచ్ ముందు విచారణకు వచ్చింది. ఆయన మంత్రిగా కొనసాగితే ఏమైనా నష్టం ఉందా..? అని పిటిషనర్లను కోర్టు ప్రశ్నించింది. సమగ్ర వివరాలను సమర్పించాలంటూ తదుపరి వారానికి పిటిషన్ విచారణను వాయిదా వేశారు.

కొత్త శ్రేణిలో పొగ, గ్యాస్ డిటెక్టర్లు

సాక్షి, చెన్నై: దక్షిణ భారత సెక్యూరిటీ అండ్ ఫైర్ ఎక్స్‌పో వేదికగా హైక్విజన్ ఇండియా కొత్త శ్రేణిలో పొగ, గ్యాస్ లీక్ వంటి వాటిని గుర్తించేందుకు వీలుగా డిటెక్టర్లు, అలారం సిస్టమ్‌ను పరిచయం చేసింది. ట్రేడ్ సెంటర్‌లో గురువారం రాత్రి జరిగిన కార్యక్రమంలో తమిళనాడు అగ్నిమాపక శాఖ అధికారి రాబిన్ కాస్ట్రో, ట్రాఫిక్ డీసీపీ సమయ సింగ్, హోంగార్డ్స్ డైరెక్టర్ బీకే రవి, ఓఎస్‌పీసీ చెన్నై చాప్టర్ ప్రతినిధి మాణిక్యం ఈ కొత్త ఉత్పత్తులను పరిశీలించారు. ఈ కొత్తశ్రేణి స్మోక్ అండ్ గ్యాస్ డిటెక్టర్లను, 12 జోన్ వైర్డ్ ఇంట్రూషన్ అలారం సిస్టమ్ గురించి సమాచారం సేకరించారు. వీటి గురించి హిక్విజన్ ఇండియా ఎండీ ఆశిష్ సమగ్ర వివరాలను తెలియజేశారు. రోబోటిక్స్ టెక్నాలజీతో సరికొత్త సాంకేతిక ఆవిష్కరణలు, భద్రత, తనిఖీల పరంగా ఉపయోగపడే ఉత్పత్తులను తెలియజేశారు.

డీఐజీ బలవన్మరణం

తీవ్ర మానసికఒత్తిడికి లోనైన కోయంబత్తూరు రేంజ్ డీఐజీ విజయకుమార్(45) శుక్రవారం ఉదయం బలవన్మరణానికి పాల్పడ్డారు. భద్రతా సిబ్బంది వద్ద ఉన్న తుపాకీ తీసుకుని తనకు తాను కాల్చుకుని మృత్యుఒడిలోకి చేరారు. ఈ సమాచారం పోలీసు యంత్రాంగాన్ని షాక్‌కు గురిచేసింది. డీజీపీ శంకర్ జివ్వాల్, ఏడీజీపీ అరుణ్ హుటాహుటిన కోయంబత్తూరుకు చేరుకున్నారు. తీవ్ర దిగ్భ్రాంతికి లోనైన సీఎం స్టాలిన్ తన సానుభూతి తెలియజేశారు. అధికార లాంఛనాలతో స్వస్థలం తేనిలో విజయకుమార్ భౌతికకాయానికి సాయంత్రం అంత్యక్రియలు జరిగాయి.

మానసిక ఒత్తిడికి తుపాకీతో కాల్చుకున్న డీఐజీ విజయకుమార్

- సీఎం దిగ్భ్రాంతి
- డీజీపీ, ఏడీజీపీల నివాళులు
- పనిభారం కాదని స్పష్టం
- అధికార లాంఛనాలతో అంత్యక్రియలు
- విచారణకు ప్రతిపక్షాల పట్టు



మంత్రి స్వామినాథన్ నివాళి



విజయకుమార్ (ఫైల్)

సాక్షి, చెన్నై: కోయంబత్తూరు రేంజ్ డీఐజీగా ఈ ఏడాది జనవరిలో ఐపీఎస్ అధికారి విజయకుమార్(45) పదోన్నతి పొందారు. ఆయనకు భార్య గీతా వాణి, కుమార్తె నందిత ఉన్నారు. రేస్‌కోర్సు రోడ్డులోని క్యాంప్ కార్యాలయం క్వార్టర్స్‌లో నివాసం ఉన్నారు. శుక్రవారం ఉదయం వాకింగ్‌కు వెళ్లి వచ్చిన ఆయన సరిగ్గా 6.45 గంటల సమయంలో తన భద్రతా సిబ్బంది రవి వద్ద ఉన్న తుపాకీ తీసుకున్నారు. తన కణత కుడివైపుగా భాగంలో తుపాకీతో కాల్చుకున్నారు. ఈ హఠాత్పరిణామంతో భద్రతా సిబ్బంది కలవరం చెందారు. క్యాంప్ కార్యాలయంలో ఉన్న వాళ్లంతా పరుగులు తీశారు. సమాచారం అందుకున్న కోయంబత్తూరు కమిషనర్ బాలకృష్ణన్, ఎస్పీ బద్రినారాయణన్, ఐజీ సుధాకర్ క్యాంప్ కార్యాలయానికి చేరుకున్నారు. రక్తపు మడుగులో పడిఉన్న మృతదేహాన్ని పోస్టు మార్టానికి తరలించారు.

మానసిక ఒత్తిడికి కారణం ఏమిటో...

తుపాకీతో కాల్చుకుని డీఐజీ మరణించిన సమాచారంతో డీజీపీ శంకర్‌జివ్వాల్‌తోపాటు పోలీసు యంత్రాంగమే షాక్‌కు గురైంది. శాంతి భద్రతల విభాగం అదనపు డీజీపీ అరుణ్ నేతృత్వంలోని విచారణ బృందాన్ని రంగంలోకి దించారు. ఈ బృందం కోయంబత్తూరుకు చేరుకుని విచారణ చేపట్టింది. గత కొంతకాలంగా విజయకుమార్ తీవ్ర మానసికఒత్తిడితో ఉన్నట్టు, ఆయన కౌన్సెలింగ్ తీసుకున్నట్టు తేలింది. రాత్రుల్లో నిద్రలేమి కారణంగా మాత్రలను వాడుతూ వచ్చినట్టు గుర్తించారు. గురువారం ఐజీ సుధాకర్, ఎస్పీ బద్రినారాయణన్‌తో కూడా విజయకుమార్ మాట్లాడినట్టు, ఓ సిబ్బంది కుమార్తె బర్త్‌డే వేడుకకు వెళ్లి వచ్చినట్టు తెలిసింది. ఈ బర్త్‌డేలో ఆయన మౌనంగా కనిపించినట్టు సహచర సిబ్బంది సమాచారం ఇచ్చారు. అయితే, ఈ మానసికఒత్తిడి పనిభారంతో మాత్రం కాదన్నది విచారణలో వెలుగు చూసింది. ఇక, తన సామాజిక మాధ్యమంలో చివరగా ఓ వీడియోను పోస్టు చేసి ఉండడం వెలుగు చూసింది. ఇందులో ఈ ప్రపంచం ఓ మాయ.. కోల్పోయేందుకు ఏమీ లేదన్న ఆధ్యాత్మిక వచనాలు చేసి ఉండడం గమనార్హం. అలాగే, విజయకుమార్ సతీమణి గీతావాణిని కమిషనర్ బాలకృష్ణన్ విచారించి, వివరాలను సేకరించారు. రెండేళ్లుగా ఆయన తీవ్ర మానసిక ఒత్తిడిలో ఉన్నారని, వైద్యుల వద్ద చికిత్స కూడా తీసుకుంటూ, కౌన్సెలింగ్‌కు వెళ్తున్నారని ఆయన భద్రతా సిబ్బంది పేర్కొంటున్నారు. అయితే, విజయకుమార్ ఆత్మహత్య చేసుకోవాల్సిన పరిస్థితికి దారితీసిన ఆ మానసిక ఒత్తిడి కారణాలు ఏమిటో అంతుచిక్కడం లేదు. ఇదే అంశాన్ని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళనిస్వామి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై, పలు పార్టీల నేతలు ప్రస్తావిస్తూ సమగ్ర విచారణ జరగాలని పట్టుబట్టారు. ఏడీజీపీ అరుణ్ మీడియాతో మాట్లాడుతూ విజయకుమార్ పనిభారంతో బలన్మరణానికి పాల్పడ లేదని, మానసిక ఒత్తిడికి లోనయ్యారని, దీనిని రాజకీయం చేయొద్దని అని విజ్ఞప్తి చేశారు.



భౌతికకాయాన్ని స్వగ్రామానికి తరలిస్తున్న దృశ్యం

టీఎన్‌పీఎస్సీ టూ యూపీఎస్సీ..

తేని జిల్లా బోడి నాయకనూరు సమీపంలోని అనైకారపట్టి గ్రామానికి చెందిన రిటైర్డ్ వీఏఓ చెల్లయ్య, రిటైర్డ్ టీచర్ రాజాత్తిల కుమారుడు విజయకుమార్. 2003లో టీఎన్‌పీఎస్సీ ద్వారా గ్రూప్–1 ఉత్తీర్ణత సాధించి డీఎస్పీ పదవి దక్కించుకున్నారు. ఆ సమయంలోనే ఆయనకు వివాహం జరిగింది. ఐపీఎస్ కావాలన్న లక్ష్యంతో యూపీఎస్సీ పరీక్ష రాసి కలను సాకారం చేసుకున్నారు. 2009 ఐపీఎస్ బ్యాచ్ అధికారిగా తమిళనాడులోని కడలూరు, కాంచీపురం, తిరువారూర్ జిల్లాల్లో ఎస్పీగా పనిచేశారు. విధి నిర్వహణలో నిజాయితీతో పాటు సహచర, కింది స్థాయి సిబ్బందితో ఎంతో సన్నిహితంగా ఉండేవారు. చెన్నై అన్నానగర్ డీసీపీగా కూడా పనిచేశారు. ఇటీవలనే డీఐజీగా పదోన్నతి పొందిన ఆయన కోయంబత్తూరుకు వెళ్లారు. తన కుమార్తెను కూడా ఐపీఎస్ చేయాలన్న కాంక్షతో ఉన్న విజయకుమార్‌ను మానసికఒత్తిడి బలి కొనడం సహచరులు జీర్ణించుకోలేకున్నారు.



తేనిలో విజయకుమార్ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న డీజీపీ శంకర్ జివ్వాల్

అధికార లాంఛనాలతో అంత్యక్రియలు..

విజయకుమార్ బలన్మరణ సమాచారంతో రాష్ట్ర గవర్నరన్ ఆర్‌ఎన్ రవి, సీఎం స్టాలిన్ దిగ్భ్రాంతికి లోనయ్యారు. ఆయన కుటుంబానికి సానుభూతి తెలియజేశారు. ఆయన భౌతికకాయాన్ని పోస్టుమార్టం అనంతరం స్వస్థలం తేని జిల్లా బోడి నాయకనూరు సమీపంలోని అనైకారపట్టి గ్రామానికి తీసుకెళ్లారు. మంత్రి ఐ పెరియస్వామి, డీజీపీ శంకర్ జివ్వాల్‌తో పాటు పోలీసు బాసులు, అధికారులు నివాళులర్పించారు. విజయకుమార్ కుటుంబాన్ని ఓదార్చారు. ఆయన భౌతిక కాయాన్ని డీజీపీతో సహా పోలీసు అధికారులు మోశారు. విజయకుమార్ పార్థివదేహానికి అధికార లాంఛనాలతో సాయంత్రం అంత్యక్రియలు జరిగాయి.



విజయకుమార్ మృతదేహానికి కుటుంబసభ్యులు, పోలీసు అధికారుల నివాళులు

కొత్త జంటలకు వివాహాలు





కల్యాణమస్తు!

- దేవదాయ శాఖ నేతృత్వంలో 34 జంటలకు వివాహం
- రాజా అన్నామలైపురంలో వేడుక
- పుట్టే పిల్లలకు తమిళ పేర్లు పెట్టాలని సీఎం స్టాలిన్ పిలుపు

సాక్షి, చెన్నై: దేవదాయ శాఖ నేతృత్వంలో శుక్రవారం చెన్నై రాజాఅన్నామలై పురంలో కల్యాణ వేడుక జరిగింది. 34 జంటలకు వివాహాలు జరిగాయి. కొత్త కాపురానికి అవసరమయ్యే అన్ని రకాల వస్తువులతో ప్రత్యేక సారెను అందజేశారు. ఇక్కడ వివాహం చేసుకున్న జంటలకు తమకు పుట్టబోయే పిల్లలకు అందమైన తమిళ పేర్లు పెట్టాలని సీఎం స్టాలిన్ పిలుపునిచ్చారు. రాష్ట్ర హిందూ, ధర్మాదాయ శాఖ నేతృత్వంలో ఇటీవల కాలంగా వివాహ వేడుకలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ప్రస్తుతం 34 జంటలకు బ్రహ్మాండ వేదికగా కల్యాణం ఘనంగా జరిగింది. సీఎం ఎంకే స్టాలిన్, మంత్రులు పీకే శేఖర్ బాబు, పొన్ముడి, ఎం సుబ్రమణియన్, సెంజి మస్తాన్, మేయర్ ప్రియ, ఎంపీలు తమిళచ్చి తంగ పాండియన్, కనిమొళి, సోము, ఎమ్మెల్యేలు, అధికారులు, కొత్త జంటల కుటుంబసభ్యులు ఈ వేడుకకు తరలివచ్చారు. వధూవరులను సీఎం స్టాలిన్ ఆశీర్వదించారు. దేవదాయశాఖ తరఫున సారెను అందజేశారు.

లక్ష్యం దిశగా పయనం..

ఈ వేడుకలో సీఎం స్టాలిన్ ప్రసంగిస్తూ, విద్య, వర్తకం, ఆర్థిక వ్యవస్థ బలోపేతం, సామాజిక న్యాయంలో లక్ష్యం దిశగా ద్రావిడ మోడల్ పాలన రాష్ట్రంలో సాగుతోందన్నారు. అన్ని రంగాలలో తమిళనాడును ఉన్నత స్థానంలో నిలబెట్టాలన్న కాంక్షతో ప్రభుత్వం చర్యలు విస్తృతం చేసిందన్నారు. అయితే, వీటికి అడ్డుకట్ట వేయడానికి రాష్ట్రంలో అనేక దుష్ట శక్తులు ప్రయత్నాలు చేస్తున్నాయని ధ్వజమెత్తారు. అన్ని కులాలకు చెందిన ఎవరైనా సరే అర్చకత్వంలోకి రావచ్చని, ఆలయా ల్లో పూజారులుగా పనిచేయవచ్చు అని గతంలో డీఎంకే ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టాన్ని ప్రస్తుతం ఇతర రాష్ట్రాలు అనుసరించేపనిలో పడ్డాయని వివరించారు. రాష్ట్రంలోని దేవాలయాల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని గుర్తు చేశారు. గత వైభవాన్ని ఆలయాలు సంతరించుకునే విధంగా, హిందూ మత ధార్మిక రంగంలో స్వర్ణయుగం తీసుకొచ్చే రీతిలో తమ పయనం ఉందన్నారు. ఆలయాల అభివృద్ధితో పాటు భక్తులకు మెరుగైన సౌకర్యాల దిశగా ప్రత్యేక పథకాలను అమలు చేస్తున్నామని వివరించారు. ఇటీవల వెయ్యేళ్లు పూర్తయిన 112 ఆలయాలను రూ.100 కోట్లతో నిర్మాణాలు చెక్కు చెదరకుండా మరమ్మతులు చేశామన్నారు. మరో 5,078 ఆలయాల పునరుద్ధరణ, జీర్ణోద్ధరణ పనులకు చర్యలు తీసుకున్నామని వివరించారు. పేదవారి చిరునవ్వులో భగవంతుడిని చూడాలన్న కాంక్షతో దేవదాయ శాఖ తరఫున పేద జంటలకు వివాహ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ శాఖ నేతృత్వంలో ధార్మిక పనులు మరింత విస్తృతం చేయనున్నామని చెప్పారు. ఇక్కడున్న వధూవరులు తమకు పుట్టే పిల్లలకు దయచేసి అందమైన తమిళ పేర్లు పెట్టాలని, ఆ పిల్లల్లో తమిళ స్ఫూర్తిని నింపాలని, సంసార జీవితాన్ని అందంగా మలచుకోవాలని పిలుపు నిచ్చారు.



కొత్తజంటకు అందించిన సారెతో సీఎం స్టాలిన్

చెన్నైలో పురుషుల హాకీ చాంపియన్‌షిప్

- నిర్వహణకు రూ.12 కోట్ల కేటాయింపు
- ఉన్నతాధికారులతో క్రీడాశాఖమంత్రి ఉదయనిధి స్టాలిన్ సమీక్ష

కొరుక్కుపేట: పదిహేనేళ్ల తర్వాత మళ్లీ ఆసియా పురుషుల హాకీ చాంపియన్‌షిప్‌ను చెన్నైలో నిర్వహించనున్నట్లు రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి ఉదయనిధి స్టాలిన్ అన్నారు. ఆసియా పురుషుల హాకీ చాంపియన్‌షిప్ 2023 ఆగస్టు 3వ తేదీ నుంచి 13వ తేదీ వరకు చెన్నైలోని మేయర్ రాధాకృష్ణన్ హాకీ స్టేడియంలో జరగనుంది. ఇందులో భారత్, చైనా, పాకిస్తాన్, మలేషియా, జపాన్, కొరియా మొత్తం ఆరు దేశాలు పాల్గొంటాయి. తమిళనాడు స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ అథారిటీ ప్రైమరీ హాకీ కోసం సింథటిక్ ఫైబర్ పిచ్, ఆటగాళ్ల శిక్షణ, కనెక్షన్ పనుల కోసం రూ.16 కోట్లు ఖర్చు చేస్తోంది. ప్రేక్షకులు కూర్చునేందుకు ప్రత్యేక సీట్లు ఏర్పాటు చేశారు. బేస్మెంట్, క్రీడాకారుల గదులు, విద్యుత్ సౌకర్యం, ఆధునిక మరుగుదొడ్లు, పునరుద్ధరణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ పోటీల నిర్వహణపై మంత్రి ఉదయనిధి స్టాలిన్ సీనియర్ ప్రభుత్వ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ టోర్నీలో పాల్గొనేందుకు వచ్చే అంతర్జాతీయ హాకీ ఆటగాళ్లు బస చేసే స్టార్ హోటళ్లు, ఆహారం, రవాణా, భద్రతా ఏర్పాట్లపై చర్చించారు. అనంతరం సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో పోటీల నిర్వహణ కోసం రూ.12 కోట్ల చెక్కును హాకీ ఇండియా సెక్రటరీ జనరల్ పోలనాథ్ సింగ్‌కు అందజేశారు.

కుటుంబంలో ఒకరికే రూ.1000



అధికారులతో సీఎం స్టాలిన్ సమావేశం



- అర్హులైన వారందరికీ వర్తింపు
- రేషన్ కార్డుల్లో కుటుంబ పెద్దగా మహిళ
- సీఎం స్టాలిన్

సాక్షి, చెన్నై: ఎన్నికల హామీగా గృహిణులకు రూ.1000 నగదు పంపిణీ పథకం కలైంజ్ఞర్ మగలిర్ ఉరిమై తొగై (కలైంజర్ మహిళా హక్కు మొత్తం) అమలుకు మార్గదర్శకాలు విడుదలయ్యాయి. అర్హులైన వారందరికీ ఈ పథకం వర్తింపచేయాలని సీఎం స్టాలిన్ శుక్రవారం ఆదేశించారు. సాయంత్రం సచివాలయంలో ఈ పథకం అమలుకు లబ్ధిదారుల ఎంపిక అంశాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం సమావేశమయ్యారు. రాష్ట్ర స్థాయి అధికారులు, సీఎస్ శివదాస్ మీనా, మంత్రులు ఉదయనిధి స్టాలిన్ హాజరయ్యారు. తమిళనాడు ప్రభుత్వ పరిపాలనా చరిత్రలోనే ఈ పథకం ఓ చిహ్నంగా మారబోతోందని ఈసందర్భంగా సీఎం ధీమా వ్యక్తంచేశారు. ఈ పథకానికి కలైంజ్ఞర్ పేరు పెట్టడం సంతోషంగా ఉందన్నారు. కోటి మంది మహిళలకు నెలకు రూ.1000 నగదు పంపిణీ చేస్తామని తెలిపారు. కలైంజ్ఞర్ 'మహిళల హక్కుల మొత్తం' దీనిని ముందుకు తీసుకెళ్తామన్నారు. ఈపథకం కోసం 2023–2024 బడ్జెట్‌లో 7 వేల కోట్ల రూపాయలు కేటాయించామన్నారు. ఈ పథకం సక్రమంగా అమలు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అర్హులైన వారికి న్యాయం చేకూర్చాలని సూచించారు. నిర్ణీత గడువులోపు అర్హులను ఎంపికచేయాలని ఆదేశించారు. ఈ పథకానికి సంబంధించి మార్గదర్శకాలను సక్రమంగా అమలు చేయాలని, ప్రత్యేక శ్రద్ధ చూపించాలని ఆదేశించారు. ఈ పథకం కోసం కోటిన్నర మంది నుంచి దరఖాస్తులు వస్తాయని అంచనా వేశామన్నారు. దరఖాస్తులను చౌకదుకాణాలు, ప్రత్యేక శిబిరాల ద్వారా స్వీకరించాలని సూచించారు. దరఖాస్తుల స్వీకరణలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భద్రతను పోలీసు యంత్రాంగం కల్పించాలన్నారు. ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందేందుకు దరఖాస్తులు చేసుకుంటున్న వారి నుంచి రేషన్, ఆధార్ కార్డు వివరాలను సేకరించాలన్నారు. అర్హులైన వారి వద్ద వివరాలు లేకుంటే పరిశీలించి న్యాయం చేయాలన్నారు. అలాగే రేషన్ కార్డు కలిగిన ఓ కుటుంబంలో ఒక మహిళకు మాత్రమే ఈ నగదు పంపిణీ జరుగుతుందన్నారు. అలాగే, ఈ పథకానికి సంబంధించిన మార్గదర్శకాలను విడుదల చేశారు. ఈ పథకం కింద ఎంపికయ్యే మహిళలు ఇక, కుటుంబ పెద్దలుగా ఉంటారని ప్రకటించారు.

కాంట్రాక్ట్ పద్ధతిలో డ్రైవర్ల నియామకం

- కార్మిక సంఘాల అసంతృప్తి

కొరుక్కుపేట: చెన్నై ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ 500 మంది డ్రైవర్లను కాంట్రాక్టు పద్ధతిలో నియమించడంపై కార్మిక సంఘాలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. రవాణా సంస్థ తరఫున 3,233 బస్సులు నడుస్తున్నాయి. రోజుకు 32 లక్షల మంది ప్రయాణిస్తున్నారు. కరోనా తర్వాత ప్రయాణికుల సంఖ్య ఇప్పుడు మునుపటి స్థాయికి చేరుకుంది. ఉచిత బస్సు ప్రయాణానికి 1,559 బస్సులను విడుదల చేయగా, ఈ బస్సుల్లో ప్రయాణించే మహిళల సంఖ్య క్రమంగా పెరుగుతూ వచ్చింది. గత నెల వరకు రోజుకు 10 లక్షల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించగా ఇప్పుడు 11.5 లక్షలకు చేరుకున్నారు.ఈ క్రమంలో రెండు రోజుల క్రితం ఈ బస్సు సర్వీసులో డ్రైవర్ల కొరత సమస్యను తాత్కాలికంగా పరిష్కరించారు. ఒకవైపు ప్రయాణికుల సంఖ్య పెరిగినా, డ్రైవర్లు బస్సులు నడపలేని పరిస్థితి నెలకొంది. ఈ పనులకు 500 మంది డ్రైవర్లకు ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ ప్రభుత్వ అనుమతి కోరగా, కాంట్రాక్ట్ పద్ధతిలో డ్రైవర్లను నియమించేందుకు టెండర్ పిలిచింది. దీని ప్రకారం టెండర్ కేటాయించి 500 మంది డ్రైవర్లను తీసుకున్నారు. కాగా కార్మిక సంఘాలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి.

కేంద్ర మంత్రి ఆర్థిక సమీక్ష



సమావేశంలో కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్, ముఖ్యమంత్రి రంగస్వామి

- కేంద్ర మంత్రితో రంగన్న భేటీ

సాక్షి, చెన్నై: కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ శుక్రవారం కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరిలో పర్యటించారు. ఈసందర్భంగా ఆమెను కలిసిన ఆ రాష్ట్ర సీఎం రంగస్వామి ఆర్థిక పరిస్థితులను వివరించారు. నిధులు సమృద్ధిగా పథకాలకు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఢిల్లీ నుంచి ఉదయం చెన్నైకు వచ్చిన ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ రోడ్డు మార్గంలో పుదుచ్చేరి వెళ్లారు. రాజ్ నివాస్‌లో ఆమెకు గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, సీఎం రంగస్వామి, స్పీకర్ సెల్వం, మంత్రులు నమశ్శివాయం, లక్ష్మీనారాయణ, తేని జయకుమార్, చంద్రప్రియాంక, సీఎస్ రాజీవ్‌వర్మ స్వాగతం పలికారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటల నుంచి సచివాలయంలో అధికారులతో నిర్మలా సీతారామన్ సమావేశమయ్యారు. సీఎంతో పాటు అన్ని శాఖల అధికారులు, మంత్రులు హాజరయ్యారు. పుదుచ్చేరి ఆర్థిక పరిస్థితి, సమస్యలు, వనరులు, భవిష్యత్తులో చేపట్టాల్సిన కార్యక్రమాలు, నిధుల కేటాయింపుల అంశాల గురించి చర్చించారు. అధికారుల అభిప్రాయాలను తీసుకున్నారు. ఈసందర్భంగా నిర్మలా సీతారామన్‌కు తమ సమస్యలను సీఎం రంగస్వామి ఏకరువు పెట్టారు. పథకాల అమలుకు సమృద్ధిగా నిధులు కేటాయించాలని ఆయన కోరారు.

క్లుప్తంగా

డీఎంకే ట్రేడర్స్ టీమ్ నియామకం

• కార్యదర్శి కాశీ ముత్తుమాణిక్యం ప్రకటన



కాశీ ముత్తుమాణిక్యం

కొరుక్కుపేట: డీఎంకే ట్రేడర్స్ టీమ్ జిల్లా ఆర్గనైజర్, డిప్యూటీ ఆర్గనైజర్లను నియమిస్తున్నట్లు డీఎంకే ట్రేడర్స్ టీమ్ కార్యదర్శి కాశీ ముత్తుమాణిక్యం ప్రకటించారు. చెన్నై ఉత్తర జిల్లా ప్రెసిడెంట్‌గా బాబు, వైస్ ప్రెసిడెంట్‌గా సురేష్ రఘు, ఆర్గనైజర్‌గా త్యాగరాజన్, డిప్యూటీ ఆర్గనైజర్లుగా సుబ్రమణియన్, తమిళసెల్వన్, ప్రేమ్‌కుమార్, కార్తీక్, హరిరామన్, పళని, పాస్‌రాజ్, మణికంతన్, అశోక్, మణికందన్, దురైరాజ్, దినేష్‌కుమార్‌లను నియమించారు. అదేవిధంగా కాంచీపురం దక్షిణ జిల్లా అధ్యక్షుడిగా షణ్ముగసుందరం, ఉపాధ్యక్షుడిగా దినేష్ బాబు ఉన్నారు. ఆర్గనైజర్‌గా దినకరన్, డిప్యూటీ ఆర్గనైజర్లుగా రాజేంది రన్, పళని, థాని కసలం, తరుమన్, రాజా, సురేష్, జైశంకర్ నియమితులయ్యారు. అదేవిధంగా కాంచీపురం సిటీ ఆర్గనైజర్‌గా రవిచంద్రన్, వైస్ ఆర్గనైజర్లుగా కరుణానిధి, శ్రీనివాసన్, రాజా, బాలామురుగన్, శ్రీనివాసన్, భూపతి, మూర్తి, రాజు శరవణన్ నియమించినట్టు కాశీ ముత్తమాణిక్యం వెల్లడించారు.

ఆక్రమణల తొలగింపు

కొరుక్కుపేట: పల్లావరం సమీపంలోని అనకాపుత్తూరు బస్టాండ్ సమీపంలో అడయార్ నది ఒడ్డున ఆక్రమణలకు గురైన ఇళ్లు, దుకాణాలను రెవెన్యూ అధికారులు శుక్రవారం జేసీపీ యంత్రాలతో తొలగించారు. ఈ విషయం తెలుసుకున్న ఆ ప్రాంతంలో నివసిస్తున్న 100 మందికి పైగా చేరుకుని నిరసన వ్యక్తం చేశారు. ఆక్రమణల తొలగింపును తీవ్రంగా వ్యతిరేకించారు. అయితే, అడయార్ నది దాని ఒడ్డు నుంచి ఆక్రమణలు తొలగించారు. ఈ క్రమంలో భారీ సంఖ్యలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. 50 మందికి పైగా మహిళలు దీదీరేనా రోడ్డుపై బైటాయించి నిరసన ప్రారంభించారు. మరికొందరు తమ ఇళ్లు, దుకాణాల నుంచి సరుకులు తీసుకెళ్లేందుకు సమయం కావాలని రెవెన్యూ అధికారులను కోరారు. దీంతో ఆక్రమణల తొలగింపు పనులు నిలిచిపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం గంట తర్వాత ఆక్రమణల పనులు చేపట్టారు. అదేవిధంగా ఇక్కడ అడయార్ నది ఒడ్డున ఉన్న ఆక్రమణలను కొన్నేళ్ల క్రితం అధికారులు తొలగించారు. గత ఏడాది చెన్నై శివారులో విస్తారంగా వర్షాలు కురిసినప్పుడు అనకాపుత్తూరు ప్రాంతంలో ఒక్క చుక్క వర్షను నీరు కూడా నిలవకపోగా, అడయార్ నది ద్వారా సముద్రంలోకి వర్షపు నీరు కలిసిన విషయం తెలిసిందే.

ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి



విద్యార్థులకు దిక్సూచీని అందజేస్తున్న ఎమ్మెల్యేలు, కలెక్టర్

తిరువళ్లూరు: లక్ష్య సాధనలో ఎదురయ్యే చిన్నచిన్న సమస్యలకు కుంగిపోకుండా ఆత్మవిశ్వాశంతో ముందుకు సాగాలని ఎమ్మెల్యే వీజీ రాజేంద్రన్ సూచించారు. 2022–23వ సంవత్సరంలో ప్లస్‌టూ పరిక్షల్లో ఉత్తీర్ణత సాధించి ఉన్నత చదువులకు దరఖాస్తు చేసుకోని వారిని గుర్తించి వారి సమస్యల పరిష్కరించడంతో పాటు ఉన్నత విద్యను కొనసాగించేలా చర్యలు తీసుకోవడానికి ప్రతి జిల్లాలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం కలెక్టర్‌లకు సూచించింది. ఇందులో భాగంగానే తిరువళ్లూరు జిల్లా పాండూర్‌లోని ఇందిర మెడికల్ కళాశాల ఆవరణలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యేలు కృష్ణస్వామి, వీజీ రాజేంద్రన్ కలెక్టర్ ఆల్బీ జాన్‌వర్గీష్ హాజరయ్యారు. అనంతరం ఎమ్మెల్యే వీజీ రాజేంద్రన్ ఉన్నత విద్యకు కుటుంబ ఆర్థిక ఇబ్బందులు ఉండొచ్చు, వాటిని చూసి కుంగిపోకుండా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలన్నారు. సీఈఓ సరస్వతి, ఆర్డీఓ బొలిన్ జయరాజ్, డీఈఓ తేన్‌మొళి పాల్గొన్నారు.

రూ.33 కోట్ల బస్టాండ్ నిర్మాణానికి భూమి పూజ.. పట్టణంలో రూ.33 కోట్లతో నిర్మించనున్న నూతన బస్టాండు నిర్మాణ పనులకు కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్, ఎమ్మెల్యే వీజీ రాజేంద్రన్ శుక్రవారం భూమి పూజ వేశారు. నూతన బస్టాండు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.33 కోట్ల నిధులు, వేడంగినల్లూరు ప్రాంతంలోని ఐదు ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించింది. పనులను నాణ్యతగా నిర్మించడంతో పాటు ఏడాదిలోపు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని కలెక్టర్ తెలిపారు.

వర్షాలు రాకముందే పూర్తిచేయండి



పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ భాస్కర పాండియన్

వేలూరు: వర్షాలు రాక ముందే నీటి కుంటల ఏర్పాటు చేయడాన్ని పూర్తిచేయాలని కలెక్టర్ భాస్కర పాండియన్ తెలిపారు. తిరుపత్తూరు జిల్లా కందిలి యూనియన్ పరిధిలోని వీసమంగళం గ్రామంలో వర్షపు నీటిని పాదుపు చేసేందుకు నీటి కుంటలు ఏర్పాటు చేసే పనులు జరుగుతున్నాయి. ఈ పనులను కలెక్టర్ తనఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో వర్షాలు వచ్చే అవకాశం ఉన్నందున పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలన్నారు. వర్షపు నీరు వృథా కాకుండా నీటిని నిల్వ చేయడం ద్వారా గ్రామంలో తాగునీటి సమస్య ఉండదని ఇదే తరహాలో వ్యవసాయ భూముల్లోనూ నీటి కుంటలను ఏర్పాటు చేసి నీటిని నిల్వ చేయాలన్నారు. అనంతరం పనుల నాణ్యత వివరాలను అడిగి తెలుసుకున్నారు. డీఆర్‌ఒ వలర్‌మది, సబ్ కలెక్టర్ భాను, తహసీల్దార్ శివప్రకాశం పాల్గొన్నారు.

క్వారీ ఏర్పాటుపై వ్యతిరేకత

• తహసీల్దార్ సమక్షంలో పీస్ కమిటీ



పీస్ కమిటీ సమావేశం

తిరుత్తణి: తెల్లరాళ్ల క్వారీకి గ్రామీణులు వ్యతిరేకత తెలపడంతో నిర్వహించిన పీస్ కమిటీలో సమస్య కొలిక్కి రాకపోవడంతో శుక్రవారం సమావేశం వాయిదా పడింది. తిరుత్తణి యూనియన్ టీసీ కండ్రిగలో టాటా సంస్థ ద్వారా తెల్లరాళ్ల క్వారీకి ప్రభుత్వం అనుమతించడంతో పాటు కాలుష్యని యంత్రణ మండలి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో నాలుగు నెలలుగా క్వారీ ఏర్పాటుకు సంబంధించి పనులు జరుగుతున్నాయి. అయితే క్వారీ ఏర్పడితే చుట్టు పక్కల గ్రామస్తులకు ఆరోగ్యసమస్యలు తలెత్తడంతో పాటు తాగునీటి సమస్యలు ఏర్పడుతాయని పంట వ్యవసాయ భూములు బీడు భూములుగా మారుతాయని ఆరోపిస్తూ రైతులు నిరసన తెలుపుతున్నారు. ఈ క్రమంలో తిరుత్తణి తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మదన్ ఆధ్వర్యంలో గ్రామీణులు, క్వారీ నిర్వాహకులు సమావేశం నిర్వహించారు. సీఐ మార్టిన్ ప్రేమ్‌రాజ్ సమక్షంలో చేపట్టిన పీస్ కమిటీలో గ్రామీణుల తరఫున సర్పంచ్ వెంకటేశులు, టాటా క్వారీ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామీణులు, క్వారీ నిర్వాహకులు తమ వాదనలు వినిపించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ క్వారీని అనుమతించబోమని, అదే సమయంలో క్వారీ మూసే ప్రసక్తే లేదని నిర్వాహకులు తేల్చి చెప్పడంతో అధికారులు చేసేదేమీ లేక పీస్ కమిటీ వాయిదా వేస్తున్నట్లు తహసీల్దార్ మదన్ తెలిపారు.

నిందితుల కోసం పటిష్ట బందోబస్తు



కోర్టు ఆవరణలో బందోబస్తులో ఉన్న పోలీసులు

వేలూరు: చెంగల్‌పట్టు కోర్టు కేసులో హాజరయ్యేందుకు వచ్చిన రౌడీని గుర్తు తెలియని వ్యక్తులు నాటు బాంబులు వేసి హత్య చేశారు. ఈ కేసులో నిందితులు వేలూరు సత్‌వచ్చారి కోర్టులో లొంగిపోతున్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. నిందితులు లొంగిపోతున్న సమయంలో శత్రువులు వారిని హత్యచేసే అవకాశం ఉంది. దీంతో ముందస్తు జాగ్రత్తగా శుక్రవారం ఉదయం సత్‌వచ్చారిలోని కోర్టు ఆవరణలో పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

రూ.10 కోట్ల మెరిట్ స్కాలర్‌షిప్ పంపిణీ



మెరిట్ స్కాలర్‌షిప్ అందుకున్న విద్యార్థులతో వేలమ్మాల్ విద్యా సంస్థల నిర్వాహకులు

తిరువళ్లూరు: వేలమ్మాల్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో 1,200 మంది విద్యార్థులకు రూ.10 కోట్ల స్కాలర్‌షిప్‌ను సంస్థ నిర్వాహకులు శుక్రవారం అందజేశారు. తిరువళ్లూరు జిల్లా పొన్నేరి వేలమ్మాల్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో నాలెడ్జ్ పార్క్‌ను ఏర్పాటు చేసి ప్రతి సంవత్సరం విద్యలో ప్రతిభను కనబరిచిన వారికి మెరిట్ స్కాలర్‌షిప్‌లను అందజేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే 2023 సంవత్సరానికిగాను రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిభ కలిగిన 1,200 మంది విద్యార్థులను గుర్తించి వారికి రూ.10 కోట్ల మెరిట్ స్కాలర్‌షిప్‌లను అందజేసే కార్యక్రమం శుక్రవారం ఉదయం నిర్వహించారు. పొన్నేరిలో జరిగిన కార్యక్రమానికి సంస్థ ఎడ్యుకేషన్ కమిటీ డైరెక్టర్ శశికుమార్ అధ్యక్షత వహించగా, ఎడ్యుకేషన్ బోర్డు డైరెక్టర్ గీతాంజలి ప్రారంభోపన్యాసం చేశారు. శశికుమార్ మాట్లాడుతూ ఎలాంటి రాజకీయ నేపథ్యం లేకుండా వేళమ్మాల్ విద్యాసంస్థలను ఏర్పాటు చేసి అత్యుత్తమ సంస్థగా తీర్చిదిద్దారని వ్యాఖ్యానించారు. ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించి వారి కలను సాకారం చేయడానికి మెరిట్ స్కాలర్‌షిప్‌లను అందజేస్తున్నామని, ప్రతిభావంతులైన విద్యార్థులకు తమ సంస్థ తోడుగా ఉంటుందని హామీ ఇచ్చారు. భవిష్యత్తులోనూ ప్రతిభ ఉన్న విద్యార్థులకు అండగా ఉంటామన్నారు. కాగా మెరిట్ స్కాలర్‌షిప్‌లు అందుకున్న విద్యార్థులు, తల్లిదండ్రులు వేళమ్మాల్ విద్యాసంస్థల వ్యవస్థాపకుడు ముత్తురామలింగంకు కృతజ్ఞతలు తెలిపారు.

వేలూరులో కాంగ్రెస్ శ్రేణుల రాస్తారోకో



వేలూరు : రాస్తారోకో చేస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు

వేలూరు: కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీకి గుజరాత్ కోర్టు రెండేళ్లు శిక్ష విధిస్తూ తీర్పును ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ కేసులో రాహుల్‌గాంధీ మరో పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసును కోర్టు కొట్టివేసింది. దీనిని ఖండిస్తూ కాంగ్రెస్ శ్రేణులు వేలూరు జిల్లా అధ్యక్షుడు టీకా రామన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం వేలూరు అన్నారోడ్డులో రాస్తారోకో చేశారు. దీంతో ట్రాఫిక్ స్తంభించడంతో పోలీసులు కార్యకర్తలను అరెస్ట్ చేసి ప్రైవేట్ కల్యాణ మండపానికి తరలించారు. రాస్తారోకోలో ఆ పార్టీ ఎస్సీ, ఎస్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిత్తరంజన్, మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షుడు వాహిద్‌బాషా, డివిజన్ కార్యదర్శులు రఘు, మనోహరన్, అశోక్‌కుమార్, మహ్మద్ అలీ జిన్నా పాల్గొన్నారు.

పళ్లిపట్టులో కాంగ్రెస్ నేతల ధర్నా

పళ్లిపట్టు: కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీపై పరువునష్టం కేసును గుజరాత్ హైకోర్టు స్టేకు నిరాకరించడంతో పళ్లిపట్టులో ఆ పార్టీ నాయకులు శుక్రవారం ధర్నా చేశారు. దొంగలందరి ఇంటి పేరు మోదీయే అంటూ రాహుల్ గాంధీ వ్యాఖ్యానించిన కేసులో సూరత్ ట్రయల్ కోర్టు రెండేళ్ల జైలు శిక్ష విధించిన విషయం తెలిసిందే. ఈ కేసులో స్టే కోరుతూ గుజరాత్ హై కోర్టును ఆశ్రయించగా కోర్టు నిరాకరించింది. దీంతో పలు ప్రాంతాల్లో కాంగ్రెస్ నాయకులు ఆందోళన చేశారు. పళ్లిపట్టులో కాంగ్రెస్ టౌన్ కమిటీ అధ్యక్షుడు శివకుమార్ అధ్యక్షతన స్థానిక గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. కోర్టులు బీజేపీ కనుసన్నల్లో నడుస్తున్నాయని విమర్శించారు.



పళ్లిపట్టులో..

శ్రీదేవి వారసురాలు వచ్చేస్తోంది!



జాన్వీకపూర్

తమిళసినిమా: నటి శ్రీదేవి ఈ పేరే అందానికి బ్రాండ్ అంబాసిడర్. తమిళనాడు బాలనటిగా తెరంగేట్రం చేసిన ఈమె ఆ తర్వాత కథానాయకిగా అవతారం ఎత్తారు. అలా తమిళం, తెలుగు, హిందీ భాషల్లో ప్రముఖ నటుల సరసన నటించి ఇండియన్ సినీ చరిత్రలో తన పేరును చిరస్థాయిగా నిలిచిపోయేలా చేసుకున్నారు. ఆమె జీవితం కథానాయకిగానే ముగిసింది. ఇక శ్రీదేవి వారసురాలిగా రంగప్రవేశం చేస్తున్న పెద్ద కూతురు జాన్వీ కపూర్ బాలీవుడ్లో క్రేజీ కథానాయకిగా రాణిస్తోంది. నటన కంటే తన అందాలతో సోషల్ మీడియాను ఊపేస్తున్న జాన్వీకపూర్‌పై దక్షిణాది సినిమా చూపు చాలా కాలం క్రితమే పడింది. పలువురు ప్రముఖ దర్శక, నిర్మాతలు తమ చిత్రాల ద్వారా పరిచయం చేయడానికి చాలా ప్రయత్నాలు చేశారు. ఆమెకు దక్షిణ చిత్రాల్లో నటించాలన్న కోరిక ఉన్నా సరైన అవకాశం కోసం ఎదురుచూస్తూ వచ్చింది. అలా ఇటీవలే తెలుగులో జూనియర్ ఎన్టీఆర్ సరసన దేవర చిత్రంలో నటించడానికి అంగీకరించింది. కొరటాల శివ దర్శకత్వంలో ఈ చిత్ర షూటింగ్ శరవేగంగా జరుపుకుంటోంది. కాగా జాన్వీకపూర్ దక్షిణాదిలో తన రెండవ చిత్రాన్ని కోలీవుడ్లో చేయబోతున్నారని తాజా సమాచారం. కోలీవుడ్లో కమలహాసన్, శ్రీదేవిలది సూపర్ హిట్ కాంబో. కాగా శ్రీదేవి వారసురాలు జాన్వీకపూర్‌ను కమలహాసన్ కోలీవుడ్లో పరిచయం చేసే ప్రయత్నంలో ఉన్నట్టు తెలిసింది. ఇటీవల విక్రమ్ చిత్రంతో బంపర్ హిట్ కొట్టిన ఆయన ప్రస్తుతం తన 233వ చిత్రంలో నటించడానికి సిద్ధమవుతున్నారు. హెచ్ వినోద్ దర్శకత్వం వహించనున్న ఈ చిత్రం ప్రీ ప్రొడక్షన్స్ కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. కాగా మరోపక్క ఆయన వరుసగా చిత్రాలు నిర్మిస్తున్నారు. నటుడు శింబు హీరోగా ఒక చిత్రం, శివకార్తికేయన్‌తో మరో చిత్రం చేస్తున్న కమలహాసన్, ఇటీవల చిన్నచిత్రంగా విడుదలై సంచలన విజయాన్ని సాధించిన లవ్ టుడే చిత్ర దర్శకుడు, కథానాయకుడు ప్రదీప్ రంగనాథం హీరోగా, నయనతార భర్త విఘ్నేశ్ శివన్ దర్శకత్వంలో మరో చిత్రాన్ని నిర్మించడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రంలోనే నటి జాన్వీకపూర్‌ను కథానాయకిగా నటింపజేయడానికి చర్చలు జరుపుతున్నట్లు తెలిసింది.

గిఫ్ట్‌కు ఇళయరాజా సంగీతం



దర్శకుడు ఆల్ఫోన్స్ పుత్రన్, ఇళయరాజా

తమిళసినిమా: తన ఒక్క చిత్రంతో నటుడు నివీన్ బాలి, నటి సాయిపల్లవి, మడోనా సెబాస్టియన్, అనుపమ పరమేశ్వరన్‌లకు మంచి సినీ జీవితం ఇచ్చిన దర్శకుడు ఆల్ఫోన్స్ పుత్రన్. ఈ దర్శకుడు 2015లో తెరకెక్కించిన మలయాళ చిత్రం ప్రేమమ్. అంతకుముందు తమిళంలో నేరం అనే సక్సెస్‌ఫుల్ చిత్రాన్ని చేశారు. ప్రేమమ్ చిత్రం తరువాత చాలా గ్యాప్ తీసుకుని గత ఏడాది పృథ్వీరాజ్, నయనతార జంటగా గోల్డ్ అనే చిత్రాన్ని రూపొందించారు. అయితే ఆ చిత్రం ఆశించిన విజయాన్ని సాధించలేదు. కాగా, తాజాగా దర్శకుడు ఆల్ఫోన్స్ పుత్రన్ చిత్రానికి సిద్ధమయ్యారు. దీనికి గిఫ్ట్ అనే టైటిల్‌ను నిర్ణయించారు. దీనికి ఆయన కథ, కథనం మాటలు ఎడిటింగ్, కలర్ గ్రేడింగ్, దర్శకత్వం బాధ్యతలను నిర్వహించడం విశేషం. రోమియో పిక్చర్స్ పతాకంపై రాహుల్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో నృత్య దర్శకుడు శాండి, నటి కోవైసరళ, సహానా సర్వేశ్, నటి మహాలక్ష్మి, సంపత్‌రాజ్, రాహుల్ ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు. కాగా ఈ చిత్రానికి సంగీతజ్ఞాని ఇళయరాజా సంగీతాన్ని అందిస్తున్నారు. వైవిధ్య భరితమైన ప్రేమ కథతో తెరకెక్కిస్తున్న ఇందులో 7 పాటలు చోటుచేసుకుంటాయట. గిఫ్ట్ చిత్రం ఇప్పటికే షూటింగ్ జరుపుకుంటోందని యూనిట్ వర్గాలు తెలిపారు.

అశ్విన్స్ చిత్రానికి సీక్వెల్ ఉంటుంది



అశ్విన్స్ చిత్ర యూనిట్

తమిళసినిమా: నటుడు వసంతరవి కథానాయకుడిగా నటించిన చిత్రం అశ్విన్స్. నటి విమలరామన్, సరస్వతి మేడం, నటుడు ఉదయ దీప్, మురళీధరన్ ముఖ్యపాత్రలు పోషించిన హర్రర్ సస్పెన్స్ థ్రిల్లర్ కథా చిత్రాన్ని శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర పతాకంపై బీవీఎస్ఎన్ ప్రసాద్ సమర్పణలో బాపినీడు నిర్మించారు. నవ దర్శకుడు తరుణ్ తేజ కథ, దర్శకత్వం బాధ్యతలను నిర్వహించిన ఈ చిత్రానికి విజయ్ సిద్ధార్థ్ సంగీతాన్ని, ఏఎం అడ్విన్ ఛాయాగ్రహణం అందించారు. గత నెల 23న విడుదలైన ఈ చిత్రం విశేష ప్రేక్షకాదరణతో ప్రదర్శింపబడుతున్న సందర్భంగా చిత్ర యూనిట్ గురువారం సాయంత్రం చెన్నైలోని ప్రసాద్ ల్యాబ్‌లో థ్యాంక్స్ గివింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో పాల్గొన్న చిత్ర దర్శకుడు తరుణ్ తేజ మాట్లాడుతూ ఈ చిత్రానికి ప్రధాన బలం కంటెంట్ అన్నారు. దాన్ని ప్రజల ముందుకు తీసుకెళ్లిన మీడియాకు ధన్యవాదాలు అన్నారు. ఒక కొత్త కాన్సెప్ట్‌తో రూపొందించిన ఈ చిత్ర విజయంపై తమకు తొలి నుంచి నమ్మకం ఉందన్నారు. అయితే తమ నమ్మకాన్ని మించిన విజయాన్ని ప్రేక్షకులు అందించారన్న ఆనందాన్ని వ్యక్తం చేశారు. చిత్ర కథానాయకుడు వసంత రవి మాట్లాడుతూ ఈ చిత్ర విజయానికి అశ్వినీ దేవతలే కారణం అన్నారు. ఒక నటుడికి విజయం చాలా ముఖ్యం అన్నారు. తనలాంటి ఎదుగుతున్న నటులకు చాలా ముఖ్యం అన్నారు. తాను ఇంతకు ముందు నటించిన రాఖీ చిత్రం సమయంలో చేయడం మిస్ అయిన విషయాలను ఈ చిత్రానికి చేశామన్నారు. రాష్ట్రంలోని పలు థియేటర్లకు వెళ్లి ప్రేక్షకుల ఆదరణను చూసి వారికి ధన్యవాదాలు చెప్పామన్నారు. ఈ చిత్ర నిర్మాతలు బాపినీడు, ప్రసాద్‌లకు ధన్యవాదాలు చెప్పుకుంటున్నానన్నారు. వీళ్లు తమిళంలో మరిన్ని చిత్రాలు చేస్తారని ముందేచెప్పానన్నారు. అశ్విన్స్ చిత్రానికి సీక్వెల్ ఉంటుందని వసంతరవి చెప్పారు. ఇంత పెద్ద విజయాన్ని అందించిన అందరికీ నిర్మాత బీవీఎస్ఎన్ ప్రసాద్ ధన్యవాదాలు తెలిపారు.

కోలీవుడ్ టాక్స్

ఫ్యామిలీ చిత్రంగా తూక్కుదురై



తూక్కుదురైలో యోగిబాబు, ఇనియ

తమిళసినిమా: నటుడు యోగిబాబు, ఇనియ జంటగా నటించిన చిత్రం తూక్కుదురై. మొట్టై రాజేంద్రన్, బాలాశరవణన్, సెంద్రాయన్, మహేష్ నమోనారాయణన్ ముఖ్యపాత్రలు పోషించిన ఈ చిత్రాన్ని ఓపెన్ గేట్ పిక్చర్ పతాకంపై అరవింద్ వెల్‌లై పాండియన్, అన్బరసు గణేశన్ నిర్మిస్తున్నారు. ఇంతకుముందు ట్రిప్ వంటి సక్సెస్‌ఫుల్ చిత్రాన్ని తెరకెక్కించిన డెన్నిస్ మంజునాథ్ దర్శకత్వం వహించిన తాజా చిత్రం తూక్కుదురై. రవి వర్మ ఛాయాగ్రహణం, కే.ఎస్.మనోజ్ సంగీతాన్ని అందించిన ఈ చిత్రం షూటింగ్‌ను పూర్తిచేసుకుని ప్రస్తుతం సెన్సార్ పనులు జరుపుకుంటోంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ శుక్రవారం చెన్నైలోని మార్క్ స్టూడియోలో విలేకరులతో ముచ్చటించారు. దర్శకుడు మాట్లాడుతూ తాను తొలి చిత్రాన్ని కామెడీతో కూడిన హర్రర్ థ్రిల్లర్ నేపథ్యంలో రూపొందించినట్లు చెప్పారు. ఆ చిత్రం ఆర్థికంగా సక్సెస్ అయ్యిందన్నారు. కాగా తూక్కుదురై చిత్రాన్ని దానికి భిన్నంగా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కించినట్లు తెలిపారు. పలు ఆసక్తికరమైన అంశాలతో చిత్రం జనరంజకంగా ఉంటుందన్నారు. చిత్ర కథ 18వ శతాబ్దం కాలం నాటి రాజులకు చెందిన అంశంతో మొదలవుతుందన్నారు. ఆ సన్నివేశాలను యానిమేషన్లో చూపించినట్లు చెప్పారు. ఆ తరువాత కథ 1990 నుంచి 2023 వరకు సాగుతుందని చెప్పారు. నటుడు యోగిబాబు దేవాలయాల ముందు చిత్రాలను ప్రదర్శించే యువకుడిగా నటించారని, ఆయన ప్రేయసిగా ఇనియ నటించారని చెప్పారు. ఇందులో ఆమె రెండు గెటప్పుల్లో కనిపిస్తారని తెలిపారు. చిత్రం కోసం ఆలయం, గుహ సెట్స్ వేసి చిత్రీకరించినట్లు చెప్పారు. చిత్రాన్ని ఆగస్టు 17న విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు దర్శకుడు చెప్పారు.

స్టార్స్‌తో నటిస్తేనే క్రేజ్



తమిళసినిమా: దక్షిణాది చిత్ర పరిశ్రమలో మాలీవుడ్ బ్యూటీల హవా కొనసాగుతూనే ఉంది. నటి నయనతార, ప్రియాంక మోహన్ వంటి మలయాళం భామలు పలు భాషల్లో నటిస్తున్నారు. తాజాగా నటి మాళవికమోహన్ కథానాయకిగా ఉన్నత స్థాయికి ఎదగడానికి శ్రాయశక్తులా ప్రయత్నిస్తున్నారు. ఈ కేరళ జాణ సీనియర్ మలయాళ ఛాయాగ్రాహకుడు మోహన్ వారసురాలు. 2013లో మలయాళ చిత్ర పరిశ్రమలో కథానాయకిగా రంగప్రవేశం చేశారు. తరువాత హిందీ, తమిళం చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉన్నారు. ముఖ్యంగా తమిళంలో రజనీకాంత్ కథానాయకుడిగా నటించిన పేట చిత్రంతో ఎంట్రీ ఇచ్చారు. ఆ చిత్రంలో శశికుమార్‌కు భార్యగా కీలక పాత్రలో నటించి గుర్తింపు పొందారు. ఆ తరువాత విజయ్‌తో మాస్టర్, ధనుష్‌కు జంటగా మారన్ చిత్రాల్లో నటించి పేరు తెచ్చుకున్నారు. ప్రస్తుతం విక్రమ్ సరసన తంగలాన్ చిత్రంలో నటిస్తున్నారు. ఈ చిత్రంలో కొత్త మాళవికమోహన్ చూస్తారని చెబుతున్న ఈ భామ ఇటీవల ఒక వేదికపై మాట్లాడుతూ స్టార్ హీరోలతో జత కడితేనే హీరోయిన్లకు క్రేజ్ వస్తుందని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. తన తల్లి 1970, 80 ప్రాంతంలో మలయాళం చిత్రాలు ఎక్కువగా చూసే వారన్నారు. హీరోయిన్లు మంచి కథా పాత్రల్లో నటిస్తే అభినందించే వారని చెప్పారు. అలాంటి పాత్రల కోసం ప్రార్థించుకోవాలని చెప్పేవారని, అప్పట్లో ఆమె చెప్పింది తను మనసుకు ఎక్కేది కాదని, ఇప్పుడు అర్థం అవుతోందని అన్నారు. అయితే తాను ఇప్పటికే నటిగా ఒక రౌండ్ చుట్టేశానని, ఇకపై మంచి పాత్రలను ఎంపిక చేసుకుని నటిస్తానని మాళవికమోహన్ పేర్కొన్నారు.

మాళవికమోహన్

క్లుప్తంగా

విద్యార్థి ఆత్మహత్య

తిరువొత్తియూరు: మొబైల్ చూస్తూ సమయం వృథా చేస్తున్నాడని తల్లి మందలించడంతో విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. పల్లావరం సమీపంలోని జమీన్ పల్లవరం ప్రాంతానికి చెందిన మారియమ్మాల్ కుమారుడు జగదీష్ (16) ప్లస్ వన్ చదువుతున్నాడు. కొద్ది రోజులుగా జగదీష్ సరిగ్గా చదవడం లేదు. తరచూ మొబైల్ ఫోన్ చూస్తూ గేమ్లు ఆడుతున్నట్లు తెలిసింది. దీంతో తల్లి మారియమ్మాల్ కుమారుడిని మందలించింది. శుక్రవారం సైతం జగదీష్ మొబైల్ చూస్తుండడంతో తల్లి మరోసారి గట్టిగా మందలించింది. ఆమె బయటకు వెళ్లిన సమయంలో జగదీష్ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పల్లావరం పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. విచారణ చేస్తున్నారు.

రెండు బైక్‌ల ఢీ.. దంపతుల మృతి

అన్నానగర్: రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొని వృద్ధ దంపతులు మృతిచెందారు. ఈ ఘటన శుక్రవారం కృష్ణరాయపురం వద్ద చోటుచేసుకుంది. వివరాలు.. కరూర్ జిల్లా కృష్ణరాయపురం సమీపంలోని బృంగారపాళయం వెద్దెర వీధికి చెందిన రామసామి (73), లక్ష్మి (62) దంపతులు సొంత పనుల నిమిత్తం గురువారం సాయంత్రం బైకుపై కృష్ణరాయపురం దుకాణం వీధికి వచ్చారు. పని ముగించుకుని కరూర్–తిరుచ్చి జాతీయ రహదారిపై ఇంటికి వెళ్తున్నారు. అదే సమయంలో ఎదురుగా నీలగిరి జిల్లాకు చెందిన దీపక్‌కుమార్ బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రామస్వామి, లక్ష్మి దంపతులు మృతిచెందారు. రామస్వామి మనవడు శరణ్ కార్తీక్ ఫిర్యాదు మేరకు మాయనూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాహనం ఢీకొని జింక మృతి

అన్నానగర్: తిరుభువనంలో గురువారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని మచ్చల జింక మృతి చెందింది. శివగంగై జిల్లా తిరుభువనం సమీపంలోని అరసనూరు పూవంతి అటవీ ప్రాంతం నుంచి ఓ జింక ఆహారం వెతుక్కుంటూ శివగంగై –మధురై జాతీయ రహదారిపై వచ్చింది. తిరుమంచోలై వద్ద వాహనం ఢీకొని మృతి చెందింది. గమనించిన స్థానికులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. శివగంగై అటవీశాఖ అధికారులు సంఘటనా స్థలాని వెళ్లి జింక కళేబరాన్ని పరిశీలించారు. అనంతరం దానిని అడవిలో పాతిపెట్టారు.

బాలికకు లైంగిక వేధింపులు

తిరుత్తణి: ప్రేమ పేరుతో బాలికను లైంగికంగా వేధించిన యువకుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. నిందితుడిని శుక్రవారం అరెస్ట్ చేశారు. తిరువలంగాడు అంబేడ్కర్ కాలనీకి చెందిన ఒక వ్యక్తి ఇంట్లో మూడేళ్ల కిందట ఎలక్ట్రిషియన్ పనులు చేసేందుకు అదే ప్రాంతానికి చెందిన శంకర్ కుమారుడు లోకేష్ (25) వెళ్లాడు. ఆ ఇంట్లోని బాలికతో పరిచయం ఏర్పడింది. ప్రేమిస్తున్నానని చెప్పి తరచూ ఫోన్‌లో మాట్లాడుకునేవారు. వివాహం చేసుకుంటానని నమ్మించి జూన్ 23న తనపై లైంగిక దాడికి పాల్పడ్డాడని బాలిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. తిరుత్తణి మహిళా పోలీసులు కేసు నమోదు చేసి లోకేష్‌ను అరెస్ట్ చేశారు.

బావిలో పడి చిన్నారి దుర్మరణం


మృతి చెందిన చిన్నారి

అన్నానగర్: ఆడుకుంటూ బావిలో పడి 10 నెలల చిన్నారి మృతిచెందిన విషాదకర ఘటన గురువారం సాయంత్రం వేపంబట్టులో జరిగింది. పెరంబలూరు జిల్లా వేపంబట్టు సమీపంలోని పాండగప్పాడికి చెందిన అక్షయ రాజశేఖర్, సరస్వతి దంపతులు పాండప్పాడిలోని తమ పొలంలో ఉన్న ఇంట్లో ఉంటున్నారు. వీరికి కుమారుడు యువరాజ్ (3), 10 నెలల కుమార్తె దుర్గాదేవి ఉన్నారు. చిన్నారి దుర్గాదేవి గురువారం సాయంత్రం ఇంటి దగ్గర ఆడుకుంటోంది. ఈ క్రమంలో సమీపంలోని బావిలో పడిపోయింది. ఇంట్లో బిడ్డ లేకపోవడంతో సరస్వతి సమీపంలో వెతికింది. బావిలో చిన్నారిని గుర్తించి కేకలు వేసింది. పెరంబలూరు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని బావిలో పడి మృతి చెందిన చిన్నారిని బయటకు తీశారు. వి.కలత్తూరు పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెరంబలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సెల్ దుకాణంలో అగ్ని ప్రమాదం

అన్నానగర్: అన్నానగర్‌లోని ఓ సెల్ దుకాణంలో శుక్రవారం ఉదయం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. రూ.2 లక్షల విలువైన సెల్‌ఫోన్లు కాలిపోయాయి. చెన్నై మాధవరం ప్రాంతానికి చెందిన సూర్య అన్నానగర్ ఒకటో అవెన్యూలో ఏ టు జెడ్ పేరుతో మొబైల్ ఫోన్ల విక్రయాలు, సర్వీసు దుకాణాన్ని నడుపుతున్నాడు. గురువారం రాత్రి సూర్య ఎప్పటిలాగే షాపు మూసివేసి ఇంటికి వెళ్లాడు. శుక్రవారం తెల్లవారుజామున 4 గంటలకు షాపు నుండి పొగలు రావడంతో చుట్టుపక్కల ప్రజలు పోలీసులకు సమాచారం అందించారు. విల్లివాక్కం అన్నానగర్‌కు చెందిన అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆదుపు చేశారు. షాపు యజమాని సూర్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్లే మంటలు చెలరేగినట్లు ప్రాథమిక విచారణలో తేలింది.

మళ్లీ సొంత గూటికి..

- బీజేపీకి బైబై
- పళనికి జై కొట్టిన మాణిక్యం


పళనికి పుష్పగుచ్ఛం ఇస్తున్న మాణిక్యం

సాక్షి, చెన్నై: అన్నాడీఎంకే మాజీ ఎమ్మెల్యే మాణిక్యం బీజేపీకి బైబై చెప్పారు. మాతృసంస్థ అన్నాడీఎంకేలోకి మళ్లీ వచ్చేశారు. ప్రధాన కార్యదర్శి పళనిస్వామి సమక్షంలో శుక్రవారం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.

మదురై జిల్లా చోళవందాన్ నియోజకవర్గం నుంచి 2016లో అసెంబ్లీకి మాణిక్యం ఎన్నికయ్యారు. అన్నాడీఎంకే వర్గాల అమ్మ జయలలిత మరణం తర్వాత పరిణామాలతో ఆయన పన్నీరుసెల్వం వెన్నంటి నిలిచారు. శశికళకు వ్యతిరేకంగా తీవ్రగళాన్ని వినిపించారు. ఆ తర్వాత రాజకీయ పరిణామాలతో పళనిస్వామి, పన్నీరుసెల్వం ఏకం అయ్యారు. ఈ సమయంలో మాణిక్యానికి పార్టీలో పన్నీరుసెల్వం కీలక పదవి కట్టబెట్టారు. తన మద్దతుదారుడిని అందలం ఎక్కించారు. ఈ పరిస్థితులలో మళ్లీ పన్నీరు, పళని మధ్య వివాదం రావడంతో గత ఏడాది నవంబర్‌లో అన్నాడీఎంకేను వీడారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై సమక్షంలో మద్దతుదారులతో కాషాయం కండువా కప్పుకున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ పనితీరుకు ఆకర్షితుడై బీజేపీలోకి వచ్చినట్టు ప్రకటించారు. అయితే, ఆయనకు బీజేపీలో సరైన గుర్తింపు దక్కలేదు. ఆయన్న పట్టించుకనే వారు కరువైనట్టు సమాచారం. చివరకు పన్నీరుసెల్వం వైపు కన్నెత్తి కూడా చూడకుండా, తాను పళనిస్వామికి విశ్వాసపాత్రుడిగా చాటుకునే పనిలో పడ్డారు. శుక్రవారం చెన్నైలో పళని స్వామిని కలిసి అన్నాడీఎంకేలో చేరారు. సేవ చేసే చోటకే మళ్లీ వచ్చిచేరానని, చోళవందాన్‌లో తన కార్యక్రమాలు విస్తృతం చేయనున్నట్టు మాణిక్యం తెలిపారు.

విఘ్నేశ్ శివన్, నయన్‌పై కేసు


విఘ్నేష్ శివన్, నయనతార

తమిళసినిమా: దర్శకుడు విగ్నేష్ శివన్, నయనతారలపై ఆస్తి అపహరణ కేసు నమోదు అయ్యింది. ఆరేళ్ల క్రితం ప్రేమలో పడి, సహజీవనం చేస్తూ గత రెండేళ్ల క్రితం పెళ్లి చేసుకున్న సంచలన జంట నయనతార, విఘ్నేష్ శివన్. నయనతార నటిగా సంతోషంగా ఉన్నా వ్యక్తిగతంగా పలు సమస్యలను ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. ఈ జంట సరోగసి విధానం ద్వారా కవల పిల్లలకు తల్లిదండ్రులు అయిన విషయం కూడా వివాదంగా మారింది. తాజాగా వీళ్లకు మరో సమస్యను ఎదురైంది. విఘ్నేశ్ శివన్ పూర్వీకం తిరుచ్చి జిల్లా, లాల్‌కుడి గ్రామం ఈయన తండ్రి పేరు శివకొళుదు. వీళ్ల తొమ్మిది అన్నదమ్ములు. పోలీస్ ఇన్ఫార్మర్‌గా పనిచేసిన విఘ్నేష్ శివన్ తండ్రి శివకొళుదు ఇప్పుడు లేరు. అయితే ఈయన జీవించి ఉండగా తమ ఉమ్మడి ఆస్తిని అన్నదమ్ములకు తెలియకుండా మోసపూరితంగా అపహరించినట్లు ఆయన సోదరుడు మాణిక్యం కోయంబత్తూర్‌లో నివసిస్తున్న మరో సోదరుడు కుంచిత పాదం గురువారం తిరిచ్చి డీఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. అందులో మాణిక్యం పేర్కొంటూ తమ సోదరుడు విఘ్నేష్ శివన్ తండ్రి ఉమ్మడి ఆస్తిని తమకు తెలియకుండా వేరే వారికి విక్రయించి మోసానికి పాల్పడ్డాడని, తమ ఆస్తిని కొనుగోలు చేసిన వారికి డబ్బును తిరిగి ఇచ్చి, ఆస్తిని తమకు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని అదేవిధంగా తమ సోదరుడు కుమారుడు విఘ్నేశ్ శివన్ అతని తల్లి మీనాకుమారి, సోదరి ఐశ్వర్య, భార్య నయనతారలపై చర్యలు తీసుకోవాలని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో తిరుచ్చి డీఎస్పీ ఈ కేసు దర్యాప్తు చేయాల్సిందిగా పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సంఘటన ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. ఇది నటి నయనతారకు కూడా తలనొప్పిగా మారింది.

గవర్నర్‌ను కలిసిన లింఫాట్ ప్రతినిధులు


గవర్నర్ రవికి వినతిపత్రం అందజేస్తున్న సీఎంకే రెడ్డి

కొరుక్కుపేట: లింఫాట్ చైర్మన్, ప్రొఫెసర్ సీఎంకే రెడ్డి నేతృత్వంలోని వివిధ మైనారిటీ భాషలకు చెందిన తమిళనాడు నేతలు రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవిని గురువారం రాజ్‌భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. సుప్రీం కోర్టులో ఎస్ఎల్‌పీ మాతృభాష వివరాలను తెలియజేయగా గవర్నర్ ఎంతో ఓపికగా విన్నారు. త్వరలో ఆశించే సుప్రీంకోర్టు తీర్పును నిజమైన స్ఫూర్తితో రాష్ట్రంలో అమలు చేయాలని ప్రతినిధి బృందం గవర్నర్‌ను అభ్యర్థించింది. ముస్లిం సభ్యుడు, అడ్వకేట్, హుస్సేన్ అఫ్రోజ్ ఉర్దూ అకాడమీ కార్యకలాపాలను పునరుద్ధరించాలని, వారి భాషను ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు. మలయాళీ నాయకుడు, నంద గోవింద్, కన్నడ నాయకుడు, నారాయణ భట్, రాజస్థానీ నాయకులు, పరాస్ జైన్, విమల్‌చంద్ వారి భాషల సమస్యలను వివరించారు.

తల్లి మందలించిందని కుమారుడి ఆత్మహత్య

తిరువళ్లూరు: చదువుపై దృష్టిపెట్టడం లేదని తల్లి మందలించడంతో మనస్తాపం చెందిన ప్లస్‌వన్ విద్యార్థి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన తిరువళ్లూరులో జరిగింది. తిరువళ్లూరు బండికావనూర్ ప్రాంతానికి చెందిన దామోదరన్. ఇతడి భార్య తిలకవతి. వీరికి ప్రకాష్‌రాజ్ అనే కుమారుడు దున్నాడు. ఇతన స్థానిక ప్రైవేటు పాఠశాలలో ప్లస్‌వన్ చదువుతున్నాడు. ఇటీవల నిర్వహించిన పరీక్షల్లో ప్రకాష్‌రాజ్ ఆశించిన స్థాయిలో మార్కులు సాధించలేదని తెలిసింది. దీంతో బాగా చదవాలని తల్లి మందలించింది. మనస్తాపం చెందిన ప్రకాష్‌రాజ్ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఫిర్యాదు మేరకు టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గణాంకాల్లో పెరిగిన వృద్ధి

సాక్షి, చెన్నై: ఫైనాన్షియల్ రంగంలో పునావాలా ఫిన్ కార్ప్ తన షేర్లలో ఐదు శాతం వృద్ధిని సాధించింది. తాజా గణాంకాలు, చెల్లింపులు, నిర్వహణలో ఉన్న ఆస్తుల వివరాల మేరకు బలమైన వృద్ధిని సాధించామని ఆ సంస్థ స్థానికంగా శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొంది. 2023 జూన్ 30వ తేదీ ముగిసిన త్రైమాసికం ఆర్థిక ఫలితాలను ఈ ప్రకటనలో విడుదల చేశారు. ఆ మేరకు క్యూ1ఎఫ్‌వై24లో మొత్తం చెల్లింపులు ఆల్ టైమ్ గరిష్ట స్థాయిగా రూ.7,050 కోట్లకు చేరినట్టు వివరించారు. ఇది 143 శాతం పెరుగుదల అని, త్రైమాసికంలో 11 శాతం వృద్ధిని సూచిస్తుందని పేర్కొన్నారు. జూన్ 30వ తేదీ నాటికి రూ.4 వేల కోట్ల లిక్విడిటీని కలిగి ఉన్నట్టు తెలిపారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

అన్నానగర్: పుదుచ్చేరిలోని కిరుమాంబాక్కంలో విద్యార్థులకు గంజాయి సరఫరా చేస్తున్నట్లు ఫిర్యాదులు రావడంతో పోలీసులు నిఘా ఉంచారు. శుక్రవారం ఉదయం స్పెషల్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రమేష్, బాగూర్ ఇన్‌స్పెక్టర్ గణేష్ తనిఖీలు నిర్వహించారు. ఓ ప్రైవేట్ మెడికల్ కళాశాల వద్ద ఉన్న ముగ్గురిపై అనుమానం రావడంతో సోదాలు చేశారు. విచారణలో వారు గంజాయి ప్యాకెట్లను విక్రయిస్తున్నట్లు గుర్తించారు. వీరిలో ఇద్దరు వైద్యులు ఉన్నట్లు తేలింది. నిందితులు చెన్నైకి చెందిన డాక్టర్ కుట్రాలీశ్వరన్ (29), పుదుచ్చేరి కోరిమెట్‌కు చెందిన డాక్టర్ కార్తికేయాన్ (26), కడలూరు జిల్లా అన్నవల్లిగిరి ప్రాంతానికి చెందిన రవికుమార్ (29)గా గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకుని కిలో గంజాయి, రూ.21 వేల నగదు, 3 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

పులియాంతోపులో విద్యార్థి..

తిరువొత్తియూరు: చెన్నై పులియాంతోపులో విద్యార్థులకు గంజాయి విక్రయిస్తున్నట్లు పులియంతోపు సహాయ కమిషనర్ అలగేషన్‌కు రహస్య సమాచారం అందింది. ఆయన ఆదేశాల మేరకు బేసిన్‌బ్రిడ్జి సహాయ ఇన్‌స్పెక్టర్ వినోద్ తనిఖీ చేశారు. అనుమానాస్పదంగా తిరుగుతున్న యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. అతనిని తనిఖీ చేయగా చిన్న పొట్లాల్లో 100 గ్రాముల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. పెరంబూరు కన్నాభిరామన్ ఆలయ వీధికి చెందిన యోవాస్ (19)గా తెలిసింది. సహా విద్యార్థులకు గంజాయి విక్రయిస్తున్నట్లు విచారణలో తేలింది. అతనిపై కేసు నమోదు చేశారు. అనంతరం కోర్టులో హాజరుపరిచి పుళల్ జైలుకు తరలించారు.

స్థలం ఇప్పిస్తానని మోసం

తిరువొత్తియూరు: స్థలం కొని ఇస్తామని రూ.కోటి మోసం చేసిన వ్యవహారంలో శివకాశికి చెందిన బీజేపీ కార్యనిర్వాహకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. మరో ఇద్దరి కోసం వెతుకుతున్నారు. విరుదునగర్ జిల్లా శివకాశి కార్పొరేషన్ తిరుత్తంగల్ స్టాండర్డ్ కాలనీకి చెందిన ఈశ్వరన్ (48). శివకాశి కైత్‌లో వస్త్రదుకాణం నడుపుతున్నాడు. ఇతను తిరుతంగల్ ఆలవూరణికి చెందిన బీజేపీ ప్రభుత్వ కమ్యూనికేషన్ విభాగం జిల్లా కార్యదర్శి. బ్రోకర్ సత్యరాజ్ (40), అయ్యసామి సహా ముగ్గురు శివకాశి విరుదునగర్ రోడ్డులోని ఆమత్తూరు సమీపంలో ఎకరా భూమి రూ. 81 లక్షలు చొప్పున 5 ఎకరాలను రూ.4 కోట్ల 5 లక్షలకు కొనుగోలు చేసి ఇస్తానని పేర్కొన్నారు. తర్వాత ఈ మాటలు నమ్మిన ఈశ్వరన్ 2023, జూన్ 21న భూమి రిజిస్ట్రేషన్‌కు రూ. 10 లక్షలు ఇచ్చినట్లు సమాచారం. తరువాత స్థలం రిజిస్ట్రేషన్‌కు ఖర్చు అవుతుందని సత్యరాజ్ అయ్యప్పసామి వద్ద నగదు తీసుకున్నట్లు తెలిసింది. నగదు తీసుకున్న తరువాత రిజిస్ట్రేషన్‌కు పిలవకపోవడంతో అనుమానించి ఈశ్వరన్ సెల్‌ఫోన్‌లో సత్యరాజ్‌ను సంప్రదించేందుకు ప్రయత్నించగా అతని ఫోన్ స్విచ్ ఆఫ్‌లో ఉంది. దీంతో అనుమానం వచ్చిన ఈశ్వరన్ తన బంధువులను కొందరిని తీసుకుని అలవూరనిలోని సత్యరాజ్ ఇంటికి వెళ్లి పట్టా నమోదుపై అడిగాడు. అప్పుడు సత్యరాజ్, ఈశ్వరన్ చూసి నీవు ఎవరో నాకు తెలియదు అన్నాడు. దీంతో ఈశ్వరన్ తాను మోసపోయానని గ్రహించి తిరుత్తంగల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు పోలీసులు సత్యరాజ్, అయ్యాసామి సహా ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి శుక్రవారం తెల్లవారుజామున వాహన తనిఖీల్లో సత్యరాజ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. మరో ఇద్దరి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

స్వాతంత్ర్య సమరయోధుడికి సన్మానం



సన్మానిస్తున్న అధికారులు

అన్నానగర్: కడలూరులో గురువారం 104 ఏళ్ల స్వాతంత్ర్య సమరయోధుడిని సన్మానించారు. ప్రభుత్వ ఉద్యోగాలు, స్వాతంత్ర్య పోరాట అమర వీరుల నుంచి పదవీ విరమణ పొందిన అధికారులకు ప్రతినెలా ట్రెజరీ ద్వారా పింఛన్ చెల్లిస్తున్నారు. పదవీ విరమణ పొందిన అధికారులు మరణిస్తే, వారి జీవిత భాగస్వాములకు పెన్షన్ ఇస్తారు. ఈ విధంగా పింఛన్‌దారులు తాము సజీవంగా ఉన్నామని చూపించేందుకు సంవత్సరానికి ఒకసారి ట్రెజరీకి లైఫ్ సర్టిఫికెట్ సమర్పించాలి. దీని కోసం ఇంటర్వ్యూలో పాల్గొనడం తప్పనిసరి. ఆ ప్రకారం, పెన్షనర్లు, స్వాతంత్ర్య పోరాట అమర వీరులు లైఫ్ సర్టిఫికెట్ సమర్పించడానికి ఇంటర్వ్యూలో పాల్గొనడానికి వెళ్లారు. ఈ స్థితిలో కడలూరు కారుమారపేటకు చెందిన 104 ఏళ్ల స్వాతంత్ర్య సమరయోధుడు ఏకాంబరం ఇంటర్వ్యూలో పాల్గొనేందుకు వెళ్లనున్నాడు. విషయం తెలిసి ట్రెజరీ అధికారులు అతడికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఇంటికి వెళ్లి వేలిముద్ర, ఫేస్ యాప్ ద్వారా ముఖాన్ని నమోదు చేయాలని నిర్ణయించారు. దీని ప్రకారం గురువారం జూనియర్ అసిస్టెంట్ పశుపతి నేతృత్వంలో అకౌంటెంట్లు రాజేశ్వరి, మణిమేగళ, జయభారతి, ట్రెజరీ అధికారులు ఆయన ఇంటికి వెళ్లారు. అనంతరం అమరవీరుడు ఏకాంబరంను శాలువ కప్పి సన్మానించారు. అనంతరం అతని వేలిముద్ర, ముఖాన్ని రికార్డు చేసి ఇంటర్వ్యూ నిర్వహించారు.

శిశువు కిడ్నాప్.. దంపతుల అరెస్ట్


అన్నానగర్: ప్లాట్‌ఫాంపై నిద్రిస్తున్న తల్లి వద్ద నుంచి 2 నెలల శిశువును అపహరించిన దంపతులను పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు..పుదుచ్చేరిలోని ఉప్పలం నేతాజీ నగర్‌కు చెందిన వీరప్రతాప్, సోనియా దంపతులకు కుమార్తె లాక్ష్య (3), కుమారుడు ఆదిత్య (2 నెలలు) ఉన్నారు. సోనియా పుదుచ్చేరి బీచ్‌లో క్రీడా వస్తువులు విక్రయించేది. జూన్ 27వ తేదీ రాత్రి వ్యాపారం ముగించుకుని ఓ దుకాణం ముందు ఉన్న ఫ్లాట్‌ఫాంపై తన భర్త పిల్లలతో కలిసి నిద్రపోయింది. అర్ధరాత్రి అకస్మాత్తుగా నిద్రలేచి చూసేసరికి చిన్నారి ఆదిత్య కనిపించకుండాపోయాడు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విచారణ చేశారు. అందులో బెంగళూరుకు చెందిన పునీత(31), బసవరాజ్(32) దంపతులకు కొన్నాళ్ల క్రితం వివాహమై సంతానం లేదు. కొద్ది నెలల క్రితం పునీత గర్భం దాల్చింది. అయితే గర్భస్రావం జరిగింది. ఈ విషయాన్ని భర్తతో చెప్పి పునీత మనస్తాపానికి గురైంది. అత్తమామలు, కుటుంబ సభ్యులు చులకనగా మాట్లాడుతారని భయపడిన దంపతులు బిడ్డను అపహరించినట్లు తెలిసింది. వారిని అరెస్టు చేసి చిన్నారిని తల్లిదండ్రులకు అప్పగించారు.

ఒప్పందం



కొరుక్కుపేట: కేన్సర్‌పై పరిశోధనలు, శిక్షణ కోసం చెన్నైలోని అపోలో ప్రోటాన్ కేన్సర్ సెంటర్‌తో బెల్జియంకు చెందిన ఐబీఏతో అవగాహన ఒప్పందం చేసుకుంది. ఈ మేరకు శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయా సంస్థల ప్రతినిధులు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసి మార్చుకున్నారు. అపోలో ప్రోటాన్ క్యాన్సర్ సెంటర్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ రాకేష్ జలాలి మాట్లాడుతూ ప్రోటాన్ బీమ్ థెరపీ ట్రైనింగ్ కోసం ఐబీఏతో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు తెలిపారు. బెల్జియం ఐబీఏ, సేల్స్ డైరెక్టర్, క్లాడ్ డ్యూపాంట్, అపోలో హాస్పిటల్ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్‌పర్సన్ ప్రీతారెడ్డి, అంకాలజీ అండ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ దినేష్ మాధవన్ పాల్గొన్నారు.

స్మారకం



చెన్నైలోని గ్రేట్ లేక్స్ ఇన్‌స్టిట్యూట్ ఆవరణలో విద్యావేత్త, పద్మశ్రీ అవార్డు గ్రహిత, ప్రొఫెసర్ బాల వి బాలచంద్రన్ స్మారక చిహ్నాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. దీనిని కాగ్నిజెంట్ మాజీ సీఈఓ లక్ష్మీనారాయణన్, ప్రిన్సిపల్ సురేష్ రామనాథన్ ప్రారంభించారు. బాలచంద్రన్ సేవలను కొనియాడారు. -సాక్షి, చెన్నై

నిరసనల హోరు


నిరసనలో కాంగ్రెస్ నాయకులు

- కాంగ్రెస్ శ్రేణుల రాస్తారోకోలు, రైల్‌రోకోలు

సాక్షి, చెన్నై: ఏఐసీసీ నేత రాహుల్‌గాంధీ అప్పీలు పిటిషన్ తిరస్కరణకు గురికావడంతో రాష్ట్రంలోని కాంగ్రెస్ నేతలు తీవ్ర ఆగ్రహానికి లోనయ్యారు. కేంద్రం కనుసన్నల్లోనే గుజరాత్‌లో వ్యవహారాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. పలుచోట్ల రాస్తారోకోలు, రైల్‌రోకోలు చేశారు. పరువు నష్టం కేసులో రాహుల్‌పై అనర్హత వేటు వేస్తూ ఇటీవల సూరత్ కోర్టు ఇచ్చిన తీర్పు గురించి తెలిసిందే. దీనిని వ్యతిరేకిస్తూ గుజరాత్ హైకోర్టులో రాహుల్ అప్పీలు పిటిషన్ వేశారు. విచారణ ముగియడంతో పిటిషన్‌ను తిరస్కరిస్తూ, కిందికోర్టు తీర్పును గుజరాత్ కోర్టు సమర్థించింది. స్టేకు నిరాకరించింది. దీంతో రాహుల్ ఇరకాటంలో పడ్డారు. అదే సమయంలో గుజరాత్‌లో రాహుల్‌కు న్యాయం లభించే అవకాశాలు లేవని, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ కనుసన్నల్లోనే వ్యవహారాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ కాంగ్రెస్ నేతలు ఆందోళనకు దిగారు. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ వర్గాలు నిరసనలు హోరెత్తించాయి. రాస్తారోకోలు, ధర్నాలు అంటూ ముందుకు సాగారు. పలుచోట్ల రైల్వే స్టేషన్లలోకి చొరబడి రైళ్లను అడ్డుకునే ప్రయత్నం చేసిన కాంగ్రెస్ నేతలను పోలీసులు అరెస్టు చేశారు. చెన్నైలో ఎగ్మూర్ రైల్వేస్టేషన్‌లో కాంగ్రెస్ నేతలు రైల్ రోకోకు ప్రయత్నించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కేఎస్ అళగిరి నేతృత్వంలో నిరసన జరిగింది. దీంతో ఆందోళన కారులను పోలీసులు అడ్డుకున్నారు. వాగ్వివాదాలు, తోపులాట నడుమ నేతలను పోలీసులు అరెస్ట్ చేశారు.

బైక్‌ను ఢీకొన్న కారు

- దంపతుల దుర్మరణం

అన్నానగర్: రెడ్డియార్ చత్రం సమీపంలో రోడ్డుపై ఆగివున్న బైకును కారు ఢీకొన్న ఘటనలో నిండు గర్భిణి, ఆమె భర్త మృతిచెందారు. దిండుక్కల్ జిల్లా నీలకోట్టై సమీపంలోని పల్లపట్టికి చెందిన బేతన్ కుమారుడు సురేష్ (32). ఇతని భార్య కాళీశ్వరి (27). వీరికి పవిత్రశ్రీ(3) కుమార్తె ఉంది. తిరుపూర్‌లోని ఓ ప్రైవేట్ మిల్లులో సురేష్ కూలీ. ఈ స్థితిలో కాళీశ్వరి 7 నెలల గర్భిణి. గురువారం సురేష్ భార్య, కూతురిని బైకులో ఎక్కించుకుని తిరుపూర్‌కు బయలుదేరారు. వారి వెనుక బంధువులు వ్యాన్‌లో వెళ్లారు. రెడ్డియార్ చత్రం సమీపంలోని కదిరణంబట్టి ప్రాంతంలో వారు దిండుక్కల్ – పళని రహదారిపై వెళుతుండగా వ్యాన్‌లో కుమార్తెను తీసుకెళ్లాలని సురేష్ నిర్ణయించుకున్నాడు. ఇందుకోసం రోడ్డుపై ద్విచక్రవాహనాన్ని ఆపాడు. కాళీశ్వరి బిడ్డను బైకు నుంచి దించి తాను కిందకు దిగేందుకు ప్రయత్నించింది. అప్పుడు అటుగా వెళుతున్న కారు అదుపుతప్పి బైకును ఢీకొంది. ఈ ఘటనలో సురేష్, కాళీశ్వరి బైకు నుంచి కిందపడి అక్కడికక్కడే మృతిచెందారు. కుమార్తెకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న రెడియార్ చత్రం ఎస్ఐ శరవణకుమార్, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదంలో మృతిచెందిన సురేష్, అతని భార్య మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం దిండుక్కల్ ప్రభుత్వాస్పత్రికి తరలించి పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

నగల కోసం మహిళ హత్య


పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న బంధువులు

వేలూరు: వేలూరు జిల్లా పేర్నంబట్టు సమీపంలోని సాత్‌కర్ గ్రామానికి చెందిన మోహన్. ఇతని భార్య వలర్‌మది(50). వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. వలర్‌మది మూడు మేకలను పెంచుతూ ప్రతిరోజూ మేతకు తీసుకెళ్లేది. గురువారం మధ్యాహ్నం 12 గంటలకు మేకలను మేతకు తీసుకెళ్లింది. ఆ సమయంలో అక్కడకు వచ్చిన గుర్తు తెలియని వ్యక్తులు వలర్‌మది చెవికి వేసుకొని ఉన్న బంగారు కమ్మలను తీసుకునేందుకు చెవును కత్తిరించారు. దీంతో వలర్‌మది కేకలు వేసూ అక్కడ నుంచి పరుగులు తీసింది. దీంతో నిందితులు ఆమె వెంబడించి గొంతు కోసం హత్య చేశారు. సాయంత్రం 4 గంటలకు అటుగా వెళ్లిన వారు గ్రామస్తులకు సమాచారం అందజేశారు. గ్రామస్తులు పేర్నంబట్టు పోలీసులకు సమాచారం అందజేయడంతో పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు. పోలీసులు అనుమానితులు పది మందిని అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నారు. నిందితులను అరెస్ట్ చేయాలని కోరుతూ శుక్రవారం ఉదయం బంధువులు పోలీస్‌స్టేషన్ ఎదుట రాస్తారోకో చేశారు. పోలీసులు బంధువులతో చర్చలు జరిపి రాస్తారోకోను విరమింప జేశారు.

డీఎంకే కార్మిక విభాగంలో నియామకాలు


ఎమ్మెల్యే చంద్రన్‌తో కార్మిక విభాగం నేతలు

తిరుత్తణి: డీఎంకే జిల్లా కార్మిక విభాగంలో నియమితులైన వారు శుక్రవారం ఎమ్మెల్యే చంద్రన్‌ను కలిశారు. తిరువళ్లూరు వెస్ట్ జిల్లా కార్మిక విభాగం అధ్యక్షుడిగా నరేంద్రన్, కార్యదర్శిగా శ్రీనివాసన్ తిరుత్తణిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో డీఎంకే జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్యే చంద్రన్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వారి వెంట డీఎంకే మండల కార్యదర్శి ఆర్తిరవి, నాయకులు రామదాసు, షరీఫ్, వేలు, గోపి, శివకుమార్, ఆటో పాండ్యన్, రఘుపతి, మునిరత్నం ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో నిందితుడు మృతి


రైల్వేట్రాక్‌పై పడివున్న సంతోష్ మృతదేహం

తిరువళ్లూరు: వేర్వేరు కేసుల్లో ప్రధాన నిందితుడు రైల్వే ట్రాక్‌పై అనుమానాస్పదస్థితిలో మృతిచెందాడు. తిరువళ్లూరు జిల్లా వేపంబట్టు గ్రామానికి చెందిన ఇళంజెళియన్ కుమారుడు సంతోష్ అలియాస్ జబరాజ్(28). ఇతడిపై వివిధ పోలీస్ స్టేషన్లలో పలు కేసులు ఉన్నాయి. వేపంబట్టు రైల్వేస్టేషన్ సమీపంలో చెన్నై వెళ్లే రైలు మార్గంలో ఓ వ్యక్తి మృతదేహం వున్నట్టు పోలీసులకు సమాచారం. సమాచారం మేరకు పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని మృత దేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. పోలీసుల విచారణలో మృతి చెందిన వ్యక్తి సంతోష్‌గా గుర్తించారు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానస్పద కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వాలీబాల్ పోటీలకు వచ్చి..!


మృతిచెందిన నాగరాజు

వరదయ్యపాళెం: ఒకే బైక్‌పై నలుగురు ప్రయాణం.. ఆపై మితిమీరిన వేగం ప్రమాదానికి దారితీసింది. అదుపు తప్పి పడిపోవడంతో వారంతా గాయపడ్డారు. తీవ్రగాయాలతో ఒకరు ఆస్పత్రిలో మరణించారు. శ్రీసిటీ హైటెక్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ అరుణ్‌కుమార్ రెడ్డి తెలిపిన వివరాలు.. సత్యవేడు సమీపంలోని తమిళనాడు మాదరపాకం ప్రాంతానికి చెందిన నాగరాజు (21), గణేష్ (19), శివమణి (15), మనస్వామి (20) వరదయ్యపాళెంలో జరిగిన వాలీబాల్ పోటీలలో శుక్రవారం పాల్గొన్నారు. సాయంత్రం తిరిగి ఇంటికి వెళ్తుండగా సత్యవేడు ప్రధాన రోడ్డు మార్గంలోని చిన్న పాండూరు సమీపంలోని నక్కల మిట్ట వద్ద అదుపు తప్పి ద్విచక్ర వాహనం ప్రమాదానికి గురైంది. ప్రమాదంలో ఆ నలుగురికీ గాయాలయ్యాయి. నాగరాజుకు మాత్రం తీవ్ర గాయాలయ్యాయి. వీరికి చిన్న పాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స చేసి, మెరుగైన వైద్యం కోసం 108లో సత్యవేడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించి నాగరాజు మృతిచెందాడు. ఇదలా ఉంచితే, వీరంతా ఒకే స్కూటీపై ప్రయాణించడం, వేగంగా వెళ్లడమే ప్రమాదానికి ప్రధాన కారణమని ప్రత్యక్ష సాక్షులు చెప్పినట్లు తెలిసింది. సమాచారం అందుకున్న ఎస్ఐ అక్కడికి చేరుకుని పరిశీలించారు. యువకుల కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాలు కొనేందుకు డబ్బులు లేక చోరీ

అన్నానగర్: గర్భంతో ఉన్న భార్యకు పాలు కొనేందుకు డబ్బులు లేక పాల ప్యాకెట్లు చోరీ చేసిన ఘటన చెన్నై ముగప్పేర్‌లో చోటుచేసుకుంది. వివరాలు.. ముగప్పేర్‌లో జూన్ 28న ఇంటి ముందు పాల ప్యాకెట్లు కనిపించడం లేదని ఇంటి యజమాని ఏజెంట్‌కు ఫిర్యాదు చేశారు. అక్కడున్న సీసీ కెమెరాలను పరిశీలించారు. డెలివరీ బాయ్ పాల ప్యాకెట్లు వేసిన వెళ్లిన తర్వాత బైక్‌పై వచ్చిన ఓ యువకుడు అపహరించినట్లు గుర్తించారు. ఆ రికార్డుల ఆధారంగా నొలంభూర్ పోలీసులకు మిల్క్ ఏజెంట్ గణేశన్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. చోరీ చేసిన వ్యక్తి 6వ బ్లాక్‌కు చెందిన గౌతం (23)గా గుర్తించారు. అతన్ని అదుపులోకి తీసుకుని విచారించారు. పేదరికం కారణంగా దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నాడు. ఇకపై ఇలాంటి ఘటనలకు పాల్పడనని వేడుకున్నాడు. అతడిపై పాత కేసులు ఏమైనా ఉన్నాయా అని ఆరా తీశారు. లేవని తేలడంతో పోలీసులు అతడిని హెచ్చరించి పంపించేశారు.

క్లుప్తంగా...

ఈ కోర్టులో పిటిషన్ ఎందుకు వేశారు?

- మార్గదర్శి చిట్‌ఫండ్‌ను ప్రశ్నించిన న్యాయమూర్తి



సాక్షి, హైదరాబాద్: మార్గదర్శి చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్ కేసులన్నీ ఒకే న్యాయమూర్తి విచారణ జరపాలని ప్రధాన న్యాయమూర్తి ఆదేశించిన తర్వాత కూడా ఈ కోర్టులో ఎందుకు పిటిషన్ దాఖలు చేశారని పిటిషనర్ న్యాయవాదినిజస్టిస్ సురేందర్ ప్రశ్నించారు. మార్గదర్శి యాజమాన్యంపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోవద్దని కోర్టు ఆదేశించినా.. నోటీసులు జారీచేశారంటూ చెరుకూరి శైలజ, మార్గదర్శి చిట్ ఫండ్స్ హైకోర్టులో కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ కె. సురేందర్ శుక్రవారం విచారణ చేపట్టారు. ప్రతివాదుల తరఫున ఏపీ స్పెషల్ జీపీ గోవిందరెడ్డి వాదనలు వినిపించారు. మార్గదర్శి దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ జరిపే అర్హత తెలంగాణ హైకోర్టుకు ఉందా? లేదా? అన్న అంశంపై సుప్రీంకోర్టు ఈనెల 18న విచారణ జరపనుందని, అప్పటివరకు ఈ పిటిషన్‌లో విచారణను వాయిదా వేయాలని కోరారు. హైకోర్టులో ఇతర కేసులు ఈనెల 20కి వాయిదా వేశారన్న విషయాన్ని గుర్తుచేశారు. సుప్రీంకోర్టు ఒకసారి ఈ అంశాన్ని విచారణకు స్వీకరించిన తర్వాత అదే అంశంపై హైకోర్టు విచారణ జరపలేదని వెల్లడించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. ఏపీ సీఐడీ అధికారులకు నోటీసులు జారీచేస్తూ, విచారణను ఆగస్టు 14వ తేదీకి వాయిదా వేశారు.

నాలుగేళ్లలో 25.75 లక్షల జనన ధ్రువీకరణ పత్రాలు

సాక్షి, అమరావతి: జనన, మరణ ధ్రువీకరణ పత్రాల మంజూరు విషయంలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. జనన ధ్రువీకరణ పత్రాలైతే ఆస్పత్రి నుంచి తల్లీబిడ్డ డిశ్చార్జి అయి ఇంటికి వెళ్లే లోగా, మరణ ధ్రువీకరణ పత్రాలైతే మూడు రోజుల్లోగా మంజూరు చేస్తున్నారు. ప్రభుత్వాస్పత్రుల్లో ఈ విధానం పక్కాగా అమలు చేస్తున్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లోను నిర్దేశించిన సమయంలోగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. 2019 నుంచి ఈ ఏడాది మే నెలాఖరు నాటికి 25,75,161 జనన ధ్రువీకరణ పత్రాలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇదే కాలానికి వివిధ కారణాలతో మృతి చెందిన 20,30,122 వ్యక్తుల మరణ ధ్రువీకరణ పత్రాలను జారీ చేశారు. ఈ ఏడాది జనవరి నుంచి మే వరకూ 2.95 లక్షల జనన, 1.86 లక్షల మరణ ధ్రువీకరణ పత్రాలు జారీ చేసినట్టు గణాంకాలు చెబుతున్నాయి. రాష్ట్రంలోని 25 డీఎంఈ, 242 ఏపీవీవీపీ ఆస్పత్రులు, 1,145 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో జనన, మరణ రిజిస్ట్రేషన్ యూనిట్‌లు ఉన్నాయి. అదే విధంగా పట్టణ, నగర ప్రాంతాల్లోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో జనన, మరణాల నమోదుకు 24 కార్పొరేషన్‌లు, 77 మున్సిపాలిటీలు, 29 నగర పంచాయతీలు, గ్రామీణ ప్రాంతాల్లో అయితే 13,148 పంచాయతీల్లో రిజిస్ట్రేషన్ యూనిట్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

సృజనాత్మక ఆలోచనలతో పరిశోధనలు సాగాలి

- కేంద్రమంత్రి నారాయణ స్వామి



సదస్సు సంచికను ఆవిష్కరిస్తున్న డీఆర్‌డీవో డైరెక్టర్ జనరల్ డాక్టర్ శ్రీనివాసరావు

ఏయూ క్యాంపస్: వివిధ శాస్త్ర అంశాలను సమన్వయం చేస్తూ పరిశోధనలు జరగాలని కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత శాఖ సహాయ మంత్రి ఏ.నారాయణ స్వామి అన్నారు. శుక్రవారం ఆంధ్ర విశ్వవిద్యాలయం (ఏయూ) ట్రాన్స్ డిసిప్లినరీ హబ్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చైర్ సంయుక్తంగా డిజైన్ థింకింగ్‌పై నిర్వహిస్తోన్న 2 రోజుల జాతీయ సదస్సునుద్దేశించి ఆయన వర్చువల్‌గా ప్రసంగించారు. సృజనాత్మక ఆలోచనలతో సమష్టిగా పనిచేయాలని సూచించారు. భవిష్యత్తులో డిజైన్ థింకింగ్ బలమైన సాధనంగా మార్పు చెందే అవకాశం ఉందన్నారు. డీఆర్‌డీవో డైరెక్టర్ జనరల్ డాక్టర్ వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ సృజనాత్మక ఆలోచనలను ప్రోత్సహించాల్సిన అవసరముందన్నారు. రానున్న కాలంలో కొన్ని రంగాల్లో భారత్ తన ఆవిష్కరణలతో ఆధిపత్యాన్ని చూపుతుందన్నారు. ఏయూ వీసీ పీవీజీడీ ప్రసాద రెడ్డి మాట్లాడుతూ నేడు డిగ్రీలు కొలమానం కాబోవని, నైపుణ్యాలు కలిగి ఉండటం అవసరమన్నారు. సదస్సు కన్వీనర్ అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్ ఎం.జేమ్స్ స్టీఫెన్ మాట్లాడుతూ సదస్సుకు 20 రాష్ట్రాల నుంచి ప్రతినిధులు హాజరవుతున్నారని 452 పరిశోధన పత్రాలు, 60 సెషన్స్‌గా, 40 విభిన్న శాస్త్ర అంశాలపై చర్చలు ఉంటాయన్నారు. సదస్సులో ఈఎస్ఎస్ ఈఎన్ఎస్ టెక్ సొల్యూషన్స్ ఫౌండర్ డైరెక్టర్ సాయిరాం బొల్లాప్రగడ, ది టెక్ ఇంటర్న్ సంస్థ డైరెక్టర్ మహేష్ రఖేజ, ఇస్రో శాస్త్రవేత్త మూర్తి రేమెళ్ల, ఐపీఆర్ చైర్ ప్రొఫెసర్ డాక్టర్ హనుమంతు పురుషోత్తం, ఏయూ రిజిస్ట్రార్ కృష్ణమోహన్, రెక్టార్ సమత ప్రసంగించారు. సదస్సు ప్రత్యేక సంచికను శ్రీనివాసరావు ఆవిష్కరించారు.

ఎల్‌వీఎం3-ఎం4 రాకెట్‌కు ఎలక్ట్రికల్ పరీక్షలు పూర్తి



ప్రయోగానికి సిద్ధంగా ఉన్న ఎల్‌వీఎం3-ఎం4 ఉపగ్రహ వాహకనౌక

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): స్థానిక సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్)లోని రెండో ప్రయోగ వేదిక నుంచి ఈ నెల 14వ తేదీ మధ్యాహ్నం 2.35 గంటలకు నిర్వహించనున్న చంద్రయాన్-3 ప్రయోగానికి సంబంధించి ఎల్‌వీఎం3-ఎం4 రాకెట్‌కు శుక్రవారం ఎలక్ట్రికల్ పరీక్షలను పూర్తిచేశారు. చంద్రయాన్-3 ప్రయోగాన్ని ఇస్రో అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. అదేవిధంగా ఇది గ్రహాంతర ప్రయోగం కావడంతో ప్రపంచమంతా భారత్ వైపు చూస్తోంది. కాబట్టి గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఈ ప్రయోగానికి సంబంధించిన అన్ని అంశాలను శాస్త్రవేత్తలు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఈ నెల 14వ తేదీ వరకు రోజూ అనేక రకాల పరీక్షలు చేసిన తర్వాత ప్రయోగాన్ని నిర్వహిస్తారు.

చంద్రయాన్-3 ప్రయోగాన్ని వీక్షించేందుకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి

ఈ నెల 14న చంద్రయాన్-3 ప్రయోగాన్ని వీక్షించేందుకు ఆసక్తిగలవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని షార్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. సందర్శకులు శుక్రవారం నుంచే https://lvg.shar.gov.in అనే వెబ్‌సైట్‌ను ఓపెన్ చేసి పేరు, పూర్తి వివరాలు నమోదు చేసుకోవచ్చని, ఆధార్ కార్డు, కోవిడ్ పరీక్ష సర్టిఫికెట్ కూడా ఉండాలని పేర్కొన్నారు.

గత ప్రభుత్వం హయాంలో 'ఏకలవ్య' నిధులు దిగమింగారు..

- 2017లో కేంద్రం ఇచ్చిన రూ.40.29 కోట్ల నిధుల్లో అవినీతి
- సీఐడీ విచారణ కోరాలని గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శికి లేఖ రాసిన ఎస్టీ కమిషన్



శంకర్‌నాయక్‌కు వినతిపత్రం ఇస్తున్న లచ్చన్నదొర, తమ్మన్నదొర, మడి బొజ్జమ్మ

సాక్షి, అమరావతి : గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్(ఈఎంఆర్ఎస్)కు కేంద్ర ప్రభుత్వం కేటాయించిన నిధులు దిగమింగారని ఆదివాసి(గిరిజన) సాంస్కృతిక, సంక్షేమ సంఘం ఆరోపించింది. ఈ విషయమై సంఘ అల్లూరి సీతారామరాజు జిల్లా ప్రధాన కార్యదర్శి కోసు లచ్చన్న దొర మరికొందరు కలిసి విజయవాడలోని ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఏపీ గిరిజన గురుకుల సొసైటీ పరిధిలోని ఈఎంఆర్ఎస్‌లలో విద్యార్థులకు వర్చువల్ క్లాస్ రూమ్స్(వీసీఆర్), డిజిటల్ క్లాస్ రూమ్స్(డీసీఆర్) నిర్వహణ కోసం కేంద్ర ప్రభుత్వం నిధులిచ్చింది. 2017లో ఇచ్చిన రూ.40.29కోట్ల నిధుల్లో అవినీతి జరిగిందని వారు ఆరోపించారు. దీనిపై గతంలో కూడా తాము ఫిర్యాదు చేసినట్టు పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఈ అవినీతి, అక్రమాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

సీఐడీ విచారణకు లేఖ రాసిన ఎస్టీ కమిషన్

గత ప్రభుత్వ హయాంలో ఏకలవ్య గురుకులాల నిధుల్లో అవినీతి జరిగిందనే ఆరోపణలపై వాస్తవాలు నిగ్గు తేల్చేలా సీఐడీ విచారణ కోరాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి కాంతిలాల్ దండేకు ఏపీ ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్ లేఖ రాశారు. ఆ లేఖకు ఆదివాసి(గిరిజన) సాంస్కృతిక, సంక్షేమ సంఘం ప్రతినిధులు ఇచ్చిన ఫిర్యాదును జత చేశారు. ఇదే విషయమై వాస్తవాలను నివేదించాలంటూ ఈ ఏడాది మే 17న గిరిజన సంక్షేమ గురుకులాల కార్యదర్శికి ఏపీ ఎస్టీ కమిషన్ సెక్రటరీ సీహెచ్ ఎంఎం గంగాధర్ రాసిన ఫైనల్ రిమైండర్ లేఖను కూడా జత చేయడం గమనార్హం.

నోట్ల మార్పిడి దందాలో ఏఆర్ ఆర్ఐ పాత్ర

ఏఆర్ ఆర్ఐ స్వర్ణలతతో పాటు ఏఆర్ కానిస్టేబుల్, హోంగార్డ్, మధ్యవర్తి అరెస్ట్

దొండపర్తి (విశాఖ దక్షిణ): విశాఖలో నోట్ల మార్పిడి వ్యవహారంలో ఏఆర్ ఆర్ఐ స్వర్ణలత పాత్ర ఉన్నట్లు పోలీసుల విచారణలో నిర్ధారణ అయింది. రూ.90 లక్షలు విలువ చేసే రూ.500 నోట్లు ఇస్తే.. రూ.కోటి విలువ చేసే రూ.2 వేల రూపాయల నోట్లు ఇస్తామని ఆశపెట్టి నేవీ ఉద్యోగులను మోసం చేసి రూ.12 లక్షలు కాజేసిన వ్యవహారం నగరంలో కలకలం రేపింది. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేసి నిందితులు ఏఆర్ ఆర్ఐతో పాటు మధ్యవర్తి విజ్జిన సూరిబాబు, ఏఆర్ కానిస్టేబుల్ మహంతిహేమ్‌సుందర్, హోంగార్డు వంటాకు శ్రీనులను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.12.10 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సీఎం త్రివిక్రమ్‌వర్మ తెలిపారు. శుక్రవారం పోలీస్ సమావేశ మందిరంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన కేసు వివరాలను వెల్లడించారు. పాత గాజువాక ప్రాంతానికి చెందిన కొల్లి శ్రీను, శ్రీధర్ నేవీలో పనిచేసి ఈ ఏడాది పదవీ విరమణ పొందారు. వీరికి గోపీ అనే స్నేహితుడి ద్వారా ఆరిలోవ ప్రాంతానికి చెందిన విజ్జిన సూరిబాబు పరిచయమయ్యాడు. శ్రీను, శ్రీధర్ పదవీ విరమణ చేయడంతో డబ్బులు వచ్చాయన్న విషయాన్ని సూరిబాబు గ్రహించాడు. తన వద్ద ఒక డీల్ ఉందని, అది చేస్తే రూ.10 లక్షలు లాభం వస్తుందని నమ్మించాడు. రూ.90 లక్షలు విలువ చేసే రూ.500 నోట్లు ఇస్తే.. రూ.కోటి విలువ చేసే రెండు వేల రూపాయల నోట్లు ఇస్తారని చెప్పాడు. డబ్బు వస్తుందన్న ఆశతో శ్రీను, శ్రీధర్‌లు అందుకు అంగీకరించారు. సూరి చెప్పిన ప్రకారం ఈ నెల 5న సీతమ్మధార ప్రాంతంలోని ఎన్ఆర్ఐ ఆస్పత్రి వెనుకకు రూ.90 లక్షలతో కారులో వచ్చారు. అక్కడే ఉన్న సూరి విషయాన్ని ఓల్డ్ డెయిరీ ఫాం ప్రాంతానికి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ మహంతిహేమసుందర్‌కు చెప్పాడు. దీంతో హేమసుందర్ అక్కడకు చేరుకున్నాడు.

ఏఆర్ కానిస్టేబుల్ వచ్చి సూరిపై చేయిచేసుకున్నాడు. ఇంత డబ్బు ఎలా వచ్చిందని.. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్‌కు గానీ, ఆదాయ పన్నుల శాఖ అధికారులకు గానీ చెబితే మొత్తం డబ్బు సీజ్ చేసేస్తారని బెదిరించాడు. లాభం వస్తుందన్న ఆశపడి వచ్చిన శ్రీను, శ్రీధర్‌కు అక్కడ ఏం జరుగుతుందో అర్థం కాలేదు. ఇంతలో హేమసుందర్ తమ మేడం ఏఆర్ ఆర్ఐ స్వర్ణలత ఇక్కడే ఉన్నారని.. ఆమెకు తెలిస్తే విషయం సీరియస్ అవుతుందని హెచ్చరించారు. అలా జరక్కుండా ఉండాలంటే తమకు కొంత డబ్బు ఇవ్వాలని డిమాండ్ చేశారు. శ్రీనును బెదిరించి సూరి రూ.5 లక్షలు, హేమసుందర్, హోంగార్డు వంటాకు శ్రీనులు రూ.10 వేలు, ఏఆర్ ఆర్ఐ స్వర్ణలత రూ.5 లక్షలు కాజేశారు. అనంతరం బాధితుడు శ్రీను డీసీపీ-1 విద్యాసాగర్ నాయుడుకు ఫిర్యాదు చేశారు.

త్వరలో తెలంగాణ టెట్

సాక్షి, హైదరాబాద్: త్వరలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీనిపై వెంటనే కసరత్తు చేపట్టాలని అధికారులను ఆదేశించింది. శుక్రవారం హైదరాబాద్‌లో సమావేశమైన మంత్రివర్గ ఉప సంఘం దీనికి ఆమోదం తెలిపింది. మంత్రులు హరీశ్‌రావు, సబిత, సత్యవతి రాథోడ్, ఇంద్రకరణ్‌రెడ్డి, జగదీశ్ రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ, పాఠశాల విద్య డైరెక్టర్ దేవసేన ఈ సమావేశంలో పాల్గొన్నారు. విద్యాశాఖలో దాదాపు 22 వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీ అంశం చర్చకు వచ్చినట్టు తెలిసింది.

10న పోలవరం డయాఫ్రమ్ వాల్‌పై కీలక భేటీ

- సీడబ్ల్యూసీ, పీపీఏ, డీడీఆర్పీ, రాష్ట్ర జలవనరుల అధికారులతో కేంద్ర జల్‌శక్తి శాఖ ప్రత్యేక కార్యదర్శి సమావేశం



సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టు ఈసీఆర్ఎఫ్ (ఎర్త్ కమ్ రాక్ ఫిల్) డ్యాం పునాది డయాఫ్రమ్ వాల్ నిర్మాణాన్ని ఎలా చేపట్టాలనే అంశంపై చర్చించడానికి కేంద్ర జల్‌శక్తి శాఖ ప్రత్యేక కార్యదర్శి పంకజ్‌కుమార్ సోమవారం ఉన్నతస్థాయి సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) చైర్మన్ కుశ్వీందర్‌సింగ్ వోరా, డ్యాం డిజైన్ రివ్యూ ప్యానల్ (డీడీఆర్పీ) చైర్మన్ ఏబీ పాండ్య, సీఎస్ఎంఆర్ఎస్ (సెంట్రల్ సాయిల్ అండ్ మెటీరియల్ రీసెర్చ్ స్టేషన్) డైరెక్టర్ ఆర్.చిత్ర, వ్యాప్కోస్ సీఈఓ అమన్ శర్మ, పీపీఏ (పోలవరం ప్రాజెక్టు అథారిటీ) సీఈఓ శివ్‌నందన్‌కుమార్, ఎన్‌హెచ్‌పీసీ (నేషనల్ హైడ్రో పవర్ కార్పొరేషన్) మాజీ ఈడీ ఎస్ఎల్ కపిల్, రాష్ట్ర జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్, ఈఎన్‌సీ సి.నారాయణరెడ్డిలతోపాటు ప్రధాన కాంట్రాక్టు సంస్థ మేఘా, సబ్ కాంట్రాక్టు సంస్థలు బావర్, కెల్లర్ సంస్థ ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొంటారు. డయాఫ్రమ్ వాల్ పరిస్థితిపై పీపీఏ సభ్య కార్యదర్శి రఘురాం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తారు. ఈసీఆర్ఎఫ్ డ్యామ్ గ్యాప్-2లో నిర్మించిన పునాది డయాఫ్రమ్ వాల్ గోదావరి వరదల ఉధృతికి 30 శాతం దెబ్బతిందని ఎన్‌హెచ్‌పీసీ తేల్చింది. దెబ్బతిన్న చోట్ల 'యూ' ఆకారంతో కొత్తగా డయాఫ్రమ్ వాల్ నిర్మించి.. పాత దానితో అనుసంధానం చేస్తే సరిపోతుందని డీడీఆర్పీ, సీడబ్ల్యూసీలు తేల్చాయి. కానీ.. పోలవరం ప్రాజెక్టు పురోగతిపై ఈనెల 3న కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ నిర్వహించిన సమావేశంలో సీడబ్ల్యూసీ, డీడీఆర్పీ చేసిన ప్రతిపాదనపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. సీడబ్ల్యూసీ, డీడీఆర్పీ ప్రతిపాదన మేరకు డయాఫ్రమ్ వాల్‌ను సరిదిద్దితే.. పూర్తి సామర్థ్యం మేరకు ఊట నీటికి అడ్డుకట్ట వేసే అవకాశాలు తక్కువని నిపుణులు అభిప్రాయపడ్డారు. దీనిపై షెకావత్ స్పందిస్తూ.. పోలవరం ప్రాజెక్టు భద్రత అత్యంత ప్రధానమని, ఈసీఆర్ఎఫ్ డ్యామ్ గ్యాప్-2లో 1,396 మీటర్ల పొడవునా పాత దానికి ఎగువన కొత్తగా డయాఫ్రమ్ వాల్ నిర్మించాలని సూచించారు. అప్పుడు రెండు డయాఫ్రమ్ వాల్‌లు ఉన్నట్లవుతుందని.. డ్యామ్‌కు పూర్తిస్థాయిలో భద్రత ఉంటుందన్నారు. కొత్త డయాఫ్రమ్ వాల్‌పై సీడబ్ల్యూసీ, పీపీఏ, ఎన్‌హెచ్‌పీసీ, వ్యాప్కోస్, సీఎస్ఆర్ఎంఎస్, డీడీఆర్పీ, రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులు, కాంట్రాక్టు సంస్థల ప్రతినిధులతో చర్చించి సోమవారంలోగా నివేదిక ఇవ్వాలని పంకజ్‌కుమార్‌ను మంత్రి ఆదేశించారు.

ముగిసిన రబీ ఉత్పత్తుల కొనుగోళ్లు

- రికార్డు స్థాయిలో 2022-23లో రూ.513.94 కోట్ల పంట ఉత్పత్తుల సేకరణ
- 2021-22లో సేకరించిన వాటి విలువ రూ.450.61 కోట్లు
- ప్రభుత్వ జోక్యంతో భారీగా పెరిగిన మార్కెట్ ధరలు



సాక్షి, అమరావతి: రబీ ఉత్పత్తుల సేకరణ ముగిసింది. రైతులకు మద్దతు దక్కని పంట ఉత్పత్తులను మార్కెట్ ఇంటర్‌వెన్షన్ స్కీమ్ కింద ప్రభుత్వం రికార్డు స్థాయిలో సేకరించింది. ధరల స్థిరీకరణ ద్వారా ఏటా ప్రతి సీజన్‌లోను మార్కెట్‌లో మద్దతు ధర లభించని పంట ఉత్పత్తులను సేకరిస్తూ నాలుగేళ్లుగా ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోంది. అదే రీతిలో 2022-23లో ఖరీఫ్, రబీ సీజన్లలో మద్దతు ధర దక్కని పంట ఉత్పత్తులను ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఫలితంగా మార్కెట్‌లో వ్యవసాయ ఉత్పత్తుల ధరలు మద్దతు ధరకు మించి పెరిగాయి. సీఎం యాప్ ద్వారా రోజూ మార్కెట్‌లో ధరల హెచ్చుతగ్గులను పర్యవేక్షిస్తూ కనీస మద్దతు ధర దక్కని పంట ఉత్పత్తులను మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేస్తోంది. ఖరీఫ్ 2021 సీజన్ చివరిలో మార్కెట్ ధరలు తగ్గడంతో ప్రభుత్వాదేశాలతో 3,513 మంది రైతుల నుంచి రూ.24.61 కోట్ల విలువైన 8,384 టన్నుల సజ్జలు, పెసలు, మొక్కజొన్న, రాగులు, కందులు సేకరించారు. గడిచిన ఖరీఫ్-2022 సీజన్‌లో సజ్జలు మినహా మిగిలిన పంట ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి ధరలు దక్కడంతో రైతులకు మంచి లాభాలొచ్చాయి. సజ్జలను మాత్రమే ఆర్బీకేల ద్వారా కొనుగోలు చేశారు. 564 మంది రైతుల నుంచి రూ.3.94 కోట్ల విలువైన 1,676 టన్నులు కొనుగోలు చేశారు. రబీ 2021-22 సీజన్‌లో 33,566 మంది రైతుల నుంచి రూ.426 కోట్ల విలువైన 84,773 టన్నుల శనగలు, జొన్నలు, పసుపు, పెసలు సేకరించారు. ఇటీవల ముగిసిన రబీ 2022-23 సీజన్‌లో 39,479 మంది రైతుల నుంచి రూ.510.74 కోట్ల విలువైన 1,39,262 టన్నుల శనగలు, మొక్కజొన్న, పసుపు సేకరించారు. ప్రధానంగా 28,112 మంది రైతుల నుంచి రూ.336.83 కోట్ల విలువైన 63,132 టన్నుల శనగలు, 9,110 మంది రైతుల నుంచి రూ.139.52 కోట్ల విలువైన 71,110 టన్నుల మొక్కజొన్న, 2,257 మంది రైతుల నుంచి రూ.34.39 కోట్ల విలువైన 5,020 టన్నుల పసుపు సేకరించారు. శనగలకు సంబంధించి నూరు శాతం చెల్లింపులు చేయగా, మొక్కజొన్న రైతులకు రూ.139.06 కోట్లు, పసుపు రైతులకు రూ.7.48 కోట్లు చెల్లించారు. మిగిలిన రూ.27.37 కోట్లు చెల్లించేందుకు ఏర్పాట్లు చేశారు. గడిచిన రబీ సీజన్‌లో మార్కెట్ ఇంటర్‌వెన్షన్ స్కీమ్ కింద ప్రభుత్వం జోక్యం చేసుకోవడంతో మొక్కజొన్న ధర రూ.1,500 నుంచి రూ.2 వేలకుపైగా పెరిగింది. అదేరీతిలో కందులు, పెసలు, మినుములు వంటి అపరాల ధరలు కూడా రికార్డు స్థాయిలో పలుకుతున్నాయి. టీడీపీ ప్రభుత్వం ఐదేళ్లలో రూ.3,322.15 కోట్ల విలువైన 9.01 లక్షల టన్నుల పరిమాణం కలిగిన 12 రకాల పంట ఉత్పత్తులను సేకరించగా, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ నాలుగేళ్లలో ఏకంగా రూ.7,712.32 కోట్ల విలువైన 21.56 లక్షల టన్నుల పరిమాణం కలిగిన 17 రకాల పంట ఉత్పత్తులను సేకరించింది. గతంలో ఏన్నడూ లేనివిధంగా అరటి, పత్తి, పొగాకు, బత్తాయి. టమాటా పంట ఉత్పత్తులను కనీస మద్దతు ధరలకు సేకరించి రైతులకు అండగా నిలిచింది.

రైతులకు అండగా నిలిచాం



సీఎం వైఎస్ జగన్ ఆదేశాలతో సీజన్ ప్రారంభంలో ధర లభించని మొక్కజొన్నతో పాటు శనగ, పసుపు పంట ఉత్పత్తులను ఆర్బీకేల ద్వారా ప్రభుత్వం నిర్దేశించిన కనీస మద్దతు ధరలకు సేకరించాం. కేవలం పదిరోజుల్లోనే డబ్బు చెల్లించాం. ఫలితంగా మార్కెట్‌లో ధరలు మళ్లీ పుంజుకున్నాయి.

– రాహుల్ పాండే, ఎండీ, ఏపీ మార్క్‌ఫెడ్

కిసాన్ డ్రోన్లకు రైతుల ఆసక్తి

సాక్షి, అమరావతి: వ్యవసాయంలో డ్రోన్ల వినియోగం ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా తొలిదశలో ఆగస్టులో అన్ని జిల్లాల్లో మొత్తం 500 డ్రోన్లను వినియోగంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టింది. రైతులతోపాటు నిరుద్యోగ యువతకు డ్రోన్ పైలెట్ శిక్షణ ఇస్తున్నారు. జిల్లాకు 20 మంది చొప్పున మొత్తం 520 మందికి డ్రోన్ పైలెట్ శిక్షణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటి వరకు 212 మంది రైతులు, 96 మంది నిరుద్యోగులు డ్రోన్ పైలట్ శిక్షణ పొందేందుకు ప్రతిపాదనలు సమర్పించారు. ఈ మొత్తం 308 మందిలో 203 మందికి ఇప్పటికే శిక్షణ ఇచ్చారు. ఆగస్టు కల్లా రైతు భరోసా కేంద్రాలకు అనుబంధంగా ఉన్న కస్టమ్ హైరింగ్ కేంద్రాల్లో 500 డ్రోన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించినందున మిగతా యూనిట్లకు అవసరమైన వారికి శిక్షణ కోసం ఈ నెల 15వ తేదీలోగా ప్రతిపాదనలు పంపాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) జవహర్‌రెడ్డి కలెక్టర్లను ఆదేశించారు. కస్టమ్ హైరింగ్ సెంటర్‌కి తప్పనిసరిగా ఒక డీజీసీఏ (డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్) సర్టిఫైడ్ పైలెట్ ఉండాలని పేర్కొన్నారు. ఇప్పటికే ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా గుంటూరు లాంలోని వ్యవసాయ డ్రోన్ పరిశోధన కేంద్రమైన సెంటర్ ఫర్ అప్సరాకు డ్రోన్ల రిమోట్ పైలెట్ ట్రైనింగ్ కోర్సుకు డీజీసీఏ అనుమతి ఇచ్చిందని తెలిపారు. అక్కడ ఒక్కో బ్యాచ్‌లో 20 మందికి 12 రోజులు శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. తాడేపల్లిలోని డ్రోగో డ్రోన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కి డీజీసీఏ అనుమతి ఇచ్చిందని, ఇక్కడ పదిరోజుల శిక్షణ ఇస్తారని ఆయన తెలిపారు.

రైతులకు లబ్ధి

వ్యవసాయ కార్యకలాపాల్లో మానవశ్రమను తగ్గించడంతో పాటు వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి, ఉత్పత్తి పెంచడానికి వ్యవసాయ యాంత్రీకరణకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా డ్రోన్ల వినియోగం పెంచుతోంది. పంటల అంచనా, భూ రికార్డుల డిజిటలైజేషన్, పురుగుమందులు, పోషకాలు పిచికారీ చేయడానికి ఇవి ఎంతో ఉపయోగపడతాయి. తద్వారా రైతుల ఉత్పాదక వ్యయం తగ్గి ఆదాయం పెరుగుతుంది.

జిల్లాల వారీగా డ్రోన్ పైలెట్ శిక్షణకు ఇప్పటివరకు ప్రతిపాదించిన రైతులు, నిరుద్యోగ యువత సంఖ్య ఇలా..

జిల్లా	రైతులు	నిరుద్యోగ యువత	జిల్లా	రైతులు	నిరుద్యోగ యువత
			శ్రీకాకుళం	10	3
			విజయనగరం	5	8
అనంతపురం	18	2	ఏలూరు	8	2
పల్నాడు	19	1	శ్రీ సత్యసాయి	9	1
తిరుపతి	9	11	నంద్యాల	4	5
వైఎస్సార్	16	7	ఎన్టీఆర్	9	--
బాపట్ల	15	4	అనకాపల్లి	6	1
గుంటూరు	16	1	చిత్తూరు	--	7
ప్రకాశం	17	--	అంబేడ్కర్ కోనసీమ	3	3
పశ్చిమగోదావరి	3	14	కృష్ణా	6	--
కర్నూలు	4	12	అన్నమయ్య	3	--
కాకినాడ	4	11	పార్వతీపురం మన్యం	2	--
తూర్పుగోదావరి	14	--	విశాఖపట్నం	1	--
ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు	11	3	అల్లూరి సీతారామరాజు	--	--

మాదిగల అభివృద్ధికి.. ఐటీడీఏ తరహా సంస్థను ఏర్పాటుచేయాలి

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బ్రహ్మయ్య మాదిగ



గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): మాదిగల అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రత్యేక ప్యాకేజీ, ఐటీడీఏ తరహాలో ప్రత్యేక సంస్థను ఏర్పాటుచేయాలని ఏపీ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడ జింఖానా మైదానంలో శుక్రవారం రాత్రి మాదిగల జన జాగృతి సభ జరిగింది. ముఖ్య అతిథి బ్రహ్మయ్య మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ, రాజకీయ రంగాల్లో వర్గీకరణ అమలుచేసిందన్నారు. ఎస్సీ కార్పొరేషన్‌ను మూడుగా విభజించిందన్నారు. విద్య, ఉద్యోగాల్లోనూ వర్గీకరణ చేసేందుకు ప్రభుత్వం కృషిచేయాలన్నారు. వర్గీకరణపై సుప్రీంకోర్టులో ఉన్న కేసులో రాష్ట్ర ప్రభుత్వం ఇంప్లీడ్ కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చి విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిందని.. ఈ వ్యవస్థ ద్వారా రాష్ట్రంలో మాదిగల అభివృద్ధిపై సర్వే జరపాలని కోరారు. దీని ఆధారంగా మాదిగల అభివృద్ధికి ప్యాకేజీ ప్రకటించాలని కోరారు. ఇన్నేళ్లయినా మాదిగ ఉద్యమం ఆశించిన ఫలితాలు సాధించలేదని బ్రహ్మయ్య ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్ర ప్రభుత్వం వర్గీకరణ దిశగా కృషిచేస్తూనే మాదిగల అభ్యున్నతికి బాటలు వేయాలన్నారు. ప్రతి జిల్లాలో మాదిగ భవన్‌ను ఏర్పాటు చేసి దానిని విజ్ఞాన కేంద్రంగా తీర్చిదిద్దాలని కోరారు. రాష్ట్రంలో ఏర్పాటుచేయబోయే యూనివర్శిటీకి గుర్రం జాషువా పేరు పెట్టాలని ఆయన కోరారు. ఎమ్మార్పీఎస్ ఉద్యమ సమయంలో మాదిగలపై పెట్టిన కేసులు ఎత్తివేయాలన్నారు. పానుగంటి షాలేం రాజు అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కో-కన్వీనర్ శ్రీధర్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.


ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలకు అండగా ప్రభుత్వం: మంత్రి బొత్స



సాక్షి ప్రతినిధి, విజయనగరం: ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, యాజమాన్యాలు తొందరపడి లాకౌట్ ప్రకటించవద్దని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. వ్యాపారాల నిర్వహణలో ఒడిదుడుకులు వస్తుంటాయని, వాటిని తట్టుకుని నిలబడాలని సూచించారు. మూసివేసిన పరిశ్రమల్లోని కార్మికులకు అవసరమైతే ప్రత్యామ్నాయ ఉపాధి కల్పిస్తామని తెలిపారు. ఆయన శుక్రవారం విజయనగరంలో మీడియాతో మాట్లాడుతూ జిల్లాలోని భీమసింగి సుగర్ ఫ్యాక్టరీని 2004 సంవత్సరంలో చంద్రబాబు హయాంలోనే మూసివేశారని, బొబ్బిలి సుగర్ ఫ్యాక్టరీని అమ్మేసింది కూడా ఆయనేనని చెప్పారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత భీమసింగి సుగర్ ఫ్యాక్టరీని తెరిపించామని తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం 20వేల హెక్టార్లలో చెరుకు పండిస్తున్నారని, ఆ పంటను సంకిలి ఫ్యాక్టరీకి తరలించి రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తున్నామన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఒంటరిగానే పోటీ చేస్తుందని మంత్రి బొత్స స్పష్టం చేశారు. ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలే తమ బలమని, ఇప్పుడున్న సీట్ల కంటే ఎక్కువ సాధిస్తామని ధీమా వ్యక్తంచేశారు. ముందస్తు ఎన్నికలకు వెళ్లాల్సిన అవసరం తమకు లేదన్నారు. ఈ సమావేశంలో ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఎన్నికలు త్వరగా వస్తే మంచిది

- అన్నం తినే వ్యక్తులు జగన్‌కు ఓటేయరు: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు
- పులివెందులలో ఆయన ఓటమి ఖాయం



సాక్షి, అమరావతి: ఎన్నికలు ఎంత త్వరగా వస్తే అంత మంచిదని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు చెప్పారు. తాము ఎన్నికలకు సిద్ధంగా ఉన్నామన్నారు. ముందస్తు ఎన్నికలని వాళ్లే లీకులిచ్చి, వాళ్లే ఖండిస్తారని వైఎస్సార్‌సీపీ నేతలను ఆయన విమర్శించారు. వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన కొందరికి మంగళగిరి టీడీపీ కార్యాలయంలో కండువాలు కప్పి పార్టీలో చేర్చుకున్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. అన్నం తినే వ్యక్తులు జగన్‌కు.. సొంత బాబాయిని చంపిన వ్యక్తికీ ఓటేయరని చెప్పారు. జగన్‌మోహన్‌రెడ్డి పులివెందులలో ఓడిపోవడం ఖాయమని చెప్పారు. సీఎం ఢిల్లీ వెళ్లి ఏం సాధించారో చెప్పాలని డిమాండ్ చేశారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కరెంట్ ఛార్జీలు తగ్గిస్తామని ఆయన హామీ ఇచ్చారు. టమాటా రేటు రూ. 200కు చేరిందని, తమ హయాంలో ధరలు పెరిగితే నియంత్రించామన్నారు. ఉల్లిపాయ ధరలు పెరిగితే తాను నాసిక్ నుంచి వాటిని తెప్పించి ధరలను కంట్రోల్ చేశానని చంద్రబాబు గుర్తుచేశారు. ప్రొద్దుటూరు ఎమ్మెల్యే బకాసురుడని.. ఆయన చేసిన తప్పులను ప్రశ్నించినందుకు నందం సుబ్బయ్య అనే టీడీపీ కార్యకర్తను చంపేశారని ఆరోపించారు. ప్రొద్దుటూరు డెయిరీని ఎందుకు తెరవలేదని ఆయన ప్రశ్నించారు. చిత్తూరు డెయిరీ ఆస్తులను అమూల్‌కు ఇచ్చేశారని, రూ.6 వేల కోట్ల ఏపీ ఆస్తులను అమూల్‌కి కట్టబెట్టారని విమర్శించారు. గుజరాత్ డెయిరీలకు ఇక్కడి జిల్లాలను పంచారన్నారు. అధికారంలోకి వస్తే ఏడాదికి మూడు ఉచిత సిలెండర్లు ఇస్తామని, తల్లికి వందనం పేరుతో ఎంతమంది పిల్లలుంటే అంతమందికి ఏడాదికి రూ.15 వేలు ఇస్తామని చంద్రబాబు చెప్పారు. ముగ్గురు పిల్లలుంటే రూ.45 వేలు, నలుగురు పిల్లలుంటే రూ.60 వేలు ఇస్తామన్నారు.

✻ మనం మాట్లాడుకోవాల్సిందే!

సోషల్ మీడియా ద్వారా చిన్న చిన్న అట్రాక్షన్స్‌కు లోనై 'లవ్' పేరుతో ట్రాఫికింగ్ బారిన పడుతున్న అమ్మాయిల వ్యథలు ఇటీవల ఎన్నో ఉంటున్నాయి. ఈ సమస్య సమాజంలో ఎలాంటి పరిణామాలను సృష్టిస్తుందో, ముందే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో నిపుణులు చెప్పే విషయాలను 'మనం మాట్లాడుకోవాల్సిందే!'


ప్రతీకాత్మక చిత్రం

ఆన్‌లైన్ లవ్ మాయలో పడొద్దు!

'ప్రియ (పేరుమార్చడమైనది) కనిపించక రెండు రోజులవుతోంది. ఏం జరిగిందో తెలియక తల్లిదండ్రులు తల్లడిల్లిపోయారు. కంప్లైంట్ ఇచ్చిన ఒక రోజులోనే ప్రియని తీసుకొచ్చి, తల్లిదండ్రులకి అప్పజెప్పారు పోలీసులు.

వారు చెప్పిన విషయం విన్న తల్లిదండ్రులు ఆశ్చర్యపోయారు.

ప్రియ వయసు పదిహేనేళ్లు. పదో తరగతి చదువుతోంది.

కరోనా టైమ్‌లో ఆన్లైన్ క్లాసెస్ కోసం తండ్రి స్మార్ట్ ఫోన్ కొనిచ్చాడు. ఇప్పటికీ ఆ ఫోన్ తనే వాడుతోంది.

మూడు నెలల క్రితం సోషల్ మీడియాలో ఆమెకు ఒక వ్యక్తి పరిచయం అయ్యాడు. అతని పేరు విక్కీ.

ఫ్రెండ్‌గా ఆమె మంచి చెడులు కనుక్కుంటూ, చాటింగ్ చేస్తూ ఉండేవాడు.

మొదట వాయిస్ కాల్స్, ఆ తర్వాత వీడియో కాల్స్ మాట్లాడుతుండేవాడు.

అతను చెప్పే ప్రేమ కబుర్లు ప్రియకు బాగా నచ్చాయి. అమ్మానాన్నలు ఎంతసేపూ చదువు చదువు అని అంటుంటారు. కానీ, వాటి గురించి విక్కీ మాట్లాడడు.

ఒక్కరోజు విక్కీ చాట్ చేయకపోయినా, ఫోన్‌లో మాట్లాడకపోయినా ప్రియకు ఊపిరాడనట్లుండేది.

విక్కీ ఏం చెప్పినా ప్రియ వెనకాడకపోయేది.

రోజు రోజుకూ విక్కీ లేకపోతే తను బతకలేనని అనిపించసాగింది ప్రియకు.

దీంతో ఓ రోజు విక్కీ చెప్పిన చోటుకు వెళ్లిపోవాలనుకుంది.

దాంతో తల్లికి తెలియకుండా డబ్బులు తీసుకుని చెప్పకుండా వెళ్లిపోయింది.

ఎవరికైనా చెబితే పరువు పోతుందనే భయం ఓ వైపు, కూతురు ఏమైందోననే భయం మరోవైపు వారిని కుదిపేసింది.

తల్లిదండ్రులు ఇచ్చిన కంప్లైంట్‌తో.. ప్రియ ముంబైకి చేరుకున్నట్టు కనిపెట్టిన పోలీసులు, ఆమెను సురక్షితంగా తిరిగి తీసుకొచ్చారు. ఇలాంటి కథనాలు ఇటీవల మనం తరచూ వింటున్నాం.

– నిర్మలారెడ్డి

- **ఆన్‌లైన్‌లోనే కాదు బయట కూడా అమ్మాయిలను ట్రాప్ చేయడానికి చిన్న చిన్న ఆకర్షణ పథకాలను అమలు చేసేవారుంటారు.**
- **మైనర్ అమ్మాయిలు/అబ్బాయిలు పరిచయం లేని వ్యక్తులు ఇచ్చే కానుకలకు కూడా అట్రాక్ట్ అవుతుంటారు.**
- **అవతలి వారు చెప్పేది నిజం అని నమ్మి, ఇంటిని వదిలి వెళ్లిపోతుంటారు.**
- **ఇంట్లో ప్రేమ దక్కలేదనో, మరో కారణం చేతనో బయటి వ్యక్తుల పట్ల ఆకర్షితులవుతుంటారు.**

పెద్ద శిక్ష

అలవాట్లు రుగ్మతలు అవుతున్నాయి. రుగ్మతలుగా మారడం వల్లే నేరాలు కూడా భిన్నంగా మారిపోయాయి. ఇంటర్నెట్ వల్ల మంచి ఎంత పెరిగిందో, చెడు అంతకన్నా ఎక్కువ పెరిగింది. కొందరికి ఇదొక ఉపయోగకరమైన అడిక్షన్‌గా కూడా మారింది. ప్రతిదీ అందుబాటులోకి వచ్చిన ఈ రోజుల్లో అందరిలోనూ కాన్ఫిడెన్స్ లెవల్స్ కూడా పెరిగాయి. దేనికోసం మనం ముందుకు వెళుతున్నాం అనే స్పష్టత ప్రతి ఒక్కరిలోనూ ఉండాలి. షార్ట్‌కట్స్‌లో సంపాదించాలనే ఆలోచన వల్ల కూడా సైబర్ క్రైమ్స్ పెరుగుతున్నాయి. చూడకూడనివి ఎక్కువ చూడటం వల్ల మనస్తత్వాలు మారుతున్నాయి. ఫోన్ చూడద్దని, ఇంటర్నెట్ చూడద్దని, ఎక్స్‌పోజర్ తగ్గించుకోమని చెప్పలేం. ఇవన్నీ మన జీవితంలో భాగమైనప్పుడు ఎలా డీల్ చేయాలో తెలుసుకోవడం మాత్రమే ఈ రోజుల్లో కుటుంబాలకు అవసరం. ఈ రోజుల్లో మైనర్లు ఇంటర్నెట్‌లో ఎక్కువ ఉంటున్నారు. వారిని గమనిస్తూ, మంచి చెడులను చర్చిస్తూ ఉండాలి. ప్రేమ, పెళ్లి పేరుతోనో వెళ్లిపోయారని, వీటిని మిస్సింగ్ కేస్ కింద చూడం. కిడ్నాప్ కింద రిజిస్టర్ చేస్తాం. ట్రేస్ అవగానే రేప్ సెక్షన్స్ యాడ్ చేస్తాం. ఒక్కసారి పోక్సో కేసు కింద నమోదు చేసిన తర్వాత నేరస్తులకు శిక్ష భారీ ఎత్తున పడుతుంది. నాన్‌బెయిలబుల్ సెక్షన్స్ కింద కేస్ బుక్ అవుతుంది. మైనర్‌ని తీసుకువెళ్లి, పెళ్లి చేసుకున్నా అది చట్టరీత్యా నేరం. మైనర్ అమ్మాయి లేదా అబ్బాయి ఇద్దరిలో ఎవరు మిస్ అయినా దానిని ట్రాఫికింగ్‌కు సంబంధించిన సెక్షన్స్ కింద కేస్ రిజిస్టర్ చేస్తాం. రూరల్, అర్బన్ ఏరియాల్లో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తుంది. ఆన్‌లైన్ ప్రేమల జోలికి వెళ్లకుండా ఉండటమే ఉత్తమం.



– సుమతి, ఐపీఎస్, డీఐజీ, ఉమెన్ సేఫ్టీ వింగ్, తెలంగాణ

ఇదొక వ్యసనం

పరిచయం లేని వ్యక్తులు తమ పట్ల చూపే కన్‌సర్న్‌ని నిజమైన ప్రేమ అనుకొని భ్రమిస్తుంటారు కొందరు. ఈ మోహం ఆమె/అతడి ఆరోగ్యం, భవిష్యత్తు సంబంధాలను ప్రభావితం చేస్తుంది. న్యూరలాజికల్ కెమికల్ అయిన ఫినైల్ ఇథైలమైన్ పెరగడం వల్ల ప్రేమభావాలు కలుగుతాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. మోహానికి గురైన వ్యక్తులు ఆల్కహాల్, డ్రగ్స్ వంటి అలవాట్లకు కూడా లోనవుతుంటారు. వారిలో ఆనందపు స్థాయిలను పెంచుకోవడానికి రకరకాల మార్గాలను అన్వేషిస్తుంటారు. ఇందుకు సినిమాలు, ఇంటర్నెట్ పోర్న్ సదుపాయాలు కూడా పిల్లల మెదళ్లపై ప్రభావం చూపుతున్నాయి. ఇదొక వ్యసనం అని చాలామంది గుర్తించరు. ఆన్‌లైన్ రిలేషన్‌షిప్స్ తల్లిదండ్రులకు తెలియడం లేదు. పిల్లల ఆన్లైన్ నెట్‌వర్కింగ్ గురించి తల్లితండ్రులకు, కౌన్సెలింగ్ థెరపీ ద్వారా పిల్లల్లోనూ మంచి మార్పులు తీసుకురావచ్చు. స్కూళ్లు, కాలేజీల్లో కూడా 'లవ్, రిలేషన్‌షిప్స్' డిజిటల్ వాడకం, ఏది నమ్మాలి, ఏది నమ్మకూడదు అనే విషయాల పైన అవగాహన తరగతులు తీసుకోవాలి.



– డాక్టర్ గిడియన్, డి-అడిక్షన్ థెరపిస్ట్ లివింగ్ సోబర్, హైదరాబాద్

బ్యూటిప్స్



పాల నిగారింపు

- పచ్చిపాలు, రోజ్ వాటర్‌ను సమపాళ్లల్లో తీసుకుని కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లై చేసి వలయాకారంగా మర్దన చేయాలి. పదినిమిషాల తరువాత కాటన్ బాల్‌తో తుడిచేసి గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి.
- పచ్చిపాలలో చిటికెడు ఉప్పు వేసి కలిపి, ముఖానికి అప్లై చేయాలి. ఐదు నిమిషాలు మర్దన చేసి చల్లటి నీటితో కడిగేయాలి.
- రెండు టేబుల్ స్పూన్ల వేపాకు పేస్టులో టేబుల్ స్పూను తేనె, ఒకటిన్నర టేబుల్ స్పూన్ల పచ్చి పాలు పోసి పేస్టులా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లై చేయాలి. పూర్తిగా ఆరాక గోరు వెచ్చని నీటితో కడిగేయాలి. వారంలో మూడు సార్లు ఈ ప్యాక్ వేసుకోవడం వల్ల మొటిమలు పోయి ముఖం ఫ్రెష్‌గా కనిపిస్తుంది.
- పచ్చిపాలు ఎండవేడికి పాడైన చర్మాన్ని సంరక్షించడంలో ప్రముఖ పాత్ర పోషిస్తాయి. తేమ కోల్పోయిన చర్మానికి తేమనం దిస్తాయి. రోజూ క్రమం తప్పకుండా రెండు పూటలా ఈ వీటిలో ఏదైనా ఒక పద్ధతిని అనుసరిస్తే ముఖం మీద మొటిమలు వాటి తాలుకూ మచ్చలు పోయి ముఖం నిగారింపుతో మెరిసిపోతుంది.

కిచెన్ టిప్



ఊరగాయలను నిల్వచేసుకునే చిన్న జాడీలను పొడిగా ఆరబెట్టిన తరువాత, వేడివేడి నూనెను జాడీలోపల రాయాలి. తరువాత ఊరగాయ పెడితే బూజు పట్టదు. రోజూ మూతతీసి వాడుతున్నప్పటికి పచ్చడి ఎక్కువరోజులపాటు నిల్వ ఉంటుంది.

ఇంటిప్స్



- వానాకాలంలో బట్టలను ఉతికాక కర్పూరం కలిపిన నీటిలో జాడించడం వల్ల దుస్తుల నుంచి దుర్వాసన రాకుండా ఉంటుంది. ఆరీ ఆరని దుస్తులను ఇస్త్రీ చేసినా అదోవిధమైన వాసన వస్తాయి. అందువల్ల దుస్తులు పూర్తిగా ఆరిన తర్వాతనే ఐరన్ చేయాలి.
- అల్మారా లో బట్టలను పెట్టేముందు అక్కడక్కడ కొన్ని కర్పూరం బిళ్లలు ఉంచాలి. దీనివల్ల చిమటల వంటి కీటకాలు చేరకుండా ఉంటాయి. అంతేకాకుండా బట్టల్లో దుర్వాసన తొలగిపోతుంది.

చదువు.. సంస్కారం.. పర్యావరణం

పదో తరగతి చదివే పిల్లలు... స్కూలు, ట్యూషన్లు అంటూ బిజీబిజీగా ఉంటారు. ఆఖరి పరీక్షలు పూర్తయ్యేవరకు చదువు తప్ప మరో ధ్యాస ఉండదు వీరికి. అలాంటిది లితిషా బగాడియా చదువుతో పాటు చుట్టుపక్కల పేరుకుపోయిన చెత్తను నిర్మూలిస్తూ పర్యావరణ పరిరక్షణకు నడుం బిగించింది. గత రెండేళ్లుగా వివిధ రకాల కార్యక్రమాలతో ప్రకృతి సంరక్షణకు కృషిచేస్తోన్న లితిషాను 'ద ప్రిన్సెస్ డయానా క్లైమెట్ యాక్షన్' అవార్డు వరించింది. ఈ అవార్డుతో పిల్లలకు చదువు, సంస్కారంతోపాటు పర్యావరణ స్పృహ కూడా ఉండాలి అనడానికి ఉదాహరణగా నిలుస్తోంది లితిషా.

ముంబైకు చెందిన లితిషాకు... చెత్తపేరుకుపోయిన నగరాల జాబితాలో ముంబై కూడా ఉండడం నచ్చలేదు. దీంతో నగరాన్ని శుభ్రం చేయాలనుకుంది. అదే విషయాన్ని తన స్నేహితురాలు సియా జోషికి చెప్పింది. ఇద్దరూ కలిసి ఎన్జీవోని ఏర్పాటు చేసి ముంబైని క్లీన్ చేద్దామనుకున్నారు. కానీ ఆ సమయంలో కరోనా ఆంక్షలు ఉండడంతో బయటకు రావడం కుదరలేదు. దీంతో 2021 ఆగస్టు 31న 'ఐకా' ఫౌండేషన్‌ను ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రారంభించారు. ఐకా ద్వారా... పర్యావరణ సమస్యలు, వ్యర్థాల నిర్వహణ, టపాసులు కాల్చడం, నీటి వృథా... వంటి అంశాలపై ప్రచారం చేస్తూ అవగాహన కల్పించేవారు. ఇది నచ్చిన కొంతమంది ఔత్సాహికులు ముందుకు రావడంతో వారితో కలిసి చెత్తను శుభ్రం చేయడం మొదలు పెట్టారు. వీరికి మరి కొంతమంది తోడవడంతో అంతా సమూహంగా ఏర్పడి పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలను విస్తరించారు.


లితిషా బగాడియా


సియా జోషి

■ **పూల నుంచి పెర్‌ఫ్యూమ్స్**

ప్రాజెక్ట్ 'అవిఘ్న' పేరుతో... వినాయక చవితి వేడుకల్లో మండపాల దగ్గర చల్లే పూలు, ఇతర పండుగల్లో వాడేసిన పూలను, నిమజ్జనం తరువాత మిగిలిపోయే ఇనుము వ్యర్థాలను సేకరించి రీసైక్లింగ్‌కు తరలిస్తున్నారు. ఈ పూలను పెర్‌ఫ్యూమ్స్‌గా, ఎరువులుగా మార్చడం వల్ల నిరుపేదలకు ఆదాయం కూడా వస్తోంది. గణేష ఉత్సవాల్లో మూడువందల కేజీలకు పైగా పూల వ్యర్థాలను సేకరించి 'మోబి ట్రాష్' అనే స్టార్టప్‌కు అందించారు. ఈ స్టార్టప్ పూలను గిరిజన, మురికివాడల్లోని నిరుపేదలకు ఇచ్చి అగరు బత్తీలు, రంగులు తయారు చేయించి వారికి ఉపాధి కల్పిస్తోంది. దీనిద్వారా నగరంలో చెత్త శుభ్రం అవడమేగాక, పరిసరాలు పరిశుభ్రంగా మారుతున్నాయి.

■ **ఈ వేస్ట్‌తోపాటు బీచ్‌క్లీనింగ్**

వాడిపడేసిన ల్యాప్‌టాప్స్, ఫోన్ ఛార్జర్లు, ఇయర్‌ఫోన్స్ వంటి ఎలక్ట్రానిక్ వేస్ట్‌ను కూడా సేకరించి ఈ వేస్ట్ రీసైక్లింగ్ సెంటర్లకు చేరవేస్తున్నారు. స్వాతంత్య్ర దినోత్సవం రోజున ప్రత్యేకంగా 'ఈ వేస్ట్ కలెక్షన్ డ్రైవ్' నిర్వహించి వేస్ట్ సేకరిస్తున్నారు. 'బీచ్‌క్లీన్ – అప్' కార్యక్రమాలు నిర్వహిస్తూ.. బీచ్‌లో దొరికిన ప్లాస్టిక్ వ్యర్థాలను 'శక్తి ప్లాస్టిక్స్' కంపెనీకి ఇస్తున్నారు. ఈ కంపెనీ ప్లాస్టిక్ వ్యర్థాలను రీసైకిల్ చేసి ఫర్నీచర్, ఇతర వస్తువులను తయారు చేసి విక్రయిస్తోంది. ఇవేగాక ఏడోతరగతి లోపు పిల్లలకు వర్క్‌షాప్స్ ద్వారా పర్యావరణ ప్రాముఖ్యత, కాలుష్యం నుంచి పర్యావరణాన్ని ఎలా కాపాడుకోవాలో అవగాహన కల్పిస్తున్నారు. హోలీ, దీపావళి సమయాల్లో ఇకోఫ్రెండ్లీ సంబరాలు జరుపుతూ.. పర్యావరణంపై అవగాహన కల్పిస్తున్నారు.

■ **చదువుతూనే...**

ఇంకా జీవితంలో స్థిరపడేంతగా చదువుకోలేదు. అయినా ఇన్ని కార్యక్రమాలతో బిజీగా ఉన్న ఈ ఇద్దరూ ప్రస్తుతం తమ కాలేజీ చదువుని నిర్లక్ష్యం చేయకుండా ముంబైని క్లీన్ చేయడం విశేషం. తల్లిదండ్రుల ప్రోత్సాహం కూడా ఉండడంతో.. భవిష్యత్‌లో పర్యావరణ అవగాహన కార్యక్రమాలను దేశంలోని మరిన్ని నగరాలకు విస్తరిస్తామని ఈ చిచ్చరపిడుగులు చెబుతున్నారు. నేటి బాలలే రేపటి పౌరులు, ఇలాంటి బాలలు మరింతమంది తయారైతే మన దేశ భవిష్యత్ ఉజ్వలంగా వెలిగిపోతుంది.


'ఐకా' టీమ్

"ఈ అవార్డు వచ్చినందుకు ఎంతో సంతోషంగా ఉంది. నా స్నేహితురాలు, ఐకా ఫౌండేషన్ సహవ్యవస్థాపకురాలు సియా జోషి నా వెన్నంటే ఉండి ప్రోత్సహించడం వల్లే ఈ గౌరవం దక్కింది. అందుకే మరిన్ని ప్రాజెక్టుల ద్వారా అందరిలో అవగాహన కల్పిస్తూ.. పర్యావరణాన్ని కాపాడుతాము" అని లితిషా బగాడియా చెబుతోంది.

గోయింగ్ సోలో

● ఇద్దరు విజేతల అరుదైన కథ

స్వేచ్ఛను ప్రేమించే మనిషి బంధనాలతో పుట్టాడు. చాలామంది ఆ బంధనాలలోనే ఉండిపోతారు. కొందరు మాత్రం స్వేచ్ఛ గురించి తపిస్తారు. తాము ఎప్పుడూ నడిచే దారి నుంచి పక్కకు వచ్చి కొత్త దారిలో ప్రయాణిస్తారు. అద్భుతాలు సృష్టిస్తారు. గరీమ శంకర్, రేణు సింఘీ ఈ కోవకు చెందిన మహిళలు. వీరి జీవితంపై 'గోయింగ్ సోలో' అనే డాక్యుమెంటరీ ఫిల్మ్ వచ్చింది...

స్ఫూర్తి



'ఆడపిల్లలు సైకిల్ తొక్కడమేమిటి!' అని ఆశ్చర్యపోయే కుటుంబాల్లో పుట్టారు గరీమ శంకర్, రేణు సింఘీలు చిన్నప్పుడు సైకిల్‌ను చూడడం తప్ప నడిపింది లేదు. సైకిల్‌పై జెట్ స్పీడ్‌తో దూసుకుపోయేవాళ్లను చూసి ఆశ్చర్యపడేవారు. అలాంటి వారు సైకిలింగ్‌లో అద్భుతాల సృష్టిస్తారని ఎవరూ ఊహించలేదు.

'గోయింగ్ సోలో' డాక్యుమెంటరీలో వారి అంతర్, బహిర్ ప్రయాణం ఉంటుంది. నాలుగు గోడల మధ్య ఇంటికి పరిమితమైన రోజుల నుంచి లండన్-ఎడిన్‌బర్గ్-లండన్ (ఎల్‌ఈఎల్) లాంటి ప్రతిష్ఠాత్మకమైన సైకిలింగ్ ఈవెంట్స్ వరకు చేసిన ప్రయాణం కళ్లకు కడుతుంది.

'వారి జీవితాల్లో సైకిలింగ్‌కు మించి చెప్పవలసిన విషయాలు చాలా ఉన్నాయి అనిపించింది. వారి జీవితాల్లోని అద్భుతాలను ఆవిష్కరించడానికి సైకిల్ అనేది ఒక సాధనం మాత్రమే' అంటాడు 'గోయింగ్ సోలో' డైరెక్టర్ అమీ గోర్.

దిల్లీలోని ఒక సంపన్న కుటుంబంలో పుట్టిన గరీమకు స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు తప్ప ఏ లోటూ లేదు. టీనేజ్‌లో ఉన్నప్పుడు అందరిలాగా తాను కూడా రోడ్డు మీద సైకిల్ తొక్కాలనుకునేది. సైకిల్ తొక్కడం మాట ఎలా ఉన్నా ఇల్లు దాటి బయటికి రావడమే గగనంగా ఉండేది. తల్లిదండ్రులు ఆమెను పొరపాటున కూడా బయటికి పంపేవారు కాదు.

గరీమకు పెళ్లి అయింది. ఆ తరువాత ఒక బిడ్డకు తల్లి అయింది. బాగా బరువు పెరిగింది. అది తనకు చాలా ఇబ్బందిగా మారింది. బరువు తగ్గడానికి మార్గాల గురించి ఆలోచిస్తున్న సమయంలో తనకు ఇష్టమైన సైకిలింగ్ గుర్తుకు వచ్చింది. టీనేజ్‌లో ఉన్నప్పుడు తమ్ముడి ద్వారా సైకిల్ తొక్కడం నేర్చుకుంది. అయితే ఆమె సైకిల్ యాత్ర ఇంటిపరిసరాలకే పరిమితం.


బరువు తగ్గడం మాట ఎలా ఉన్నా సైకిలింగ్ ద్వారా తాను ఒంటరిగా రోడ్డు మీదికి వచ్చింది. నగరంలో ప్రతి వీధిని చూసే అవకాశం వచ్చింది. అంతా కొత్తగా ఉంది. చాలా ఉత్సాహంగా ఉంది! ఇక అప్పటి నుంచి రెగ్యులర్ రైడర్‌గా మారింది. సైకిల్ లేకుండా ఆమెను చూడడం అరుదైపోయింది.

సైకిలింగ్‌పై గరీమ ఆసక్తిని గమనించిన సన్నిహితులు 'లక్ష్యం ఏర్పాటు చేసుకో. విజయం సాధించు' అని చెప్పేవారు. దీంతో తన కంఫర్ట్ జోన్ నుంచి బయటికి వచ్చి కొత్త అడుగులు వేసింది. సైకిల్ ఈవెంట్స్‌లో పాల్గొనడం ప్రారంభించింది. ఆ రేసులను విజయవంతంగా పూర్తి చేసిన తరువాత తన మీద తనకు ఎంతో నమ్మకం వచ్చేది. తెలిసినవాళ్లు లండన్-ఎడిన్‌బర్గ్-లండన్ (ఎల్‌ఈఎల్) సైకిల్ ఈవెంట్‌కు ప్రిపేర్ అవుతున్న సమయంలో షెడ్యూల్‌కు మూడు నెలల ముందు తన పేరును రిజిస్ట్రేషన్ చేయించుకుంది.

'నిజానికి అదొక అసాధ్యమైన లక్ష్యం. కాని ఏదో ధైర్యం నన్ను ముందుకు నడిపించింది' అంటున్న గరీమ ఎల్‌ఈఎల్‌లో 125 గంటలలో 1,540 కిలోమీటర్లు దూరం సైకిలింగ్ చేసింది. గరీమ ఉత్సాహం, సాహసానికి ముచ్చటపడిన ఎల్‌ఈఎల్ కమ్యూనిటీ ఆమెను మెడల్‌తో సత్కరించింది.

ఇక రాజస్థాన్‌కు చెందిన రేణు సింఘీ విషయానికి వస్తే పెళ్లికి ముందు అంతంత మాత్రంగా ఉన్న స్వేచ్ఛ ఆ తరువాత పూర్తిగా పోయింది. వంట నుంచి పిల్లల పెంపకం వరకు పూర్తిగా ఇంటికే పరిమితం కావాల్సి వచ్చింది. తన కుమారుడికి సైకిల్ కొనడానికి ఒకరోజు బైక్‌షాప్‌కు వెళ్లింది. తన కోసం కూడా ఒక సైకిల్ కొన్నది. అప్పటికి ఆమె వయసు 52 ఏళ్లు. 'ఈ వయసులో సైకిల్ తొక్కడమేమిటి' అనేవారు కుటుంబసభ్యులు. అయితే అవేమీ పట్టించుకోకుండా లాంగ్-డిస్టెన్స్ సైకిలింగ్ ఈవెంట్స్‌లో పాల్గొని అందరినీ ఆశ్చర్యపరిచేది. ఆ తరువాత ఇంటర్నేషనల్ ఈవెంట్స్‌పై దృష్టి పెట్టింది.

'మనకు నచ్చింది చేయాలి. వయసు అనేది అడ్డు కాదు' అంటున్న సింఘీ ఎల్‌ఈఎల్-ఈవెంట్ విజయవంతంగా పూర్తి చేసిన తొలి భారతీయ మహిళగా చరిత్ర సృష్టించింది.


గరీమ శంకర్


రేణు సింఘీ

దిల్లీ నుంచి ఇంగ్లాండ్ వరకు...

అమ్మీ మీడియా (న్యూయార్క్), ఖాన్ అండ్ కుమార్ మీడియా (ఇండియా) నిర్మించిన 'గోయింగ్ సోలో'ను దిల్లీ, ఊటీ, జైపూర్, జోద్‌పూర్, ఇంగ్లాండ్, స్కాట్లాండ్‌లో చిత్రీకరించారు. 70 నిమిషాల నిడివి ఉన్న ఈ డాక్యుమెంటరీకి అమీ గోర్ దర్శకుడు. టీవి, షార్ట్‌ఫిల్మ్, డాక్యుమెంటరీలలో పది సంవత్సరాల అనుభవం ఉంది. 'వారి అనుభవాలు, ప్రయాణం నన్ను ఎంతో ఉద్వేగానికి గురిచేశాయి. రకరకాల పరిస్థితులు లేదా వయసును కారణంగా చూపి తమకు తాము రకరకాల పరిమితులు విధించుకునే ఎంతోమందికి ఈ డాక్యుమెంటరీ స్ఫూర్తి ఇస్తుంది' అంటున్నాడు డైరెక్టర్ అమీ గోర్.



మీ నోరు బాగుందా?

నోరు మంచిదయితే ఊరు మంచిదవుతుందన్నది సామెత. అందులోని నిజానిజాల సంగతి ఎలా ఉన్నా, మన నోరు బాగుంటే ఆరోగ్యం బాగుంటుందన్నది వైద్య నిపుణుల మాట. కొందరి నోటి నుంచి చెడు వాసన వస్తుంటుంది. అది వారికి తెలియదు. ఒకవేళ తెలిసినా, అది కేవలం నోటి సమస్య మాత్రమే అనుకుని నోటిని పుక్కిలించి ఉమ్మెయ్యడం, మౌత్‌వాష్‌లను వాడటం వంటివి చేస్తారు. కానీ, చెడు శ్వాస అనారోగ్యానికి సంకేతమనే సంగతి మీకు తెలుసా?

అవును. అది నిజం. బాగా బ్రష్ చేసిన తర్వాత కూడా నోటి నుంచి దుర్వాసన వస్తుంటే తప్పకుండా అనుమానించాలి. శరీరంలో నీరు తగ్గినట్లయితే.. ఆకలి వేస్తుందనే తప్పుడు సంకేతాలు ఇస్తుంది మెదడు. ఆ సమయంలో ఆహారానికి బదులు నీళ్ల తీసుకోవడం మంచిది. ఎందుకంటే.. నోరు పొడిబారితే లాలాజలంలో ఉండే యాంటీబ్యాక్టీరియల్ గుణం తగ్గిపోయి నోటినుంచి చెడు వాసన వస్తుంది.

అలర్జీలు కూడా కారణమే

నోటి శుభ్రత పాటించకపోవడం, అలర్జీల వంటి సమస్యల వల్ల కూడా శ్వాస దుర్వాసన వస్తుంది. ఒకవేళ మీరు నోటిని శుభ్రంగా ఉంచుకుంటూ.. తగినన్ని నీళ్ల తాగే అలవాటు ఉన్నా సరే నోరు చెడు వాసన వస్తుంటే తప్పకుండా వైద్యులను సంప్రదించాలి.

టాన్సిల్ స్టోన్స్ వల్ల కూడా నోటి నుంచి చెడు వాసన వస్తుంది. కాబట్టి ఒకసారి పరీక్షలు చేయించుకోవడం ఉత్తమం.

వివిధ అనారోగ్య సమస్యలు, చెడు అలవాట్ల వల్ల కూడా నోటినుంచి దుర్వాసన వస్తుంది.

ప్రతి రెండు మూడు నెలలకోసారి టూత్ బ్రష్‌ను మార్చడం ముఖ్యం, అలాగే నాలుక స్క్రాపర్, ఫ్లాసర్ కూడా మార్చాలి. ఈ సాధనాలు మీ దంతాలు, చిగుళ్ళు, నాలుకను శుభ్రంగా ఉండేలా చూస్తాయి. పంటినొప్పి, చిగుళ్ళలో వాపు వంటి బాధాకరమైన పరిస్థితులకి దారితీసే అసౌకర్యాలను నివారిస్తాయి. భోజనం చేసిన తర్వాత ఉప్పునీటితో నోటిని పుక్కిలించడం సహజమైన మౌత్‌వాష్‌గా పని చేస్తుంది, ఇది మీ నోటి పరిశుభ్రతను మరింత మెరుగుపరుస్తుంది.

సరైన నోటి పరిశుభ్రత కోసం సాఫ్ట్-బ్రిస్టల్ బ్రష్, టూత్‌పేస్ట్, ఫ్లాస్, టంగ్ క్లీనర్, మౌత్ వాష్ వంటి ముఖ్యమైన ఉత్పత్తులను తప్పకుండా ఉపయోగించాలి. అప్పుడే నోటి ఆరోగ్యం బాగుండి, ఎలాంటి రోగాలు దరిచేరకుండా ఉంటాయి.

గుండె జబ్బులను నివారించాలని అనుకునే వారు ఉదయం బ్రేక్ ఫాస్ట్‌కు ముందు పళ్ల తోముకోవడం ఎంత ముఖ్యమో రాత్రి భోజనం తర్వాత నిద్రకు ఉపక్రమించే ముందు పళ్ల తోముకోవడం కూడా అంతే ముఖ్యమని అధ్యయనకారులు సలహా ఇస్తున్నారు. కొన్ని ఆహారాలు మీ చిగుళ్ళను బలంగా ఇంకా దంతాలు ఎక్కువ కాలం ఉండేలా చేస్తాయి. చిగుళ్ళు తగినంత బలంగా లేకుంటే, దంతాలు ఊడిపోతాయి. అందువల్ల, చిగుళ్ళను దృఢంగా చేయడం కోసం మంచి ఆహారాన్ని తీసుకోవటం అవసరం.

నోటి దుర్వాసన అరికట్టేందుకు చిట్కాలు

- దుర్వాసన కేవలం నోటి నుంచే వస్తున్నట్లయితే.. రోజూ ఉదయాన్నే పళ్లు తోమగానే తప్పకుండా నాలుకను శుభ్రం చేసుకోవాలి.
- ఏదైనా ఆహారాన్ని తిన్న తర్వాత నీటితో నోరు పుక్కిలించి ఉమ్మేయాలి. నోటిలో ఆహారం ఎక్కువసేపు ఉన్నట్లయితే బ్యాక్టీరియా ఏర్పడే అవకాశం ఉంది. అది నోటిలో దుర్వాసన కలిగిస్తుంది కాబట్టి అప్పడప్పడు కొన్ని నీటిని తాగుతుండాలి.
- రోజూ ఆపిల్ లేదా క్యారట్లను తినడం ద్వారా కూడా నోటిలో ఉండే మలినాలను తొలగించవచ్చు.
- కాఫీ ఎక్కువగా తాగినా సరే దుర్వాసన వస్తుంది కాబట్టి కాఫీకి బదులు గ్రీన్ టీ తాగడం మేలు. ఎందుకంటే గ్రీన్ టీ శ్వాసను మెరుగుపరుస్తుందని పరిశోధనల్లో తేలింది.
- యాలుక్కాయను నోటిలో వేసుకుని చప్పరిస్తూ ఉండాలి.
- దాల్చిన చెక్క, లవంగం కూడా మంచిదే.



అనారోగ్య కారణాలు కావచ్చు..!

కిడ్నీలు సరిగా పని చేయకపోతే రక్తంలో ఉండే వ్యర్థాలు, మలినాలు పేరుకుపోతాయి. ఆ ప్రభావం నాలుకపై ఉండే టేస్ట్ బడ్స్‌పై పడుతుంది. ఫలితంగా తినే ఆహారం రుచిగా అనిపించదు. పైగా ఏదో లోహాన్ని నోటిలో పెట్టుకున్నట్లుగా అనిపిస్తుంది. అంతేగాక.. చెడు రక్తం వల్ల ఊపిరితిత్తుల్లోకి కూడా చేరుతుంది. దానివల్ల శ్వాస క్రియ సమయంలో రక్తంలో ఉండే మలినాలు మనం వదిలే కార్బన్ డై ఆక్సైడ్‌లో కలుస్తాయి. ఆ గాలి బయటకు వచ్చినప్పుడు శ్వాస దుర్వాసనతో కూడి ఉంటుంది. కాబట్టి.. ఆ రెండు లక్షణాలు కనిపించినప్పుడు తప్పకుండా వైద్యులను సంప్రదించడం అవసరం. ఎందుకంటే నోరు బాగుంటేనే ఆరోగ్యం బాగుంటుంది!

మీకు తెలుసా?





పూర్వం 15 ఏళ్ల వయసుకే ఆడపిల్లలకు పెళ్లి చేసేవాళ్లు కాబట్టి రజస్వల అయిన వెంటనే పెళ్లి చేయాలని ఆ సమయంలో నేతితో తయారు చేసిన స్వీట్లు ఎక్కువగా తినిపించేవాళ్లు. నిజానికి రజస్వల అయినప్పుడే కాదు, ఏ వయసు పిల్లలకయినా స్వీట్లు, నేతి పదార్థాలు ఎక్కువగా పెట్టకూడదు. పైగా రజస్వల అయిన పిల్లలను కొద్దికాలం పాటు ఇంటికే పరిమితం చేస్తారు కాబట్టి పిల్లలు ఆ కొద్దిరోజుల్లో విపరీతంగా బరువు పెరగటంతోపాటు ఆ ఆహార శైలికి అలవాటు పడి అలాగే కొనసాగుతారు. అధిక బరువు వల్ల హార్మోన్లలో అవకతవకలు మొదలవుతాయి. ఇది ప్రమాదకరం. రజస్వల సమయంలో హార్మోన్ల స్రావాలు ఎక్కువగా ఉంటాయి కాబట్టి ఉప్పు, కారాలు, మసాలాలు తగ్గించి ప్రొటీన్లు ఎక్కువగా ఉండే ఆహారాన్ని ఇవ్వాలి. రక్తస్రావం ఎక్కువగా ఉండి ఐరన్ లోపం ఏర్పడుతుంది కాబట్టి ఈ సమయంలో ఆకుకూరలు, గుడ్లు ఎక్కువగా ఇవ్వాలి. క్యాల్షియం, విటమిన్ డి లోపాలు రాకుండా పాలు ఇవ్వడంతోపాటు వేరుసెనగ పప్పు, బెల్లం, ఖర్జూరాలు, పప్పులు, అటుకులు, రాగులు, నువ్వులతో తయారుచేసిన చిరుతిళ్ల తినిపించాలి.



ఏదీ బీట్ చేయలేదు..!

ఎండలు ఇప్పుడిప్పుడే తగ్గుముఖం పడుతున్నాయి. చిటపటా చినుకులు పడుతున్నాయి. రుతు సంధి కారణంగా అంటే సీజనల్ మార్పుల వల్ల ఇన్ఫెక్షన్లు, ఫ్లూ వంటి అనారోగ్య సమస్యలు రావడం సహజం. ఇటువంటి సమస్యల బారిన పడకుండా ఉండడానికి ఆహారంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. అటువంటి వాటిలో బీట్‌రూట్ ఉత్తమమైనది.



★ ప్రోటీన్లు విటమిన్లు పుష్కలంగా ఉండే బీట్‌రూట్‌తో తయారు చేసిన ఆహారాలను ప్రతిరోజు తినడం వల్ల శరీరంలోని రోగనిరోధక శక్తి లోపం సమస్యలను కూడా తగ్గించుకోవచ్చని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

బీట్‌రూట్‌లో ఏయే పోషకాలుంటాయి?

బీట్‌రూట్‌లో సోడియం, పొటాషియం, కాల్షియం, ఫాస్పరస్ వంటి పోషకాలు అధిక పరిమాణంలో లభిస్తాయి. దీనిని సలాడ్‌లో తీసుకోవడం వల్ల శరీరానికి చాలా రకాల ప్రయోజనాలు కలుగుతాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. బీట్‌రూట్‌లో ఫోలేట్ పుష్కలంగా ఉంటుంది.. ఇది కణాల పెరుగుదలను మెరుగుపరచడంలో కీలకపాత్ర పోషిస్తుంది.



★ బీట్‌రూట్‌లో ఐరన్ సమృద్ధిగా లభిస్తుంది కాబట్టి ప్రతిరోజు బీట్‌రూట్ జ్యూస్‌ను తాగడం వల్ల రక్తహీనత, రోగ నిరోధక శక్తి సమస్యల నుంచి సులభంగా ఉపశమనం పొందవచ్చు.

★ బీట్‌రూట్‌లో అధిక మోతాదులో లభించే నైట్రేట్ వల్ల రక్తపోటు నియంత్రణలో ఉండడమే కాకుండా రక్తంలో గడ్డకట్టకుండా నిరోధిస్తుంది. అంతేకాకుండా రక్తప్రవాహాన్ని మెరుగుపరిచేందుకు సహాయపడుతుంది.

★ కార్బోహైడ్రేట్లు పుష్కలంగా ఉండే బీట్‌రూట్ శరీరంలో శక్తి స్థాయిలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. తరచు అనారోగ్య సమస్యలతో బాధపడేవారు ప్రతిరోజు బీట్‌రూట్ జ్యూస్ తాగడం వల్ల చక్కటి ఉపశమనం లభిస్తుంది.

★ బీట్‌రూట్ ఉండే గుణాలు చర్మాన్ని మెరిపించడంలో కూడా కీలకపాత్ర పోషిస్తాయి. ఇందులో ఉండే ఫోలేట్, ఫైబర్ చర్మ సౌందర్యాన్ని మెరుగుపరుస్తాయి. దీని రసాన్ని ముఖానికి రాసుకుంటే మొటిమలు, మచ్చలు తొలగిపోతాయి.

★ బీట్‌రూట్ రసాన్ని తాగడం వల్ల జ్ఞాపకశక్తి పెరుగుతుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఇందులో ఉండే గుణాలు ఒత్తిడిని తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ముఖ్యంగా బరువు తగ్గాలనుకునేవారు బీట్‌రూట్ రసాన్ని తాగడం వల్ల మంచి ఫలితాలు పొందుతారు.

సినిమా

ప్రతినాయకుడు

కథను ముందుకు తీసుకెళతాడు కథానాయకుడు (హీరో). ఆ కథానాయకుడికి అడుగడుగునా అడ్డం పడుతుంటాడు ప్రతినాయకుడు (విలన్). హీరోగా ఒకరు, విలన్‌గా వేరొకరు నటిస్తుంటారు. అయితే నాయకులు అప్పుడప్పుడూ ప్రతినాయకులుగా కూడా నటిస్తుంటారు. ఇలా కొందరు కథానాయకులు 'ప్రతినాయకులు'గా కనిపించడానికి రెడీ అయిన చిత్రాల గురించి తెలుసుకుందాం.



● ఎన్టీఆర్ ● రానా ● కమల్‌హాసన్

మిషన్.. ప్రాజెక్ట్ కె

రెండొందలకు పైగా సినిమాల్లో నటించి, ఏడు పదుల వయసు సమీపిస్తున్న తరుణంలో కూడా కెరీర్‌లో దూకుడు ప్రదర్శిస్తున్నారు కమల్‌హాసన్. ప్రస్తుతం శంకర్ దర్శకత్వంలో 'ఇండియన్ 2' చిత్రంలో కథానాయకుడిగా నటిస్తున్నారు కమల్‌హాసన్. అలాగే దర్శకులు మణిరత్నం, హెచ్. వినోద్ కథల్లో కథానాయకుడిగా నటించేందుకు కమల్‌హాసన్ ఆల్రెడీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఇలా హీరోగా వరుస ప్రాజెక్ట్స్‌ను ఆయన లైన్లో పెట్టారు. అయితే కథానాయకుడిగానే కాదు.. కథ నచ్చితే ఆ కథలోని కథానాయకుడికి ప్రతినాయకుడిగా సవాలు విసరడానికి రెడీ అయ్యారు కమల్. ప్రభాస్, దీపికా పదుకోన్ జంటగా అమితాబ్ బచ్చన్, దిశా పటానీ ప్రధాన పాత్రధారులుగా రూపొందుతున్న సైన్స్ ఫిక్షన్ ఫిల్మ్ 'ప్రాజెక్ట్ కె'లో నటించడానికి కమల్‌హాసన్ అంగీకరించిన విషయం తెలిసిందే. ఈ సినిమాలో కమల్ ప్రతినాయకుడి పాత్రలో నటిస్తున్నారనే టాక్ ఫిల్మ్‌నగర్‌లో వినిపిస్తోంది. అయితే ప్రతినాయకుడి పాత్రలు చేయడం కమల్‌హాసన్‌కు కొత్తేమీ కాదు. 'ఇంద్రుడు-చంద్రుడు' (కాస్త నెగటివ్ టచ్ ఉన్న క్యారెక్టర్), 'ఇండియన్', 'ఆళవందాన్' (తెలుగులో 'అభయ్'), 'దశావతారం' వంటి సినిమాల్లో ఆయన హీరోగా, విలన్‌గా నటించి మెప్పించారు. సో.. చాలా గ్యాప్ తర్వాత మళ్లీ నెగటివ్ షేడ్ క్యారెక్టర్‌లో కమల్ కనిపించినట్లు అవుతుంది. మరి.. 'ప్రాజెక్ట్ కె'లో కమల్ చేస్తున్నది నెగటివ్ షేడ్ ఉన్న క్యారెక్టరేనా? అనే విషయంపై క్లారిటీ రావాలంటే మరికొంత సమయం వేచి చూడాలి. 'మహానటి' ఫేమ్ నాగ్ అశ్విన్ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని అశ్వనీదత్ నిర్మిస్తున్నారు.

బాలీవుడ్ వార్‌లో...

నాయకుడి పాత్రైనా, ప్రతి నాయకుడి పాత్రైనా ఎన్టీఆర్ అవలీలగా చేసేస్తుంటారు. 'జై లవ కుశ' చిత్రంలో ఎన్టీఆర్ చేసిన జై, లవ, కుశ పాత్రల్లో జై విలన్ క్యారెక్టర్ అనే సంగతి తెలిసిందే. తాజాగా మరోసారి ఈ తరహా పాత్రను 'వార్ 2'లో చేసేందుకు ఎన్టీఆర్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని తెలుస్తోంది. హృతిక్ రోషన్ హీరోగా నటించిన హిందీ హిట్ స్పై థ్రిల్లర్ ఫిల్మ్ 'వార్'. ఈ సినిమాకు సీక్వెల్‌గా 'వార్ 2' ఈ ఏడాది చివర్లో సెట్స్‌పైకి వెళ్లనుంది. 'వార్'లో హీరోగా నటించిన హృతిక్ రోషనే సీక్వెల్‌లోనూ హీరోగా నటించనున్నారు. కాగా.. ఈ చిత్రంలో ఎన్టీఆర్ ఓ లీడ్ రోల్ చేయనున్నారు. ఎన్టీఆర్ పాత్రకు కాస్త నెగటివ్ షేడ్స్ ఉంటాయని బాలీవుడ్ సమాచారం. స్పై థ్రిల్లర్‌గా రూపొందనున్న ఈ సినిమాకు 'బ్రహ్మాస్త్ర' ఫేమ్ అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహిస్తారు. ఆదిత్యా చోప్రా నిర్మించనున్నారు. మరోవైపు ప్రస్తుతం కొరటాల శివ దర్శకత్వంలో ఎన్టీఆర్ 'దేవర' సినిమాలో హీరోగా నటిస్తున్నారు. అలాగే ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఓ సినిమా కమిట్ అయ్యారు.

రాక్షస రాజు

హీరో, విలన్, గెస్ట్ రోల్.. ఇలా ఏ పాత్రలో అయినా రానా అదుర్స్. 'బాహుబలి' సినిమాలో భళ్లాలదేవుడు పాత్రలో అద్భుతంగా విలనిజమ్ పండించారు రానా. అలాగే 'నేనే రాజు నేనే మంత్రి'లో హీరోగా నటించిన రానా క్యారెక్టర్‌లో కాస్త నెగటివ్ షేడ్స్ కనిపిస్తాయి. ఈ సినిమాకు తేజ దర్శకుడు. కాగా రానా, తేజ కాంబినేషన్‌లోనే 'రాక్షస రాజు' అనే టైటిల్‌తో మరో సినిమా తెరకెక్కనుంది. గోపీనాథ్ ఆచంట నిర్మిస్తారు. టైటిల్‌ని బట్టి ఈ చిత్రంలో హీరో క్యారెక్టరైజేషన్‌లో కాస్త నెగటివ్ టచ్ ఉంటుందని ఊహించవచ్చు. ఈ ఏడాదిలోనే ఈ సినిమాను సెట్స్‌పైకి తీసుకెళ్లాలనుకుంటున్నారు. మరోవైపు గుణశేఖర్ దర్శకత్వంలో మైథలాజికల్ ఫిల్మ్ 'హిరణ్య కశ్యప', మిలింద్ రావు దర్శకత్వంలో ఓ సినిమాలో రానా హీరోగా నటిస్తారని గతంలో ప్రకటనలు వచ్చాయి. ఈ సినిమాలపై మరో అప్‌డేట్ రావాల్సి ఉంది.

కొత్త ఇన్నింగ్స్

ఐదేళ్ల క్రితం వచ్చిన 'ఒక్కడు మిగిలాడు' సినిమా తర్వాత హీరోగా వెండితెరపై కనిపించలేదు మంచు మనోజ్. ప్రస్తుతం 'వాట్ ది ఫిష్' చిత్రంలో మనోజ్ హీరోగా నటిస్తున్నారు. వరుణ్ కోరుకొండ దర్శకత్వంలో విశాల్, సూర్య బెజవాడ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఒకవైపు హీరోగా నటిస్తూనే మరోవైపు విలన్‌గా కొత్త ఇన్నింగ్స్‌ను స్టార్ట్ చేయాలనుకుంటున్నారట మనోజ్. రవితేజ హీరోగా 'కలర్‌ఫోటో' ఫేమ్ సందీప్ రాజ్ దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనుందని, ఇందులో విశ్వక్ సేన్ కీలక పాత్రలో, మంచు మనోజ్ నెగటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో నటించనున్నారని టాక్. మరి.. ప్రతినాయకుడి పాత్ర పరంగా మంచు మనోజ్ కొత్త ఇన్నింగ్స్‌ను స్టార్ట్ చేస్తారా? వెయిట్ అండ్ సీ.



● విశ్వక్ సేన్ ● మంచు మనోజ్

లంకల రత్న?

'సామాజిక నిబంధనలను ధిక్కరించే ప్రపంచంలో బ్లాక్ ఉండదు, వైట్ ఉండదు, గ్రే మాత్రమే ఉంటుంది' అన్నది విశ్వక్ సేన్ తాజా చిత్రంలోని డైలాగ్. దీన్నిబట్టి ఈ చిత్రంలో విశ్వక్ క్యారెక్టరైజేషన్‌లో కాస్త నెగటివ్ షేడ్స్ ఉంటాయని ఊహించవచ్చు. ఈ సినిమా స్టార్టింగ్ సమయంలో మాస్ కా దాస్ బ్యాడ్‌గా మారాడు అంటూ చిత్ర యూనిట్ నుంచి వినిపించింది. రాజమండ్రి పరిసర ప్రాంతాల్లోని చీకటి సామ్రాజ్యం నేపథ్యంలో రూపొందుతున్న పీరియాడికల్ ఫిల్మ్ ఇది. ఈ సినిమాకు 'లంకల రత్న' టైటిల్ అనుకుంటున్నారనే ప్రచారం ఫిల్మ్‌నగర్‌లో వినిపిస్తోంది. తాజాగా ఈ సినిమా రెండో షెడ్యూల్ ముగిసినట్లు, రాజమండ్రి పరిసర ప్రాంతాల్లోని రిమోట్ లొకేషన్స్‌లో చిత్రీకరించినట్లు శుక్రవారం చిత్ర యూనిట్ ప్రకటించింది. కృష్ణ చైతన్య దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ సినిమాను నిర్మిస్తున్నారు. మరోవైపు రవితేజ ముళ్లపూడి దర్శకుడిగా పరిచయం అవుతున్న చిత్రంలో హీరోగా నటిస్తున్నారు విశ్వక్ సేన్.

వీరే కాదు.. ఒకవైపు నాయకులుగా నటిస్తూ మరోవైపు ప్రతినాయకులుగానూ నటిస్తున్న హీరోలు ఇంకొందరు ఉన్నారు.

కామిక్-కాన్ 2023లో ప్రాజెక్ట్ కె

ప్రభాస్ హీరోగా తెరకెక్కుతోన్న పాన్ ఇండియా చిత్రం 'ప్రాజెక్ట్ కె' అరుదైన ఘనత సాధించింది. కాలిఫోర్నియాలోని శాన్ డియాగోలో నిర్వహించనున్న 'శాన్ డియాగో కామిక్-కాన్ 2023' వేడుకలో 'ప్రాజెక్ట్ కె' సినిమా టైటిల్, ట్రైలర్, సినిమా విడుదల తేదీని లాంచ్ చేయనున్నారు. నాగ్ అశ్విన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో దీపికా పదుకోన్ హీరోయిన్. అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, దిశా పటానీ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. అశ్వనీదత్ ఈ సినిమా నిర్మిస్తున్నారు. నాగ్ అశ్విన్ మాట్లాడుతూ– ''ఇండియా గొప్ప కథలకు, సూపర్ హీరోలకు నిలయం. మా 'ప్రాజెక్ట్ కె' సినిమా, కథ గురించి ప్రపంచ ప్రేక్షకులకు పరిచయం చేయడానికి 'శాన్ డియాగో కామిక్-కాన్ 2023' సరైన వేదిక అని భావిస్తున్నాం'' అన్నారు. ''శాన్ డియాగో కామిక్-కాన్ 2023'లో లాంచ్ అవుతున్న తొలి భారతీయ చిత్రంగా 'ప్రాజెక్ట్ కె' చరిత్ర సృష్టించనుంది. ప్రపంచపటంలో భారతీయ సినిమాను చూడాలని కోరుకునే భారతీయ ప్రేక్షకులందరికీ ఇది గర్వకారణం'' అన్నారు అశ్వనీదత్. ఈ నెల 20న ప్రారంభమయ్యే 'శాన్ డియాగో కామిక్-కాన్ 2023'లో కమల్‌హాసన్, ప్రభాస్, దీపికా పదుకోన్, నాగ్ అశ్విన్ తదితరులు పాల్గొంటారు.



● 'ప్రాజెక్ట్ కె' పోస్టర్

ఆగస్టులో ఆదికేశవ

పంజా వైష్ణవ్ తేజ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'ఆదికేశవ'. శ్రీకాంత్ ఎన్. రెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో ఎస్. నాగవంశీ, ఎస్. సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఆగస్టు 18న రిలీజ్ చేయనున్నట్లు తాజాగా చిత్ర బృందం ప్రకటించింది. ''యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం 'ఆదికేశవ'. ఇప్పటికే విడుదలైన టీజర్ సినిమాపై అంచనాలను పెంచేసింది. జాతీయ అవార్డు గ్రహీత, మలయాళ నటుడు జోజు జార్జ్ ఈ సినిమాతో తెలుగు పరిశ్రమలోకి అడుగు పెడుతున్నారు. త్వరలో ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని విషయాలను వెల్లడిస్తాం'' అని చిత్రయూనిట్ ప్రకటించింది. రాధిక, అపర్ణా దాస్ ముఖ్య పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాశ్, కెమెరా: డడ్లీ.



● వైష్ణవ్, శ్రీ లీల

బెదురులంక డేట్ ఫిక్స్

'ఆర్‌ఎక్స్ 100' ఫేమ్ కార్తికేయ గుమ్మకొండ హీరోగా నటించిన 'బెదురులంక 2012' సినిమా విడుదల తేదీ ఫిక్స్ అయింది. ఈ చిత్రాన్ని ఆగస్టు 25న విడుదల చేస్తున్నట్లు శుక్రవారం ప్రకటించింది యూనిట్. క్లాక్స్ దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ మూవీలో 'డీజే టిల్లు' ఫేమ్ నేహా శెట్టి కథానాయికగా నటించారు. రవీంద్ర బెనర్జీ (బెన్నీ) ముప్పానేని నిర్మించారు. ''హిలేరియస్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం 'బెదురులంక 2012'. ఇప్పటివరకు గోదావరి నేపథ్యంలో వచ్చిన రూరల్ డ్రామాలకు భిన్నంగా మా సినిమా ఉంటుంది'' అన్నారు బెన్నీ ముప్పానేని. ''మా సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు చివరి దశలో ఉన్నాయి. మణిశర్మగారు అద్భుతమైన బాణీలు అందించారు. కార్తికేయ, నేహా జోడీ ఆకట్టుకుంటుంది'' అన్నారు క్లాక్స్. ఈ చిత్రానికి కెమెరా: సాయి ప్రకాష్ ఉమ్మడిసింగు, సన్నీ కూరపాటి, సమర్పణ: సి. యువరాజ్, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: దుర్గారావు గుండా, సహనిర్మాతలు: అవనీంద్ర ఉపద్రష్ట, వికాస్ గున్నల.



● కార్తికేయ, నేహా శెట్టి

సస్పెన్స్.. థ్రిల్



● సాయికృష్ణ

తల్లాడ సాయికృష్ణ, స్వప్న చౌదరి, సుమన్, అలీ, తనికెళ్ల భరణి, సత్య శ్రీ కీలక పాత్రల్లో 'మిస్టరీ' సినిమా షురూ అయింది. తల్లాడ సాయికృష్ణ దర్శకత్వంలో పీవీ ఆర్ట్స్ పతాకంపై వెంకట్ పులగం నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా దర్శక-నిర్మాతలు మాట్లాడుతూ–''సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రమిది. ఈ నెల 21 వరకు హైదరాబాద్, పరిసర ప్రాంతాల్లో షూటింగ్ జరుగుతుంది. సింగిల్ షెడ్యూల్‌లో షూటింగ్‌ని పూర్తి చేస్తాం. సెప్టెంబర్ చివరి వారంలో 'మిస్టరీ'ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: రామ్ తవ్వ, కెమెరా: సుధాకర్, శివ రాథోడ్

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	505	65,280
నిఫ్టీ ▽	166	19,332

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 ముగింపు)

సూచీ	ముగింపు		మార్పు
నాస్‌డాక్	13,794	▲	114
డోజోన్స్	34,020	▲	98
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,257	▽	24
డాక్స్	15,603	▲	75
షాంఘై	3,197	▽	9
నికాయ్	32,388	▽	385

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	58,586	▽	58
బంగారం (99.5 స్వచ్ఛత)	58,351	▽	58
వెండి (కేజీ)	69,750	▽	1,066

వేదాంతా చేతికి ట్విన్ స్టార్ బిజ్



న్యూఢిల్లీ: సహచర సంస్థ ట్విన్ స్టార్ టెక్నాలజీస్ లిమిటెడ్ (టీఎస్‌టీఎల్) నుంచి సెమీకండక్టర్, డిస్‌ప్లే బిజినెస్‌లను సొంతం చేసుకోనున్నట్లు వేదాంతా లిమిటెడ్ వెల్లడించింది. తద్వారా సమీకృత సెమీకండక్టర్, డిస్‌ప్లే బిజినెస్‌లు కలిగిన తొలి కంపెనీగా వేదాంతా ఆవిర్భవించనుంది. వేదాంతాకు అల్టిమేట్ హోల్డింగ్ కంపెనీ అయిన టీఎస్‌టీఎల్.. వోల్కన్ ఇన్వెస్ట్‌మెంట్స్‌కు పూర్తి అనుబంధ సంస్థకావడం గమనార్హం! కాగా.. షేర్ల బదిలీ ద్వారా టీఎస్‌టీఎల్ సెమీకండక్టర్, డిస్‌ప్లే బిజినెస్ యూనిట్‌లో 100 శాతం వాటాను సొంతం చేసుకోనున్నట్లు వేదాంతా వెల్లడించింది. దీంతో వేదాంతా డైవర్సిఫైడ్ పోర్ట్‌ఫోలియోకు సెమీకండక్టర్, డిస్‌ప్లే గ్లాస్ బిజినెస్ జత కలవనున్నాయి.

భద్రతా ఫీచర్లకే అధిక ప్రాధాన్యత



ముంబై: కార్ల కొనుగోలు విషయంలో కస్టమర్లు భద్రతా ఫీచర్లకే అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు స్కోడా ఆటో ఇండియా, ఎన్‌ఐక్యూ బేసెస్ సర్వే వెల్లడించింది. ముఖ్యంగా క్రాష్ రేటింగ్‌లు, ఎయిర్ బ్యాగుల సంఖ్యను పరిగణలోకి తీసుకుంటారని తెలిపింది. జనాదరణ పొందిన ఫీచర్లలో ఇంధన సామర్థ్యం మూడో స్థానంలో ఉంది. భారత్‌లో కార్లకు భద్రతా రేటింగ్ తప్పనిసరిగా ఉండాలని 10 మందిలో 9 మంది కస్టమర్లు అభిప్రాయపడ్డారు. 'అధిక రేటింగ్ మోడళ్లు కలిగిన తొలి 3 బ్రాండ్లలో స్కోడా ఒకటి. గ్లోబల్ ఎన్సీఏపీ పరీక్షలో స్లావియా, కుషాక్ 5 స్టార్ సేఫ్టీ రేటింగ్ పొందాయి. భద్రత మాకు తొలి ప్రాధాన్యత' అని స్కోడా ఆటో ఇండియా బ్రాండ్ డైరెక్టర్ పీటర్ సోలాక్ తెలిపారు.

మ్యూచువల్ ఫండ్ ట్రస్టీలపై మరింత బాధ్యత

- పెట్టుబడిదారుల ప్రయోజనాలకు ప్రాధాన్యం
- తప్పుడు మార్గాల్లో విక్రయాలకు చెక్
- తగిన వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలి
- నూతన ఆదేశాలు తీసుకొచ్చిన సెబీ



న్యూఢిల్లీ: మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసే పెట్టుబడిదారుల ప్రయోజనాల పరిరక్షణకు, పారదర్శకత పెంచేందుకు క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ నూతన నిబంధనలు తీసుకొచ్చింది. మ్యూచువల్ ఫండ్ ట్రస్టీలపై మరింత బాధ్యతలు మోపింది. ప్రతి అసెట్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఏఎంసీ/మ్యూచువల్ ఫండ్ నిర్వహణ సంస్థ) కొత్తగా యూనిట్ హోల్డర్ (ఇన్వెస్టర్) ప్రొటెక్షన్ కమిటీ (యూహెచ్‌పీసీ)ని ఏర్పాటు చేయాలని ఆదేశించింది. ఏఎంసీ నిర్ణయాలు యూనిట్ హోల్డర్ల ప్రయోజనాల కోణంలోనే ఉన్నాయా అన్నది యూహెచ్‌పీసీ పర్యవేక్షించనుంది. కొత్త నిబంధనలు జనవరి 2024 జనవరి 1 నుంచి అమల్లోకి వస్తాయని సెబీ శుక్రవారం సర్క్యులర్ జారీ చేసింది.

ఇవీ కొత్త మార్గదర్శకాలు

- మ్యూచువల్ ఫండ్స్ తమ నిర్వహణ ఆస్తులను పెంచుకునేందుకు తప్పుడు మార్గాల్లో పెట్టుబడులను ఆకర్షించకుండా తగిన వ్యవస్థలను ఏర్పాటు చేసుకునేలా సంబంధిత మ్యూచువల్ ఫండ్ ట్రస్టీ చూడాలి.
- తమ ఉద్యోగులు, అనుబంధ సంస్థలు దుర్వినియోగానికి పాల్పడకుండా చూడాలి. మోసపూరిత లావాదేవీలు చోటు చేసుకోకుండా, ఉద్యోగులు ఫ్రంట్ రన్నింగ్‌కు పాల్పడకుండా (సంస్థ నిర్ణయాలు ముందే తెలుసుకుని ప్రయోజనం పొందడం), డిస్ట్రిబ్యూటర్లు ఆకర్షించే అంచనాలతో ఉత్పత్తులను విక్రయించకుండా తగిన చెకింగ్ వ్యవస్థలు ఏర్పాటు చేసుకోవాలి.
- ఏఎంసీలు వసూలు చేసే ఫీజులు, వ్యయాలు పారదర్శకంగా ఉండేలా ట్రస్టీలు చూడాలి.
- ఏఎంసీల పథకాల వారీగా పనితీరు, పోటీ పథకాలతో, సూచీలతో పోల్చినప్పుడు ఎలా ఉందన్నది సమీక్షించాలి.
- కేవైసీ వివరాలు సరిగ్గా లేని ఫోలియోల విషయంలో ఏఎంసీలు తీసుకున్న నిర్ణయాలను ఎప్పటికప్పుడు సమీక్షించాలి.
- ఈ బాధ్యతల నిర్వహణకు ఫండ్ ట్రస్టీలు ఆడిట్, న్యాయ సేవల సంస్థలు, మర్చంట్ బ్యాంకర్లు, తదితర నిపుణుల సేవలు పొందొచ్చు.
- ఓ కంపెనీ ఫండ్ ట్రస్టీగా నియమితమైతే, చైర్‌పర్సన్‌గా ఇండిపెండెంట్ డైరెక్టర్ ఉండాలి.
- మ్యూచువల్ ఫండ్స్ అందించే ఉత్పత్తులు, సేవలకు సంబంధించి యూనిట్ హోల్డర్ల ప్రయోజనాలకు యూహెచ్‌పీసీ బాధ్యత వహించాల్సి ఉంటుంది.

ఫండ్ స్పాన్సర్లకు కొత్త నియమావళి

మ్యూచువల్ ఫండ్‌ను స్పాన్సర్ చేసే ప్రైవేటు ఈక్విటీ సంస్థలకు కొత్త కార్యాచరణను సెబీ ప్రతిపాదించింది. ప్రైవేటు ఈక్విటీ సంస్థలకు ఫండ్ మేనేజర్‌గా కనీసం ఐదేళ్ల అనుభవం, కనీసం రూ.5,000 కోట్ల ఆస్తులను నిర్వహించి ఉండాలి.

రికార్డు స్థాయి వద్ద లాభాల స్వీకరణ

- ప్రపంచ ప్రతికూల పరిణామాల నేపథ్యం
- ఫైనాన్స్, ఐటీ, ఇంధన షేర్లలో అమ్మకాలు
- నిఫ్టీ 8 రోజుల పరుగుకు విరామం
- సెన్సెక్స్ నష్టం 505 పాయింట్లు



ముంబై: స్టాక్ సూచీల రికార్డు ర్యాలీకి శుక్రవారం బ్రేక్ పడింది. ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల నుంచీ ప్రతికూల సంకేతాలు అందాయి. గరిష్ట స్థాయిల వద్ద లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. ఫలితంగా వారాంతపు రోజున సెన్సెక్స్ 505 పాయింట్లు నష్టపోయి 65,280 వద్ద ముగిసింది. ఈ సూచీలో మొత్తం 30 షేర్లకు గానూ 25 షేర్లు నష్టపోయాయి. నిఫ్టీ 166 పాయింట్లు క్షీణించి 19,332 వద్ద నిలిచింది. ఈ సూచీ 8 రోజుల వరుస ర్యాలీకి బ్రేక్ పడినట్లైంది. సూచీలు ఉదయం నష్టాలతో మొదలయ్యాయి. దేశీయంగా నెలకొన్న సానుకూలతల అండతో ఆరంభ నష్టాలను భర్తీ చేసుకోవడమే కాకుండా స్వల్పంగా లాభపడ్డాయి. ఈ క్రమంలో సెన్సెక్స్ 113 పాయింట్లు బలపడి 65,899 వద్ద, నిఫ్టీ 27 పాయింట్లు పెరిగి 19,524 వద్ద చరిత్రాత్మక గరిష్టాలను నమోదు చేయగలిగాయి. అయితే ఫైనాన్స్, ఐటీ, ఆయిల్ షేర్లలో తలెత్తిన అమ్మకాలతో మళ్లీ నష్టాల బాటపట్టాయి. మిడ్‌సెషన్‌లో యూరప్ మార్కెట్ల నష్టాల ప్రారంభంతో ఏ దశలోనూ కోలుకోలేకపోయాయి. బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 0.76%, 0.28% చొప్పున నష్టపోయాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.790 కోట్ల షేర్లను కొన్నారు. ఈ వారం మొత్తంగా సెన్సెక్స్ 562 పాయింట్లు, నిఫ్టీ 143 పాయింట్ల చొప్పున లాభపడ్డాయి. డాలర్ మారకంలో రూపాయి విలువ 13 పైసలు క్షీణించి 82.73 స్థాయి వద్ద స్థిరపడింది.

''అమెరికాలో ప్రైవేటు రంగ ఉద్యోగ కల్పన అనూహ్యంగా పెరగడంతో వడ్డీరేట్ల పెంపు అంచనాలు తెరపైకి వచ్చాయి. బాండ్లపై రాబడి సైతం పెరిగింది. ఈ పరిణామాలకు తోడు సూచీలు చారిత్రాత్మక గరిష్ట స్థాయిల వద్ద ట్రేడవుతుండటం, వారాంతపు రోజు కావడంతో లాభాల స్వీకరణ చోటు చేసుకుంది'' అని రిలిగేర్ బ్రోకింగ్ వైస్ ప్రెసిడెంట్ అజిత్ మిశ్రా తెలిపారు.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- ఐడియా ఫోర్జ్ షేరు లిస్టింగ్‌లో అదరగొట్టింది. బీఎస్ఈలో కంపెనీ ఇష్యూ ధర (రూ.672)తో పోలిస్తే 94% ప్రీమియంతో రూ.1305 వద్ద లిస్టయ్యింది. ట్రేడింగ్‌లో 100 శాతం మేర దూసుకెళ్లి రూ.1,344 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. చివరికి 93 శాతం లాభంతో రూ.1,295.50 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్ మొత్తంలో 6.50 లక్షల ఈక్విటీ షేర్లు చేతులు మారాయి. లిస్టింగ్ తొలిరోజున కంపెనీ మార్కెట్ విలువ రూ.5,398 కోట్లుగా నమోదైంది.
- వజ్రాభరణాల తయారీ, విక్రయ సంస్థ టైటాన్ షేరు మెరిసింది. బీఎస్ఈలో 1.25% లాభపడి రూ.3145 వద్ద ముగిసింది. రూ.3211 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం క్యూ1లో కంపెనీ ఆదాయం 20 శాతం వృద్ధి చెందడంతో ఈ షేరుకు డిమాండ్ లభించింది.
- నష్టాల మార్కెట్లోనూ ప్రభుత్వరంగ బ్యాంకుల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. పీఎన్‌బీ, కెనరా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా షేర్లు 2% నుంచి 1.50% లాభపడ్డాయి. ఇండియన్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్ షేర్లు ఒకశాతం పెరిగాయి.

ఫ్లిప్‌కార్ట్.. వ్యక్తిగత రుణాలు!

యాక్సిస్ బ్యాంక్‌తో ఒప్పందం

ముంబై: ఈకామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్ వ్యక్తిగత రుణాలందించనుంది. ఇందుకు ప్రైవేట్ రంగ దిగ్గజం యాక్సిస్ బ్యాంకుతో చేతులు కలిపింది. తద్వారా రూ. 5 లక్షల వరకూ వ్యక్తిగత రుణాలను ఈకామర్స్ ప్లాట్‌ఫామ్ ద్వారా అందించనుంది. ఇందుకు గరిష్ఠంగా మూడేళ్ల గడువును అనుమతిస్తోంది. రిటైల్ రంగ దిగ్గజం వాల్‌మార్ట్ అనుబంధ సంస్థ ఫ్లిప్‌కార్ట్‌కు 45 కోట్లమంది కస్టమర్లున్నారు. అత్యధిక రిస్కులుండే అన్‌సెక్యూర్డ్ వ్యక్తిగత రుణాలు, క్రెడిట్ కార్డులలో భారీ వృద్ధిపై ఆర్‌బీఐ ఆందోళనలు వ్యక్తం చేస్తున్న నేపథ్యం ఫ్లిప్‌కార్ట్, యాక్సిస్ బ్యాంక్ ఒప్పందానికి ప్రాధాన్యత ఏర్పడింది. దేశీ వినియోగదారులు జీవనశైలి విధానాలను మెరుగుపరచుకునేందుకు ఆసక్తి చూపుతున్నట్లు ఈ సందర్భంగా ఫ్లిప్‌కార్ట్ పేర్కొంది. యాక్సిస్ బ్యాంక్‌తో భాగస్వామ్యం ద్వారా కస్టమర్ల కొనుగోలు శక్తి పుంజుకునే వీలున్నట్లు అభిప్రాయపడింది. కొనుగోలుదారులకు మద్దతుగా ఇప్పటికే సంస్థ బీపీఎస్ఎల్, ఈఎంఐ, కోబ్రాండెడ్ క్రెడిట్ కార్డులు అందిస్తున్నట్లు ఫ్లిప్‌కార్ట్ సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ ధీరజ్ అనేజా పేర్కొన్నారు.



ఒలెక్ట్రాకు రూ.10,000 కోట్ల ఆర్డర్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మేఘా ఇంజనీరింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ అనుబంధ కంపెనీలైన ఒలెక్ట్రా గ్రీన్‌టెక్, ఈవీ ట్రాన్స్‌ల కన్సార్షియం భారీ ఆర్డర్‌ను చేజిక్కించుకుంది. ఇందులో భాగంగా మహారాష్ట్ర స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్‌కు (ఎంఎస్ఆర్‌టీసీ) 5,150 ఎలక్ట్రిక్ బస్‌లను 24 నెలల్లో సరఫరా చేయాల్సి ఉంటుంది. డీల్ విలువ సుమారు రూ.10,000 కోట్లు అని ఒలెక్ట్రా శుక్రవారం ప్రకటించింది. ఒలెక్ట్రా నుంచి ఈ ఎలక్ట్రిక్ బస్‌లను ఈవీ ట్రాన్స్ కొనుగోలు చేసి ఎంఎస్ఆర్‌టీసీకి అందిస్తుంది. కాగా, భారీ ఆర్డర్ నేపథ్యంలో ఒలెక్ట్రా షేరు ధర క్రితం ముగింపుతో పోలిస్తే బీఎస్ఈలో శుక్రవారం 18.02% ఎగసి రూ.1,231.35 వద్ద స్థిరపడింది.

దేశీ ఐటీకి వై2కే తరహా అవకాశాలు..

తెలంగాణ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్ రంజన్



ఐటీ సదస్సులో మాట్లాడుతున్న జయేశ్ రంజన్, వేదికపై శేఖర్ రెడ్డి తదితరులు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఐటీ రంగంలో భారత్ వేగంగా పురోగమిస్తోందని తెలంగాణ ఐటీ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్ రంజన్ తెలిపారు. రెండు దశాబ్దాల క్రితం వై2కే సమస్య తలెత్తినప్పుడు దాని పరిష్కారానికి దేశీ ఐటీ సంస్థలు, నిపుణులు తోడ్పాటు అందించారని పేర్కొన్నారు. ప్రస్తుతం మళ్లీ వై2కే తరహాలో .. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ విభాగాల్లో వస్తున్న అవకాశాలను మరింతగా అందిపుచ్చుకోవాలని ఆయన ఆకాంక్షించారు. భారతీయ పరిశ్రమల సమాఖ్య సీఐఐ, తెలంగాణ ప్రభుత్వం సంయుక్తంగా కొత్త ఆవిష్కరణలు, భవిష్యత్ డిజిటల్ పరివర్తనపైన నిర్వహించిన ఐటీ సదస్సులో పాల్గొన్న సందర్భంగా జయేశ్ రంజన్ ఈ విషయాలు చెప్పారు. మరోవైపు, 2022–23లో తెలంగాణ నుంచి ఐటీ ఎగుమతులు 31 శాతం వృద్ధి చెందాయని, ఉద్యోగాల కల్పన 16.2 శాతం పెరిగిందని, ఇన్నోవేషన్ ఇండెక్స్‌లో రాష్ట్రం దేశంలోనే రెండో స్థానంలో ఉందని సీఐఐ తెలంగాణ చైర్మన్ సి. శేఖర్ రెడ్డి తెలిపారు.



ఫైనల్లో రష్మిక-వైదేహి జోడీ

అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య మహిళల టోర్నీలో హైదరాబాద్ అమ్మాయి భమిడిపాటి శ్రీవల్లి రష్మిక డబుల్స్ విభాగంలో ఫైనల్లోకి ప్రవేశించింది. థాయ్‌లాండ్‌లో శుక్రవారం జరిగిన డబుల్స్ సెమీఫైనల్లో రష్మిక-వైదేహి చౌధరీ (భారత్) ద్వయం 6-4, 6-3తో పునిన్ కొవాపిటుక్‌టెడ్-మంచాయ సావంగ్‌కెవ్ (థాయ్‌లాండ్) జంటపై నెగ్గింది. హైదరాబాద్‌కే చెందిన సహజ యామలపల్లి సింగిల్స్ విభాగంలో సెమీఫైనల్లోకి అడుగు పెట్టింది. క్వార్టర్ ఫైనల్లో సహజ 0-6, 6-1, 6-1తో లీ జాంగ్ సియో (కొరియా)పై విజయం సాధించింది. గంటా 34 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సహజ రెండు ఏస్‌లు సంధించి, ఎనిమిది డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తన సర్వీస్‌ను నాలుగుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఆరుసార్లు బ్రేక్ చేసింది.



క్వార్టర్స్‌లో లక్ష్య సేన్, సింధు

కాల్గరీ: కెనడా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల సింగిల్స్ విభాగంలో లక్ష్య సేన్... మహిళల సింగిల్స్ విభాగంలో పీవీ సింధు క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లారు. శుక్రవారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో లక్ష్య సేన్ 21-15, 21-11తో వైగోర్ కొల్హో (బ్రెజిల్)పై నెగ్గగా... సింధుకు ఆమె ప్రత్యర్థి నత్సుకి నిదైరా (జపాన్) నుంచి వాకోవర్ లభించింది. పురుషుల డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో విష్ణువర్ధన్-కృష్ణప్రసాద్ ద్వయం 9-21, 11-21తో రెండో సీడ్ అహసాన్-సెతియవాన్ (ఇండోనేసియా) జోడీ చేతిలో ఓడింది.

బ్రిజ్‌భూషణ్‌కు కోర్టు సమన్లు

న్యూఢిల్లీ: రెజ్లర్లను లైంగికంగా వేధించిన కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) చీఫ్, బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్‌సింగ్‌కు ఢిల్లీ కోర్టు సమన్లు జారీ చేసింది. పోలీసులు దాఖలు చేసిన చార్జిషీట్‌ను పరిశీలించిన ఢిల్లీ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ హర్జీత్ సింగ్ జస్పాల్ ఈ కేసులో విచారించేందుకు తగిన సాక్ష్యాధారాలున్నాయని తెలిపారు. ఈ నెల 18న కోర్టు ముందు హాజరు కావాలని బ్రిజ్‌భూషణ్‌కు సమన్లు జారీ చేశారు.

'ఏషియాడ్'కు ద్వితీయ శ్రేణి జట్టు

ముంబై: ఆసియా క్రీడల్లో భారత పురుషుల, మహిళల క్రికెట్ జట్లు పాల్గొనడం ఖాయమైంది. శుక్రవారం జరిగిన బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో దీనికి అధికారికంగా ఆమోద ముద్ర వేశారు. చైనాలో సెప్టెంబర్ 23 నుంచి అక్టోబర్ 8 వరకు ఆసియా క్రీడలు జరుగుతాయి. అయితే ఈ పోటీల్లో మహిళల విభాగంలో మాత్రమే భారత రెగ్యులర్, పూర్తి స్థాయి జట్టు బరిలోకి దిగుతోంది. పురుషుల విభాగంలో మాత్రం ద్వితీయ శ్రేణి టీమ్‌ను పంపాలని బోర్డు నిర్ణయించింది. అక్టోబర్ 5 నుంచి భారత్‌లోనే వన్డే వరల్డ్ కప్ జరుగుతుండటమే దీనికి కారణం. ఐపీఎల్-2023 సీజన్‌లో కొత్తగా తీసుకొచ్చిన 'ఇంపాక్ట్ ప్లేయర్' నిబంధనను దేశవాళీ టి20 టోర్నీ ముస్తాక్ అలీ ట్రోఫీలోనూ అమలు చేయాలని బీసీసీఐ నిర్ణయించింది.

అల్‌కరాజ్ ముందుకు...

- మూడో రౌండ్‌లోకి టాప్ సీడ్
- హోరాహోరీ పోరులో ముర్రేపై సిట్సిపాస్ విజయం



అల్‌కరాజ్

లండన్: వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీ పురుషుల సింగిల్స్ విభాగంలో ప్రపంచ నంబర్ వన్, టాప్ సీడ్ కార్లోస్ అల్‌కరాజ్ మూడో రౌండ్‌లోకి దూసుకెళ్లాడు. శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో ఈ స్పెయిన్ స్టార్ 6-4, 7-6 (7/2), 6-3తో అలెగ్జాండర్ ముల్లర్ (ఫ్రాన్స్)పై గెలుపొందాడు. 2 గంటల 33 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో అల్‌కరాజ్ ఐదు ఏస్‌లు సంధించాడు. 32 విన్నర్స్ కొట్టి, 41 అనవసర తప్పిదాలు చేశాడు. నెట్ వద్దకు 29 సార్లు దూసుకొచ్చి 24 సార్లు పాయింట్లు గెలిచాడు. రెండుసార్లు ప్రత్యర్థి సర్వీస్‌ను బ్రేక్ చేసిన అల్‌కరాజ్ తన సర్వీస్‌లో మాత్రం ఒక్కసారి కూడా బ్రేక్ పాయింట్ అవకాశం ఇవ్వలేదు. మరోవైపు ఐదో సీడ్ సిట్సిపాస్ (గ్రీస్) హోరాహోరీ పోరులో గట్టెక్కి మూడో రౌండ్‌లోకి అడుగు పెట్టాడు. 2013, 2016 వింబుల్డన్ చాంపియన్ ఆండీ ముర్రే (బ్రిటన్)తో 4 గంటల 40 నిమిషాలపాటు జరిగిన రెండో రౌండ్ పోరులో సిట్సిపాస్ 7-6 (7/3), 6-7 (2/7), 4-6, 7-6 (7/3), 6-4తో విజయం సాధించాడు. 17 ఏస్‌లు సంధించిన సిట్సిపాస్ ఏకంగా 90 విన్నర్స్ కొట్టడం విశేషం. ఇతర రెండో రౌండ్ మ్యాచ్‌ల్లో మూడో సీడ్ మెద్వెదెవ్ (రష్యా) 6-3, 6-3, 7-6 (7/5)తో మనారినో (ఫ్రాన్స్)పై, ఆరో సీడ్ హోల్గర్ రూనె (డెన్మార్క్) 6-3, 7-6 (7/3), 6-4తో కార్బలెస్ బేనా (స్పెయిన్)పై నెగ్గారు.

అజరెంకా జోరు

మహిళల సింగిల్స్‌లో మాజీ నంబర్‌వన్ అజరెంకా (బెలారస్), నాలుగో సీడ్ జెస్సికా పెగూలా (అమెరికా) ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు. మూడో రౌండ్ మ్యాచ్‌ల్లో అజరెంకా 6-2, 6-4తో 11వ సీడ్ కసత్‌కినా (రష్యా)ను ఓడించగా... పెగూలా 6-4, 6-0తో కొకియారెటో (ఇటలీ)పై గెలిచింది.

సుదీర్ఘ టైబ్రేక్...

మహిళల సింగిల్స్‌లో సురెంకో (ఉక్రెయిన్), అనా బొగ్డాన్ (రొమేనియా) మ్యాచ్ చరిత్రకెక్కింది. 3 గంటల 40 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సురెంకో 4-6, 6-3, 7-6 (20/18)తో బొగ్డాన్‌ను ఓడించి ప్రిక్వార్టర్ ఫైనల్ చేరింది. నిర్ణాయక మూడో సెట్‌లో టైబ్రేక్ ఏకంగా 37 నిమిషాలు సాగింది. తద్వారా మహిళల గ్రాండ్‌స్లామ్ టోర్నీల చరిత్రలో సుదీర్ఘంగా సాగిన టైబ్రేక్‌గా రికార్డు నమోదైంది. 38 పాయింట్ల తర్వాత టైబ్రేక్‌లో ఫలితం తేలడం కూడా రికార్డే. ఈ మ్యాచ్‌లో సురెంకో ఐదుసార్లు, బొగ్డాన్ ఆరుసార్లు మ్యాచ్ పాయింట్లు కాపాడుకోవడం గమనార్హం.

ఆసియా క్రీడలకు భారత టీటీ జట్టులో శ్రీజ



న్యూఢిల్లీ: ఆసియా క్రీడల్లో, ఆసియా చాంపియన్‌షిప్‌లో పాల్గొనే భారత టేబుల్ టెన్నిస్ (టీటీ) జట్లను శుక్రవారం ప్రకటించారు. 10 మంది సభ్యులతో కూడిన భారత పురుషుల, మహిళల జట్లకు ఆచంట శరత్ కమల్, మనిక బత్రా సారథ్యం వహిస్తారు. మహిళల సింగిల్స్ జాతీయ చాంపియన్, తెలంగాణ అమ్మాయి ఆకుల శ్రీజ కూడా ఈ ప్రతిష్టాత్మక క్రీడల్లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తుంది. తెలంగాణకు చెందిన ఎస్ఎఫ్ఆర్ స్నేహిత్, మహారాష్ట్ర ప్లేయర్ సానిల్ షెట్టి రిజర్వ్ ఆటగాళ్లుగా ఎంపికయ్యారు. ఆసియా టీటీ చాంపియన్‌షిప్ సెప్టెంబర్ 3 నుంచి 10 వరకు దక్షిణ కొరియాలో... ఆసియా క్రీడల టీటీ ఈవెంట్ చైనాలోని హాంగ్జౌలో సెప్టెంబర్ 23 నుంచి అక్టోబర్ 2 వరకు జరుగుతాయి.

భారత టీటీ జట్లు: పురుషుల టీమ్ విభాగం: ఆచంట శరత్ కమల్, సత్యన్ జ్ఞానశేఖరన్, హర్మీత్ దేశాయ్, మానవ్ ఠక్కర్, మనుష్ షా. **రిజర్వ్:** ఎస్ఎఫ్ఆర్ స్నేహిత్, సానిల్ శెట్టి. **మహిళల టీమ్ విభాగం:** మనిక బత్రా, ఆకుల శ్రీజ, సుతీర్థ ముఖర్జీ, అహిక ముఖర్జీ, దియా చిటాలె. **రిజర్వ్:** అర్చన కామత్, రీత్ రిష్యా. **పురుషుల డబుల్స్:** శరత్ కమల్-సత్యన్; మానవ్-మనుష్. **మహిళల డబుల్స్:** సుతీర్థ-అహిక ముఖర్జీ; శ్రీజ-దియా. **మిక్స్‌డ్ డబుల్స్:** మనిక-సత్యన్; శ్రీజ-హర్మీత్ దేశాయ్.

అజేయంగా లంక

నిసాంక సెంచరీ • చివరి మ్యాచ్‌లో విండీస్‌పై విజయం



నిసాంక

హరారే: వన్డే ప్రపంచకప్ క్వాలిఫయింగ్ టోర్నీలో 'సూపర్ సిక్స్' దశను కూడా శ్రీలంక జట్టు అజేయంగా ముగించింది. వెస్టిండీస్‌తో శుక్రవారం జరిగిన చివరి 'సూపర్ సిక్స్' మ్యాచ్‌లో శ్రీలంక ఎనిమిది వికెట్ల తేడాతో గెలిచింది. వెస్టిండీస్ నిర్దేశించిన 244 పరుగుల లక్ష్యాన్ని శ్రీలంక రెండు వికెట్లు కోల్పోయి 44.2 ఓవర్లలో ఛేదించింది. నిసాంక (113 బంతుల్లో 104; 14 ఫోర్లు) సెంచరీ సాధించగా... దిముత్ కరుణరత్నే (92 బంతుల్లో 83; 7 ఫోర్లు) అర్ధ సెంచరీ చేశాడు. వీరిద్దరు తొలి వికెట్‌కు 190 పరుగుల భాగస్వామ్యం జోడించారు. వీరిద్దరు అవుటయ్యాక కుశాల్ మెండిస్ (34 నాటౌట్; 3 ఫోర్లు), సమరవిక్రమ (17 నాటౌట్; 1 ఫోర్) మూడో వికెట్‌కు అజేయంగా 40 పరుగులు జత చేశారు. అంతకుముందు వెస్టిండీస్ 48.1 ఓవర్లలో 243 పరుగులకు ఆలౌటైంది. కీసీ కార్టీ (87; 6 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మహీశ్ తీక్షణ 34 పరుగులిచ్చి 4 వికెట్లు తీశాడు. ఆదివారం జరిగే ఫైనల్లో నెదర్లాండ్స్‌తో శ్రీలంక తలపడుతుంది. ఫైనల్ చేరడంద్వారా శ్రీలంక, నెదర్లాండ్స్ ఈ ఏడాది అక్టోబర్-నవంబర్‌లలో భారత్ వేదికగా జరిగే వన్డే ప్రపంచకప్ టోర్నీకి అర్హత సాధించాయి.

సౌత్‌జోన్ లక్ష్యం 215



వైశాక్

బెంగళూరు: సౌత్‌జోన్ సీమర్ వైశాక్ విజయ్‌కుమార్ (5/76) నిప్పులు చెరిగే బౌలింగ్‌తో నార్త్‌జోన్‌ను కూల్చేశాడు. దీంతో దులీప్ ట్రోఫీ సెమీఫైనల్లో నార్త్‌జోన్ రెండో ఇన్నింగ్స్‌లో 56.4 ఓవర్లలో 211 పరుగులకే ఆలౌటైంది. ఓవర్‌నైట్ స్కోరు 51/2తో శుక్రవారం మూడో రోజు ఆట కొనసాగించిన నార్త్ జట్టు 160 పరుగులు జోడించి మిగతా ఎనిమిది వికెట్లు కోల్పోయింది. ప్రభ్‌సిమ్రాన్ సింగ్ (63; 11 ఫోర్లు), హర్షిత్ రాణా (38; 4 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. మూడు పరుగుల స్వల్ప ఆధిక్యంతో కలిపి నార్త్ జట్టు సౌత్ జట్టుకు 215 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించగా... ఆట ముగిసే సమయానికి సౌత్‌జోన్ రెండో ఇన్నింగ్స్‌లో వికెట్ కోల్పోకుండా 21 పరుగులు చేసింది. ఆఖరి రోజు విజయానికి 194 పరుగుల దూరంలో ఉంది.

పుజారా శతకం

సెంట్రల్ జోన్‌తో జరుగుతున్న మరో సెమీఫైనల్లో చతేశ్వర్ పుజారా (133; 14 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీతో కదంతొక్కగా, సూర్యకుమార్ యాదవ్ (52; 8 ఫోర్లు, 1 సిక్స్) అర్ధసెంచరీ సాధించాడు. దీంతో వెస్ట్ భారీ లక్ష్యంవైపు దూసుకెళుతోంది. ఆట నిలిచే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 9 వికెట్లకు 292 పరుగులు చేసింది. సౌరభ్ 4, సారాంశ్ 3 వికెట్లు తీశారు. ప్రస్తుతం వెస్ట్ 384 పరుగుల ఆధిక్యంలో ఉంది. వర్షం కారణంగా చివరి రోజు ఆట సాధ్యంకాకుండా మ్యాచ్ 'డ్రా'గా ముగిస్తే తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో వెస్ట్ జోన్ జట్టుకు ఫైనల్ బెర్త్ ఖరారవుతుంది.



స్టోక్స్

ఆస్ట్రేలియా 116/4

తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 237 ఆలౌట్

లీడ్స్: యాషెస్ సిరీస్ మూడో టెస్టు ఆసక్తికర మలుపులతో సాగుతోంది. రెండో రోజు కూడా ఇంగ్లండ్, ఆస్ట్రేలియా పోటాపోటీగా పోరాడాయి. శుక్రవారం ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా తమ రెండో ఇన్నింగ్స్‌లో 4 వికెట్లు కోల్పోయి 116 పరుగులు చేసింది. ఖ్వాజా (43), వార్నర్ (1), లబుషేన్ (33), స్మిత్ (2) పెవిలియన్ చేరారు. ప్రస్తుతం ఆసీస్ ఓవరాల్ ఆధిక్యం 142 పరుగులకు చేరింది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 68/3తో ఆట కొనసాగించిన ఇంగ్లండ్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 237 పరుగులకు ఆలౌటైంది. ఫలితంగా ఆస్ట్రేలియాకు 26 పరుగుల స్వల్ప ఆధిక్యం లభించింది. కెప్టెన్ స్టోక్స్ (80; 6 ఫోర్లు, 5 సిక్స్‌లు) ఒంటిచేత్తో జట్టుకు గౌరవప్రదమైన స్కోరు అందించాడు. చివర్లో మార్క్ వుడ్ (8 బంతుల్లో 24; 1 ఫోర్, 3 సిక్స్‌లు) మెరుపులు ఇంగ్లండ్ భారీ ఆధిక్యం కోల్పోకుండా కాపాడాయి. ఆసీస్ కెప్టెన్ కమిన్స్ (6/91) రాణించాడు.

తమీమ్ వీడ్కోలు వెనక్కి

ప్రధానితో భేటీ తర్వాత నిర్ణయం



బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనాతో మొర్తజా, తమీమ్

చిట్టోగ్రామ్: వన్డే ప్రపంచకప్‌కు ముందు... ఉన్నపళంగా అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు ప్రకటించిన బంగ్లాదేశ్ కెప్టెన్ తమీమ్ ఇక్బాల్ తన నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నాడు. ఆ దేశ ప్రధాని షేక్ హసీనాతో భేటీ అయిన తర్వాత వీడ్కోలుపై వెనక్కి తగ్గి... ఆటకు సై అంటున్నాడు. భారత్ ఆతిథ్యమివ్వనున్న వన్డే మెగా ఈవెంట్‌కు మూడు నెలల ముందు అతని ఆకస్మిక నిర్ణయం బంగ్లాదేశ్ క్రికెట్ వర్గాలను నిర్ఘాంతపరిచింది. దీనిపై ప్రధాని హసీనా జోక్యం చేసుకొని అతని దృష్టిని క్రికెట్‌పై మళ్లించారు. శుక్రవారం ప్రధాని కార్యాలయం నుంచి కలవాలనే కబురు రావడంతో మధ్యాహ్నం 34 ఏళ్ల సీనియర్ క్రికెటర్ తన భార్యతో పాటు ప్రధాని నివాసానికి వెళ్లారు. బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు అధ్యక్షుడు నజ్ముల్ హసన్, మాజీ కెప్టెన్ మష్రఫె మొర్తజా... తమీమ్‌తో కలిసి ప్రధాని షేక్ హసీనాతో సమావేశమయ్యారు. ఈ భేటీ ముగిసిన వెంటనే తన రిటైర్మెంట్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటున్నట్లు ప్రకటించాడు. అఫ్గానిస్తాన్‌తో బుధవారం తొలి వన్డే తర్వాత తమీమ్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు ప్రకటించి షాక్ ఇచ్చాడు.

మరపురాని మహానేత



జనం కోసం ఎందాకైనా అంటూ పోరాడిన యోధుడు.. రూపాయికే వైద్యం చేసి ప్రజల నాడి పట్టిన వైద్యుడు

- మండుటెండలో 1,475 కి.మీల పాదయాత్రతో ప్రజలకు భరోసా
- అధికారంలో రాగానే ఇచ్చిన హామీలు అమలు చేసిన నేత
- పాలకుడంటే ఎలా ఉండాలో చాటిచెప్పిన దార్శనికుడు
- వ్యవసాయం, ప్రజారోగ్యం, విద్య రంగాలకు పెద్దపీట
- నేడు మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి 74వ జయంతి

సాక్షి, అమరావతి

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా పనిచేసిన ఐదేళ్ల మూడు నెలల కొద్ది కాలంలోనే మనసుండాలే కానీ ప్రజలకు ఎంత మేలు చేయవచ్చో చేతల్లో చూపించారు. సాగునీటి ప్రాజెక్టులు, రహదారులు, పేదలకు పక్కా ఇళ్లు వంటి పథకాలతో సమగ్రాభివృద్ధి వైపు ఎలా పరుగెత్తించవచ్చో దేశానికే చాటిచెప్పారు. ఆయన మరణించి 13 ఏళ్లవుతున్నా ఇప్పటికీ ప్రజలు నమ్మలేకపోతున్నారు. వైఎస్సార్ అనే పదం వినగానే స్వచ్ఛమైన చిరునవ్వు మన కళ్ల ముందు సాక్షాత్కరిస్తుంది. నమస్తే అక్కయ్యా.. నమస్తే చెల్లెమ్మా.. నమస్తే తమ్ముడూ.. అని ఆప్యాయంగా పిలిచే పిలుపు మన చెవుల్లో ఎప్పటికీ ప్రతిధ్వనిస్తూనే ఉంటుంది. అందుకే ఆ మహానేత చిరస్మరణీయుడు. ప్రజల సంక్షేమం, రాష్ట్ర సమగ్రాభివృద్ధిలో మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ఒక అడుగు వేస్తే.. ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగు అడుగులు వేస్తున్నారు.

జనం కోసం ఎందాకైనా..

వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగులో 1949 జూలై 8న జన్మించిన వైఎస్ రాజశేఖరరెడ్డి వైద్య విద్యను అభ్యసించారు. పులివెందులలో ఆస్పత్రి నెలకొల్పి ఒక్క రూపాయికే వైద్యం చేసి రూపాయి డాక్టర్‌గా ప్రజల ప్రేమాభిమానాలు పొందారు. డాక్టర్‌గా ప్రజల నాడి తెలిసిన వైఎస్సార్ 1978లో రాజకీయ అరంగేట్రం నాటి నుంచి 2009 సెప్టెంబర్ 2న హెలికాప్టర్ ప్రమాదంలో హఠాన్మరణం చెందేవరకూ తన జీవితాన్ని ప్రజలకే అంకితం చేశారు. మండుటెండలో 1,475 కి.మీల ప్రజా ప్రస్థానం పాదయాత్ర ద్వారా వరుస ఓటములతో జీవచ్ఛవంలా మారిన కాంగ్రెస్‌కు ప్రాణం పోశారు. 2004లో ఇటు ఉమ్మడి రాష్ట్రంలోనూ.. అటు కేంద్రంలోనూ కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చారు. పాదయాత్రలో ప్రజల కష్టాలను అర్థం చేసుకుని నేనున్నానంటూ భరోసా ఇచ్చిన వైఎస్సార్.. అధికారంలోకి వచ్చాక కన్నీళ్లు తుడిచారు. ఐదేళ్ల సంక్షేమాభివృద్ధి పథకాలతో జనరంజక పాలన అందించి.. 2009 ఎన్నికల సందర్భంగా గెలుపోటములకు తనదే బాధ్యత అని నిబ్బరంగా ప్రకటించారు. ఇటు రాష్ట్రంలో.. అటు కేంద్రంలో ఒంటిచేత్తో కాంగ్రెస్‌ను తిరిగి అధికారంలోకి తెచ్చారు. రూ.లక్ష కోట్ల వ్యయంతో కోటి ఎకరాలకు నీళ్లందించేలా ఒకేసారి 84 ప్రాజెక్టులను చేపట్టారు. వైఎస్సార్ హఠాన్మరణం అనంతరం ఆ ప్రాజెక్టులను ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు కొనసాగించక తప్పని పరిస్థితి ఏర్పడింది.

ప్రజారోగ్యానికి ఆరోగ్యశ్రీతో భరోసా

2004 మే 14 నుంచి 2007 జూన్ 26 వరకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద వైద్య సహాయం కోసం దరఖాస్తు చేసుకున్న వారికి రూ.168.52 కోట్లను అధికారంలో ఉండగా వైఎస్ రాజశేఖరరెడ్డి విడుదల చేశారు. ఉచితంగా కార్పొరేట్ వైద్యాన్ని అందించేలా ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టారు. ప్రమాదంలో గాయపడిన వారిని తక్షణమే ఆస్పత్రికి తరలించేలా 108 వాహనాలతోపాటు గ్రామీణ ప్రాంతాలకు వైద్య సేవలను విస్తరిస్తూ 104 సర్వీసులను ప్రారంభించారు. ఈ సేవలను పలు రాష్ట్రాలు అనుసరించాయి. ఆరోగ్యశ్రీ స్ఫూర్తితోనే కేంద్రం ఆయుష్మాన్ భారత్ పథకాన్ని చేపట్టింది.

రైతును రాజు చేసిన మారాజు

సీఎంగా ఉచిత విద్యుత్ ఫైలుపై తొలి సంతకం చేసి రైతు రాజ్యానికి వైఎస్ రాజశేఖరరెడ్డి పునాది వేశారు. విద్యుత్ చార్జీలు కట్టలేని రైతులపై నాడు టీడీపీ సర్కార్ రాక్షసంగా బనాయించిన కేసులను ఒక్క సంతకంతో ఎత్తి వేశారు. రూ.1,100 కోట్ల వ్యవసాయ విద్యుత్ బకాయిలను మాఫీ చేశారు. రూ.400 కోట్లతో మొదలైన వ్యవసాయ విద్యుత్ సబ్సిడీ ఆ తర్వాత ఏడాది రూ.6 వేల కోట్లకు చేరినా ఉచిత విద్యుత్‌పై వెనక్కు తగ్గలేదు. వైఎస్ స్ఫూర్తితో పలు రాష్ట్రాలు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నాయి. పావలా వడ్డీకే రైతులకు రుణాలు అందించి పెట్టుబడి కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సిన దుస్థితిని తప్పించారు. పంటల బీమాను అమలు చేశారు. ఇన్‌పుట్ సబ్సిడీ అందించారు. మద్దతు ధర కల్పించడం కోసం ఢిల్లీతో పోరాడారు.

పేదరికానికి విద్యతో విరుగుడు

పేదరికం వల్ల ఏ ఒక్కరూ ఉన్నత చదువులకు దూరం కారాదనే లక్ష్యంతో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి వైఎస్సార్ రూపకల్పన చేశారు. డాక్టర్, ఇంజనీర్ లాంటి ఉన్నత చదువులు పేదవాడి సొంతమైతేనే పేదరిక నిర్మూలన సాధ్యమని దృఢంగా విశ్వసించి.. ఆ దిశగా అడుగులు వేశారు. ఫీజుల పథకం ద్వారా లక్షలాది మంది నిరుపేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతోపాటు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతోన్న ఓసీ విద్యార్థులు సైతం ఉన్నత చదువులను అభ్యసించి దేశ విదేశాల్లో ఉన్నత ఉద్యోగాలను నిర్వర్తిస్తున్నారు. జిల్లాకు ఒక విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేశారు. తాడేపల్లిగూడెంలో ఉద్యానవర్సిటీ, తిరుపతిలో పశు వైద్యకళాశాలను నెలకొల్పారు. ప్రతిష్టాత్మక జాతీయ విద్యా సంస్థ ఐఐటీ (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ)ని హైదరాబాద్ సమీపంలో కంది వద్ద ఏర్పాటు చేశారు. బాసర, ఇడుపులపాయ, నూజివీడు వద్ద ట్రిపుల్ ఐటీలను నెలకొల్పి లక్షలాది మందికి ఉన్నత చదువుల భాగ్యం కల్పించారు. వైఎస్సార్ బాటలో పలు రాష్ట్రాలు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని అమలు చేస్తున్నాయి.

మాంద్యం ముప్పు తప్పించిన ఆర్థికవేత్త

ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాలను 2007–08, 2008–09లో ఆర్థిక మాంద్యం అతలాకుతలం చేసింది. ఆ మాంద్యం ప్రభావం దేశాన్ని కూడా తాకినా, ఉమ్మడి రాష్ట్రంపై పడకుండా వైఎస్సార్ నివారించగలిగారు. సాగునీటి ప్రాజెక్టులు, పేదల ఇళ్ల నిర్మాణం, రహదారుల నిర్మాణం లాంటి అభివృద్ధి పనులు చేపట్టి ఆర్థిక కార్యకలాపాలకు ఊతమిచ్చారు. ఐటీ పరిశ్రమకు వెన్నుదన్నుగా నిలవడం ద్వారా ఎగుమతులు రెట్టింపు చేశారు. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని చేపట్టి శరవేగంగా పూర్తి చేసి హైదరాబాద్‌ను ప్రపంచ చిత్రపటంలో నిలిపారు. ఇది జంట నగరాల్లో ఐటీ రంగం వేళ్లూనుకునేందుకు దోహదం చేసింది.

నేడు రాష్ట్ర వ్యాప్తంగా రైతు దినోత్సవ వేడుకలు

అనంతపురం జిల్లా కల్యాణదుర్గంలో రాష్ట్ర స్థాయి వేడుక

జిల్లా, మండల కేంద్రాలు, ఆర్బీకేల్లోనూ రైతు దినోత్సవ వేడుకలు

సాక్షి, అమరావతి: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్సార్ 74వ జయంతిని పురస్కరించుకొని ఆ మహానేతకు ఘనంగా నివాళులర్పిస్తూ శనివారం రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్ రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. రాష్ట్ర, జిల్లా, మండల కేంద్రాలతో పాటు వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల్లో కూడా ఈ వేడుకలు నిర్వహిస్తోంది. అనంతపురం జిల్లా కల్యాణదుర్గంలో రాష్ట్ర స్థాయి వేడుకలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొననున్నారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం వద్ద వేడుకలను ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు శుక్రవారం పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. ఇందులో భాగంగా శనివారం ఉదయం 9.45 గంటలకు పలు సేవా కార్యక్రమాలు చేపట్టనున్నారు.



రావి ఆకుపై వైఎస్సార్ చిత్రం

నంద్యాల జిల్లా నందికొట్కూరుకి చెందిన చిత్రకారుడు దేశెట్టి శ్రీనివాసులు రావి ఆకుపై దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిత్రాన్ని గీశారు. వైఎస్సార్ జయంతి సందర్భంగా ఈ చిత్రాన్ని రూపొందించినట్లు చెప్పారు.
– నందికొట్కూరు

గుండెకు నిబ్బరం!

▶ మొదటి పేజీ తరువాయి

యాంజియోగ్రామ్, గుండె మార్పిడి సహా వివిధ చికిత్సలను పథకం కింద ఉచితంగా నిర్వహిస్తున్నారు. హృద్రోగ బాధితులకు వైద్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.695.15 కోట్లు ఖర్చు చేసింది. మరోవైపు శస్త్ర చికిత్స అనంతరం విశ్రాంతి తీసుకునే సమయంలో వైఎస్సార్ ఆరోగ్య ఆసరా కింద ఆర్థిక సాయాన్ని కూడా అందించింది.

నాలుగేళ్లలో 40 లక్షల మందికి ఉచిత వైద్యం

కేవలం హృద్రోగ చికిత్సలే కాకుండా పలు రకాల ఆరోగ్య సమస్యలకు ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా వైద్యం అందుతోంది. టీడీపీ హయాంలో నిర్వీర్యమైన ఆరోగ్యశ్రీ పథకానికి ఊపిరిలూదుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న చర్యలతో పేద, మధ్యతరగతి ప్రజలకు భారీ మేలు చేకూరుతోంది. పొరుగు రాష్ట్రాల్లోని పెద్ద పెద్ద కార్పొరేట్ ఆస్పత్రుల్లో సైతం ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా చికిత్స అందుతోంది. వైద్యం పొందిన అనంతరం చిరునవ్వుతో ఇంటికి తిరిగొస్తున్నారు. గత సర్కారు హయాంలో పేదలకు ఏదైనా పెద్ద జబ్బు చేస్తే తల తాకట్టు పెట్టడం మినహా గత్యంతరం లేని దుస్థితి. దేవుడిపై భారం వేసి రోజులు లెక్కపెట్టుకోవాల్సిన దయనీయ పరిస్థితులు నాడు నెలకొన్నాయి. ఈ అవస్థలకు తెరదించుతూ ఆరోగ్యశ్రీలో ప్రొసీజర్లను 3,257కి పెంచి ఉచిత వైద్య సేవలను సీఎం జగన్ అందుబాటులోకి తెచ్చారు. ఆరోగ్యశ్రీకి గత సర్కారు బకాయిపెట్టిన రూ.630 కోట్లను చెల్లించడంతోపాటు ప్రభుత్వ వైద్య రంగాన్ని అన్ని సదుపాయాలతో బలోపేతం చేశారు. దీంతో సగటున రోజుకు 3,300 మంది నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఉచిత చికిత్సలు పొందుతున్నారు. ఆరోగ్యశ్రీ పథకం కోసం గత నాలుగేళ్లలో ప్రభుత్వం ఏకంగా రూ.9,025 కోట్లు ఖర్చు చేయగా దాదాపు 40 లక్షల మంది వైద్య సేవలు పొందారు. తిరుపతిలోని శ్రీపద్మావతి చిన్న పిల్లల ఆస్పత్రి ఎంతో మందికి పునర్జన్మ ప్రసాదిస్తోంది. ఇటీవల ఏకంగా గుండె మార్పిడితో రికార్డు సృష్టించింది. బ్రెయిన్‌డెడ్ అయిన ఓ వ్యక్తి గుండెను ఓ చిన్నారికి విజయవంతంగా అమర్చారు. చిన్నారుల్లో గుండె సంబంధిత వ్యాధులన్నింటికీ ఇక్కడ నాణ్యమైన అధునాతన వైద్యం అందుతోంది. ఇతర రాష్ట్రాల వారికి సైతం మానవతా దృక్పథంతో వైద్య సేవలు అందిస్తున్నారు.

ఆరోగ్యశ్రీ ద్వారా హృద్రోగ చికిత్సలు ఇలా

సంవత్సరం	రోగులు	ప్రొసీజర్లు	వ్యయం రూ.కోట్లలో
2019-2020	23,797	24,027	79.69
2020-2021	24,243	24,599	77.06
2021-2022	36,725	37,646	116.09
2022-2023	65,813	85,558	301.82
2023-2024 (ఇప్పటి వరకూ)	21,251	32,208	120.49
మొత్తం	1,71,829	2,04,038	695.15




అన్నదాతకు ప్రాణదాత



వ్యవసాయదారుడైన చిత్తూరు జిల్లా పుంగనూరుకు చెందిన కృష్ణారెడ్డి హృద్రోగం బారిన పడటంతో ఆ కుటుంబానికి గుండె ఆగినంత పనైంది! గుండె మార్పిడి శస్త్ర చికిత్స ఖర్చును భరించే స్థోమత లేకపోవడంతో ఏం చేయాలో పాలుపోలేదు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా గుండె ఆపరేషన్ చేస్తారని స్థానిక ఏఎన్ఎం చెప్పడంతో 2021 ఏప్రిల్‌లో బెంగళూరులోని నెట్‌వర్క్ ఆస్పత్రిని సంప్రదించారు. మైసూర్‌లో బ్రెయిన్ డెడ్ అయిన ఓ వ్యక్తి గుండెను కృష్ణారెడ్డికి అమర్చి ట్రాన్స్‌ప్లాంట్ సర్జరీ చేశారు. ఆరోగ్యశ్రీ ద్వారా రూ.11 లక్షలు చెల్లించి ఆ కుటుంబ పెద్దకు రాష్ట్ర ప్రభుత్వం పునర్జన్మ ప్రసాదించింది. 'నేను ఇవాళ ప్రాణాలతో ఉన్నానంటే ఆరోగ్యశ్రీనే కారణం. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా గుండె మార్పిడి ఆపరేషన్ చేశారు. కోలుకునే సమయంలో వైఎస్సార్ ఆరోగ్య ఆసరా కింద డబ్బులు కూడా అందచేశారు' అని కృష్ణారెడ్డి చేతులు జోడించి చెబుతున్నారు.

రూపాయి ఖర్చు లేకుండా బైపాస్



రక్త నాళాలు దెబ్బతినడంతో బైపాస్ సర్జరీ చేయాలని వైద్యులు చెప్పారు. నిరుపేద కుటుంబం కావడంతో నాకు అంత స్థోమత లేదు. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచితంగా సర్జరీ చేశారు. ఇప్పుడు ఆరోగ్యంగా ఉన్నా. ప్రభుత్వం చేసిన మేలు ఈ జన్మలో మరువలేను.
– దొంతాల రాఘవయ్య, మామందూరు, నెల్లూరు జిల్లా

పెద్ద జబ్బులకు సైతం..



గుండె, కాలేయం, కిడ్నీ, క్యాన్సర్ సంబంధిత పెద్ద జబ్బులకు సైతం చికిత్సలు ఆరోగ్యశ్రీ పథకం పరిధిలో ఉన్నాయి. ప్రొసీజర్ల సంఖ్య భారీగా పెరిగింది. వైద్యం కోసం ప్రజలు ఆర్థికంగా చితికిపోకూడదనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీకి అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది.
– హరేంధిరప్రసాద్, సీఈవో, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ

ఆపద్బాంధవిలా ఆదుకుంది

గుండె రక్తనాళాలు దెబ్బతినడంతో బైపాస్ సర్జరీ చేయాలని వైద్యులు నిర్ధారించారు. ఆ సమయంలో ఆరోగ్యశ్రీ ఆపద్బాంధవిలా ఆదుకుంది. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా గత నెల 26న సర్జరీ జరిగింది. ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యా. కోలుకునే సమయంలో వైఎస్సార్ ఆరోగ్య ఆసరా ద్వారా ఆర్థిక సాయం అందుతుందని చెప్పారు. సీఎం జగన్ ప్రభుత్వం చేసిన మేలును ఈ జన్మకు మరువలేను.
– కొరివి కిశోర్, గుంటూరు



ఆస్ట్రేలియాలో వైఎస్సార్ జయంతి వేడుకలు

సాక్షి, అమరావతి: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 74వ జయంతి వేడుకలను వైఎస్సార్‌సీపీ ఆస్ట్రేలియా శాఖ శుక్రవారం ఘనంగా నిర్వహించింది. పార్టీ స్థానిక కన్వీనర్ చింతలచెరువు సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. పార్టీ కార్యకర్తలు అన్ని ప్రధాన నగరాల్లో కేకులు కట్ చేసి వైఎస్సార్ సేవలను స్మరించుకున్నారు. ఆస్ట్రేలియాలోని పలు రాష్ట్రాల వైఎస్సార్‌సీపీ నాయకులతో పాటు, భారత్ నుంచి పలువురు పార్టీ నేతలు జూమ్ కాల్ ద్వారా పాల్గొన్నారు.

వస్త్ర వ్యాపారిపై దాడికి వ్యాపార లావాదేవీలే కారణం

- ఈ ఘటనలో ఎలాంటి రాజకీయ కోణం లేదు
- నిందితులకు పార్టీలతో సంబంధం లేదు
- ఓ మీడియాలో వెలువడ్డ కథనంలో నిజం లేదు: పోలీస్ కమిషనర్ టీకే రాణా
- ఇద్దరి అరెస్టు... మరో వ్యక్తి కోసం గాలింపు
- నిందితుడితో మా పార్టీకి ఎలాంటి సంబంధం లేదు: తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని
- మహిళలపై టీడీపీ నేతలు చింతమనేని, వినోద్ జైన్ అఘాయిత్యాలను ప్రజలు మర్చిపోలేదు
- వారిపై ఎలాంటి చర్యలూ తీసుకోకపోగా బాబు వెనకేసుకొచ్చారు

విజయవాడ స్పోర్ట్స్: ఇటీవల విజయవాడలో వస్త్ర వ్యాపారిపై ఓ దుకాణం యజమాని దాడికి పాల్పడిన ఘటనలో ఎలాంటి రాజకీయ కోణం లేదని పోలీసు ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. నిందితులకు రాజకీయ పార్టీలతో ఎలాంటి సంబంధం లేదని, వ్యాపార లావాదేవీలే ఘటనకు కారణమని పేర్కొన్నారు. దీనికి సంబంధించి ఓ మీడియాలో వెలువడ్డ కథనాల్లో నిజం లేదని, అసత్యాలను వ్యాప్తి చేయవద్దని సూచించారు. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టీకే రాణా శుక్రవారం రాత్రి మీడియాకు వెల్లడించారు.

చెక్కు చెల్లకపోవడంతో..

ధర్మవరానికి చెందిన హోల్‌సేల్ వస్త్ర వ్యాపారి అన్ని ప్రాంతాలకు వస్త్రాలను సరఫరా చేస్తుంటారు. విజయవాడ పటమటలోని ఆలయ సిల్క్స్ షాపు యజమానికి గతేడాది డిసెంబర్‌లో రూ.2.34 లక్షల విలువ చేసే వస్త్రాలను సరఫరా చేశారు. దీనికి సంబంధించిన చెక్కు చెల్లకపోవడంతో డబ్బులివ్వాలని ఆలయ సిల్క్స్ యజమాని గుడవర్తి అవినాష్ గుప్తాను పలుమార్లు ఫోన్‌లో కోరారు. ఈ క్రమంలో డబ్బులు వసూలు చేసుకునేందుకు తన స్నేహితుడితో కలిసి ఈ నెల రెండో తేదీన విజయవాడ వచ్చారు. దుకాణం వద్ద ఘర్షణ చోటు చేసుకోవడంతో ఆలయ సిల్క్స్ యజమాని అవినాష్‌గుప్తా, సూపర్‌వైజర్ చీవేళ్ల నాగేశ్వరరావు, మరో వ్యక్తి కలసి వస్త్ర వ్యాపారిని, అతడి స్నేహితుడిని చేతులతో కొట్టారు. దుస్తులు విప్పించి నగ్నంగా నాలుగు గంటల పాటు బంధించారు. ఆ వీడియోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఈ ఘటనపై శుక్రవారం బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులు గుడవర్తి అవినాష్‌గుప్తా, నాగేశ్వరరావును అరెస్ట్ చేశారు. మరో వ్యక్తిని అదుపులోకి తీసుకోవాల్సి ఉంది.



సీపీ రాణా

తెనాలిలో అలాంటి నాయకులెవరూ లేరు..

ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



తెనాలి: వస్త్ర వ్యాపారిపై తెనాలికి చెందిన వైఎస్సార్ సీపీ అవినాష్ గుప్తా జులుం ప్రదర్శించారంటూ ఆంధ్రజ్యోతి ప్రచురించిన కథనంలో నిజం లేదని తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ స్పష్టం చేశారు. శుక్రవారం రాత్రి కొల్లిపరలో ఎమ్మెల్యే శివకుమార్ మీడియాతో మాట్లాడుతూ తమ పార్టీతో అతడికి ఎలాంటి సంబంధం లేదన్నారు. అలాంటి వారికి తమ పార్టీలో స్థానం ఉండదని, తప్పు చేస్తే సీఎం జగన్ ఏమాత్రం ఉపేక్షించరని స్పష్టం చేశారు. 2011లో పార్టీలో చేరిన తాను అవినాష్ గుప్తా అనే వ్యక్తిని ఎన్నడూ చూడలేదన్నారు. ఎల్లో మీడియా కథనాలు వికృత చేష్టలకు నిదర్శమన్నారు. చంద్రబాబు హయాంలో మహిళలపై లెక్కలేనన్ని దాడులు, అఘాయిత్యాలు జరిగాయని పేర్కొన్నారు. ఇసుక దోపిడీని అడ్డుకున్నందుకు జుత్తు పట్టుకుని ఎమ్మార్వో వనజాక్షిపై దాడికి పాల్పడ్డ చింతమనేని ప్రభాకర్‌పై చంద్రబాబు ఎలాంటి చర్యలు తీసుకోకపోగా ప్రోత్సహించారని గుర్తు చేశారు. విజయవాడలో టీడీపీ నేత వినోద్ జైన్ ఓ మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడి బాధితురాలి ఆత్మహత్యకు కారణమైన ఉదంతాన్ని ప్రజలు మరచిపోలేదని చెప్పారు.

చేనేతలపై దాడులను ప్రభుత్వం ఉపేక్షించదు

ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి

మంగళగిరి: రాష్ట్రంలో చేనేతలపై దాడులకు పాల్పడితే ప్రభుత్వం ఉపేక్షించదని వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి స్పష్టంచేశారు. శుక్రవారం ఆయన మంగళగిరిలోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ధర్మవరం చేనేత వ్యాపారులపై విజయవాడలో జరిగిన దాడి విషయంలో ప్రభుత్వం వెంటనే స్పందించిందని చెప్పారు. దాడికి పాల్పడిన విజయవాడకు చెందిన అవినాష్‌ను అరెస్ట్ చేయించి ధర్మవరం తరలించినట్లు తెలిపారు. చేనేత వ్యాపారుల మీద దాడి ఘటనపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటనే స్పందించి నిందితులను అరెస్ట్ చేయించడం హర్షణీయమన్నారు.

అగ్ని కీలల్లో ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్

- ఐదు బోగీలు పూర్తిగా, రెండు బోగీలు పాక్షికంగా దగ్ధం
- శుక్రవారం ఉదయం భువనగిరి సమీపంలోని బొమ్మాయిపల్లి వద్ద ఘటన
- తొలుత ఎస్4 బోగీలో పొగలు.. కాసేపటికే మంటలు..
- విచారణ జరుపుతున్న రైల్వే శాఖ.. రూ.6 కోట్ల నష్టం

సాక్షి, యాదాద్రి/సికింద్రాబాద్ (హైదరాబాద్): శుక్రవారం ఉదయం సుమారు 10 గంటలు.. కోల్‌కతా నుంచి సికింద్రాబాద్ మీదుగా మన్మాడ్ వెళ్తున్న ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ రైలు.. ప్రయాణికులంతా మాటాముచ్చట్లతో, సెల్‌ఫోన్‌లో గడుపుతున్నారు.. ఉన్నట్టుండి ఎస్4 బోగీలో పొగలు వచ్చాయి.. కొద్దిసేపట్లోనే మంటలు మొదలయ్యాయి.. అది చూసిన ప్రయాణికులంతా హాహాకారాలు పెట్టారు.. ఓ ప్రయాణికుడు అప్రమత్తమై చైన్ లాగడం, అదే సమయంలో రైల్వే గార్డు హెచ్చరికలతో లోకోపైలట్లు బ్రేక్ వేయడంతో రైలు ఆగిపోయింది. వెంటనే ప్రయాణికులంతా ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని.. లగేజీని రైల్లోనే వదిలేసి కిందికి దిగేశారు. ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదు. యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి శివార్లలోని బొమ్మాయిపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో ఈ ఘటన జరిగింది. ప్రమాదంలో ఐదు బోగీలు పూర్తిగా, రెండు బోగీలు పాక్షికంగా దగ్ధమయ్యాయి.

గాలి ధాటికి మంటలు విస్తరించి..

18 బోగీలతో వెళ్తున్న ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ రైలు తెలంగాణలోని భువనగిరి జిల్లా నాగిరెడ్డిపల్లి రైల్వే స్టేషన్ దాటగానే ఎస్4 బోగీలో పొగలు, మంటలు మొదలయ్యాయి. ఇవి టాయిలెట్‌లో మొదలయ్యాయని కొందరు, బోగీ మధ్యలోని అప్పర్ బెర్త్ పక్కన మొదలయ్యాయని మరికొందరు ప్రయాణికులు చెప్తున్నారు. అయితే రైలు వేగంగా వెళుతుండటంతో గాలి ధాటికి అగ్నికీలలు విస్తరించాయి. అది గుర్తించి రైలును ఆపేసరికే సుమారు ఆరు కిలోమీటర్ల దూరంలోని బొమ్మాయిపల్లి సమీపంలోకి చేరుకుంది. రైలు ఒక్కసారిగా కుదుపుతో ఆగిందని, లగేజీ వదిలి కిందికి దూకామని ప్రయాణికులు చెప్తున్నారు. ఈ క్రమంలో ఒకరి మీద ఒకరు పడటంతో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రయాణికులు, రైల్వే సిబ్బంది స్పందించి బోగీల మధ్య లింక్‌ను వేరు చేయడంతో.. మంటలు ఇతర బోగీలకు వ్యాపించడం ఆగిపోయింది. పది ఫైరింజన్లతో మంటలు ఆర్పారు. ప్రమాదంతో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి ఈ మార్గంలో రైళ్ల రాకపోకలను నిలిపివేశారు. వాటిని విజయవాడ–కాజీపేట మీదుగా మళ్లించారు. సాయంత్రం 6.30 గంటల తర్వాత రాకపోకలను పునరుద్ధరించారు. ప్రమాదంలో ఎస్4 బోగీతోపాటు ఓవైపు ఉన్న ఎస్2, ఎస్3, మరోవైపున్న ఎస్5, ఎస్6 బోగీలు పూర్తిగా కాలిపోయాయి. వాటిలో చాలా మంది ప్రయాణికుల లగేజీ, వస్త్రాలు, ల్యాప్‌టాప్‌లు, సర్టిఫికెట్లు, ఇతర సామగ్రి కాలిబూడిదయ్యాయి. రైల్వే శాఖకు రూ.6 కోట్ల మేరకు నష్టం వాటిల్లినట్టు ప్రాథమికంగా అంచనా వేశారు. దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ప్రమాదానికి కారణంపై విచారణ జరుపుతున్నామని ప్రకటించారు. రైల్లోంచి దిగిన ప్రయాణికులకు స్థానిక గురుకుల పాఠశాలలో వసతి కల్పించారు. కాలిపోయిన బోగీలను వదిలేసి మిగతా బోగీలలో ప్రయాణికులను ఎక్కించి రైలును సికింద్రాబాద్‌కు పంపించారు. 'హైదరాబాద్–ఢిల్లీ మార్గంలో బాలాసోర్ తరహా రైలు ప్రమాదం జరుగుతుంది' అని హెచ్చరిస్తూ వారం కింద దక్షిణ మధ్య రైల్వేకు బెదిరింపు లేఖ వచ్చిన నేపథ్యంలో తాజా ప్రమాదం కలకలం రేపింది. దీనితో ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ ప్రమాదం వెనుక విద్రోహ చర్యపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943